# క్రాంతి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] రాష్ట్రకమిటీ అధికార పత్రిక

సంపుటి : 24 సంచిక : 2 | మార్చి- ఏప్రిల్ 2000 | వెల : ఐదు రూపాయలు

**లోపలి పేజీల్లో...**


యుద్ధ బడ్జెట్... 5
దేశవ్యాప్త సమ్మెలు... 14
కా॥ గణపతి ప్రసంగం... 19
చెచెన్యా యుద్ధం... 23
బందిపోట్ల గూడుపుఠాణి... 33
రాజ్యాంగ సమీక్ష... 42
మాధవరెడ్డి ఖతం... 52


# మేడే వర్ధిల్లాలి!

## సామ్రాజ్యవాద వ్యవస్థను ధ్వంసం చేయడానికి ఐక్యమవుదాం!!

ఉన్న కాసిన్ని సౌకర్యాలను కూడా ఊడబీక్కోవటం, అష్ట దారిద్ర్యం, నిరుద్యోగం లాంటివి ప్రపంచమంతటా ఆవరిస్తుండగా ప్రపంచ ప్రజలు నూతన సహస్రాబ్దిలోకి అడుగు పెడుతున్నారు. సామ్రాజ్యవాద శక్తులు తమ సంక్షోభ భారాన్ని ప్రపంచ వ్యాప్తంగా పీడిత ప్రజల మూపుల మీదికి నెట్టివేయడాన్ని కొనసాగిస్తున్నందువల్ల ప్రపంచ జనాభాలోని అత్యధిక మెజారిటీ ప్రజల దుర్దశ మరింత దయనీయంగా తయారవుతోంది. ప్రజల్లో అసహనం పెరుగుతూ తమ అసంతృప్తిని వివిధ రూపాలలో వ్యక్తపరుస్తున్నారు. సామ్రాజ్యవాద దోపిడీని, అణచివేతను, నిర్బంధాన్ని వ్యతిరేకించడానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు మరింతగా వీధుల్లోకి వస్తున్నారు.

### భ్రమల్ని చెదరగొట్టిన వాస్తవం

ప్రజల ఈ ప్రమాదకరమైన పరిస్థితి మధ్యనే సామ్రాజ్యవాద విష సర్పాలు భవిష్యత్తు గురించిన సుందర చిత్రాలను ప్రదర్శిస్తూ ప్రజలను శాంతపర్చడానికి ప్రయత్నిస్తున్నాయి. 'బిజినెస్ వీక్' సంపాదకులు తమ 1998 ప్రత్యేక సంచికలో ఇలా రాశారు ''విప్లవాత్మకమైన సాంకేతిక జ్ఞానం, శరవేగంగా జరిగే ప్రపంచీకరణలు ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని కనీస స్థాయిలో వుంచి, ఉత్పాదకతను బాగా పెంచి, వేగవంతమైన పెరుగుదలకు అవకాశమిస్తున్నాయి. ఉత్పత్తిలో ఈ చలన శీలత ప్రపంచమంతటా ఊహించలేనంత సంపదలను తెస్తూ దశాబ్దాల పాటు కొనసాగుతుంది''. దీంట్లో కొత్త విషయమేదీ లేదు. రెండవ ప్రపంచ యుద్ధం చివర్లో పెట్టుబడిదారీ సిద్ధాంతకర్తలు ఇలాగే సామ్రాజ్యవాద వ్యవస్థ గురించి అనేక భ్రమలను, కల్పనలను సృష్టించారు. అయితే రెండో ప్రపంచ యుద్ధానంతరపు సామ్రాజ్యవాద వ్యవస్థ సౌభాగ్యం గురించిన ఇలాంటి అద్భుత గాథలన్నీ గాల్లో కలిసి పోయాయి. అందుకు పూర్తిగా భిన్నమైన వాస్తవికత ఆ భ్రమలన్నింటినీ పటాపంచలు చేసింది. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాలను తొలగించడానికి చేపట్టిన చర్యలన్నీ వెనుకడుగేశాయి. సామ్రాజ్యవాద దశలోని పెట్టుబడిదారీ వ్యవస్థ అధిగమించలేనట్టి సంక్షోభాల గుండా పయనిస్తూ వచ్చింది. ఈసారి సంక్షోభం రెండో ప్రపంచ యుద్ధ కాలం నుండి ఎన్నడూ లేనంత తీవ్రంగా వుంటోంది. సంవత్సరానికి 8 నుండి 10 శాతం దాకా నిరంతరం పెరుగుతున్న అంతర్జాతీయ రుణ పరిస్థితి స్థాయిని దృష్టిలో పెట్టుకున్నట్లయితే ప్రస్తుత సంక్షోభం లోతును సులభంగానే అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ ఉత్పాదక సామర్థ్య వినియోగపు రేట్లు నూటికి 70-75 శాతంగా మాత్రమే వుంటున్నాయి. నిజవేతనం పడిపోతోంది. సట్టా పెట్టుబడుల అపరిమిత పెరుగుదల అన్నదే బాగా కొట్టొచ్చినట్లు కన్పించే అంశంగా వుంటోంది. 1974 తర్వాత, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల స్థూల దేశీయ ఉత్పత్తి సగటు పెరుగుదల దాదాపు సగానికి పడిపోయింది. '80లలో ఇది మరింతగా పడిపోయింది. '90ల ద్వితీయార్థంలో యూరప్ ఖండ స్థూల దేశీయోత్పత్తి పెరుగుదల రేటు 3 శాతం కంటే తక్కువగానే వుంది. నిరుద్యోగితాస్థాయి 1980ల నుండి 10 శాతంపైనే వుంటూ వచ్చింది. 1990లలో ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సగటు ఆదాయాలతో, అత్యధిక నిరుద్యోగపు రేట్లతో, వస్తు ఉత్పాదకతలో నిరాశాజనకమైన పెరుగుదల రేట్లతో గుర్తింపబడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకి సంబంధించిన ఈ కీలక ప్రాంతాలకు ఆవల వుంటున్న మెజారిటీ ప్రజానీకం క్షీణిస్తున్న జీవన ప్రమాణాలు, నిత్యం పెరుగుతున్న సామాజిక అసమానత, జనాభాలోని అతి పెద్ద సెక్షన్లు దరిద్రులవటం కారణంగా మరింత భయంకరమైన ఆర్థిక పరిస్థితులను చవిచూశారు. బూర్జువా ఆర్థిక వేత్తలు ప్రత్యేకించి రెండో ప్రపంచ యుద్ధం చివర్లో చేసిన వాగ్దానాలన్నీ అబద్ధాలుగా పై చిత్రణ నిరూపిస్తూంది. ఈ విధమైన వాగ్దాన కర్తలలో అత్యంత ప్రాధాన్యత, పలుకుబడి గల్గినవాడు కీన్స్. 1930లలో ప్రపంచ పెట్టుబడిదారీ కేంద్రాలలో తీవ్రంగా పెరిగిపోయిన నిరుద్యోగం, దారిద్ర్యం, సౌకర్యాల లేమి వంటివి, సంపూర్ణ ఉద్యోగాలను కల్పిస్తామంటూ చేసిన వాగ్దానాలను

వమ్ము చేశాయి. అప్పటికే చాలా కాలం నుండే సామ్రాజ్యవాద సమర్థకులు ఈ సంపూర్ణ ఉద్యోగితా సమతౌల్య స్థితి గురించి ఊదరగొడుతూ వచ్చారు. పెట్టుబడిదారీ విధానం వనరులను పూర్తిగా వినియోగించుకుంటూ తన్ను తాను సరి చేసుకునే రకం వ్యవస్థ కాదని కీన్స్ అంగీకరించాడు. కొనుగోలు శక్తిని సృష్టించటమెలా అన్న సమస్యపైనే కీన్స్ ప్రధానంగా దృష్టి సారించాడు. పెట్టుబడిదారీ విధానపు ఉత్పాదక యంత్రాన్ని వేగవంతం చేసేందుకుగానూ పెట్టుబడులపై, ప్రజోపయోగ పనులపై, రక్షణ వగైరాలపై ఖర్చును పెంచాలంటూ అతడు అభ్యర్థించాడు. దీన్ని చాలామంది అంగీకరించి అమలు పర్చారు. ప్రపంచ యుద్ధం వల్ల విధ్వంసమైపోయిన సామ్రాజ్యవాద దేశాల ఆర్థిక వ్యవస్థలు 1950ల ప్రారంభం నుండి 60ల మధ్య కాలంలో మెరుగుపడినాయి. కాబట్టి పై కీన్సియన్ మందు ప్రకారం పనిచేసిన పెట్టుబడిదారీ విధానం తన అంతర్గత వైరుధ్యాల కారణంగా ఎలాంటి ప్రధాన వైఫల్యాలకు లోనుకాకుండానే దీర్ఘకాలంపాటు కొనసాగగలదని విశ్వసించేవారు. అయితే 1960ల మలి భాగంలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం పదే పదే సంక్షోభాలను ఎదుర్కోవలసి వచ్చింది. వ్యవస్థ యొక్క అరాచకత్వాన్ని, సంక్షోభాన్ని నిలువరించటంలో ఈ కీన్సియన్ వ్యాధి నివారణా పద్ధతి విఫలమై పోయింది. దీంతో 70ల తొలి భాగం నుండి నూతన పద్ధతులను చేపట్టారు. అయితే ఆ సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ఈ పద్ధతులు పరిస్థితిని మరింత దిగజారటానికి తోడ్పడటమేకాక కొన్ని అదనపు సంక్లిష్టతలను కూడా సృష్టించాయి.

రెండో ప్రపంచ యుద్ధం నాటి నుండి (ఇది సైతం సంక్షోభం సృష్టించిందే) సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ అనేక ఆర్థికమాంద్యాలను అధిగమించాల్సి వచ్చింది. వీటిలో ప్రతి మాంద్యమూ క్రితం దాని కంటే తీవ్రమైనదీ, సంక్లిష్టమైనదిగా వుండేది. ఈ సంక్షోభాల తర్వాత సాధించిన పరిష్కారాలు స్వల్ప ఉత్పాదకతా రేట్లు, నిరంతరం పెరుగుతున్న నిరుద్యోగం వంటి పెరుగుతున్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించటంలో విఫలమై పోవటమే కాదు; 1973లో వున్న స్థిర మార్పిడీ రేట్ల స్థానంలో విస్తృత రూపంలోని ఆర్థిక ఎక్ఛేంజ్ రేట్లు ఉనికిలోకి రావటం, '70లలో జమ (క్రెడిట్), వడ్డీరేట్ల పెరుగుదల, తత్ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో 1982లో రుణ సంక్షోభం ఏర్పడటం వంటి పలు కొత్త సమస్యలను కూడా సృష్టించాయి. సంక్షోభాన్ని అధిగమించడానికి తీసుకున్న చర్యలు పెట్టుబడి సాంద్రీకరణ, కేంద్రీకరణ ధోరణులను మరింతగా బలోపేతం చేశాయి. ఆ విధంగా కొన్ని అతి పెద్ద పారిశ్రామిక సర్వీసు మరియు ద్రవ్యపరమైన టి.ఎన్.సి.లు ఆవిర్భవించాయి. ప్రస్తుతం అంతర్జాతీయ ద్రవ్యవ్యవస్థ ఆధిపత్య స్థానాల్లో వున్న లండన్, న్యూయార్క్, టోక్యో మూడు నగరాల్లో అతి కొద్దిమంది అంతర్జాతీయ ద్రవ్య ప్రభువుల ఆజమాయిషీలో వుంటోంది. గుత్త పెట్టుబడిదారీ విధానపు (అంటే సామ్రాజ్యవాదం) పరాన్నభుక్కు స్వభావం ఇపుడు మరింత సుస్పష్టంగా వుంటోంది. అయినప్పటికీ సిగ్గూ, శరమూ లేని బూర్జువావర్గ సిద్ధాంత కర్తలు మరింత పట్టుదలతో పెట్టుబడిదారీ విధానమొక్కటే మానవజాతి ముందున్న ఏకైక ప్రత్యామ్నాయమని వర్ణిస్తూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే చరిత్ర భిన్నమైన కథను చెబుతోంది. ప్రపంచ ప్రజలు ఇప్పటికే లెనిన్, స్టాలిన్, మావోల నేతృత్వంలో కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో ఒక వున్నత వ్యవస్థలోకి అంటే....సోషలిస్ట్ వ్యవస్థలోకి పయనించారు. వుత్పత్తి శక్తుల అభివృద్ధిని అడ్డుకుని వారి ప్రాథమికావసరాలను లేకుండా చేసినటువంటి ఆర్థిక సంక్షోభాన్ని రష్యా, చైనా, తదితర సోషలిస్ట్ దేశాల ప్రజలు ఎన్నడూ ఎదుర్కోలేదు. సోషలిజం వెనుకంజ తర్వాత ఈదేశాలు నిరంకుశ పెట్టుబడిదారీ దేశాలుగా మార్పు చెంది, ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థలో భాగమై లోతైన సంక్షోభంలో కూరుకు పోయాయి.

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ. అది చరిత్రకు అతీతమైన (ట్రాన్స్-హిస్టారికల్) వ్యవస్థ కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క ఈ దశలో ఉత్పత్తి శక్తులకు, ఉత్పత్తి సంబంధాలకు మధ్య వున్న వైరుధ్యం మరింత తీవ్రతరమౌతుంది. ఇక్కడ ఉత్పత్తి సామాజీకరింపబడింది. అయితే వ్యక్తిగత ఆస్థి సంబంధాలు ఈ సామాజీకరింపబడిన వుత్పత్తిని సంపూర్ణంగా వినియోగించుకునేలా చేయలేవు. పెట్టుబడిదారీ విధానపు సామ్రాజ్యవాద దశను విశ్లేషిస్తూ లెనిన్ ఇలా నొక్కి చెప్పాడు. **''మనకు సామాజీకరింపబడిన ఉత్పత్తి వుంది. అయితే అది కేవలం పరస్పరం పెనవేసుకుని లేదు. సొంత ఆర్థిక సంబంధాలూ, సొంత ఆస్థి సంబంధాలూ అనే పై పెంకు ఇప్పుడిక దాని లోపలి వస్తువుకు తగినట్లుగా లేదని, అది అనివార్యంగా క్షీణించక తప్పదని, దాని తొలగింపును కృత్రిమంగా ఆలస్యం చేస్తే (కీడులోకెల్లా కీడు సంభవించి, అవకాశవాదపు వుండుకు చికిత్స చాలాకాలం సాగితే) ఆ పెంకు దీర్ఘకాలం క్షీణ స్థితిలో నిలిచి వుండవచ్చుననీ, కాని అనివార్యంగా అది తొలగింపబడుతుందని మనకు తేటతెల్ల మౌతుంది''.** పెరుగుతున్నట్టి ఉత్పత్తి సామాజీకరణకి, వ్యక్తిగత యాజమాన్యానికి మధ్య వైరుధ్యం మరింత తీవ్రతర మౌతోంది. నిరంతరం విస్తృతమవుతున్న సంక్షోభం ఈ వైరుధ్యపు ఫలితమే. సామ్రాజ్యవాదం మరణశయ్యపై వున్న పెట్టుబడిదారీ విధానమే. ఇది ఉత్పత్తి శక్తులను వినియోగించుకోలేదు. కాబట్టి ఉత్పత్తి శక్తులలోకెల్లా అత్యంత విప్లవాత్మకశక్తి అయినటువంటి కార్మికవర్గం ఉత్పత్తితో అత్యున్నత సంబంధంలో వుండే నూతన ఉత్పత్తి సంబంధాల కోసం చాలా కాలం నుండి పోరాడుతూ వస్తోంది. ఈ నూతన ఉత్పత్తి సంబంధాలు సామ్రాజ్యవాదాన్ని కూలదోయటం ద్వారా మాత్రమే సాధ్యపడగలవు. అందువల్ల సామ్రాజ్యవాదపు ఆగమనం ద్వారా, పెట్టుబడిదారీ విధానం నుండి సోషలిజానికి పరివర్తనా శకం ప్రారంభమైంది. 20వ శతాబ్దపు ప్రారంభం నుండి ఇది కార్మికవర్గ విప్లవాల యుగమని సూచిస్తూ ఒక ఉన్నత వ్యవస్థ కోసం పోరాటం అనేక ఒడిదుడుకుల గుండా కొనసాగుతూనే వుంది.

## ప్రజా ప్రతిఘటన: సోషలిస్ట్ రాజ్యాల ఆవిర్భావం

సామ్రాజ్యవాద శక్తుల మధ్య మార్కెట్ల పునర్విభజన కోసం పలు రూపాల్లోని ప్రభుత్వ పరాధీనత, జాతుల అణచివేతలను తీవ్రతరం చేయటం, నిర్దాక్షిణ్యమైన దోపిడి, అణచివేత, కొల్లగొట్టడం, యుద్ధం (అంటే ప్రాంతీయ యుద్ధం, ప్రచ్ఛన్న యుద్ధం, ప్రపంచ యుద్ధం) వంటి అంశాల పెరుగుదలకు వీలు కల్పించే వలసవాద విధానాల కొనసాగింపే సామ్రాజ్యవాదం. అందువల్లనే దేశాలు నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాయి. జాతులు స్వయం నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నాయి. ప్రజలు కార్మికవర్గం ఆధ్వర్యంలో విప్లవం కోసం పోరాడుతున్నారు. 20వ శతాబ్ది చరిత్ర దీన్నంతటినీ స్పష్టంగా ప్రదర్శించింది. సామ్రాజ్యవాదంతో పోరాడటంలో కార్మికవర్గమే అత్యంత ప్రధాన పాత్ర వహించింది. 20వ శతాబ్ది మొదట్లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, బెల్జియం, తదితర దేశాలలో తీవ్రమైన సామ్రాజ్యవాదుల దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు కార్మికులు సమ్మె పోరాటాలు మొదలుపెట్టారు. ఈ పోరాటాల క్రమంలో అంతర్జాతీయ కార్మికవర్గ ఉద్యమంలో విప్లవకర ధోరణి బలోపేతమైంది. 20వ శతాబ్ది మొదట్లో సామ్రాజ్యవాదుల అంతర్గత వైరుధ్యాలు కూడా

తీవ్రతరమైనాయి. తమ దోపిడీని మరింత కొనసాగించుకునేందుకుగాను సామ్రాజ్యవాద శక్తులన్నీ నూతన మార్కెట్లను చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తూండేవి. 1914లో ప్రపంచ మార్కెట్ల పునర్విభజనకై మొదటి ప్రపంచయుద్ధం మొదలైంది. ఈ సామ్రాజ్యవాద యుద్ధంతో ప్రజలకు, కార్మికులకు మరిన్ని బాధలు తోడైనాయి. బూర్జువా ప్రభుత్వాలు అనుసరిస్తున్న నేరపూరిత విధానాలకు, యుద్ధానికి వ్యతిరేకంగా కార్మికవర్గం గొంతెత్తింది. రష్యాలో బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో కార్మికవర్గ విప్లవోద్యమం చాలా శీఘ్రగతిన బలం పుంజుకుంది. సామ్రాజ్యవాద దశలో లెనిన్ అభివృద్ధి పర్చిన విప్లవకర సిద్ధాంతం, వ్యూహం-ఎత్తుగడల వెలుగులో బోల్షివిక్ పార్టీ కార్మికవర్గాన్ని ముందుకు నడిపించి సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పింది. ఇది మానవ చరిత్రలోనే ఒక నూతన శకాన్ని నెలకొల్పింది. కార్మికవర్గ నియంతృత్వం స్థాపన ప్రపంచ వ్యాప్తంగా విప్లవకర కార్మికవర్గాన్ని సంఘటిత పర్చింది. ఈ సోషలిస్ట్ విప్లవ విజయం ప్రభావంతో ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ విప్లవోద్యమం వృద్ధి చెందింది. 1918 జనవరి 28న ఫిన్నిష్ కార్మికులు తమ అధికారాన్ని స్థాపించారు. 1918 అక్టోబర్ నెలలో ఆసియా-హంగరీలో జరిగిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవం పలు స్వతంత్ర రాజ్యాల ఆవిర్భావానికి దారి తీసింది. 1918 నవంబర్‌లో జర్మనీలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం మొదలైంది. 1918 డిసెంబర్‌లో లిథువేనియా, లాత్వియా, ఈస్తోనియాలలో కార్మికవర్గం తన అధికారాన్ని నెలకొల్పింది. 1919 మార్చి 21న హంగేరియన్ సోవియట్ రిపబ్లిక్ ఏర్పడింది 1919 ఏప్రిల్‌లో బవేరియన్ సోవియట్ రిపబ్లిక్ ఏర్పడింది. 1920 జూలైలో పోలెండ్‌లో సోవియట్ రాజ్యాధికారం ఏర్పడింది. అయితే ఈ దేశాల్లో చాలా వాటిలో విప్లవానికి సంబంధించిన స్వీయాత్మక అంశం బలహీనంగా వున్నందువలన ఈ విప్లవాలు ఓడిపోయాయి. ఈ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు అప్పుడప్పుడే రూపుదిద్దుకుంటూ వుండినాయి. ఈ పరిస్థితుల్లో ప్రపంచ సామ్రాజ్యవాద శక్తులు ఈ విప్లవాలను క్రూరంగా అణచివేశాయి. ఈ వెనుకంజ వున్నప్పటికీ ఈ విప్లవాల అనుభవాలు అంతర్జాతీయ విప్లవోద్యమానికి తోడ్పడినాయి. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన నాటి నుండి ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ కార్మికవర్గం ఇతర పీడిత ప్రజానీకంతో కలిసి వీరు తమ సమరశీలతను, కృతనిశ్చయాన్ని ప్రదర్శిస్తూ భారీ ఎత్తున వుద్యమాలను నిర్వహించి తమ డిమాండ్లకు ప్రభుత్వాలు తల ఒగ్గేటట్లు చేసుకున్నారు. ఆ డిమాండ్లలో ప్రత్యేకమైనది 8 గంటల పనిదినం. ఈ దశలో పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికవర్గం, ఇతర పీడిత ప్రజారాసులే కాదు, వలస ప్రపంచంలోని సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులు సైతం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా లేచి నిలబడి జాతీయ విముక్తి పోరాటాలను నిర్వహించాయి. 1917 తర్వాత దాదాపు ఆసియా,ఆఫ్రికా ఖండాల్లోని అన్ని దేశాల్లోనూ జాతీయ విముక్తి పోరాటాలూ, విప్లవాలూ విజృంభించాయి.

## రెండో ప్రపంచ యుద్ధం: కార్మికవర్గం ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు

1929 సం॥రం మలిభాగం నుండి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తిరిగి మరో సంక్షోభాన్ని ఎదుర్కొన్నది. ఈసారి అది 1933 చివరిదాకా కొనసాగింది. అటు తర్వాత సైతం అది కోలుకోలేదు. స్తబ్దతా దశ కొనసాగింది. 1937 మలిభాగం ప్రారంభం నుండి తిరిగి మరో కొత్త ఆర్థిక సంక్షోభం మొదలైంది. ఫలితంగా, సామ్రాజ్యవాద దేశాల మధ్య వైరుధ్యాలు మరింత తీవ్రమైనాయి. ప్రపంచ ప్రజలు రెండో ప్రపంచ యుద్ధాన్ని చవిచూశారు. ఈ యుద్ధం కనీవినీ ఎరుగని ఫాసిస్టు పాశవికత్వంతోపాటు, సామ్రాజ్యవాద శక్తుల నిజ స్వభావాన్ని మరోసారి ప్రదర్శించింది. కార్మికవర్గ పార్టీలు, వారి అంతర్జాతీయ కార్మిక సంఘమైన మూడో ఇంటర్నేషనల్, వీటన్నింటికంటే అధికంగా సోవియట్ యూనియన్ కలిసి ఫాసిస్ట్ దాడి నుండి మానవజాతిని కాపాడాయి. సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సోవియట్ యూనియన్ ప్రజలు వీరోచిత పోరాటాల్లో పాల్గొని ఫాసిస్టు శక్తులను ఓడించటానికి తమ జీవితాలనే ఫణంగా పెట్టారు. ప్రపంచమంతటా ఫాసిస్ట్ వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పడింది. అది ప్రపంచ వ్యాప్తంగా బలమైన ఫాసిస్ట్ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను అభివృద్ధి చేసింది. చైనాలో మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ విప్లవాత్మక ప్రజాయుద్ధాన్ని అభివృద్ధిపర్చి, స్థావర ప్రాంతాలను నెలకొల్పి ఫాసిస్ట్ వ్యతిరేక ఐక్య సంఘటనని వృద్ధిపర్చి జపాన్ దురాక్రమణ దాడిని ప్రతిఘటించింది. కొరియా, మలయా, బర్మా, ఇండోనేషియా, పిలిప్పైన్స్ దేశాల ప్రజలు కూడా జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు నడిపి దురాక్రమణదారుని ఓడించారు. ఈ దశలో ఆఫ్రికా, ఆసియా దేశాల కమ్యూనిస్టు పార్టీలూ, ఇతర ప్రజాతంత్ర శక్తులూ ఫాసిస్ట్ దురాక్రమణ దారులను ప్రతిఘటించి, అన్ని విధాల వలస అణచివేతను నిర్మూలించి జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించడానికిగానూ తమ ప్రయత్నాలపై కేంద్రీకరించాయి. రెండో ప్రపంచ యుద్ధం చివరలో కార్మికవర్గం 13 రాజ్యాలలో అధికారాన్ని స్థాపించింది. అర్ధభూస్వామ్య, అర్ధవలస దేశాలలో, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేయడానికి దీర్ఘకాల ప్రజాయుద్ధానికి చెందిన సరైన పంథాని ప్రదర్శించి చూపిన చైనా విప్లవం ఈ కాలంలోని విప్లవాలలో కెల్లా అత్యంత ప్రధానమైనది. అత్యంత శక్తివంతమైన అమెరికా సామ్రాజ్యవాద దేశాన్ని ఓడించటం ద్వారా వియత్నాం ప్రజలు చరిత్రనేకాక విప్లవ పోరాటానికి సంబంధించిన నమూనాను కూడా సృష్టించారు. 1950, 60ల చరిత్ర అంతా అమెరికా, సోవియట్ రష్యా అగ్ర రాజ్యాలు రెండింటికీ వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ప్రజలు సాగించిన సామ్రాజ్యవాద వ్యతిరేక బలమైన పోరాటాల చరిత్రగా నడిచింది. ఈ కాలంలోనే సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ దిగజారిపోయి సోషల్ సామ్రాజ్యవాద దేశంగా పరివర్తన చెందింది. '60లలో ఈ మూడు ఖండాల్లోని దేశాలు విప్లవోద్యమాల, పోరాటాల తుఫాన్ కేంద్రాలుగా మారిపోయాయి.

చైనా కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలు దిగజారిపోయి, పై 13 సోషలిస్టు దేశాలు పెట్టుబడిదారీ దేశాలుగా పరివర్తన చెందిన కారణంగా విప్లవకర కార్మికవర్గ ఉద్యమాలు, పోరాటాలు వెనుకంజ వేశాయి. అయితే ఈ వెనుకంజను అధిగమిస్తూ కార్మికవర్గం తన శక్తిని తాను తిరిగి నిరూపించు కునేందుకుగాను పీడిత ప్రజారాసులతో ఐక్యమయింది. '90ల మలిభాగంలో ఫ్రాన్స్‌లో రాడికల్ ప్రజా వుద్యమాలు, ప్రజా మిలిటెంట్ పోరాటపు విస్ఫోటనలు, భారీస్థాయి ప్రజాసమ్మెలు, విద్యార్థి ప్రదర్శనలు జరిగాయి. మెక్సికోలో గ్రామీణ తిరుగుబాటు, ఇండోనేషియాలో విద్యార్థి తిరుగుబాటు, భారతదేశంలో ప్రజా ప్రదర్శనలు, దక్షిణ కొరియా, కొలంబియా, వెనిజులా, ప్యూర్టోరికాలలో సార్వత్రిక సమ్మెలు చెలరేగాయి. వీటికి మించి పెరూ, పిలిప్పైన్స్, టర్కీ, నేపాల్, భారతదేశ ప్రజలు మార్క్సిస్ట్-లెనినిస్ట్ పార్టీల నాయకత్వంలో, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో పురోగమిస్తున్నారు. ఇవన్నీ ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితి మరింత

మరింతగా విప్లవ పోరాటాలకు, విప్లవాలకు అనుకూలంగా మారిందని సూచిస్తున్నాయి.

వందేళ్ళ క్రితం చరిత్ర కేసి ఓసారి చూస్తే రష్యాలో, యూరప్ దేశాల్లో 1900లో కార్మిక పోరాటాలు, సమ్మెలు వెల్లువెత్తుతుండేవి. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దశలోకి అడుగిడుతున్న కాలమది. 20వ శతాబ్దం ఆరంభమే కార్మికవర్గ పోరాటాలతో మొదలైంది. అది సోషలిస్ట్ విప్లవాలను, నూతన వ్యవస్థను వునికిలోకి తెచ్చింది. అయితే ఆ శతాబ్ది ఆరంభం నుండి కూడా విప్లవకర శక్తులకు, సోషల్ డెమోక్రసీ ముసుగులోని రివిజనిజానికి రకరకాల రూపాలతో మధ్య ఘర్షణలు జరుగుతూనే వచ్చాయి. విప్లవ ప్రయోజనాలకు, కేవల ఆర్థిక ప్రయోజనాలకు మధ్య ఘర్షణ 20 శతాబ్దంలోని ప్రతి విప్లవంలోనూ ప్రతిబింబించింది. ఆర్థికవాదం యూరప్‌లో, అమెరికాలో కార్మికవర్గ ప్రభువులను సృష్టించి ప్రపంచమంతటా తన ప్రభావాన్ని వ్యాపింపజేసింది. ఆర్థిక వాదానికి, ఉత్పత్తి శక్తుల సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడి గెలిచిన రష్యా, చైనా తదితర సోషలిస్ట్ విప్లవాలు క్రమంగా కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం లోపలే బలం పుంజుకున్న ఆర్థికవాదం ప్రభావానికి గురై వెనుకంజ వేశాయి. 1950ల మధ్యలో మొదలై 1990ల మొదట్లో ముగిసిన ఈ తిరోగమన చరిత్ర పెట్టుబడిదారీ సమర్థకులకు పట్టపగ్గాలు లేకుండా చేసింది. కాని గత పదేళ్ళుగా పెట్టుబడిదారీ విధానపు నడకను గమనించినట్లయితే ఈ 'ఏకైక ప్రత్యామ్నాయం' ప్రపంచానికిచ్చిన కానుకలేమిటో సులభంగా అర్థమవుతాయి. ఈ పదేళ్ళలో ఒక్కటంటే ఒక్క సం॥రం కూడా పెట్టుబడిదారీ విధానం కల్లోలాలకు గురికాకుండా స్థిరంగా సాగిన చరిత్ర లేకుండా పోయింది. అది గల్ఫ్ బావుల్లో ఇరాక్ తరహా హైటెక్ యుద్ధాన్ని రగిలించింది. లాటిన్ అమెరికా దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పగూల్చి 'మెక్సికో'ను దివాళా తీయించింది. ఆగ్నేయాసియా దేశాల ద్రవ్య విలువలను పతనం చేసి వాటిని కోలుకోలేకుండా చేసింది. స్వయంగా తన పెరట్లోనూ, బయటి దేశాల్లోనూ కార్మికుల, ప్రజల జీవన ప్రమాణాలను ఎన్నడూ లేనంతగా దిగజార్చి వేసింది. యుగోస్లేవియా, ఆఫ్ఘనిస్తాన్, రువాండా వగైరా దేశాల్లోని జాతులను దారుణ మారణకాండతో మునిగేలా చేసింది. మరోవైపు జపాన్, జర్మనీల ఆర్థిక అద్భుతాల వైభవ చరిత్ర ఈ దశాబ్దంతోనే ముగిసి పోయింది. ఆగ్నేయాసియా 'టైగర్' ఆర్థిక వ్యవస్థల కోరలు తెగి పోయాయి. నిజంగానే పెట్టుబడిదారీ విధానంలో ఈ రోజు ఎక్కడా కూడా ఆర్థిక అద్భుతాలకు అడ్రసన్నదే లేదు. ప్రతిరోజూ ప్రపంచంలో ఏదో ఒక చోట స్టాక్ మార్కెట్లు కుప్పగూలు తున్నాయి. ఆర్థిక, స్టాక్ మార్కెట్ల లావాదేవీలలో టి.ఎన్.సి.లకు మేలు చేకూర్చే విధానాలే రాజ్యమేలు తున్నాయి. వ్యక్తుల జీవితం కాసింత భద్రతతో అయినా సాగే రోజులు పోయాయి. ఎల్లెడలా ఆవరించిన సంక్షోభ భారాన్ని కార్మికుల, పీడిత ప్రజల మీదికి నెట్టేయడానికి పెట్టుబడిదారీ విధానం ప్రయత్నించటంతో పాశ్చాత్య దేశాలలో, వెనుకబడిన దేశాలలో మిలిటెంట్ పోరాటాలు వెల్లువెత్తు తున్నాయి. గత 50 సం॥లలో ఎన్నడూ లేనంత విస్తృతంగా యూరప్ కార్మికులు లక్షలాది మందిగా వీధుల్లోకి వచ్చి రాజ్య వ్యవస్థలతో తలపడటాన్ని 90ల దశాబ్దమే నమోదు చేసింది. ఫ్రాన్స్‌లో దఫదఫాలుగా మిలియన్లాదిగా కార్మికులు వీధుల్లోకి రాగా బ్రిటన్‌లో ప్రభుత్వ వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా గత సం॥రం బ్రిటన్ రైతాంగం 20వ శతాబ్ది బ్రిటీష్ చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా లక్షలాదిగా తరలివచ్చి లండన్ వీధుల్లో తన అసమ్మతి వాణిని వినిపించింది. యూరప్‌లో పర్యావరణ ఉద్యమాలు తప్ప కార్మికోద్యమాలకు చోటు లేదన్న ప్రతీతిని తిప్పికొడుతూ మిలిటెంట్ కార్మిక పోరాటాలు రంగం మీదికొస్తున్నాయి.

మరి భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల మాటేమిటి? దళారీ పాలకులకు, వారి సామ్రాజ్యవాద యజమానులకు మధ్య దోపిడీ బంధం మున్నెన్నడూ లేనంతగా పెనవేసుకు పోయింది. ప్రపంచ బ్యాంకుల, ఐ.యం.యఫ్.ల పేరు బహిరంగంగా ప్రస్తావించడానికి కూడా ఒకప్పుడు వెనుకాడిన దళారీ పాలకులు ఇప్పుడు ఆ ద్రవ్య సంస్థల వద్ద బిచ్చం ఎత్తుకోనిదే తిండి దొరకదంటూ నిర్భయంగా ప్రకటిస్తున్నారు. బడ్జెట్ ప్రసంగాల్లో ప్రపంచబ్యాంకు రుణాలను, సహాయాలను పదుల సంఖ్యలో ప్రస్తావించనిదే దళారులకు మనుగడలేని పరిస్థితి ఏర్పడింది. దళారులు, సామ్రాజ్యవాదులు కుమ్మక్కైన ఫలితంగా ప్రజల జీవితాలు హరించుకు పోతున్నాయి. నీళ్ళను, విద్యుత్‌ని సరుకుగా మార్చాలనే ప్రపంచబ్యాంకు సంస్కరణలు ప్రజలకు ఆ రెండింటినీ దూరం చేస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాలు కనీవినీ ఎరుగని నీటి ఎద్దడి, కరువుల బారిన పడినాయి. ఒక సంవత్సరం తగినంత వర్షపాతం లేకుంటే లక్షలాది పశువులు, కోట్లాది ప్రజల మనుగడే అస్తవ్యస్తమయ్యేలా పాలకులు వర్షాధార వ్యవసాయ విధానాలనే నేడు కొనసాగిస్తున్నారు. నిరుద్యోగం, నిర్బంధ పదవీ విరమణ, ఉద్యోగాల కోతలు, ప్రైవేటీకరణ మాయాజాలపు ముసుగును చించివేసి ప్రజలను వీధుల్లోకి లాగుతున్నాయి. నూతన సహస్రాబ్ది ప్రజల వేడుకలు, ఉత్సాహాలతో కాక పెట్టుబడిదారీ విధానంపై విసిగిపోయిన ప్రజల అసమ్మతి, సమ్మెల వెల్లువలతో ప్రారంభమైంది. రాజస్థాన్, జమ్మూ-కాశ్మీర్‌లలో ప్రభుత్వోద్యోగులు, ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్‌శాఖ ఉద్యోగులు/కార్మికులు; దేశమంతటా రేవు కార్మికులు ఇంకా లాయర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆంధ్రలో జూనియర్ డాక్టర్లు, ఉద్యోగులు, విద్యార్థులు, నిరుద్యోగులు వేలలో కాదు లక్షల సంఖ్యలో సమ్మెలకు, వీధి పోరాటాలకు దిగటం, దేశమంతటా సార్వత్రిక సమ్మెలు ప్రబలటం వంటివి నూతన శతాబ్దికి స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు రాజ్యం ఎంతగా ఫాసిజీకరణ చెందుతున్నదంటే ఎలాంటి అసమ్మతినైనా తుపాకీ కాల్పులతో, చిత్రహింసలతో, అరెస్టులతో అణచివేయడానికి పాలకులు బరితెగించి ముందుకొస్తున్నారు. నూతన శతాబ్ది ఫాసిజాన్ని తీవ్రతరం చేస్తోంది. అది ఒక ధోరణిగా ముందు కొస్తోంది. ఎలాంటి సమ్మెలనైనా ఉక్కుపాదంతో అణచివేసే రూపంలో అది బయట పడుతోంది. దీంతో కార్మికవర్గపు విముక్తి శతాబ్దంగా ఈ నూతన శతాబ్ది కూడా కొనసాగనుంది. ఈ పరిస్థితిలో కార్మికవర్గం సోషల్ డెమోక్రసీ నుండి, కేవల ఆర్థిక పోరాటాల నుండి బయటపడందే నిజమైన విముక్తికి చేరువ కాలేదు. ప్రధానంగా, బలంగా ఊడలు దిగిపోయిన సోషల్ డెమోక్రసీ, ఆర్థికవాద ప్రభావాల నుండి కార్మికవర్గం ముందుకు రావాలి. పై సమ్మెలు కార్మికులలో, ఉద్యోగులలో, పీడిత ప్రజల్లో భ్రమలు పోతుండటాన్ని నిరూపించాయి.

సామ్రాజ్యవాద దోపిడీకి, అణచివేతకు, బానిసత్వానికి వ్యతిరేకంగా తన వీరోచిత పోరాట సంప్రదాయాలను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం ఈ నూతన సహస్రాబ్దిలో జరుపు కుంటున్న మొట్టమొదటి మేడే ఇది. మానవజాతి విముక్తి కోసం సామ్రాజ్యవాద వ్యవస్థను రద్దు చేయటానికి కార్మికవర్గం కృతనిశ్చయంతో నడుం కడుతుంది. ఇందుకోసం అది సకల సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులనూ ఐక్యం చేస్తుంది.

**సకలదేశ కార్మికులారా, ఏకం కండి!!** ❑

బడ్జెట్ (2000-2001)

# దేశ ప్రజల మీదే దాడికి సిద్ధమైన యుద్ధ బడ్జెట్

ఈసారి బడ్జెట్ యుద్ధ ప్రకటనను తలపిస్తోంది. కేవలం పొరుగు దేశాల మీదే కాదు, అంతకు మించి ప్రత్యేకించి మన దేశ ప్రజలపైనే గురిపెట్టిన యుద్ధమిది. మొత్తంగానే దివాళాతీసి, రుణాలమీదే మనుగడ సాగిస్తున్న ప్రభుత్వం కేవలం సాయుధ బలగాల మీదే కాక నిర్బంధ యంత్రాంగాలన్నింటిమీదా పెట్టే ఖర్చును భారీ ఎత్తున పెంచుతూ ఈ బడ్జెట్‌ని రూపొందించింది, మునుపెన్నడూ, చివరకు అత్యవసర పరిస్థితి కాలంలో కూడా బడ్జెట్ ఇంత పచ్చి సైనికతత్వంతో నిండి వుండలేదు.

**ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దివాళా తీసిన స్థితిలో ప్రభుత్వ వ్యయంలో ఈ భారీ పెరుగుదలను ఎలా సమకూర్చుకుంటున్నారంటే, ధనికులపై పన్నులను మోపటం ద్వారాకాక, పేద, మధ్య తరగతి ప్రజల జేబుల్లోని చివరి పైసాను సైతం ఊడబీక్కునే నిర్దాక్షిణ్యమైన కార్యక్రమం ద్వారానే తప్ప మరొక విధంగా కాదు. ఈ బడ్జెట్ ప్రత్యేకత ఏమిటంటే తుపాకులను కొని వాటితో ప్రజలను కాల్చడానికి ప్రజల డబ్బునే కొల్లగొట్టే స్వభావంతో వుందది. ఒక దెబ్బతోనే, ఉన్నత వర్గాలకు రాయితీలు కల్పించి బలిపిస్తూ, అదే సమయంలో పోలీస్, మిలటరీ వ్యయాన్ని పెంచటం ద్వారా వారిని ప్రజల ఆగ్రహం నుండి కాపాడే విధం ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది.**

ఈ బడ్జెట్ విశ్లేషణలో మొదటగా మనం పాలకుల మందుగుండు సామాగ్రిపై వ్యయం ఏ మేరకు పెరుగుతూందో చూద్దాం. తర్వాత మనం ఈ భారీ నిధులను ప్రజల నుండి ఎలా కొల్లగొడుతున్నారో చూద్దాం; తర్వాత ఉన్నత వర్గాలకు, ప్రత్యేకించి విదేశీ పెట్టుబడికి ఎంతెంత భారీ మొత్తాలను బహుమతిగా ఇచ్చారో చూద్దాం. చివరగా ప్రభుత్వాలు వరుసగా చేపట్టిన ''ఆర్థిక సంస్కరణల'' విధానాల కారణంగా ఆర్థిక వ్యవస్థ ఇవాళ ఎంత దివాళాకోరుతత్వంలోకి చేరిందో కూడా చూద్దాం.

## ప్రజలపై యుద్ధ పత్రం

రక్షణ వ్యయం ఇంత భారీగా పెరిగిపోవటం ఇంతకు ముందెన్నడూ జరగలేదు. ఈసారి బడ్జెట్‌ని సమర్పించే సందర్భంగా ప్రభుత్వం గావించిన యుద్ధ నినాద స్థాయి కూడా ఇంతకు ముందెన్నడూ లేదు. విదేశాల్లో భారత విస్తరణవాదానికి, స్వదేశంలో ఫాసిస్ట్ నిర్బంధానికి ఒక అధికారిక పత్రం-చార్టర్-లాంటిదే ఈ బడ్జెట్. తమ పెట్టుబడికి భద్రత కల్పించుకోడానికిగాను మొత్తం దక్షిణాసియా మార్కెట్‌పైన, మనదేశ ప్రజలపైన దాడి చేస్తున్న దళారీ బడా బూర్జువా-టి.ఎన్.సి.ల కూటమికి చెందిన రెండంచులకత్తే ఈ 2000-2001 వార్షిక బడ్జెట్. **సైన్యంపై పెంచిన వ్యయంమీదే కాదు, పారా మిలటరీ, ఇతర కౌంటర్ ఇన్‌సర్జెన్సీ విభాగాలపై పెట్టే వ్యయంలో కూడా ఈ భారీ పెరుగుదల మనకు కనబడుతుంది.** భారత పాలకవర్గాలు భారత ప్రజలను అణచివేయడానికే కాదు నేపాల్ వంటి పొరుగుదేశాల్లోని ప్రజా ఉద్యమాలను నలిపి వేయడంలో సాయపడేందుకు కూడా పథకమేస్తున్నాయి.

రక్షణ వ్యయాన్ని గత సంవత్సరం కంటే 13,000 కోట్ల రూ॥ల భారీ మొత్తానికి (28.2% పెరుగుదల) పెంచారు. 58,587 కోట్ల రూ॥లతో ఈ వ్యయం ఇపుడు భారత స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 3 శాతం మేరకు వుంటోంది. అంటే ఒక్క సం॥రంలోనే స్థూల దేశీయోత్పత్తిలో రక్షణ వ్యయం వాటా 0.7 శాతం పెరిగిందన్నమాట. సైన్య యంత్రాంగం నిరవధికంగా చేస్తున్న డిమాండు ఇది. అయితే ఒకే ఒక్క సం॥రంలోనే ఇంత పెరుగుదల వుంటుందని మిలటరీ ఉన్నతాధికారులు సైతం ఊహించలేక పోయారు. **అత్యున్నత సైనికాధికారులకూ, బి.జె.పి. ఆధ్వర్యంలోని ప్రభుత్వ అగ్రనేతల మధ్య పెరిగిన దృఢమైన బంధాన్నే ఇది సూచిస్తుంది.** సైనిక వ్యయంలో పెరుగుదలకి పాకిస్తాన్ నుండి పెరుగుతున్న ప్రమాద సంకేతాలే కారణంగా చూపిస్తున్నారు. కాని నవ్వు పుట్టించే అంశమేమిటంటే పాకిస్తాన్ మొత్తం రక్షణ బడ్జెట్‌ని కలిపి చూసినా అది ఈ సం॥రం పెరిగిన భారతదేశ రక్షణ వ్యయానికి సమానంగా మాత్రమే వుండొచ్చు అన్నదే!!

భారత పాలక వర్గాలు దక్షిణాసియాలో తమ భుజబలాన్ని ప్రదర్శించేందుకు, అలాగే దేశంలో వారి తిరుగుబాటు వ్యతిరేక చర్యల స్థాయిని పెంచేందుకు (ఇప్పటికే సైన్యంలోని మూడింట ఒక వంతు ఈ చర్యల్లో మునిగిపోయి వుంది) గాను రక్షణ వ్యయాన్ని ఇంత భారీగా పెంచారన్నదే వాస్తవం.

కాబట్టి ఈ పెరుగుదలతోపాటు గత సంవత్సరంతో పోల్చి చూస్తే, పారా మిలటరీ బలగాలపై బడ్జెట్‌లో కేటాయించిన వ్యయం కూడా ఈసారి 16 శాతానికి పెరిగింది. గతంలోని 7,000 కోట్ల రూ॥ల నుండి ఇపుడు దీనిని 8,000 కోట్ల రూ॥లకు పెంచారు. దీనికి అదనంగా రాష్ట్రాల పోలీసు బలగాల ఆధునీకరణ కోసం కేటాయిస్తున్న మొత్తాన్ని కేంద్రం రెట్టింపు (200 కోట్లు) చేసింది. దీంతోపాటు జమ్మూ కాశ్మీర్, ఈశాన్య భారతంలో పెరిగిన తన తిరుగుబాటు వ్యతిరేక చర్యలకు గాను కేంద్రం ఈ రాష్ట్రాలకు మరో 500 కోట్ల రూ॥ల ''ప్రత్యేక సహాయాన్ని'' కూడా కేటాయించింది. పైగా అన్ని విమానాశ్రయాలలో భద్రత కోసం 500 కోట్ల రూ॥లను అందించే పథకాలు కూడా రూపొందించారు. ఇది బడ్జెట్ లెక్కల్లో లేదు.

అయితే ఇంతటితో వ్యవహారం పూర్తి కాలేదు. కౌంటర్-ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్ల సామర్థ్యతను పెంచేందుకు కూడా ప్రత్యేక పథకం వుంది. 'గ్రామీణాభివృద్ధి'గా చెప్పబడుతున్న దానికి ఈ బడ్జెట్‌లో 5,000 కోట్ల రూ॥ల ప్రత్యేక కేటాయింపు వుంది. అయితే ఈ ''ప్రధాన మంత్రి గ్రామోదయ యోజన'' పథకంలో 50 శాతం ఫండ్ లేక 2,500 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని కేవలం గ్రామీణ రహదారులను నిర్మించేందు కోసమే కేటాయించారు.

నిస్సందేహంగానే, విప్లవకర, జాతీయ సాయుధ పోరాటాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేస్తున్న దాడులకు వెనుకబడిన ప్రాంతాలలో రోడ్ల సౌకర్యాలు లేకపోవడమన్నది ఒక ప్రధాన అడ్డంకిగా వుంటున్నది. ఇప్పుడు దీన్ని సరిదిద్దుకోవాలని చూస్తున్నారు. పాఠశాలలు లేవు, ఆసుపత్రులు లేవు, నీటి పారుదల సౌకర్యాలు లేవు, ప్రభుత్వ చౌక రవాణా వసతి లేదు....కాని రోడ్లు మాత్రం నిర్మించబడతాయి. ఇందుకోసంగాను, 1000 కోట్ల రూ॥ల అదనపు కేటాయింపును రాష్ట్రాల రోడ్ల నిర్మాణం కోసం కేటాయించారు.

అందరికీ తెలిసేలా కేటాయించబడిన ఈ వ్యయాలకు అదనంగా వివిధ శాఖల కింద అపార మొత్తాలు దాగి వుంటున్నాయి. రిటైరైన మిలటరీ/పారామిలటరీ బలగాలకు పెన్షన్లు, అంతరిక్ష, అణు పరిశోధనా కార్యక్రమాలు, ఇంటెలిజెన్స్ వగైరాల పద్దుల కింద ఇవి దాగి వుంటున్నాయి. **ఎవరైనా ఈ మొత్తాన్ని లెక్కించినట్లయితే అది నమ్మశక్యంకాని విధంగా 85,000 కోట్ల రూ॥లకు చేరుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఈ రాక్షస బలగాన్ని పెంచి పోషించడానికిగాను దేశంలోని ప్రతి కుటుంబం సగటున 350 రూ॥లను చెల్లిస్తుంది. యన్.సి.ఎ.ఇ.ఆర్. సర్వే ప్రకారం మన జనాభాలోని 59 శాతం....అంటే 59 కోట్ల మంది ప్రజలు నెలకు 1000 రూ॥ల కంటే తక్కువ ఆదాయంతోనే బతుకుతున్నారు. పై వ్యయం మొత్తం మన ప్రజల మూపులపై మోయలేని భారాన్ని మోపుతోంది.**

సంపన్న వర్గాల జోలికి పోకుండానే, సామాన్య ప్రజానీకం నుండి ఈ అదనపు భారాన్ని ఎలా లాక్కుంటారో మనం ఇక చూద్దాం.

## ప్రజలను లూటీ చేయటం

బందిపోటు దొంగలు కొద్దిమందిగా వున్న ధనికుల సంపదలను దొంగిలిస్తారు. కాని ఈ బడ్జెట్ల ద్వారా ప్రభుత్వాలు కోట్లాది ప్రజలను కొల్లగొడతాయి. పేదలకు కల్పిస్తున్న సబ్సిడీలపై కోత విధించాలంటూ 'నిపుణులు'గా చెప్పబడుతున్నవారు గొంతు చించుకుని అరుస్తున్నారు కానీ మరోవైపు సమాచార సాంకేతిక రంగానికి ఇస్తున్న రాయితీలవల్ల ప్రతి సాఫ్ట్‌వేర్ వుద్యోగికి వాస్తవంగా సం॥కి 55,000 రూ॥ల సబ్సిడీ లభిస్తోందన్న నిజంపట్ల వీరు మౌనం పాటిస్తున్నారు. ఈ బడ్జెట్ పేదలపై, వ్యవసాయదారులపై ప్రత్యేకంగా గురిపెట్టింది.

**మొదటగా, దారిద్ర్య రేఖకు దిగువన వున్న వారికి ఇస్తున్న ఆహార ధాన్యాల రేషన్ ధరను 70 శాతం మేర పెంచటం ద్వారా బడ్జెట్ పేదలలోకెల్ల పేదలపై గురిపెట్టింది.** రేషన్ గోధుమ ధరను కేజీకి రూ॥ 2.5ల నుండి 4.2 రూ॥లకు; బియ్యాన్ని 3.5 రూ॥ల నుండి 5.9 రూ॥లకు, చక్కెరను రూ॥ 11.9 నుండి 13 రూ॥లకు పెంచేశారు. రేషన్ కోటాను 10 కేజీల నుండి 20 కేజీలకు పెంచారు కానీ ప్రజల వద్ద చెల్లించడానికి డబ్బే లేనపుడు ఇది అర్థం పర్థం లేనట్టిదిగానే వుంటుంది.

రెండోది. దారిద్ర్యరేఖకు ఎగువన వున్న వారు ఎలాంటి ఆహార సబ్సిడీని పొందకుండా బడ్జెట్ వారిని జాబితా నుండి వాస్తవంగానే తొలగించి పారేసింది. ఇక నుండి వీరంతా ఆహార ధాన్యాలను బహిరంగ మార్కెట్‌లోనే కొనాల్సి వుంటుంది. ఒక కుటుంబం దారిద్ర్య రేఖకు కింద, లేక పైన వుందంటూ నిర్ణయించేది ఎవరనే అంశం కూడా, పేదలకు ఆహారం లేకుండా చేసే పాలకుల పథకానికి జతకూడుతోంది. యన్.సి.ఎ.ఇ.ఆర్. (జాతీయ అనువర్తిత ఆర్థిక పరిశోధనామండలి) జనాభాలో 59 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన వున్నారని లెక్క చెబుతుండగా ప్రభుత్వం దాన్ని 35 శాతం మందిగా చెబుతోంది. మరోవైపు ప్లానింగ్ కమీషన్ దాన్ని 25 శాతానికి అంటే అత్యల్ప సంఖ్యకు కుదించి వేసింది. మరో విధంగా చెప్పాలంటే కేవలం దారిద్ర్య రేఖకు దిగువన, లేక ఎగువన అంటూ వేరు చేయటం ద్వారానే లక్షలాది కుటుంబాలకు ఇపుడు ఎలాంటి ఆహార సబ్సిడీని కల్పించని పరిస్థితి ఏర్పడుతోంది.

దీనికి తోడుగా, ఎరువుల సబ్సిడీని 15 శాతం మేరకు తగ్గించటం ద్వారా, రవాణా వంటి అనేక మినహాయింపు చార్జీలను తొలగించటం ద్వారా ఎరువుల ధరల్లో భారీ పెంపుదలకు ఈ బడ్జెట్ దారి తీసింది. **ఇది వ్యవసాయదారులపై 6,000 కోట్ల రూ॥ల అదనపు పెను భారాన్ని మోపుతోంది.** భారీగా పెరిగిన పెట్టుబడుల ఖర్చుకు పంటల/మార్కెట్ల వైఫల్యం తోడై రుణాల వూబిలో చిక్కుకు పోయిన కారణంగా రైతాంగం దేశ వ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజానికి, గత 15 సం॥లలో పెట్టుబడుల ఖర్చు మూడు రెట్లకు పెరిగింది. కాగా రైతుల ఆదాయం 1½ రెట్లు మాత్రమే పెరిగింది. ఈ పెట్టుబడుల ఖర్చు పెరుగుదలకు విద్యుత్ చార్జీలపై సబ్సిడీని తొలగించాలంటున్న ప్రతిపాదన కూడా తోడైతే అవి భారతీయ రైతు వెన్నెముకను విరిచేస్తాయి.

దీంతోపాటుగా కేంద్ర మంత్రివర్గం డీసెల్, కిరోసిన్, ఎల్.పి.గ్యాస్ ధరలను భారీ ఎత్తున పెంచేందుకు పథకమేసింది. (మార్చి నెల మధ్యలో పెంచింది కూడా) ఒక నెల రోజుల ముందే దీని కోసం ప్రయత్నించారు గాని ఆంధ్రలో మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయానికి వీలు కల్గించేందుకు గాను దీన్ని తాత్కాలికంగా ఆపు చేశారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ సబ్సిడీ కిరోసిన్ ధరను 285 శాతం పెంచాలని (లీటర్‌కి 2 రూ॥ల నుండి 7.70 పైసలకు) వంటగ్యాస్ రేట్లను 53 శాతం దాకా పెంచాలని (124 రూాల సిలిండర్ ధరను 191.5 రూ॥లకు) ప్రతిపాదించింది. వీటి ధరల పెంపును ఒక్క నెల రోజులపాటు ఆలస్యం చేసినా 1200 కోట్ల రూ॥ల ఆదాయం కోల్పోయినట్లేనని వాణిజ్య వర్గాలు రొద పెట్టడం బట్టి వీటి ధరల పెంపు ద్వారా ప్రజల నుండి వూడ లాక్కోబోయే మొత్తం ఎంత భారీగా వుంటుందో ఎవరయినా అర్థం చేసుకోవచ్చు. **మరోలా చెప్పాలంటే సబ్సిడీ కిరోసిన్, వంటగ్యాస్ ధరల పెంపు ద్వారా పేద, మధ్య తరగతి ప్రజానీకం నుండి 14,000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని దండుకోవటం జరుగుతుంది.** ఈ పెంచిన ధరలతో పేదలకు వంట వండటం ఇక మీదట నిషిద్ధ పదార్థంలాగే అయిపోతుందేమో!

తర్వాత ఎక్సైజ్ పన్నులు పెంచారు. 3,252 కోట్ల అదనపు నికర ఆదాయాన్ని సాధించటానికిగాను పన్నుల క్రమబద్దీకరణ పేరుతో వీటిని పెంచారు. బడా వ్యాపార వర్గాలకు ఎక్సైజ్ పన్నుల్లో వివిధ రకాల కోతలు కల్పించిన తర్వాత పెంచిన నికర పెరుగుదల కాబట్టి ప్రజలపై వీటి వాస్తవ వడ్డన మరింత ఎక్కువగానే వుంటుంది. ఉదా॥కు అధిక మొత్తంలో మందుల (ఆయుర్వేద, మరియు సింథటిక్) పై ఎక్సైజ్ పన్ను 8 నుండి 16 శాతంకి రెట్టింపు చేశారు. అదే సమయంలో పెప్సీ, కోకోకోలా, ఇతర వాయుపూరిత (aerated) పానీయాలపై పన్నులను

24 శాతం నుండి 16 శాతంకి తగ్గించారు.

చివరకు వృద్ధులను, పెద్దలను కూడా ఈ బందిపోటు దొంగలు వదలి పెట్టలేదు. ప్రావిడెంట్ (భవిష్య) ఫండ్స్‌పై వడ్డీని 1 శాతం తగ్గించటం ద్వారా (12 నుండి 11 శాతంకి) వీరు ఫించనుదారుల పొదుపుల నుండి 300 కోట్ల రూ॥లను దండుకుంటున్నారు.

చివరగా రైల్వే రవాణా చార్జీలను 5 శాతం పెంచటంతో మరో 600 కోట్ల రూ॥ల భారం సైతం ప్రజలపై పడుతోంది.

**ఈ మొత్తం లూటీని ఎవరయినా లెక్కించినట్లయితే, ప్రజానీకం నుండి 20,000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని పీక్కుంటున్నారు.** అయితే ఇంతటితోనే ఇది పూర్తి కాలేదు. ప్రజల జీవితాలపై ప్రభావం చూపగల పలు రంగాలపై సైతం ఈ బడ్జెట్ బందిపోట్లు దాడి చేశారు. ఉదా॥కు రాష్ట్ర ప్రభుత్వాలు అమ్మకం పన్నులు పెంచేశాయి. వ్యవసాయాభివృద్ధికిగాను కల్పించే మొత్తంపై 16 శాతానికి కోత విధించారు. ఆరోగ్యం, విద్యపై వ్యయాన్ని ప్రస్తుతం వున్న స్వల్పస్థాయిలోనే స్తంభింపజేశారు. వీటికి తోడు ఆరోగ్యానికి, మానవ వనరుల అభివృద్ధికి కేటాయించిన వ్యయం నూతన ఆయుధాల కొనుగోలుకు కేటాయించిన మొత్తం కంటే తక్కువగా వుంది. ఇంకా ఘోరమైన విషయమేమంటే విద్యకు, ఆరోగ్యానికి కేటాయించిన కాసింత మొత్తాల్లోను 1999-2000 సం॥లో 400 కోట్ల రూ॥లను ఖర్చు చేయలేదు. ఈ రెండింటి మొత్తం వ్యయం కలిపి ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 4.5 శాతమే కాగా ఆరోగ్యంపై వ్యయం స్థూల దేశీయోత్పత్తిలో 0.06%కి పడిపోయింది.

పేదలకు ఇన్సూరెన్స్ రక్షణ, గ్రామీణ గృహ వసతి పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, 2001 సంవత్సరాన్ని ''మహిళా అభ్యున్నతి సం॥రం''గా పాటిద్దాం'', '6 లక్షల మంది పాకీ పనివారిని విముక్తి చేద్దాం' వగైరా వగైరా ప్రకటనల మాటున ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభుత్వం చేసిన ఇలాంటి క్రూరమైన దాడిని బడ్జెట్ ప్రసంగంలో కప్పి వుంచేశారు. పై నిరర్థక ప్రకటనలన్నీ ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకుగాను విసిరే చెణుకులే తప్ప మరొకటి కావు.

వీటన్నింటికీ అదనంగా, ప్రభుత్వం తన ఉద్యోగులపై పథకం ప్రకారం దాడులకు రూపకల్పన చేస్తోంది. వ్యయాన్ని తగ్గించుకునే పేరిట జీరో బడ్జెట్ ద్వారా ప్రభుత్వోద్యోగాలను భారీ ఎత్తున తగ్గించేయడానికి ప్రయత్నిస్తోంది. (జీరో ఆధారిత బడ్జెట్ అంటే పెట్టిన పెట్టుబడి బాగా గిట్టుబాటు అయ్యేలా పని జరుగుతుందా లేదా అనే ప్రాతిపదికన ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిశితంగా పరీక్షించటమే) ఈ జీరో బడ్జెట్ ద్వారా ప్రభుత్వం నూతన నియామకాలను నిలిపి వేయాలని, కాంట్రాక్టర్ల ద్వారా పని జరిగేలా చేస్తూ ప్రభుత్వ శాఖలను, సంస్థలను రద్దు చేయాలని, పెట్టే ఖర్చులకనుగుణంగా వాడకం దారుల నుండి చార్జీలను వసూలు చేయాలని వగైరా పథకాలకు పూనుకుంటోంది. చాలా పెద్ద ఎత్తున స్వచ్ఛంద పదవీ విరమణ పథకాలకు పూనుకుంటున్నప్పటికీ ప్రభుత్వం జాతీయ రెన్యువల్ ఫండ్‌ని రద్దు చేసింది. ఆస్తుల అమ్మకం ద్వారా తాను కార్మికుల/ఉద్యోగుల చెల్లింపు వ్యవహారాలను చూస్తానని అది పేర్కొంది. వాస్తవానికి ఈ ఒక్క బడ్జెట్‌లోనే వేతన చెల్లింపులు 21 శాతం మేరకు పడిపోతాయని భావించ బడుతోంది. అంటే 586 కోట్ల రూ॥ల భారీ మొత్తానికి కోత పడుతోంది (ఇది 1999-2000 సం॥లో 20,842 కోట్ల రూ॥లుగా వుండగా 2000-01 సం॥కి 20,256 కోట్ల రూ॥లకు పడిపోతోంది).

ఈ బడ్జెట్ ద్వారా మన దేశ పేద, మధ్య తరగతి ప్రజానీకం జీవితాల మీద జరుగుతున్న సంపూర్ణ దాడి తీరు ఇలాగుంది మరి! మరోవైపున బడ్జెట్ ఉన్నత, వ్యాపార వర్గాలకు ప్రత్యేకించి బలమైన విదేశీ బహుళ జాతి కంపెనీలకు అత్యధిక ప్రయోజనాలను అందించింది. ఈ బడా వ్యాపారులంతా నిధుల కొరత గురించి పెడబొబ్బలు పెడుతూనే ఆర్థిక, ద్రవ్య సంస్థలకు రుణపడిన 60,000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని గురించి ప్రస్తావించేందుకు కూడా సిద్ధపడటం లేదు. బ్యాంకులు ప్రభుత్వం రెండూ కలిసి, రైతాంగం చేసిన అతికొద్దిపాటి రుణాలను చెల్లించలేనపుడు వారి ఆస్తుల స్వాధీనానికి కూడా వెనుదీయటం లేదు, కానీ దళారీ బడా వ్యాపార వర్గాలు, చివరకు కొన్ని టి.ఎన్.సి.లు సైతం ఇంతటి భారీ రుణాలను ఎగవేస్తే ప్రభుత్వం, బ్యాంకులు నిమ్మకు నీరెత్తినట్లున్నాయి.

## టి.ఎన్.సి.లకు, దళారీ బూర్జువాలకు లాభాలపంట

విచిత్రమేమిటంటే, బాగా పురోభివృద్ధి చెందుతున్న, లాభాలను సాధిస్తున్న వాణిజ్య రంగాలకే అతిపెద్ద రాయితీలను, పన్ను మినహాయింపులను కల్పిస్తున్నారు. **అవేమిటంటే ఐ.సి.ఇ. సెక్టర్‌గా చెప్పబడుతున్న సమాచార సాంకేతిక రంగం, టెలీ కమ్యూనికేషన్లు, ఎంటర్‌టెయిన్‌మెంట్ (వినోద) పరిశ్రమలే. ఇవి మూడు కూడా శక్తివంతమైన టి.ఎన్.సి.ల, ప్రపంచ (సామ్రాజ్యవాద) మార్కెట్లతో సన్నిహితంగా ముడివేసుకుని వున్నాయి. ఈ బడ్జెట్ నుండి ఇవి గరిష్ఠ ప్రయోజనాలను పొందాయి.** క్లింటన్ ప్రభుత్వ యంత్రాంగం తన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్ కంపెనీలకు అంతర్జాతీయ మార్కెట్లను ఉచితంగా అందుబాటులో వుంచాలంటూ డిమాండు చేస్తున్నందువల్ల పై మూడు రంగాలకు పాలకవర్గాలు పెను లాభాలు కల్పించటం అన్నది ఆశ్చర్యం కల్గించదు. క్లింటన్ ప్రభుత్వ యంత్రాంగం ఆదేశాలకనుగుణంగానే మన బానిస పాలకులు తమ విధానాలను రూపొందిస్తున్నారు. కాబట్టి వారి నయా వలసవాదపు పదజాలం ప్రకారం పేదలకు సబ్సిడీలన్నవి 'నిరర్థక వ్యయం' కాగా సంపన్నులకు రాయితీలనేవి పారిశ్రామిక పురోగతికి తగిన వాతావరణాన్ని సృష్టించేందుకుగాను 'అవసరమైనటు' వంటివట. పీడితులను నల్చుకుతింటున్న రాబందుల తర్కమే ఇది.

గరిష్ఠ కస్టమ్స్ సుంకాలపై 5 శాతం కోత విధించటడంతో పాటు (ఈ కోతవల్ల అవి 40 నుంచి 35 శాతానికి పడిపోయాయి) ఐ.టి, టెలికమ్యూనికేషన్లు, వినోద పరిశ్రమ రంగాలకు చెందిన పలు అంశాలమీద కస్టమ్స్ సుంకాలలో మరిన్ని కోతలు విధించారు. కస్టమ్స్ సుంకాలలో ఈ కోతల ద్వారా దిగుమతి దారులు, వారి విదేశీ స్పాన్సర్లూ 1,428 కోట్ల రూ॥ల భారీ బహుమతిని సాధించనున్నారు. వజ్రాలు (40 నుండి 15%) ముడి పెట్రోలియం (20 నుండి 15%) వగైరా వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించి, కిరోసిన్ వంటి మౌలికావసర వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని 5 శాతం పెంచటం (30 నుండి 35శాతం) అన్నది ఆశ్చర్యకరమైనదేం కాదు. ఎగుమతులపై

5 సం॥ల పన్ను మినహాయింపు ఎత్తివేతకు వ్యతిరేకంగా వ్యాపార వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. (ఎగుమతులమీద ఇచ్చే సబ్సిడీలను చట్ట విరుద్ధంగా ప్రకటించిన ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల మేరకే దీన్ని ఎత్తివేశారు). అయితే ఇక్కడ సైతం ఐ.టి. పరిశ్రమలలో చాలా వాటిపై ఇది ప్రభావం చూపదు. ఎందుకంటే అవి 10 సం॥ల పన్ను మినహాయింపు కల్గిన స్వేచ్ఛా వ్యాపార మండలాల్లో వుంటున్నాయి.

వాణిజ్య రంగంలో, అమెరికాతో పరిమాణాత్మక (క్వాంటిటేటివ్) నిబంధనలపై ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ బడ్జెట్ 715 వస్తువులను దేశంలోకి దిగుమతి చేసుకునేందుకై నిబంధనలను సడలించింది. వీటిలో చాలా భాగం వ్యవసాయ ఉత్పత్తులు, వినియోగ సరకులు అయినందువల్ల ఈ సడలింపు అన్నది ప్రత్యేకించి చిన్న తరహా పరిశ్రమలను, వ్యవసాయాన్ని దెబ్బతీస్తుంది. ఈ వస్తువులపై గరిష్టంగా విధించిన 35 శాతం కస్టమ్స్ సుంకాలను సైతం ఇపుడు 25 శాతానికి కుదించటం ద్వారా దిగుమతులు వెల్లువలాగా తరలి వచ్చేందుకు మరింతగా ఆస్కారం దొరికినట్లయింది.

పెట్టుబడుల రంగంలో పదేపదే విధానపర మార్పులకు పూనుకోవటం ద్వారా విదేశీ పెట్టుబడి మరింతగా దేశంలోకి చొచ్చుకుని వచ్చేందుకు అనుమతించబడింది.

★ భారతీయ కంపెనీలలో తమ వాటాను 30 శాతం నుండి 40 శాతానికి పెంచుకోడానికి విదేశీ సంస్థాగత పెట్టుబడుల (యఫ్.ఐ.ఐ.)కు అనుమతి లభించింది. దీనివల్ల వీటికి భారతీయ స్టాక్ ఎక్చేంజిపై, ఇప్పటికే వాస్తవంగా తమ ఆజమాయిషీలో వున్న కంపెనీలపై మరింతగా పట్టు బిగించేందుకు వీలు చిక్కుతుంది.

★ సట్టా సరుకులపై (futures=భవిష్యత్కాలంలో సరఫరా చేయడానికిగానూ కొని అమ్మిన సరుకులను 'ఫ్యూచర్స్' అంటారు) వ్యాపారం మీద వున్న 30 సం॥ల నిషేధాన్ని ఎత్తివేశారు. తద్వారా ద్రవ్యరంగాన్ని అంతర్జాతీయ సట్టా వ్యాపారులకు మరింతగా తెరచి వుంచుతున్నారు.

★ టి.ఎన్.సి.ల కోరలలోకి భారతీయ కంపెనీలను మరింతగా నెట్టివేసేందుకుగాను మూడు మార్పులను చేశారు.

1. ఆటోమేటిక్ రూట్‌లో (ఎలాంటి నియంత్రణలూ లేకుండా) విదేశాలలో భారతీయ కంపెనీలు పెట్టుబడులు పెట్టడంపై గల పరిమితిని 15 మిలియన్ డాలర్ల నుండి 50 మిలియన్ డాలర్లకు పెంచారు.
2. వెంచర్ క్యాపిటల్ (నూతన ప్రాజెక్టులలో పెట్టే పెట్టుబడి) నిధులకు అత్యధిక పన్ను రాయితీలను కలిపించారు.
3. కొని వేసిన కంపెనీకి గల మునుపటి నష్టాలన్నింటినీ చెల్లించి వేయకుండా అలాగే ముందుకు తీసుకుపోవటానికి అనుమతించటం ద్వారా విలీనాలకు, కొనుగోళ్ళకు మరిన్ని అవకాశాలు కల్పించటం.

విదేశీ పెట్టుబడి భారతీయ పబ్లిక్ రంగ పరిశ్రమను కొనివేయడానికి వీలు కల్పించేందు కోసం బడ్జెట్ ప్రధానమైన ప్రైవేటీకరణ పథకాలను రచించింది.

1. బడ్జెట్‌లో పెట్టుకున్న 10,000 కోట్ల రూ॥ల లక్ష్యాన్ని అధిగమించే విధంగా పెట్టుబడులను వెనక్కు తీసుకునే పథకాన్ని తీవ్రంగా అమలు చేయటం. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో తన వాటాను 26 శాతానికి తగ్గించు కొనేందుకు ప్రభుత్వం సంసిద్ధత తెల్పడం.
2. జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరించాలని నిర్ణయించటం. ప్రభుత్వం జాతీయ బ్యాంకుల్లో తన వాటాను 51 నుండి 33 శాతానికి కుదించుకోవాలని ఈ బడ్జెట్‌లో నిర్ణయించింది. డైరెక్టర్ల బోర్డుకు మరింతగా స్వయం ప్రతిపత్తిని కల్పించేందుకుగాను బోర్డును పునర్నిర్మించటం.
3. రాష్ట్ర ప్రభుత్వాల భారీ విద్యుత్ బోర్డుల అమ్మకానికి (ప్రైవేటీకరణ) వీలు కల్పించేందుకుగాను ఈ బడ్జెట్ 1000 కోట్ల రూ॥లను కేటాయించింది. రాష్ట్రాల విద్యుత్ బోర్డులలో వాటాలను పెద్ద మొత్తంలో కొనివేసేందుకుగాను సిద్ధమై వున్న ప్రైవేట్ పరిశ్రమకు ఈ మొత్తం ఒక బహుమతిలాగే అవుతుంది.
4. 5,000 కోట్ల రూ॥లకు మించిన రుణాలను మాఫీ చేయటం, ప్రస్తుత ఆర్థిక సం॥రంలో 700 కోట్ల రూ॥లను మంజూరు చేయటం ద్వారా 'స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా'ని భారీగా పునర్నిర్మించటం.

★ ఐ.టి. రంగంలో పరిశోధన, అభివృద్ధికి గాను 100 కోట్ల రూ॥లను అందించారు. పేటెంట్ ఆఫీసును ఆధునీకరించేందుకు 75 కోట్ల రూ॥లను కేటాయించారు.

దేశంలోకి విదేశీ పెట్టుబడులు చొరబడేందుకు వీలు కల్పించేటటువంటి పైన చెప్పబడిన నిర్దిష్ట చర్యలకు తోడుగా బడా వ్యాపార వర్గం కూడా ఇతర రాయితీలను పొందింది. అవి:

1. కార్పోరేషన్ పన్ను కట్టని వారిపై విధించే కనీస ప్రత్యామ్నాయ పన్నును 10.5 నుంచి 7.5 శాతానికి తగ్గించారు.
2. భవన నిర్మాణ వ్యాపారుల లాబీకి అనేక పన్ను మినహాయింపులను కల్పించటం.
3. నౌకా నిర్మాణ పరిశ్రమ ఆధునీకరణ కోసంగాను దాని లాభాలపై పన్నును 100 శాతం పూర్తిగా తగ్గించటం (అంటే పన్నే లేదనే అర్థం).

ప్రభుత్వం తనవద్ద డబ్బు లేదని, అందుకని తప్పనిసరిగా సబ్సిడీలను తగ్గించక తప్పదని, ఉద్యోగులను కుదించక తప్పదని ఒకవైపు ఎలుగెత్తి చాటుతూనే మరోవైపు టి.ఎన్.సి.లకు, దళారీ బడా వాణిజ్య కుటుంబాలకు వేల కోట్ల రూ॥ల మేరకు ఈ విధమైన పన్ను రాయితీలను కల్పించేసింది.

## దివాళా, దేశద్రోహం

స్వేచ్ఛా మార్కెట్టులో ఏదయినా కంపెనీ దివాళా తీసినట్లయితే మరొకటి దానిని మింగేస్తుంది. 'ప్రపంచీకరింపబడిన మార్కెట్'లో దేశాలు దివాళా తీసినపుడు అవి సులభంగా విదేశీ ద్రవ్య పెట్టుబడుల ముందు సాగిలబడిపోతాయి. బడ్జెట్‌ని సమర్పించడానికి సరిగ్గా ఒకరోజు ముందు విడుదల చేసిన 1999-2000 సం॥రపు 'ప్రభుత్వ

ఆర్థిక సర్వే'లో తేల్చి చెప్పినట్లుగా భారత ఆర్థిక పరిస్థితి సరిగ్గా పై విధంగానే వుంది.

సాధారణ ఆర్థిక వ్యవస్థలోనూ, ప్రభుత్వ, ఆర్థిక, ద్రవ్య పరిస్థితిలోనూ ఈ క్షీణత కన్పిస్తుంది. **దాదాపుగా దశాబ్ద కాలం నుండి సాగుతున్న సంస్కరణలు వ్యవసాయాన్ని నాశనం చేశాయి. స్థానిక పరిశ్రమలను స్పష్టమైన స్తబ్దతా స్థితికి తీసుకుపోయాయి. ప్రభుత్వాన్ని దివాళా స్థితికి తెచ్చాయి.**

మొదట మనం సాధారణ ఆర్థిక వ్యవస్థను చూద్దాం. వికసిస్తున్న స్టాక్ మార్కెట్‌ని ఆరోగ్యప్రదమైన పెరుగుదలగా చిత్రించాలని పత్రికారంగం ప్రయత్నిస్తోంది. ఇది వాస్తవానికి చాలా విరుద్ధమైనది. సెకండరీ మార్కెట్‌లో (అంటే షేర్ల కొనుగోళ్ళు, అమ్మకాలు జరిగే స్టాక్ ఎక్ఛేంజ్) ప్రస్తుత వికాసం కేవలం అంచనాలమీద ఆధారపడిన నీటి బుడగే తప్ప మరొకటి కాదు. ఇది సైతం విదేశీ పెట్టుబడి ద్వారా పెంచబడుతోంది. ఆగ్నేయాసియా దేశాల్లో జరిగినట్లుగా ఈ విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకున్న రోజున ఈ బుడగ 'టప్'మని పేలక మానదు. ఏప్రిల్ మాసాంతంలో ప్రపంచమంతటా స్టాక్ మార్కెట్లలో సాఫ్ట్‌వేర్ కంపెనీల షేర్లు అక్షరాలా నీటి బుడగల్లాగే పేలిపోయాయి కూడా.

**మార్కెట్ క్యాపిటలైజేషన్ (మార్కెట్‌లో కృత్రిమంగా మార్పిడి అవుతున్న పెట్టుబడి) సమర్పిస్తున్న ప్రస్తుత వేలంవెర్రిని కాకుండా వాస్తవమైన మూల ధన కల్పనను (ఇది జాతీయ సంపదను కాక వాస్తవ ఆస్తులను సృష్టిస్తుంది) మనం చూసినట్లయితే పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా వుంది.** తొలుత ప్రాథమిక మార్కెట్‌లో (అంటే స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టబడిన నూతన పెట్టుబడులు) 1994-95 లోని 26,417 కోట్ల రూ॥ల మేరకు వుండగా 1999-2000 సం॥కి కేవలం 4,180 కోట్ల రూ॥లకు పడిపోవటం ద్వారా తీవ్రమైన క్షీణత కన్పిస్తోంది. రెండోది. పెట్టుబడికి అతి ప్రధాన వనరు అయిన స్థూల దేశీయ పొదుపులు (అంటే వ్యక్తుల, కార్పోరేషన్‌ల పొదుపులు) ఒకే ఒక్క సం॥రంలో 2.4 శాతానికి తీవ్రంగా పడిపోయాయి. 1997-98లో జి.డి.పి.లో 24.7 శాతంగా వున్న ఈ పొదుపులు 1998-99కే 22.3 శాతానికి దిగజారి పోయాయి. మూడు. ప్రభుత్వ మొత్తం వ్యయంలో పెట్టుబడి వ్యయం వాటా 1985-86లోని 40 శాతం నుండి ఈరోజుకి 16.7 శాతానికి దారుణంగా పడిపోయింది. మూలధన కల్పనలో ఇటువంటి భారీ క్షీణత అనేది దేశ ఆర్థిక వ్యవస్థలోని తీవ్రమైన స్తబ్దతకు సంకేతం. ఇక దేశంలోకి ప్రవేశిస్తున్న విదేశీ పెట్టుబడికి సంబంధించినంతవరకూ, దాంట్లో అధిక భాగం ఉనికిలో వున్న కంపెనీలను కొని వేయడం (యఫ్.డి.ఐ.లు) వైపుగా, ఇతర కంపెనీలలో వాటాలను కొనేయడం వైపుగా (యఫ్.ఐ.ఐ.లు) పోతున్నది. దీనికి తోడుగా దీర్ఘకాలంలో ఇవి దేశంలో పెట్టుబడులు పెట్టిన వేగానికి 10 రెట్లకు మించిన వేగంతో దేశం నుండి తరలి పోతాయి. 1999-2000 సం॥కి పారిశ్రామిక ప్రగతి కేవలం 6.2 శాతంగా వుంటుందని (ఇది 3 సం॥ల స్తబ్దత తరుపరి శాతం. సంస్కరణలకు పూర్వపు ప్రగతి రేటు కంటే కూడా తక్కువగానే వుంది) వ్యవసాయోత్పత్తిలో 2.2 శాతం క్షీణత వుంటుందని స్వయానా ప్రభుత్వ ఆర్థిక సర్వేనే చూపించిందంటే ఇదేమీ ఆశ్చర్యం కల్గించదు.

ఇపుడు ప్రభుత్వ ఆర్థిక స్థితిని చూద్దాం. **1991-92లో దివాళాని తప్పించేందుకుగాను ఈ యశ్వంత్ సిన్హానే (అప్పటి చంద్రశేఖర్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి) దేశంలోని బంగారు నిల్వలను తాకట్టు పెట్టేసినపుడు కేంద్ర, రాష్ట్రాలు రెండింటి ద్రవ్యలోటు జి.డి.పి.లో 9.1 శాతంగా వుండేది. ఈ 2000-2001 సం॥లో ఇది 10 శాతాన్ని చేరుతుందని భావించబడుతోంది.** ఈ వాస్తవం నుండే ప్రభుత్వ ద్రవ్య విషాద పరిస్థితిని అర్థం చేసుకోగలం. దీనర్థమేమిటి? అంటే ప్రభుత్వ వ్యయం దాని ఆదాయం కంటే 1,85,000 కోట్ల రూ॥లకు భారీ స్థాయిలో అధిగమించిందనే. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ని మనం లెక్కలోకి తీసుకున్నట్లయితే అది ప్రతిపాదించిన లోటు 1,11,275 కోట్లు లేక జి.డి.పి.లో 5.6 శాతంగా వుంటున్నది.

ఇలా, శరవేగంగా పెరుగుతున్న తన వ్యయానికి సరిపడా అదనపు డబ్బును ప్రభుత్వం ఎక్కడనుండి సాధిస్తుంది? మార్కెట్‌లో రుణం చేయడం ద్వారా మాత్రమే. అయితే ఈ మార్కెట్ రుణాలు వడ్డీ చెల్లింపులను కోరతాయి. ఈ వలయాన్ని పదే పదే సాగించినట్లయితే రుణాలు, వాటి వడ్డీ చెల్లింపులు ఆర్థిక వ్యవస్థను అప్పుల వూబిలోకి నెట్టడానికి ప్రయత్నిస్తాయి. సరిగ్గా ఈరోజు జరిగిందల్లా ఇదే.

పరిస్థితి ఎంత దిగజారి పోయిందంటే ప్రస్తుత బడ్జెట్‌లో, రాబడి (రోజువారీ) ఖర్చే (రెవిన్యూ ఎక్స్‌పెండిచర్) రాబడులను అధిగమించి 77.425 కోట్ల రూ॥లకు చేరుకుంది. మరో మాటల్లో చెప్పాలంటే ప్రభుత్వం రుణాలు చేయాల్సి రావటం (కాపిటల్ ఎక్స్‌పెండిచర్) తన పెట్టుబడి ఖర్చుల అవసరాల కోసమే కాదు (ఇది మంచిదే. ఎందుకంటే ఇది నూతన ఆదాయాలను సృష్టిస్తుంది), చివరకు తన దినవారీ అవసరాలను తీర్చుకోడానికి కూడా అప్పులను చేయాల్సి వస్తోంది. అంతకంటే ఘోరంగా పబ్లిక్ రుణాలు 13 లక్షల కోట్ల రూ॥లకు చేరిన (దేశీయ, విదేశీయ రుణాలు రెండూ కలిపి) ఈ తీవ్ర ఒత్తిడి మూలంగా వీటికి చెల్లించాల్సిన వడ్డీ ధరలు వూహించేందుకు కూడా సాధ్యంకాని విధంగా అయిపోయాయి. వాస్తవానికి ఈరోజు వడ్డీ చార్జీలే ప్రభుత్వ వ్యయంలో కెల్లా అతిపెద్ద భాగాన్ని ఆక్రమించి వున్నాయి. ఇవి ప్రభుత్వ రాబడులలో దాదాపు 50 శాతంగా వున్నాయి. నిజానికి ప్రస్తుత బడ్జెట్‌లో వడ్డీ చెల్లింపుల కింద 1,17,000 కోట్ల రూ॥లను చూపించారు. గత సం॥రం కంటే ఇప్పుడివి 40 శాతం పెరిగాయి. ఇదొక విష వలయం, ఊబి. ఇది ప్రభుత్వాన్ని గట్టెక్కలేనంత దివాళా స్థితిలోకి నెట్టేస్తోంది. ఇప్పటికే అది పీకలదాకా కూరుకుపోయి వుంది కూడా.

**ఆర్థిక వ్యవస్థ యొక్క దుర్బలమైన విత్త పరిస్థితి ఇలాంటిది కాగా విదేశీ మిగులు చెల్లింపుల (విదేశీ మారక ఆదాయాల, ఖర్చుల సమతుల్యత) పరిస్థితి మరింత దిగజారిపోయి వుంది. వాణిజ్య లోటు (ఎగుమతుల, దిగుమతుల మధ్య వ్యత్యాసం) ప్రతి సం॥రం నిరంతరం పెరుగుతూనే వుంది.** ప్రస్తుత సం॥రం చమురు దిగుమతి ధరలలో భారీ పెరుగుదల కారణంగా వాణిజ్యలోటు 20 బిలియన్ డాలర్ల రేఖను దాటుతుందని ఊహించబడుతోంది. దీనర్థం ఏమిటి? సామ్రాజ్య వాదులకు మనం విదేశీ మారక ద్రవ్యంలో 20 బిలియన్ డాలర్లను చెల్లించాలి. మనం ఎగుమతుల ద్వారా సంపాదించిన దానికంటే ఇది ఎంతో ఎక్కువ. ఇంత భారీ మొత్తం ఎక్కడనుండి వస్తుంది?

***(దేశవ్యాప్త సమ్మెలు : 18వ పేజీ తరువాయి...)***

ఆర్భాటాల కోసం గత సం॥రం 75 కోట్ల రూ॥లు వృధాగా ఖర్చుపెట్టిన ప్రభుత్వం డాక్టర్లకు 4 కోట్ల రూ॥ల స్టైఫండ్‌ను అదనంగా ఇవ్వలేనని, రాష్ట్రంలో వైద్యసేవలు పూర్తిగా స్తంభించిపోయి పదుల సంఖ్యలో రోగుల ప్రాణాలు కోల్పోతున్నందుకు డాక్టర్లదే బాధ్యత అనీ, డాక్టర్లకు వ్యతిరేకంగా విషప్రచారాన్ని తీవ్రస్థాయిలో సాగించింది. అసలు, తెలుగుదేశం పార్టీ ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వోద్యోగులకు, ప్రజలకు మధ్య తంపులు పెట్టి, రెచ్చగొట్టి, ఒత్తిడికి గురిచేసి ఆందోళనలను విరమించుకునేలా చేసే పచ్చి నియంతృత్వ విధానాలను పుణికి పుచ్చుకున్నది. గతంలో విద్యుత్ సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, ఎన్జీవోలు వివిధ సందర్భాలలో సమ్మెకు దిగినపుడు సాక్షాత్తూ ముఖ్యమంత్రే వీధి రౌడీ స్థాయిలో ప్రేలాపనలు చేసిన సంగతి ఎవరూ మర్చిపోలేదు. ఇపుడు జూనియర్ డాక్టర్ల సమ్మె సందర్భంగా సైతం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సమస్యను తాత్సారం చేసి రోజుల తరబడి పొడిగించి చివరకు సంఘంలో చీలికలు తేవడానికి ప్రయత్నించి కూడా తాననుకున్నది సాధించలేక అభాసుపాలయింది. ఇక ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ సిబ్బంది సమ్మెకు సంఘీభావంగా రాష్ట్ర విద్యుత్ శాఖ వుద్యోగులు ఫిబ్రవరి నెలలో ఒకరోజు సెలవు పెట్టినపుడు విద్యుత్ సంస్కరణల నుంచి వైదొలగే ప్రశ్నే లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది. చివరకు విద్యుత్‌శాఖ ఇంజనీర్లు సమ్మె ప్రకటన చేస్తే ఆదిలోనే వారిలో వారికి చీలికలు పెట్టి సమ్మెను విచ్ఛిన్నం చేసింది. 14 విద్యార్థి, నిరుద్యోగ యువజన సంఘాలు ఖాళీగా వున్న ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేయాలన్న డిమాండుతో ఐక్య కార్యాచరణ పోరాట కమిటీగా ఏర్పడి సాగించిన ఆందోళన, ర్యాలీలు, ధర్నాలు, నూతన సహస్రాబ్ది బిక్షాటనలు, విశ్వవిద్యాలయాల బంద్‌లు, రాష్ట్ర నిరుద్యోగంపై శ్వేతపత్రం, విడుదల, వెబ్‌సైట్ ప్రారంభించటం వంటి వివిధ పోరాట రూపాలు ప్రభుత్వాన్ని ఊపిరాడనీకుండా చేశాయి. దాదాపు 15 సం॥ల తర్వాత మళ్ళీ రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున ఆరంభమైన విద్యార్థి యువజనోద్యమం ఉద్యోగాల భర్తీ ససేమిరా కాదంటూ మొండికేసిన ప్రభుత్వాన్ని మెడలు వంచి ఒక మేరకు తమ డిమాండ్లను సాధించుకోగల్గింది. దేశం మొత్తంలో చూసినా ప్రజలపై, ఆందోళనాకారులపై విషప్రచారానికి, ఫాసిస్ట్ దాడులకు దిగటంలో తెలుగుదేశం ప్రభుత్వం అందరినీ మించిపోయింది. కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, రైతుకూలీలు, విద్యా వాలంటీర్లు, వారూ, వీరూ అని కాకుండా ప్రజల నుంచి ఏ కాస్త అసమ్మతిని కూడా 'పోలీసు పరిష్కారాల'కు వదిలిపెడుతున్న ప్రభుత్వం మరోవైపు, ప్రజల నుంచి తన్ను తాను కాపాడుకోవడానికిగాను అమెరికన్ అధ్యక్షుడి తరహా భద్రతా వలయాల వ్యవస్థను దిగుమతి చేసుకుంటోంది.

## పెరుగుతున్న ప్రజల మిలిటెన్సీ

ఈ సమ్మె వెల్లువ ఇపుడు ప్రజానీకంలోని ఇతర విభాగాలకు కూడా పాకింది. దేశ వ్యాప్తంగా లాయర్లు నడిపిన సుదీర్ఘ సమ్మె, పోలీసులతో వారి వీధి పోరాటాలు అన్నవి పెరుగుతున్న మిలిటెన్సీకి సంకేతంగా నిలుస్తాయి. దీనికి అదనంగా ఫిబ్రవరి 9న సింగరేణి కాలరీలకు చెందిన లక్షమంది బొగ్గు గని కార్మికులు మేనేజిమెంట్‌కి 60 డిమాండ్లతో కూడిన పత్రాన్ని సమర్పిస్తూ పనిని ఆపివేశారు. ఈ సమ్మె 12 రోజులపాటు కొనసాగింది.

***(దేశవ్యాప్త సమ్మెలు : తరువాయి 55 వ పేజీలో.....)***

---

'అదృష్టవశాత్తు' 10 బిలియన్ డాలర్ల మేరకు విదేశాల్లో పనిచేస్తున్న భారతీయుల ద్వారా వస్తుంది. వీరు తమ పొదుపులలో కొంత భాగాన్ని దేశంలోకి పంపిస్తారు. మరికొన్ని బిలియన్ డాలర్లు ఇతరత్రా బయటకు కన్పించని ఆదాయాల నుంచి వస్తాయి. ఇప్పటికీ 7 లేక 8 బిలియన్ డాలర్ల భారీ లోటు మిగిలే వుంటుంది. ఈ చలామణి పద్దులోటు (కరెంట్ అకౌంట్ డెఫిషిట్) గత సం॥రపు లోటు కంటే దాదాపుగా రెట్టింపై కూర్చుంది. 1998-99లో జి.డి.పి.లో ఇది 1 శాతం కాగా 1999-2000 సం॥రంలో ఇది 1.8 శాతానికి చేరుకుంది. చివరగా ఈ 7 నుంచి 8 బిలియన్ డాలర్ల మేరకు చెల్లింపులను విదేశీ పెట్టుబడుల (యఫ్.డి.ఐ., యఫ్.ఐ.ఐ., యన్.ఆర్.ఐ. డిపాజిట్లు) ద్వారా సేకరిస్తారు. అందుచేత ఇక్కడ సైతం ప్రభుత్వం తన దినవారీ వాణిజ్య ఖర్చులను విదేశాల నుండి వస్తున్న పెట్టుబడి మదుపుల ద్వారా తీర్చుకోవాల్సి వుంటుంది. రేపు ఈ విదేశీ పెట్టుబడి రావటం నిలిచిపోయిందంటే అది చెల్లింపు మిగులు (బాలెన్స్ ఆఫ్ పేమెంట్స్) సంక్షోభాన్ని కొని తెస్తుంది. అప్పుడు డాలర్ కోసం వెంపర్లాట మొదలవుతుంది. విదేశీ మారక నిల్వలు కరిగి పోతాయి. ప్రభుత్వం తన భారీ విదేశీ రుణంపై వడ్డీ చెల్లింపులను తీర్చలేక వడ్డీల ఎగవేతదారుగా మారిపోతుంది. సరిగ్గా ఆగ్నేయాసియాలో జరిగింది ఇదే. ఇంత భారీ కరెంట్ అకౌంట్ లోటుతో భారత ప్రభుత్వం సామ్రాజ్యవాదుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతుంది. వారు ఇలాంటి చెల్లింపు మిగులు సంక్షోభాన్ని తామనుకున్నపుడల్లా ముందుకు తెస్తుంటారు.

కాబట్టి ఆర్థిక వ్యవస్థను ఏ దృష్టిలోంచి చూసినా అది సంక్షోభంలో కూరుకు పోయింది. **అది 'ఆర్థిక సంస్కరణల' ద్వారా, భారతీయ దళారీ పాలకుల ద్వారా, సామ్రాజ్యవాదుల ఉత్తర్వుల ద్వారా సృష్టింపబడిన సంక్షోభం. కాసిని ఎంగిలి మెతుకుల కోసం భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాద ఆక్టోపసి (అష్టపాదజీవి- ఊపిరాడకుండా చేసి చంపటంలో ఇది దిట్ట) కబంధ హస్తాల్లోకి భారత ప్రజలను మరింత లోతుగా నెడుతున్న సంక్షోభం.** ఈ బడ్జెట్‌లో మనం, సంక్షోభంలో కూరుకుపోయిన ఒక ఆర్థిక వ్యవస్థ సామ్రాజ్యవాదుల ఆదేశానుసారం ఎలా పనిచేస్తుందన్న విషయాన్ని స్పష్టంగా చూస్తాం. ఈ బడ్జెట్ దిశ ప్రజారాసులపై భారీ పన్నులను విధించటం, సామ్రాజ్యవాద ఆధిపత్యంలోని రంగానికి ప్రధాన ప్రయోజనాలను కల్పించటం, దారిద్ర్యం, సంపదలలోని తీవ్ర అసమానతల నుండి పుట్టుకొస్తున్న అనివార్యమైన వర్గ సంఘర్షణలను అణచివేయటం కోసం రాజ్య యంత్రాంగాన్ని సంసిద్ధం చేయటం వైపుగానే వుంటుంది.

ఈ బడ్జెట్ బి.జె.పి. ఆధ్వర్యంలోని ప్రభుత్వ విద్రోహపూరిత ప్రజా వ్యతిరేక, స్వభావాన్ని స్పష్టంగా ఎత్తి చూపటమే కాదు, దాని ఫాసిస్ట్ కోరలను కూడా ప్రదర్శిస్తూంది. ఈ బడ్జెట్ ద్వారా ప్రభుత్వం ఒక వైపున ఇప్పటికే సర్వం కోల్పోయిన ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెడుతోంది. మరో వైపున అది తన విధానాలను వ్యతిరేకించే ఎవరినయినా పాశవికంగా అణచివేసేందుకుగాను తన కోరలకు పదును పెట్టుకుంటోంది.

మరి ఇప్పుడు ప్రజలు ఎలా పోరాడాల్సి వుంది? ఫాసిస్ట్ దెబ్బల నుండి తప్పించుకుంటూ ఈ విద్రోహపూరిత విధానాలను వారెలా తిప్పికొడతారు? ఖచ్చితంగా శాంతియుత, పార్లమెంటరీ మార్గాల ద్వారా మాత్రం కాదు. పార్లమెంటరీ పార్టీలన్నీ వాస్తవానికి ఈ ఆర్థిక విధానాలకే వంత పాడుతున్నాయి. విప్లవాత్మక శక్తి మాత్రమే ఈ దాడిని తిప్పికొట్టగలదు. ❑

# సబ్సిడీలను తొలగిస్తూ, ప్రజల జీవన స్థితిగతులపై ప్రభుత్వాలు చేస్తున్న పెనుదాడిని తిప్పికొట్టండి

బడ్జెట్‌ను సైతం ఆమోదించక మునుపే కేంద్ర ప్రభుత్వం రేషన్ ధాన్యం సబ్సిడీలపై కోత విధించాలన్న తన ప్రతిపాదనను అమలుచేసేసింది. ఏప్రిల్ 1న ప్రభుత్వం దారిద్ర్య రేఖకి దిగువన వున్న వారికి ఇస్తున్న గోధుమల రేటును కిలో 4.50 రూ॥లుగా నిర్ణయించటం ద్వారా 80 శాతం మేరకు భారీగా పెంచేసింది. అలాగే కిలో బియ్యాన్ని కిలోకి 5.9 రూ॥లుగా నిర్ణయించి 70 శాతానికి పెంచేసింది. అదే సమయంలో దారిద్ర్యరేఖకి ఎగువన వున్న (నెలకు రూ॥ 1,250ల పైన సంపాదిస్తున్నవారు) వారికి గోధుమలు కేజీకి 9 రూ॥లుగాను, కిలో బియ్యాన్ని రూ॥11.8 గాను పెంచేసింది. ఇది మార్కెట్ ధరలకు దగ్గరగా వుంది. దీనికి అదనంగా ప్రజాపంపిణీ వ్యవస్థ కింద ఇస్తున్న కిరోసిన్‌ని, ఎల్.పి.గ్యాస్‌ని, ఎరువులను కూడా భారీగా పెంచేసింది. (బడ్జెట్ వ్యాసంలో చూడండి). అవసరం లేని వారికి సబ్సిడీలు తొలగించాల్సిన అవసరాన్ని గురించి విడుపు లేకుండా ప్రచారం చేస్తూనే, ప్రభుత్వం సబ్సిడీల అవసరం వున్న వారిపైనే గురిపెడుతోంది. ప్రభుత్వం తను చెప్పిన దానికి పూర్తిగా భిన్నమైన దానినే చేపట్టింది. దేశంలోకెల్లా అత్యంత నిరుపేదలైన వారిపైనే అది పెనుదెబ్బ తీసింది. అది కూడా సాధారణ స్థాయిలో ఏ పదో, పదిహేనో శాతంగా కాకుండా భారీ ఎత్తున 70 నుండి 80 శాతానికి ధరలు పెంచేసింది.

తర్వాత, ఒక వారంలోపే 54,000 కోట్ల రూ॥ల జాతీయ రహదారుల అభివృద్ధి పథకాన్ని అమలు చేయాలనే టి.ఎన్.సి., దళారీ బూర్జువాల పథకాలకు నిధులందించే నిమిత్తం ప్రభుత్వం డీసెల్, పెట్రోలుపై లీటర్‌కి 1 రూపాయి చొప్పున పన్ను విధించింది. మరో మాటలో, తాము నిర్మించబోయే రహదార్లపై భారీ ఎత్తున పన్ను విధించే బడా వాణిజ్య వర్గాలకు లాభాలు సాధించి పెట్టడానికి పేద, మధ్య తరగతుల ప్రజలు సం॥కి 6000 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని నిధుల రూపంలో ఇవ్వాల్సి వుంది. తన విద్యుత్ ప్రాజెక్టును నిర్మించుకోడానికిగాను డబ్బు చెల్లించమంటూ ఎన్రాన్ కంపెనీ అడిగిందానికంటే ఇదేం భిన్నంగా లేదు. ఇటువంటి పన్నుకు అర్థం బడా వాణిజ్య వర్గాలకు నిధులు గుమ్మరించేందుకుగాను ప్రజానీకాన్ని ప్రత్యక్షంగా లూటీ చేయటమే తప్ప మరేం కాదు. ఇది బరితెగించిన నేరపూరిత దోపిడీ మాత్రమే.

వీటికి తోడుగా తీవ్రమైన నిధుల కొరత కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లోనే సబ్సిడీలపై కోత విధిస్తున్నామని ప్రభుత్వం చెప్పుకొంటుండగా, అదే సమయంలో బడా వాణిజ్య వర్గాలకు భారీ ఎత్తున బహుమతులు ప్రధానం చేయటంలో దానికి ఏ సమస్యా రావటం లేదు. అది కూడా, వారికి బడ్జెట్‌లో ఇప్పటికే మంజూరు చేసిన దానికంటే ఎంతో అధిక మొత్తంలో ఇపుడు సమర్పిస్తున్నారు. ఈ వారంలోనే వడ్డీ రేట్లను ఒక శాతం మేరకు కుదించటం ద్వారా ప్రభుత్వం బడా వ్యాపార వర్గాలకు 1,500 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని అప్పనంగా ఇచ్చేసింది. (ఏప్రిల్ 3న బిజినెస్ స్టాండర్డ్ రీసెర్చ్ బ్యూరో అంచనా) వడ్డీ ఖర్చులను భారీ మొత్తంలో అంటే 2 శాతానికి కుదించుకోవడానికి బలవంతులైన భవన నిర్మాణ పెట్టుబడిదార్ల లాబీకి అనుమతించటం ద్వారా ప్రభుత్వం నిర్మాణ పరిశ్రమకు పరిశ్రమ స్థాయిని కల్పించింది. ఇంకా మార్చి 31న ప్రకటించిన నూతన ఎగుమతుల దిగుమతుల (ఎగ్జిమ్) విధానంలో ప్రభుత్వం ఎగుమతిదారులకు, టి.ఎన్.సి.లకు వరుసగా రాయితీలను ఇచ్చింది.

కేంద్రం ప్రజానీకంపై మోపిన పెనుభారం కథ ఇంతటితో ముగిసినట్లు కాదు. ఇది సముద్రంలో నీటి బొట్టంత మాత్రమే. మనం రాష్ట్రాల వైపు చూసి వాటి విధానాల ప్రభావాన్ని గమనించి నట్లయితే మొత్తం పరిస్థితి భయంకరంగా కన్పిస్తుంది. తిరిగి ధరల పెంపును, సబ్సిడీలు, సంక్షేమ పథకాలపై కోతలు, వంటి వాటినే కాక, భారీ స్థాయిలో పెరిగిన నిరుద్యోగాన్ని కూడా మనం రాష్ట్రాల్లో చూస్తాం. ఈ మూడు అంశాలలో రాష్ట్రాల విధానాలను గురించిన చిత్రణ కోసం మనం ఈ వ్యాసంలో కేవలం మూడు రాష్ట్రాలను నమూనాగా తీసుకుందాం. అవి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్.

## తెలుగుదేశం ప్రభుత్వం పెంచిన ధరలు

కేంద్రం పెంచిన ధరల తీరును తెలుగుదేశం ప్రభుత్వం సైబర్ వేగంతో ఆంధ్రప్రదేశ్‌కి తెచ్చేసి. ఏప్రిల్ 6 నాటికే తెలుగుదేశం ప్రభుత్వం దారిద్ర్యరేఖకి దిగువన వున్న వారికిచ్చే బియ్యాన్ని రెండు రూపాయలకు అంటే కేజీ బియ్యాన్ని రూ॥ 3.50 ల నుండి రూ॥ 5.50 లకు పెంచేసింది. ఈ విధంగా అది ఆంధ్రప్రదేశ్‌లోని పేదల్లోకెల్లా నిరుపేదల మూపులపై భారీ ఎత్తున 400 కోట్ల రూ॥ల వార్షిక భారాన్ని మోపింది. ఇక విద్యుత్ చార్జీలను 15 శాతం మేరకు పెంచి ప్రధానంగా వ్యవసాయదారులను, మధ్య తరగతి గృహ వినియోగదారులను దెబ్బ తీయటం ద్వారా టి.డి.పి. కేంద్ర ప్రభుత్వాన్నే మించి పోయింది.

వీటికి తోడుగా ప్రతిచోటా జరుగుతున్నట్లుగానే ఆంధ్రప్రదేశ్ లోనూ దారిద్ర్యరేఖలో దిగువన వుంటున్నదెవరు అనే విషయంలో చాలా మోసం జరుగుతోంది. జనాభాలోని 70 శాతం ప్రజలు ఈ పథకం కిందికి వస్తారని టి.డి.పి. ప్రకటిస్తోంది కానీ వాస్తవంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యంలో 39 శాతం మేరకు మాత్రమే దారిద్ర్యరేఖకు దిగువన గల ప్రజలకు చేరుతోంది. మొత్తం బియ్యం సరఫరాలో రేఖకు దిగువన గల ప్రజలకు కేవలం 9 లక్షల టన్నుల బియ్యం మాత్రమే పోతుండగా రేఖకు ఎగువన గల వారికి 14 లక్షల టన్నుల బియ్యం పోతోంది. మరో మాటలో చెప్పాలంటే ఆంధ్రలో దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న వారిలో చాలామందిని ఆ రేఖకు ఎగువన జీవిస్తున్న వారిలాగా గుర్తిస్తున్నారు. వీరంతా ఇపుడు వాస్తవమైన మార్కెట్ రేటుకే అంటే కిలోకి రూ॥ 8 లను చెల్లించాల్సి వస్తోంది.

ఇక్కడ, కేంద్రం ధరలు పెంచడాన్ని టి.డి.పి. తీవ్రంగా

వ్యతిరేకిస్తున్నదంటూ పత్రికల్లో ఊదరగొడుతున్నారు. తెలుగుదేశంకి చెందిన నలుగురు ముఖ్యమైన పార్లమెంట్ సభ్యులు కేంద్రం పెంచిన ధరలను వ్యతిరేకిస్తున్నట్లుగాను, ప్రధానమంత్రికి తెలుగుదేశం ప్రతినిధి బృందం ఈ విషయమై మెమోరాండంని సమర్పించినట్లు గానూ బ్రహ్మాండమైన నాటకం ఆడారు. ఇతర తెలుగుదేశం పార్టీ నేతలు ఢిల్లీలో ధర్నాకు సైతం దిగారు. అయితే కేంద్రం పెంచిన ధరలను మొట్టమొదటగా అమలు చేసిన తొలి రాష్ట్ర ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమేనని మరువరాదు. నిజానికి పెంచిన ధరలపై టి.డి.పి. 'వ్యతిరేకత'గా చెప్పబడినదంతా గోబెల్స్ తరహా సూత్రధారి చంద్రబాబు ఆడిన, ఆడించిన గొప్ప వీధి నాటకపు జిమ్మిక్కే తప్ప మరేమీ కాదు. ఫిబ్రవరిలోనే టి.డి.పి. ఈ ధరల పెంపుకు సమ్మతించింది. అయితే ఆంధ్రలో జరుగబోతున్న మునిసిపల్ ఎన్నికల కారణంగా బి.జె.పి. ఈ ధరల పెంపును వాయిదా వేయాలని మాత్రమే టి.డి.పి. కోరింది. ఆ ఎన్నికలు ముగిసిన వెంటనే ధరల పెంపుదలను అమలు చేసేశారు. మరి అటువంటపుడు ఈ నాటకమంతా ఎందుకు? ఏప్రిల్ నెల చివర్లో సైతం ప్రధాని వాజ్‌పేయి, ఆర్థికమంత్రి పెంచిన ధరలను పైసా కూడా తగ్గించేది లేదంటూ నిష్కర్షగా ప్రకటించినా టి.డి.పి. కిమ్మనలేదు. పైగా ఎందుకు తమ ప్రభుత్వం ధరలను పెంచాల్సి వచ్చిందో ప్రజలకు అర్థం చేయించడానికి తాము మే నెలలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో ప్రయత్నిస్తామని ధర్మపన్నాలకు దిగారు.

ఇక, ఆహార ధాన్యాల రేట్లు, విద్యుత్ చార్జీలు రెండింటి పెరుగుదల ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్రాతి తీవ్రమైన ప్రభావాన్ని వేయబోతున్నది.

## సంక్షేమ పథకాలపై మహారాష్ట్ర ప్రభుత్వ భారీకోత విధింపులు

ప్రజలకు ఇస్తున్న సబ్సిడీలను, సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు పథకం ప్రకారం ఎలా కోత పెడుతున్నాయో చూపించే అద్భుతమైన ఉదాహరణను మునుపటి బి.జె.పి.-శివసేన ప్రభుత్వం అందిస్తుంది.

1997-98 మహారాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రజారోగ్యం, సాంఘిక సంక్షేమం, ఉపాధి హామీ పథకం వంటి విభిన్న ప్రజారంగాలపై రూపొందించిన వార్షిక పథకంలో 700 కోట్ల రూ॥ల భారీ కోతను విధించింది. మొత్తం పథకంలో ఈకోత 8.5 శాతం కంటే ఎక్కువే.

ఈ మొత్తంలో 100 కోట్ల రూ॥లను ఉపాధి హామీ పథకం లేక 'పనికి ఆహారం' పథకం నుండి కోసేశారు. ఎలాంటి పనులూ దొరకని దుర్భరమైన వేసవి నెలల్లో చాలామంది భూమిలేని పేదలకు, పేద రైతులకు ఈ పథకం కనీసంగా అయినా తిండిని కల్పిస్తూ వచ్చింది. దీన్నే ఇపుడు తొలగించబోతున్నారు. తర్వాత ప్రభుత్వం ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, ప్రభుత్వోగ్యుల భీమా పథకం వంటి వాటితో కూడిన ఆరోగ్య రంగంలో 57 కోట్ల రూ॥ల మేరకు కోత విధించింది. తర్వాత సాంఘిక సంక్షేమంపై ఖర్చులో 91 కోట్ల రూ॥ల దాకా భారీగా కోత విధించారు. మొత్తం వ్యయంలో ఇది 32 శాతంగా వుంటోంది. దీనివల్ల మహిళా, శిశు సంక్షేమ పథకాలు బాగా దెబ్బతిన బోతున్నాయి. తర్వాత బస్ టికెట్ల రేట్లను పెంచటం ద్వారా పరిపుష్టం చేయబడిన రవాణా రంగంలో 70 కోట్ల రూ॥ల మేరకు కోత విధించారు. చివర గ్రామీణ, చిన్న తరహా పరిశ్రమల రంగంలో సైతం 25.5 కోట్ల రూ॥ల కోత విధించాడు. ఇదే విధంగా కూలి పోవడానికి సిద్ధంగా వున్న చేనేత పరిశ్రమలో లక్షలాది మంది ప్రజలు ఆకలి దప్పులతో పస్తులుంటున్నారు. నిధులపై ఇలాంటి కోత విధింపులన్నవి వారిని పూర్తిగా నాశనం వైపుకే నెడతాయి.

సంక్షేమ ఖర్చుల్లో ఇంత భారీ స్థాయి కోతలు ప్రవేశపెట్టినప్పటికీ బి.జె.పి./శివసేన ప్రభుత్వం అధికారం కోల్పోయే నాటికి పూర్తిగా దివాళా తీసేసింది. మరి ఈ కోతల ద్వారా మిగిలించిన డబ్బంతా ఎక్కడకు పోయినట్లు? అంటే రాజకీయ నాయకుల, బ్యూరాక్రాట్ల దండగమారి భారీ ఖర్చులకుగాను పై నిధులను ప్రజాసంక్షేమ రంగాల నుండి దారి మళ్ళించారు. తమ తమ ప్రాంతాలలో ప్రాజెక్టులకుగాను ఎమ్మెల్యేలకు అదనంగా 54 కోట్ల రూ॥లను మంజూరు చేయటం, 'గ్రామీణ శుద్ధి కార్యక్రమం' కింద 40 కోట్ల రూ॥లు కేటాయింపు, పట్టణాల్లోని స్థానిక సంస్థలకు ఆర్థిక సహాయ పథకం కింద 26 కోట్లు వగైరా వగైరా కేటాయింపుల ద్వారా పై కోత నిధులు తరలిపోయాయి.

దేశంలోకెల్లా అత్యంత ''అభివృద్ధి చెందిన'' రాష్ట్రంలో సంక్షేమ రంగ వ్యయానికి సంబంధించిన పాలనా వ్యవహారాలు ఇలా వున్నాయి మరి.

## ఉత్తర ప్రదేశ్‌లో ప్రబలిపోయిన నిరుద్యోగం

ఆర్థిక సంస్కరణలు, ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అనుగుణమైన విధానాలు ఉత్తర ప్రదేశ్‌లో ఉపాధి స్థితిగతులపై వినాశకరమైన ప్రభావాన్ని కల్గించాయి. దేశంలోని మిగతా ప్రాంతాల్లోని పరిస్థితి కూడా ఇదే విధంగా వుంది. ప్రైవేటు, పబ్లిక్ రంగాలు రెండింటిలోనూ ఈ పరిస్థితిని చూడవచ్చు.

2000 సం॥రం మార్చిలో ఇండియన్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు తరుణ్ ఖేత్రపాల్ గత నాలుగు సం॥లలో కేవలం ప్రైవేటు రంగంలోనే 7 లక్షల మంది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయారని చెప్పాడు. 1996లో ఉత్తరప్రదేశ్‌లో 3 లక్షల దాకా చిన్న, పెద్ద పరిశ్రమలుండేవని, అవి 3,200 కోట్ల మొత్తం పెట్టుబడితో 20 లక్షల మంది ప్రజలకు ఉపాధి కల్పించేవని అతడు చెప్పాడు. ఈరోజు 2.9 లక్షల పరిశ్రమలు కొనసాగుతూ 2,500 కోట్ల పెట్టుబడితో 13 లక్షల మంది ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నాయని చెప్పాడు. మరో విధంగా చెప్పాలంటే పరిశ్రమల సంఖ్య 3.5 శాతం మేరకు తగ్గిపోగా వాటిలోని ఉద్యోగుల సంఖ్య మాత్రం భారీ స్థాయిలో 35 శాతం మేరకు పడిపోయింది. 'ఆర్థిక సంస్కరణ'ల విధానాల ఫలితంగా టి.ఎన్.సి.ల, చౌక దిగుమతుల పెనుదాడి కారణంగా దేశంలో చోటు చేసుకున్న డీ-ఇండస్ట్రియలైజేషన్ (జాతీయ ఉత్పత్తి, కార్మిక శక్తి తగ్గిపోవటం) ప్రభావ ఫలితం ఈ విధంగా వుంది. సంవత్సరానికి 2 శాతం జనాభా పెరుగుదల రేటుతో, 7 లక్షల మంది ఉద్యోగులను పూర్తిగా తొలగించి వేయటం అన్నది ఉత్తర ప్రదేశ్ మొత్తం పరిస్థితిపై ఎంత వినాశకర ప్రభావాన్ని వేయనుందో ఎవరైనా వూహించుకోవచ్చు.

పబ్లిక్ రంగంలో పరిస్థితి మరింత దయనీయంగా వుంది. ఐ.యం.యఫ్. నుండి వత్తిడి కారణంగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం

ఇప్పటికే 'పంచాయితీరాజ్' పేరిట దాదాపు 88,000 ఉద్యోగాలను రద్దు చేసింది. పైగా ఈ సంవత్సరాంతానికి మరో రెండు లక్షల ఉద్యోగాలను తొలగించేందుకు పథకమేస్తోంది. ఉత్తర ప్రదేశ్ విద్యుత్‌బోర్డు ప్రైవేటీకరణ ఉద్యోగుల సంఖ్యను మరింతగా తొలగించే మార్గంలో పోతోంది. దీనికి తోడు నిధుల కొరత పేరుతో ఉద్యోగులకున్న కనీస మాత్రపు సౌకర్యాలను కూడా తొలగించేందుకు అనేక జీ.వో.లను ప్రభుత్వం జారీ చేస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వానికి తన విస్తృత మంత్రి వర్గానికిగానూ భారీస్థాయిలో నిధులు భారీ సౌకర్యాలు కల్పించేందుకు, నూతన మంత్రిత్వ శాఖల సృష్టికి అవసరమైన నిధులకంటే ఎక్కువగానే కోట్లాది రూ॥లను అది ఖర్చు పెడుతోంది.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు దొరకక, ప్రభుత్వ రంగంలో భారీ స్థాయిలో తొలగింపులు ఉంటున్న పరిస్థితుల్లో ప్రస్తుత తరానికి ప్రయోజనం కల్గించే ఉపాధికి ఏ మాత్రం అవకాశముంది మరి! వారు నేర జీవితాన్నయినా ఎంచుకోవాలి. లేక విప్లవం వైపుకయినా అడుగేయాలి. ప్రభుత్వ విధానాలు వారికి మరో ప్రత్యామ్నాయాన్ని కల్పించటం లేదు.

## ప్రజలకు భవిష్యత్తు ఏమిటి?

తగినంత భూమి, ఉద్యోగాలు లేక, సాంఘిక సంక్షేమ రంగంలో భారీ కోతలతో, ప్రాథమికావసరాలకు పెట్టే ఖర్చు భారీగా పెరిగి పోవటంతో మెజారిటీ భారత ప్రజలకు మనుగడ సైతం అసాధ్యంగా మారిపోయింది. ఇప్పటికే గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలో ఆత్మహత్యల పెరుగుదల చాలా మొత్తంగానే వుంది. జీవించడానికి ఏ వనరులూ సాధ్యం కాకపోవటంతో ప్రజలు తీవ్ర చర్యలు చేపట్టాల్సిన స్థితిలోకి  నెట్టబడుతున్నారు.

చాలీచాలని తిండి, పస్తులతో కూడిన విషాదకర మనుగడ, వ్యాధుల తీవ్రత, సరైన వైద్య సౌకర్యాలు లేని కారణంగా వ్యాధులను నివారించుకోలేక పోవటం, పోషకాహార లేమి కారణంగా పసిపిల్లల ఏడుపులను చూడలేక తీవ్రంగా సంకట పడటం, జేబులోకి మరొక రూపాయి ఎలా వస్తుందో తెలియని భయంకరమైన అభద్రతా భావం....భారతదేశంలోని నిజమైన జీవిత దృశ్యాలు ఇవే. అది టెలివిజన్‌లలో, పత్రికలలో చిత్రింపబడుతున్న హైటెక్ ఇండియా కాదు. కోటానుకోట్ల మందికి హైటెక్ భారతం కలల లోకమే తప్ప వాస్తవం కాదు. నిస్సందేహంగానే పై నిజమైన భారతదేశం సమస్యలపట్ల స్పందించే తత్వం కొరవడిన, దైనందిన పత్రికా ప్రచారాల ఊదరలో కొట్టుకు పోయిన వస్తు వ్యామోహతత్వపు మధ్య తరగతికి చాలా దూరంలో వున్న సాధారణ ప్రజానీకంతో కూడుకుని వున్నటు వంటిదే. వీరు వాస్తవం నుండి దూరమైపోయి 'మూలాల్లోకి' వెనక్కిపోతూ హిందూ పునరుద్ధరణ వాదంలో, అణు పరీక్షలలో 'హైటెక్ కంప్యూటర్ నిపుణుల'లో (వీళ్ళు బాగా ఊదరగొట్టబడిన సాఫ్ట్‌వేర్ కార్మికులే తప్ప మరేమీ కారు) భారతీయ వైభవాన్ని కీర్తిని చూస్తున్నారు. పశ్చిమ దేశాలలో డబ్బు సంపాదించిన కొద్దిమంది ''భారతీయుల'లోనే వీరికి 'కీర్తి, ప్రతిష్ట' కనబడుతోంది. అనేక అబద్ధాల, తప్పుడు ప్రచారాల, కృత్రిమ గ్లామర్ ప్రపంచపు తళుకుబెళుకుల ద్వారా ఈ భారతీయ 'వైభవ' ప్రపంచంగా నమ్మించబడుతున్న దానిని మార్కెట్‌లోకి వదులుతున్నారు.

ప్రచార సాధనాల్లో పదేపదే విన్పిస్తున్న ఈ రోతకు, అసత్యాలకు చక్కటి ఉదాహరణను స్వల్ప ద్రవ్యోల్బణంపై ప్రభుత్వ గణాంకాలలో చూడవచ్చు. అత్యవసర వస్తువులపై ధరలు 70 నుంచి 78 శాతం, చమురుపై 30 నుండి 50 శాతం దాకా, రవాణాపై 15 నుంచి 20 దాకా పెరిగిన పరిస్థితుల్లో కూడా ప్రభుత్వ  అధికారిక ద్రవ్యోల్బణపు రేటు 2 శాతం చుట్టూ మాత్రమే తిరుగుతోంది. నిజానికి గణాంకాలు కూడా అబద్ధాలు అల్లగలవు. హోల్‌సేల్ ధరల సూచికను (డబ్ల్యు.పి..ఐ.) లెక్కించే పద్ధతిలోనే జిత్తులమారి తనం దాగి వుంది. ఈ సూచికలో 447 సరకులున్నాయి. వీటిలో పారిశ్రామిక సరకుల శాతం 57 కాగా ప్రాథమిక ఉత్పత్తులకు (ఆహార ధాన్యాలు, కూరగాయలు వగైరా) 32శాతం వాటా మాత్రమే వుంది. ఇక కిరోసిన్‌కి అయితే ఈ సూచిలో ఏ వాటా కూడా లేదు. అదే సమయంలో మామిడిపండ్లకు మాత్రం చాలా పెద్ద వాటాయే వుంది. మార్కెట్లో పతనం, చౌక దిగుమతుల వెల్లువ కారణంగా ధరలు స్థిరంగా వుంటున్న పారిశ్రామిక వుత్పత్తుల వైపే హోల్‌సేల్ ధరల సూచిలో మొగ్గు చూపినందువల్ల సహజంగానే ద్రవ్యోల్బణ రేటు తక్కువగానే వుంటోంది. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలంటుతున్న పరిస్థితుల్లో కూడా ద్రవ్యోల్బణ రేటు తక్కువగా వుండటానికి ఇదే కారణం. హోల్‌సేల్ ధరల సూచిలోని సరకులకు అవి వినియోగింపబడుతున్న నిష్పత్తిలో వాటా వుండవలసినందున ద్రవ్యోల్బణంకి సంబంధించిన అసలు వాస్తవం ఇది కాదు.


ఇలా పకడ్బందీగా అల్లబడిన లెక్కలను ఉపయోగించుకుంటూ ప్రభుత్వం ''స్థిరమైన ఆర్థిక వ్యవస్థ'', ''స్వల్ప ద్రవ్యోల్బణం'' లకు సంబంధించిన తప్పుడు సమాచారాన్ని ఇవ్వటంలో ఎన్నడూ ప్రయాసపడిందీ లేదు. మోసపోయేవారు ఈ ప్రచారం బారిన పడుతున్నారు.కానీ భారతీయ జనాభాలో దారిద్ర్యరేఖకి దిగువన వున్న 59 శాతం మందికి ఆ రేఖ దరిదాపుల్లో తిరుగుతున్న మరో 20 శాతం మందికి వారి దినవారీ జీవితంలోనే చేదు వాస్తవం కన్పిస్తోంది. ఉపాధి లేని నూతన తరంతో, పడిపోతున్న ఆదాయాలు, పెరుగుతున్న ధరలతో అంధకార భవిష్యత్తును ఎదుర్కొంటున్న మధ్యతరగతిలోని విస్తృత సెక్షన్‌లో సైతం భ్రమలు పటాపంచలు కావటం పెరుగుతోంది. వీరిని నిరవధికంగా దారి మళ్ళించడంలో పాలకవర్గాలకు మతపరమైన ముక్క సైతం చురుగ్గా పనిచేయలేక పోతోంది.

కానీ, గాలి మేడలు తప్పక కూలిపోతాయి. బూటకపు 'వైభవం'తో చేదు వాస్తవం ఘర్షణ పడుతుంది. చివరకు పార్లమెంటరీ రాజకీయ నాయకులు సైతం సామ్రాజ్యవాద శక్తుల సంపూర్ణ తొత్తుల లాగా బయట పడటం పెరుగుతోంది. తమ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రపంచబ్యాంకు, డబ్ల్యు.టి.ఓ. వగైరా సామ్రాజ్యవాద సంస్థల ఆదేశాల ఫలితమే అన్న అంశాన్ని దాచిపెట్టడానికి సైతం వారిపుడు ప్రయత్నించనంతగా బరితెగించి పోయారు.

ఈరోజు ప్రజల దుర్దశ మరింతగా దిగజారి పోవడమన్నది విస్తృతమైన విప్లవ తిరుగుబాటు ద్వారానే నిరోధింపబడగలదు. పాలకుల బలాన్ని, వారి సామ్రాజ్యవాద ప్రాయోజకుల బలాన్ని విజయవంతంగా అడ్డుకునే శక్తి సామర్థ్యతలను విప్లవశక్తి మాత్రమే ప్రజలకు ఇవ్వగలదు. అటువంటి శక్తి భారతదేశంలో మొదట కొన్ని ప్రాంతాల్లో పుట్టి క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలన్నింటికీ వ్యాపిస్తోంది. ❑

# దేశాన్ని కుదిపేసిన సమ్మెల వెల్లువ

దాదాపు పదిలక్షల మంది ప్రభుత్వోద్యోగులు/కార్మికుల భారీ సమ్మెల వెల్లువ ద్వారా నూతన సహస్రాబ్ది మనదేశంలో ప్రారంభమైంది. రాజస్థాన్ రాష్ట్రంలో 4 లక్షల మంది ప్రభుత్వోద్యోగులు చేసిన 64 రోజుల సమ్మె, జమ్మూకాశ్మీర్‌లో 3 లక్షల మంది ప్రభుత్వోద్యోగులు చేసిన 44 రోజుల సమ్మె, ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డుకి చెందిన దాదాపు లక్షమంది ఉద్యోగులు 11 రోజులపాటు సమరశీలురై చేసిన సమ్మె, లక్షమంది నౌకా, రేవు కార్మికులు చేసిన 5 రోజుల సమ్మె.....ఇవన్నీ తమ జీవన స్థితిగతులపై పలు ప్రభుత్వాలు మొదలెట్టిన కిరాతకమైన దాడిని ప్రతిఘటించడానికి ఉద్యోగులు చేసిన సమ్మెలు మాత్రమే. ప్రైవేటీకరణకి, ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా ఒక నూతన మార్గాన్ని ఆవిష్కరించిన ఉత్తర ప్రదేశ్ కార్మికుల సమ్మె వీటన్నింటిలోకెల్లా చారిత్రాత్మకమైనది. ఇది అత్యంత ప్రాధాన్యత కల్గిన సంపూర్ణమైన రాజకీయ సమ్మె. కార్మిక జనాభాలో సాపేక్షికంగా కాస్త మంచి స్థితిలో వున్న సెక్షన్ ఇపుడు ప్రపంచబ్యాంకు, ఇతర



కొత్త ఢిల్లీలో పార్లమెంటుకి సమీపంలో నిరసన తెలుపుతున్న లాయర్లు

సామ్రాజ్యవాద సంస్థల ఒత్తిడికి లోనై పని చేస్తున్న ప్రభుత్వాల గొడ్డలి వేటును చవి చూస్తున్నారు. కార్మికుల వేతనాలలో పెరుగుదల స్తంభించి పోవటమే కాదు, చివరకు వారికి మామూలుగా వచ్చే బోనస్ చెల్లింపులు, డి.ఎ.ల పెంపుదల, ఇతర సౌకర్యాలు కూడా ఇపుడు చెల్లాచెదరై పోయినాయి. వారి ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలను చట్ట విరుద్ధంగా కబళించేశారు. ప్రతి ఉద్యోగి తలపై భారీ ఎత్తున ఉద్యోగాల తొలగింపు అనే కత్తి వేలాడుతూంది. ఈ ఉద్యోగుల సమ్మెకు తోడుగా లాయర్లు కూడా సమ్మెకు దిగటం కనీవినీ ఎరుగనిది. ఇది దేశ వ్యాప్తంగా న్యాయస్థానాలను కంపింప జేసింది. 6 లక్షల సంఖ్యలోని లాయర్లు మొత్తంగా పని నిలిపివేసి వారం నుండి నెలరోజుల దాకా కోర్టులను బహిష్కరించారు.

డబ్బు సంచుల ఆదేశాల మేరకు పని చేస్తున్న ప్రభుత్వాలు తమ ప్రజలపై చేస్తున్న బహుముఖ దాడి ఇది. కార్మికులు చట్టబద్ధమైన తమ సమ్మె హక్కును ఉపయోగించాలని చూసినపుడు వేలాదిమంది కార్మికులను ప్రభుత్వం అరెస్టు చేసింది. 'అత్యావసర సర్వీసుల నిర్వహణ చట్టం' (ఎస్మా) జాతీయ భద్రతా చట్టం (ఎన్.ఎస్.ఎ.) వంటి వాటిని ప్రయోగించి వేలాదిమందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. ముఖ్యమైన కార్యకర్తలను బదిలీలు వగైరాలతో వేధించారు. పోలీసులు అర్ధరాత్రిపూట కార్మికుల కోసం ఇండ్లపై పడి గాలింపు చర్యలను చేపట్టడం ద్వారా చివరకు కార్మికుల కుటుంబాలు సైతం వేధింపు, అవమానాల నుండి తప్పించు కోలేక పోయారు.

అది కాశ్మీరు కాదు, ఈశాన్య భారతమూ కాదు. అది భారతదేశం మధ్యలో వున్న హిందీ భాషా ప్రాంతం. టెర్రరిస్టులు అనబడుతున్న వారికి వ్యతిరేకంగా కాదు, స్వయానా ప్రభుత్వ ఉద్యోగులకు వ్యతిరేకంగానే ఇవన్నీ జరిగాయి. అందుకే ఇపుడు ఈ సమ్మెలను ప్రేరేపించింది అంటూ పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ. ఏజెంట్లను నిందించటానికి కూడా వీల్లేని పరిస్థితి. ఒకవైపు ప్రభుత్వానికి, మరోవైపు బడా వాణిజ్య వర్గాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు నిలబడటంతో ఇది చాలా స్పష్టమైన వర్గ ఘర్షణే.

ఈ సంవత్సరం జనవరి నెల మొత్తంగా 50 లక్షల మంది జీవితాలపై ప్రభావం వేస్తూ తీవ్రమైన కల్లోలాలు చెలరేగినప్పటికీ ముఖ్యమైన పత్రికలలో వేటిలోనూ ఈ సంఘటనలకు కాస్తంత చోటు కల్పించలేదు. ఉద్యోగుల/కార్మికులపై క్రూరమైన దాడుల గురించి తగుమాత్రపు ఖండన రూపంలోని వార్తలు మినహా మరే ప్రచారమూ లేదు. నిజానికి ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్బంధ విధానాలను ఒక మేరకు పత్రికలు బలపరుస్తూ వచ్చాయి. ఇలాంటి పాక్షిక రిపోర్టింగ్ ద్వారా, ఇలాంటి పెద్ద సమ్మెలను ప్రాధాన్యం లేని సంఘటనలుగా చూపించాలని మీడియా అనుసరించిన వైఖరి ద్వారా సమ్మె చేస్తున్న వారికి వ్యతిరేకంగా ప్రభుత్వం స్వేచ్ఛగా, యధేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవడానికి మరికొంత అవకాశం ఏర్పడింది.

ప్రతి సమ్మె విషయంలోనూ ప్రభుత్వం నిధులు లేవని ప్రకటిస్తూ సమ్మె చేస్తున్న వారితో చర్చలకు సైతం తిరస్కరించింది. దానికి బదులుగా కార్మికులను మరింతగా చావగొట్టడానికి వారు దండాన్ని ప్రయోగించారు. తమ భారీ మంత్రి వర్గాలకు ప్రభుత్వాలు విచ్చలవిడిగా నిధులను ఖర్చు పెడుతూ వృధా చేస్తూ, తమ వేతనాలను, భత్యాలను మూడు రెట్లు పెంచుకొంటూ, ఎం.పి.లకు వారి వారి నియోజక వర్గ వార్షిక కేటాయింపులను రెట్టింపు చేస్తూ, తమ భద్రతకై భారీ ఎత్తున నిధులు ఖర్చుపెడుతూ సౌకర్యాల ద్వారా, అవినీతి ద్వారా కోట్లాది రూపాయలను తరలించేస్తూనే ప్రభుత్వాలు మరోవైపున తమ

ఉద్యోగులకు నయాపైసా అదనంగా చెల్లించడానికి కూడా అంగీకరించటం లేదు.

## 7 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెలు

రాజస్థాన్‌లో 4 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె 1999 డిసెంబర్ 15న మొదలు కాగా, జమ్మూకాశ్మీర్ ఉద్యోగుల సమ్మె డిసెంబర్ 18న మొదలైంది. మొదటి సమ్మె 64 రోజుల తర్వాత ఫిబ్రవరి 15న ముగియగా రెండోది 44 రోజుల తర్వాత జనవరి 30న ముగిసి పోయింది.

రాజస్థాన్ ప్రభుత్వ ఉద్యోగులు కోరుకున్నదల్లా ఏమిటంటే వారు తమకు ప్రతి సంవత్సరమూ రావలసిన బకాయిలను మాత్రమే డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఏ నూతన డిమాండ్లనూ లేవనెత్తలేదు. అంతకుముందే ప్రభుత్వంతో కుదుర్చుకున్న కొన్ని ఒప్పందాల అమలు కోసమే వారు ప్రయత్నించారు. ఆ ఒప్పందాలలో 1998-99 సం॥రానికి బోనస్ చెల్లింపు, కేంద్ర ప్రభుత్వంతో సరి సమానంగా డి.ఎ. చెల్లింపు, నిర్ణీత కాలానికి అనుగుణంగా టీచర్లకు ప్రమోషన్లు, 5వ వేతన కమీషన్ ప్రతిపాదనల అమలులోని వివక్షతల తొలగింపు ప్రావిడెంట్ ఫండ్, మెడికల్ టూర్ బిల్స్ చెల్లింపులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయటం వంటి అంశాలున్నాయి.

జమ్మూ కాశ్మీర్ ఉద్యోగుల పరిస్థితి కూడా ఇదే. అయిదో వేతన కమీషన్ రిపోర్టు ప్రకారం తమకు రావలసిన వేతన బకాయిలను, 1999లో తమకు రావలసిన రెండు విడతల డి.ఎ.ల బకాయిలను చెల్లించమని మాత్రమే వారడిగారు.

ఈ రెండు సందర్భాలలో ప్రభుత్వాలు తమ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడానికి బదులు వారిపై బలంగా తమ ఉక్కుపాదాన్ని మోపాయి.

రాజస్థాన్‌లో 64 రోజుల సమ్మె కాలంలో (రాష్ట్రంలో జరిగిన సమ్మెల్లోకెల్లా పెద్దది) 2500 మంది కార్యకర్తలు అరెస్టయినారు. రాష్ట్ర వ్యాప్తంగా నాయకులను జైళ్ళకు తరలించారు. ఉద్యోగులు ర్యాలీలు జరపడానికి పోలీసులు అనుమతించలేదు. పైగా జైపూర్‌లో ఏ స్థలంలో అయినా సమావేశమవడానికి ఉద్యోగులు ప్రయత్నించినపుడల్లా వారిని పోలీసులు బలవంతంగా తరిమేశారు. ఈ ఫాసిస్ట్ చర్యలను ఎదుర్కొనేందుకు, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టు కునేందుకు ఉద్యోగులు ఇల్లిల్లూ తిరిగారు. వారి భార్యా పిల్లలు సైతం వీధుల్లోకి వచ్చారు.

సమ్మె జరుగుతున్న 48వ రోజున 11 మంది ఉన్నతస్థాయి నాయకులను, పరిష్కారం కోసమై ఒత్తిడి తీసుకురావడానికి గాను జోధ్‌పూర్ జైలుకి తీసుకు వచ్చారు. అందుక భిన్నంగా వారు తమ డిమాండ్లను అంగీకరించనందుకు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉద్యోగులపై పోలీసుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జైలులోనే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. సమ్మె కాలంలో చాలా వరకు ప్రేక్షక పాత్ర వహించిన రివిజనిస్టు, తదితర యూనియన్లు ఫిబ్రవరి 9న తమ సమ్మెను అసెంబ్లీ ముందర లాంఛనప్రాయమైన ధర్నాగా మార్చి వేశాయి.

ఈలోగా నాలుగు రోజుల పాటు జరిగిన చర్చలు ఫిబ్రవరి 8న విఫలమై ముగిశాయి. ప్రభుత్వం ఏకపక్షంగా ఒక ప్యాకేజీని ప్రకటించి, ఉద్యోగులు తిరిగి పనిలో చేరడానికి 72 గంటల గడువును విధించటమే ఇందుక్కారణం. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన 'ప్యాకేజి'లో బోనస్‌ని శాశ్వతంగా రద్దు చేశారు. డి.ఎ. బకాయిలను ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌లో జమ చేశారు. యూనియన్ ఈ 'పథకాన్ని' తిరస్కరించి ఫిబ్రవరి 10న జైపూర్‌లోని మానక్‌చౌక్‌లో నిరవధిక ధర్నాకు పిలుపిచ్చింది. సమ్మె చేస్తున్న వారికి మద్దతుగా రాజస్థాన్ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్ల సర్వీసుల సమాఖ్యకి చెందిన లక్షమంది గెజిటెడ్ అధికార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 9న సాధారణ సెలవుపై వెళ్ళారు. కఠినమైన, అన్యాయమైన ప్రభుత్వ విధానంకి వ్యతిరేకంగా వారిలా సెలవుమీద వెళ్ళారు. సమ్మె చేస్తున్న ఉద్యోగుల డిమాండ్లకు మద్దతు ప్రకటించడానికిగానూ వారు జనవరి నెల వేతనాలు తీసుకోవడానికి వ్యతిరేకించారు.

సమ్మె సంపూర్ణంగా సాగింది. ప్రభుత్వం మరో నూతన ప్యాకేజీని ముందుకు తెచ్చింది. ఉద్యోగుల మద్దతు పెద్దగా లేని ఇద్దరు 'నాయకుల'తో ఒప్పందానికై చర్చలు జరిపింది. అదే సమయంలో ధర్నాకు వచ్చిన ఉద్యోగులపై క్రూరంగా లాఠీచార్జీ చేయించి అరెస్టే చేయించారు. భరత్‌పూర్‌లో అయితే పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. పోలీసు జీపును తగులబెట్టి పోలీసులపై రాళ్ళు విసిరారు. జైపూర్‌లో పోలీసులు నిషేధ ఉత్తర్వులు విధించి, ధర్నాకు దిగేందుకు ప్రయత్నించిన ఉద్యోగులను అరెస్ట్ చేశారు. కార్మికులలో చీలిక తేవడంలో ప్రభుత్వం విఫలమయినా, నాయకులు మాత్రం చివరకు రాజీపడి పోయారు. ఆర్థికవాదంలో గొంతు లోతు వరకూ మునిగి పోయిన నాయకులు ఏ డిమాండ్‌నూ ప్రభుత్వం ఆమోదించ కున్నప్పటికీ సమ్మె విరమణకు పిలుపిచ్చారు. ఉద్యోగుల బోనస్‌ని ప్రభుత్వం తిరస్కరించింది. డి.ఎ. బకాయిలను వారి ప్రావిడెంట్‌లో కలిపేసింది. సమ్మె కాలం మొత్తానికి జీతం చెల్లించనని ఆర్జిత సెలవులకు ప్రతిగా దానిని సర్దుబాటు చేయనని కూడా తేల్చేసింది. చివరకు ఉద్యోగులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెనక్కి తీసుకుంటామన్న హామీని సైతం ఇవ్వలేదు.

జమ్మూ కాశ్మీర్‌లోనూ కథ ఇదే విధంగా సాగింది. ప్రభుత్వం 'ఎస్మా'ని ప్రయోగించి వేలాదిమంది ఉద్యోగులను అరెస్ట్ చేయించింది. చాలా మందికి సస్పెన్షన్ వుత్తర్వులను జారీ చేసి, సమ్మెకాలంలో జీతం చెల్లించనని ప్రకటించింది. 44 రోజుల సమ్మె తర్వాత కుదిరిన ఒప్పందంలో, కేసులను ఉపసంహరించుకుని, సస్పెన్షన్ ఉత్తర్వులను ఎత్తివేసినప్పటికీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న నిధుల కోసం కేంద్రంతో చర్చిస్తానన్న హామీని మాత్రమే ఇచ్చింది. జనవరి నుండి డిసెంబర్ '99 వరకు డి.ఎ. ఇన్‌స్టాల్‌మెంట్లను, అయిదో వేతన కమీషన్ అకౌంట్‌పై బకాయిలను, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌కి జమ చేర్చడానికి ప్రభుత్వం ఒప్పుకొంది. మరో మాటలో చెప్పాలంటే ఉద్యోగులకు దక్కిందేమీ లేదు.

## ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ బోర్డు ఉద్యోగుల చారిత్రాత్మకమైన రాజకీయ సమ్మె

దేశం లోపల సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటానికి సంబంధించి యు.పి.ఎస్. ఇ.బి. ఉద్యోగులు భారతీయ కార్మికవర్గానికి దారి చూపించారు. గత ఏడెనిమిది సం॥లుగా అన్ని రాజకీయ పార్టీలూ ప్రపంచబ్యాంకు ఆధ్వర్యంలోని పథకాలకు డూడూ బసవన్నల్లా తలలూపేశాయి. ఇప్పుడు రాష్ట్రాల విద్యుత్ బోర్డుల

ప్రైవేటీకరణ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రక్రియ ఒరిస్సాలో జనతాదళ్ ప్రభుత్వం ద్వారా, ఆంధ్రలో టి.డి.పి. ప్రభుత్వం ద్వారా, హర్యానాలో బన్సీలాల్ ప్రభుత్వం ద్వారా జరిగి పోయింది.

మన దేశ ప్రజలపై ప్రపంచబ్యాంకు ఆధ్వర్యంలో జరిపిన దాడికి ఇది స్పష్టమైన ఉదాహరణ. ఈ దాడి లక్ష్యమేదంటే ఇంతవరకూ ప్రజలకు సేవ చేసేందుకు విద్యుత్తును ఇవ్వాలి అనే విధానాన్ని వదిలిపెట్టి, ఎం.ఎన్.సి.లు భారతీయ దళారీలతో కుమ్మక్కై స్వాధీనం చేసుకునే, లాభాలు ఆర్జించి పెట్టే యంత్రాంగంగా మార్చటమే. ఇందుకుగాను ప్రభుత్వాలు ప్రజలపైనా, రాష్ట్ర విద్యుత్ బోర్డుల ఉద్యోగులపైనా ద్వంద దాడి మొదలుపెట్టాయి. విద్యుత్ చార్జీలలో భారీ పెంపుదలను ప్రజలు చెల్లించాల్సి వుంటుంది. ఇక ఉద్యోగులు తమ ఉద్యోగాల తొలగింపును, వేతనాల్లో కోతను, తాత్కాలిక ప్రాతిపదికగల పనులను ఎదుర్కోవాల్సి వుంటుంది. ప్రభుత్వాలు యం.యన్.సి.ల ఏజెంట్ల గానూ, వారికి సౌకర్యాలను అందజేసేవిగానూ పని చేస్తుండటంతో యం.యన్.సి/దళారీ వర్గాలకు అపారమైన లాభాల పంట పండనున్నది. దీనివల్ల భారతీయ విద్యుత్తు ధర కొన్ని రంగాలలో అంతర్జాతీయ రేట్ల కంటే అయిదురెట్లు అధికంగా వుంటోంది. ఇపుడు పేదలకు, మొత్తం రైతాంగానికి విద్యుత్తు దుర్లభమే.

'99 జూలైలో ఉత్తరప్రదేశ్ విద్యుత్‌రంగాన్ని పునర్నిర్మించడానికి వుద్దేశించిన చట్టానికి రాష్ట్రపతి అంగీకారం లభించింది. ఆ విధంగా రాష్ట్ర విద్యుత్ క్రమబద్ధీకరణ కమీషన్ ఏర్పడింది. ఇది 2000 సంll రం జనవరి 14న యు.పి.యస్.ఇ.బి.ని మూడుగా విభజించడానికి సంబంధించిన నోటీసును జారీ చేసింది. యు.పి.యస్.ఇ.బి.ని జల విద్యుత్ కార్పొరేషన్‌గా, థర్మల్ (ఉష్ణ) విద్యుత్తు కార్పొరేషన్‌గా, పవర్ (విద్యుత్తు) కార్పొరేషన్‌గా (విద్యుత్ మార్పిడిని, సరఫరాని నిర్వహించేది) విభజించటమే దీని లక్ష్యం. ఈ నోటీసే ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా తక్షణం సమ్మెకు నాంది పలికించింది. ప్రభుత్వం ఉద్యోగులను సాధారణ నేరస్తులుగా భావిస్తుండటంతో సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేయ దలచింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిపి క్రూరమైన నిర్బంధాన్ని చేపట్టాయి. కేంద్రమయితే సమ్మె చేస్తున్న వుద్యోగులతో ఏ విధంగానూ రాజీపడరాదంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కఠినమైన ఆదేశాలను జారీ చేసింది. ప్రపంచబ్యాంకు తన గొంతు నొక్కుతుండటంతో కేంద్ర ప్రభుత్వం సమ్మె చేస్తున్న వారితో 'కఠినంగా' వ్యవహరించమని యు.పి. ప్రభుత్వానికి చెప్పింది. ఎందుకంటే ఉత్తరప్రదేశ్ తక్కిన దేశమంతటికీ 'ప్రయోగ కేంద్రం'గా కానున్నది. రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా, స్థిరంగా నిలబడేందుకుగాను, కేంద్ర విద్యుత్‌శాఖా మంత్రి కుమార మంగళం సమ్మె కాలం మొత్తానికి పూర్తి ఆర్థిక పరిహారాన్ని (400 కోట్ల రూll లని అంచనా వేశారు) రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తామని చెప్పాడు. 4,300 కోట్ల రూll ల రుణాన్ని మంజూరు చేసేందుకుగాను ప్రైవేటీకరణను, రాష్ట్ర విద్యుత్ బోర్డును విభజించటాన్ని ప్రపంచబ్యాంకు షరతుగా విధించింది.

సమ్మె జరుగుతున్న రెండో రోజు నుండే అరెస్టులు మొదలై 150 మందిని జైలుకి పంపారు. సమ్మె దాదాపుగా సంపూర్ణంగా జరిగింది. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సగానికి పడిపోయింది. విద్యుత్ సరఫరాని సజావుగా సాగించేందుకుగాను ప్రభుత్వం నేషనల్ గ్రిడ్ నుంచి భారీ మొత్తంలో విద్యుత్‌ని కొనాల్సి వచ్చింది. సమ్మెదార్లతో చర్చలకు బదులు ప్రభుత్వం మూకుమ్మడి అరెస్టులకు దిగింది. రాత్రిపూట ఉద్యోగుల ఇండ్లమీద దాడిచేసి వారి కుటుంబాలను సైతం వేధించింది. పోలీసుల తలబిరుసు పద్ధతులు ఎంత మొరటుగా మారాయంటే సమ్మె చేస్తున్న ఇంజనీర్ల భార్యలు రాత్రిపూట పోలీసుల దాడులను నిరోధించేందుకుగాను హైకోర్టు నుండి రిట్ ఉత్తర్వులను తెచ్చుకోవలసి వచ్చింది.

సమ్మె జరుగుతున్న కాలంలో విద్యుత్‌శాఖకు చెందిన 17,000 మంది అరెస్టు కాగా 3,000 మందిని సర్వీసు నుండి తొలగించారు. అరెస్టయిన వారిలో దుబే, సింగ్ అనే ఇద్దరు అత్యున్నత స్థాయి నాయకులున్నారు. వీరికి బెయిల్ మంజూరీ అయితే తిరిగి జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేశారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం నూతన నియామకాలకు పిలుపిస్తూ ఉత్తర భారత దేశంలోని ప్రముఖ పత్రికలన్నింటిల్లోనూ పూర్తి పేజీ ప్రకటనలను కూడా చేసింది. నూతన ఉద్యోగులను నియమించే క్రమం కూడా మొదలు పెట్టింది.

ఈలోగా దేశ వ్యాప్తంగా గల రాష్ట్రాల విద్యుత్ బోర్డు ఉద్యోగులు ఉత్తరప్రదేశ్‌లోని తమ సహచరులకు మద్దతుగా సమ్మెలకు దిగారు. జమ్మూ కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్‌లతో కూడిన ఉత్తర భారత విద్యుత్ ఉద్యోగుల సమాఖ్య మొట్టమొదట ఒకరోజు సానుభూతి పూర్వకమైన సమ్మెకి దిగింది. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలోని విద్యుత్ ఉద్యోగులు దీనిని అనుసరించారు. దేశ వ్యాప్తంగా వున్న విద్యుత్ ప్లాంట్లకు బొగ్గు సరఫరాని నిలిపివేస్తామని 'కోల్ ఇండియా లిమిటెడ్' ఉద్యోగులు బెదిరించారు.

ప్రభుత్వం కేవలం నిర్బంధం ద్వారానే కాక, యూనియన్లను పరస్పరం ఎదురు నిలపటం ద్వారా కూడా సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి చేయదగినదల్లా చేసింది. ఇందుకుగానూ మాజీ కార్మిక నేత జార్జి ఫెర్నాండెజ్ సేవలను వుపయోగించుకుంది. సమ్మె మధ్యలో 'కిసాన్ మజ్దూర్ పంచాయత్ సంఘ్'కి చెందిన పాండేని చర్చల కోసం జైలు నుండి విడుదల చేసింది. అదే సమయంలో పై ఇద్దరు ముఖ్య నాయకులను అరెస్టు చేసి చాలా దూరంలోని బందా, హమీర్‌పూర్ జైళ్ళకు తరలించేసింది.

ఎట్టకేలకు జనవరి 25న 'రాజీ ఒప్పందం' కుదిరింది. దీని ప్రకారం యూనియన్లు విద్యుత్‌బోర్డును మూడుగా విభజించటానికి అంగీకరించగా, ప్రభుత్వం ప్రైవేటీకరణను ఒక సంవత్సరం పాటు వాయిదా వేసుకుంది. నూతనంగా ఏర్పడే కార్పొరేషన్లో కార్మికుల ప్రయోజనాలను కాపాడడానికి ప్రభుత్వం సమ్మతించింది. సర్వీస్ నిబంధనలు, వేతనాలు, రిటైర్‌మెంట్ కాలంలో అందే ప్రయోజనాలు మారకుండా కొనసాగుతాయి. ఉద్యోగాల నుండి తొలగింపు, నేరాలపై చర్యలు వంటి వాటితో సహా సమ్మె కాలంలో ఉద్యోగులకు వ్యతిరేకంగా తీసుకున్న క్రమశిక్షణా చర్యలను ఉపసంహరించుకుంటారు.

అయితే ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే ఉద్యోగులు పనిలోకి దిగారు కాని ప్రభుత్వం తన వాగ్దానాల నుండి వెనక్కు పోయింది. కాన్పూర్ యూనిట్ ప్రైవేటీకరణ క్రమాన్ని నిలిపి వేయాలంటూ కార్మికులు ప్రత్యేకంగా కుదుర్చుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం బాహాటంగా బుట్టదాఖలు చేసి ప్రైవేటీకరణ క్రమాన్ని కొనసాగించింది. సమ్మె ముగిసిన వెంటనే కాన్పూర్ యూనిట్‌ను 2000, ఫిబ్రవరి 15 లోగా కాన్పూర్ విద్యుత్ సరఫరా కంపెనీ (కెస్కో)గా రిజిష్టర్ చేయాలని

ఆదేశాలు జారీ చేసింది. ఈ కొత్త కంపెనీలో ఒక ప్రైవేట్ కంపెనీకి 74 శాతం వాటాలుంటాయి. ఫిబ్రవరి 28 నాటికల్లా ఈ కాన్పూర్ ఎలక్ట్రిసిటీ సప్లై కంపెనీ విద్యుత్ చార్జీల పెంపుదల గురించి రెగ్యులేటరీ కమీషన్‌కి ప్రతిపాదనను పంపింది. ఏప్రిల్ 1 నాటికి 'కెస్కో' వినియోగదారులకు 100 శాతం దాకా విద్యుత్ రేట్లను భారీగా పెంచనున్నది. దీనికి తోడుగా 'కెస్కో' తన ఉద్యోగులను పెద్ద ఎత్తున తొలగిస్తానని ప్రతిపాదించింది. మొత్తం 3,382 మంది ఉద్యోగులలో 2,800 మందిని (83 శాతం), 114 మంది జూనియర్ ఇంజనీర్లలో 104 మందిని (91 శాతం) 90 మంది సీనియర్ అధికార్లలో 50 మందిని (56 శాతం) తొలగించాలని, లేక ఇతర విభాగాలకు మార్చాలని అది డిమాండ్ చేసింది. ఇంకా కేంద్ర విద్యుత్ చెల్లింపుల కోసం రాష్ట్ర విద్యుత్ బోర్డు తన ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ మొత్తాలను చట్ట విరుద్ధంగా వాడుకున్నది. బోర్డును మూడుగా విభజించి కార్పోరేషన్‌ని ఏర్పాటు చేసిన తర్వాత పై బకాయిలను ఎవరు చెల్లిస్తారన్నది స్పష్టం చేయటం లేదు. ఇపుడు కెస్కో ఉద్యోగులు పోగుపడిన తమ పి.ఎఫ్. మొత్తాలనే కాక, ఫించన్లను కూడా కోల్పోనున్నారు. విద్యుత్‌రంగంపై ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాల బారిన ఉద్యోగులు, వినియోగదారులు ఎలా పడనున్నార నేందుకు కాన్పూర్ యూనిట్ ప్రైవేటీకరణ అందరికీ ఉదా॥గా నిలుస్తోంది.

అయితే ప్రభుత్వం వెన్నుపోటు చర్యలలో 'కెస్కో' స్థాపన ఒక్కటి మాత్రమే కాదు. ఫిబ్రవరి 2న 12 విద్యుత్ యూనియన్లతో కూడిన సంస్థ అయిన విద్యుత్ కర్మచారి సంయుక్త సంఘర్ష సమితి జనవరి 27న తమతో కుదుర్చుకున్న 14 అంశాల ఒప్పందాన్ని ఉల్లంఘించి నందుకుగాను ప్రభుత్వాన్ని దుయ్యబట్టింది. సమ్మె చేసిన ఉద్యోగులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన కేసులను ఉపసంహరించు కోకుండా సమ్మె కాలంలో చేసిన ఉద్యోగుల బదిలీలను రద్దు చేయకుండా ప్రభుత్వం మోసగించింది. ఈ విషయమై ముఖ్యమంత్రికి నిరసన తెలుపాలని బయలు దేరిన 12 మంది యూనియన్ నాయకులను దారిలోనే అరెస్టు చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ బోర్డు ఉద్యోగులు మెరుపు సమ్మెలకు దిగి తమ నేతలను విడిపించుకున్నారు.

ఇలా, ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించటానికి, ప్రపంచబ్యాంకు నిబంధనలకు దాసోహం అవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృత నిశ్చయంతో ముందుకు అడుగేస్తున్నాయి. ఈలోగా విద్యుత్ బోర్డును మూడుగా విభజన చేయటమన్నది ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందిస్తుందంటూ రాజకీయ నాయకులు రాసివ్వాలని వైస్ చాన్సలర్లు, ప్రొఫెసర్లు, టీచర్లతో సహా పలువురు మేధావులు డిమాండ్ చేశారు. నిజానికి సమ్మె విరమణ జరిగి ఉద్యోగులు పనిలోకి దిగిన తర్వాత సమ్మెదార్లు సమ్మెలను విచ్ఛిన్నం చేసిన వారిపై, అధికార్లపై దాడి చేసి కొట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఘర్షణలు జరిగాయి. భవిష్యత్తులో జరిగే మిలిటెంట్ కార్యక్రమాలకు ఇది సంకేతంగా నిలుస్తోంది.

## రేవు కార్మికుల సమ్మె

2000 సం॥రం జనవరి 18న దేశ వ్యాప్తంగా 11 ప్రధాన రేవులలో లక్షలాది మంది రేవు కార్మికులు సమ్మెకు దిగారు. వేతనాల పొడిగింపును, సర్వీస్ పరిస్థితులలో మెరుగుదలను కోరుతూ దేశ వ్యాప్తంగా 5 నౌకా, ఓడరేవు సమాఖ్యలకు చెందిన కార్మికులు సమ్మె పిలుపిచ్చారు. ప్రభుత్వం రూపొందిస్తున్న 'సంస్కరణ'లను సైతం వీరు వ్యతిరేకించారు. ఎందుకంటే ఈ సంస్కరణలు విస్తృతమవటం ద్వారా వారికి మరింతగా భారం పెరగగలదు. ఈ డిమాండ్ల తిరస్కరణ సమ్మెకు నాంది పలికింది.

ఈ సమ్మె సంపూర్ణంగా జరిగింది. అయితే మరోసారి ప్రభుత్వం కార్మిక శక్తిని లొంగదీసేందుకు కఠిన పద్ధతులను ప్రారంభించింది. సమ్మె కాలంలో నౌకా, ప్రాంతీయసేన (టెరిటోరియల్ ఆర్మీ)లకు చెందిన బలగాలను రేవులను కాపాడేందుకు పిలిపించారు. ఓడరేవు కార్మికులతో కఠినంగా వ్యవహరించాలంటూ ఇండియన్ మర్చంట్ చాంబర్ (బడా బూర్జువాల అసోసియేషన్ ఇది) ప్రభుత్వాన్ని త్వరపెట్టింది. ''తరచుగా జరిగే సమ్మెలు రేవులను బాగా దెబ్బతీస్తాయి కాబట్టి రేవు సర్వీసులను అత్యవసర సర్వీసులుగా గుర్తించాలంటూ'' అది నొక్కి పలికింది. ప్రభుత్వం ఇటీవలే ఆఫీసర్లకు 50 నుంచి 80 శాతం దాకా వేతనాలు పెంచగా, కార్మికులకు మాత్రం కేవలం 28 శాతం మేరకే పెంచింది.

కార్మికులను అరెస్ట్ చేసి, పనిలోంచి తొలగిస్తానని ప్రభుత్వం చేసిన హెచ్చరిక యూనియన్ సమ్మె ఉపసంహరణకు దారి తీసింది. రోజుకు 800 కోట్ల రూ॥ల విలువైన ఎగుమతులను ఓడలలోకి భర్తీ చేయాలనే తమకనుకూలమైన అంశాలపై బలంగా బేరమాడటానికి కార్మికులు సిద్ధమైనా, నాయకులు మాత్రం తదుపరి చర్చల కోసం ప్రభుత్వం నుండి పొందిన హామీతోనే సమ్మెను విరమించారు. అయితే ప్రభుత్వం యూనియన్లలో తన చెంచాలను నియమించి కార్మికులలో చీలికను తేవాలని ప్రయత్నించటంతో ఈ ఒప్పందం సైతం వృధా అయిపోయింది. అందుచేత యూనియన్లు 'ఉభయపక్ష వేతన చర్చల కమిటీ'తో సమావేశాన్ని ఫిబ్రవరి 2న బహిష్కరించాయి. ''ప్రాముఖ్యత లేని పెద్దగా గుర్తింపులేని' యూనియన్లకు చెందిన ఇద్దరు ప్రతినిధులను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించడం ద్వారా ప్రభుత్వం జిత్తులకు, బుద్రమార్పిడి చర్యలకు పాల్పడిందని వారు ఆరోపించారు.

## లాయర్ల సమ్మె

దేశ వ్యాప్తంగా 10,000 కోర్టులలోని 6 లక్షల మంది లాయర్లు వారం నుండి, నెల దాకా దఫ దఫాలుగా సమ్మెలకు దిగారు. భారతీయ న్యాయవాద వృత్తి చరిత్రలోకెల్లా ఈ సమ్మె కనీవినీ ఎరుగనట్టిది. జిల్లా, లేక తాలూకా స్థాయి కోర్టులు సైతం ఈ సమ్మె కార్యాచరణ ప్రభావానికి గురి కాకుండా పోలేదు. దేశమంతటా లాయర్లు కోర్టులను బహిష్కరించారు, ర్యాలీలు జరిపారు, మానవ హారాలను ప్రదర్శించారు. నిరసన బ్యాడ్జీలను ధరించారు. నిరాహార దీక్షలను పాటించారు. పోస్టర్లు, ప్లేకార్డులతో బహిరంగ సభలు జరిపారు. రాస్తారోకోలు చేశారు. న్యాయ శాఖా మంత్రి గడ్డిబొమ్మను తగుల బెట్టారు. చివరకు పోలీసులతో వీధి పోరాటాలకు సైతం దిగారు. ఢిల్లీలోని సుప్రీంకోర్టు మొదలుకుని తాలూకా, మండల స్థాయిలోని అతి చిన్న కోర్టుల దాకా గల న్యాయవాదులందరూ బి.జె.పి. ప్రభుత్వం న్యాయవాద వృత్తిపై విధించాలని చూస్తున్న అప్రజాస్వామికమైన, సామ్రాజ్యవాద అనుకూల మార్పులకు వ్యతిరేకంగా ఏకమై కదిలారు. అనేకమంది లాయర్లకు బి.జె.పి./ఆర్.ఎస్.ఎస్.లతో సంబంధాలు వున్నాకానీ పౌర న్యాయస్మృతిలోనే ఫాసిస్ట్ చట్టాలను రుద్దడానికి, ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆదేశాలతో దేశంలోకి విదేశీ న్యాయ సంస్థలను అనుమతించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలతో పోరాడేందుకు గాను వీరంతా ఒక్కటై కదిలారు.

‘99 నవంబర్‌లో పార్లమెంటు ఉభయ సభలూ ఆమోదించి, ప్రస్తుతం అమలు చేయడానికి చూస్తున్న సివిల్ ప్రొసీజర్ కోడ్‌కి సంబంధించిన 40 సవరణలను వ్యతిరేకిస్తూ లాయర్లు మొదట్లో కదిలారు. ఈ సవరణలు స్వభావరీత్యానే కిరాతకమైనట్టివి. ఇవి ఎమర్జెన్సీ కాలంలో తెచ్చిన మార్పులను గుర్తుకు తెస్తాయి. ఈ సవరణ వాస్తవంగానే కోర్టులో అప్పీలు చేసుకునే హక్కును సైతం లేకుండా చేయాలని చూసింది. ఈసవరణలే కనుక అమలులోకి వస్తే పౌరులను సింగిల్ జడ్జి తీర్పుల దయాదాక్షిణ్యాలకు వదిలిపెడుతూ సివిల్, రిట్ అంశాలలో అప్పీలు చేసుకునే హక్కు కూడా లేకుండా పోతుంది. ఏకంగా సుప్రీంకోర్టులో మాత్రమే అప్పీలు చేసుకోవాల్సి వుంటుంది. దేశ పౌరులలో చాలా మందికి ఇది అందుబాటులో లేదు. (సుప్రీంకోర్టు ఢిల్లీలో మాత్రమే వుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుప్రీంకోర్టు శాఖలను ప్రారంభించడాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది).

దీనికి తోడుగా అనేక చిన్న చిన్న కేసులలో రెండోసారి అప్పీలుకు ఈ సవరణలు వ్యతిరేకత తెల్పుతున్నాయి. దావా పత్రాన్ని లేక, రాతపూర్వక ప్రకటనను ఒకసారి సమర్పించాక వెనక్కు తీసుకోవడాన్ని ఇది వ్యతిరేకిస్తోంది. కోర్టు ఇంజెంక్షన్ (నిషేధ ఉత్తర్వు) పరిధిని ఇది కుదించేస్తోంది. చివరకు సాక్షులను క్రాస్ పరీక్ష చేసే అధికారాన్ని కోర్టుల నుండి, లాయర్ల నుండి మార్చివేయడానికి సైతం ఇది ప్రయత్నిస్తోంది. సాక్షుల క్రాస్ పరీక్షను కోర్టు ద్వారా కాక, కోర్టు రూమ్ అవతల మరొక స్థలంలో వుండి పనిచేసే కమీషనరు ద్వారా (కోర్టు ద్వారానే నియమింపబడతారు) రికార్డు చేయాలని ఈ సవరణ చట్టం ప్రకటిస్తోంది.

లాయర్లు కేవలం పౌర న్యాయస్మృతికి సంబంధించిన ఈ సవరణలనే కాదు, 1961 అడ్వొకేట్ల చట్టంలో 18 మార్పులను సూచిస్తూ భారతీయ లా కమీషన్ పంపిణీ చేసిన పత్రాన్ని సైతం వ్యతిరేకిస్తున్నారు. ఈ మార్పుల ద్వారా ప్రభుత్వం దేశంలో విదేశీ లాయర్లు ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతించాలని చూస్తోంది. సర్వీసులపై డబ్ల్యు.టి.ఓ. ఒప్పందం 2005 నాటికి టెలికామ్, భీమా రంగాలలోనే కాకుండా న్యాయ సర్వీసులలోనూ తలుపులు తెరచి వుంచాలని పిలుపిస్తున్నందువల్ల ఇదేమంత ఆశ్చర్యం గొల్పించదు. 2005 నాటికన్నా ముందే తన సామ్రాజ్యవాద యజమానులను సంతృప్తి పర్చాలని బానిస ప్రభుత్వం కోరుకుంటోంది. లాయర్స్ యాక్ట్‌కి చేసిన మరొక సవరణ ప్రకారం, లాయర్లు తమ లైసెన్స్‌లు పునరుద్ధరించుకోవడానికి గాను తప్పనిసరిగా ప్రతి సం॥రం తాజా పరీక్షలకు సిద్ధపడాల్సి వుంటుంది. ఇది ఏ ప్రజాతంత్ర ఉద్యమంలో అయినా చురుగ్గా పనిచేసే లాయర్లకు వ్యతిరేకంగా ప్రభుత్వం ప్రయోగించే వేధింపుకు సంబంధించిన రూపమే.

ఇలాంటి కిరాతక చర్యలకు, దేశ ప్రయోజనాలకు నగ్నంగా తలపెట్టబోతున్న ద్రోహాలకు వ్యతిరేకంగా లాయర్లు మిలిటెంట్ చర్యలతో వీధుల్లోకి రావాల్సి వచ్చింది. తమిళనాడు, కర్నాటకలలో ఫిబ్రవరి 14 నుండే లాయర్లు కోర్టుల బహిష్కరణను మొదలు పెట్టేశారు. అధికారుల నుండి ఏ స్పందనా లేక పోవటంతో చెన్నై లాయర్లు ఫిబ్రవరి 22న మానవహారంగా ఏర్పడి యూనియన్ న్యాయశాఖా మంత్రి గడ్డి బొమ్మను తగులబెట్టారు. తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 24న దేశ వ్యాప్త కోర్టుల బహిష్కరణకు, పార్లమెంట్ వద్దకు ప్రదర్శనగా పోవడానికి పిలుపిచ్చింది.

ఫిబ్రవరి 24న దేశ వ్యాప్తంగా లాయర్లు సమ్మెకు దిగారు. దేశం నలుమూలల నుండి వేలాదిమంది లాయర్లు పార్లమెంట్ ముందు ప్రదర్శనలో పాల్గొన్నారు. లాయర్లు మరింత ముందుకు పోకుండా నిరోధించేందుకు పోలీసులు రోడ్డుకడ్డంగా వాహనాలను నిలబెట్టారు. దొమ్మీలను అరికట్టే తరహాలో సిద్ధమై వారు లాయర్లు ముందుకు రావాలని చూసినపుడు సంపూర్ణ దాడిని మొదలెట్టారు. లాయర్ల పైకి పంపు నీటిని, టియర్ గ్యాస్‌ని వదిలారు. రెచ్చిపోయిన ప్రదర్శనకారులు పోలీసులపైకి రాళ్ళు విసిరి కొద్దిమంది సీనియర్ పోలీస్ అధికార్లతో సహా 20 మంది పోలీసులను గాయపర్చారు. అడ్డంకులను తొలగించుకుంటూ పార్లమెంట్ వైపుగా తరలివెళ్ళడానికి ప్రయత్నించారు. అప్పుడు పోలీసులు క్రూరంగా లాఠీచార్జీకి పాల్పడి 80 మంది లాయర్లను గాయపర్చారు. జర్నలిస్టులను, ఫోటోగ్రాఫర్లను సైతం వారు వదలలేదు.

తర్వాత భారతీయ న్యాయవాదుల మండలి లాఠీ చార్జీలో పాల్గొన్న పోలీసు అధికారులకు వ్యతిరేకంగా చర్యను డిమాండు చేస్తూ నిరవధిక సమ్మెకు పిలుపిచ్చింది. దేశవ్యాప్తంగా లాయర్లు లాఠీచార్జీని ఖండిస్తూ వీధుల్లోకి వచ్చారు. చెన్నైలో అడ్వొకేట్లు, లా స్టూడెంట్లు ఈ లాఠీచార్జీని ఖండిస్తూ న్యాయశాఖామంత్రి రాజీనామాను కోరుతూ రద్దీగా వుండే యన్.యస్.సి. బోస్ రోడ్డుమీద రాస్తారోకో చేశారు. మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఇంకా దక్షిణ భారతదేశ వ్యాప్తంగా కూడా ప్రధాన నగరాలలోనే కాక చిన్న చిన్న జిల్లా టౌన్లలో సైతం లాయర్లు కోర్టు ఆవరణల్లో నినాదాలు చేస్తూ న్యాయశాఖా మంత్రి, ప్రధానమంత్రి గడ్డిబొమ్మలను తగులబెట్టారు. లాయర్లతో చర్చించకుండా నూతన శాసనాలను అమలు చేయమంటూ న్యాయశాఖా మంత్రి దిగి వచ్చేంత వరకూ సమ్మె వారం రోజులపాటు కొనసాగింది. అయితే లాఠీచార్జీలో పాల్గొన్న పోలీసు అధికారులపై చర్య తీసుకోవడానికి ప్రభుత్వం అంగీకరించక పోవటంతో ఢిల్లీ హైకోర్టు, దిగువ కోర్టులు న్యాయవాదులు తాము మార్చి మధ్య నుండి విడత విడతలుగా నిరాహార దీక్షకు కూర్చుంటామని ప్రకటించారు. పోలీసులపై చర్య తీసుకోకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఆంధ్రప్రదేశ్‌లో సమ్మెల పరంపర

ఆంధ్రప్రదేశ్‌లో నూతన శతాబ్ది జూనియర్ డాక్టర్ల సమ్మెతో మొదలైంది. ప్రజలను నానారకాల వేషాలతో, పథకాలతో మోసగించి రెండోసారి అధికారంలోకి వచ్చేశానని, ఇక తనకు తిరుగులేదని విర్రవీగిపోతున్న చంద్రబాబు సరిగ్గా జనవరి ‘జన్మభూమి’లోనే జూనియర్ డాక్టర్ల సమ్మెను ఎదుర్కోవాల్సి వచ్చింది. దాదాపు పదేళ్ళుగా తేలకుండా మిగిలివున్న సమస్యల పరిష్కారం కోసం జనవరి తొలివారం నుంచి 20 రోజులపాటూ జూనియర్ డాక్టర్లు నిర్వహించిన సమ్మె ప్రభుత్వాన్ని ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంత ఇరకాటంలో పడేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రలో తమకిస్తున్న స్టైఫండ్ కడు హీనంగా వుందని, ప్రతి రెండేళ్ళకోసారి 15 శాతం మేరకు స్టైఫండ్ మొత్తాన్ని పెంచాలని గతంలో చేసుకున్న ఒప్పందాన్ని ప్రభుత్వం బేఖాతరు చేసిందంటూ ఇంకా ఇతర డిమాండ్లతో జూ.డాక్టర్లు సమ్మెకు దిగారు. ఈ 20 రోజుల సమ్మె సందర్భంగా డాక్టర్ల వృత్తిపై బురదజల్లుతూ, వారికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతూ, మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తూ తెలుగుదేశం ప్రభుత్వం సాగించిన చాణక్యనీతికి హద్దుల్లేకుండా పోయాయి. చేయని పనులకు, కేవలం పబ్లిసిటీ కోసం,

***(దేశవ్యాప్త సమ్మెలు : తరువాయి 10 వ పేజీలో.....)***

# పార్టీలో మహిళల, విప్లవ మహిళా ఉద్యమాభివృద్ధికి ఆటంకంగా వున్న పితృస్వామిక, పురుషాధిక్యతా భావజాలాలకు వ్యతిరేకంగా పోరాడుదాం!

*(సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ, ప్రజా గెరిల్లాలు ఒక ఉద్యమప్రాంతంలో జరుపుకున్న మార్చి 8, 2000సం॥ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా కామ్రేడ్ గణపతి (కేంద్రకమిటీ కార్యదర్శి) ప్రసంగ పూర్తి పాఠం ప్రచురిస్తున్నాము)*

కామ్రేడ్స్!

మనం ఈరోజు అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం జరుపుకొంటున్నాము. నేడు మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం. ఇది నూతన శతాబ్దిలో ప్రపంచవ్యాప్తంగా శ్రామిక మహిళలు, కమ్యూనిస్టులు జరుపుకొంటున్న మొదటి శ్రామిక మహిళా దినోత్సవం. శ్రామిక మహిళలు గత వర్గ సమాజాలు అన్నింటిలోనూ పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో ఎడతెగకుండా పోరాటాలు కొనసాగిస్తూ వచ్చారు. ముఖ్యంగా చైతన్యవంతులైన కార్మికవర్గ మహిళలు ఆధునిక యుగంలో పితృస్వామ్యానికి మూలమైన మొత్తం పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించి, స్త్రీ పురుష అసమానతలు లేని నూతన సమున్నత వర్గ రహిత సమాజాన్ని నెలకొల్పటానికి సుదీర్ఘకాలంగా కొనసాగిస్తూ వచ్చిన అనేకమైన బ్రహ్మాండమైన పోరాటాల్లో అనేక గొప్ప విజయాలు సాధించటంతోపాటు కొన్ని పెద్ద ఓటములు కూడా పొందారు. ప్రత్యేకంగా 20వ శతాబ్దంలోని 3వ పాదం వరకు శ్రామిక మహిళలు సాధించిన అపూర్వమైన విజయాలను స్ఫూర్తిగా తీసుకొంటూనే గత 50 సం॥లలో పొందిన ఓటముల నుండి పాఠాలు నేర్చుకొని 21వ శతాబ్దాన్ని విముక్తి శతాబ్దంగా, స్త్రీ పురుష అసమానతలకు, సకల దోపిడీ పీడనలకు తావులేని నూతన ప్రపంచాన్ని నిర్మించే శతాబ్దంగా మలచటానికి కంకణబద్ధులమౌతామని శపథం చేయాల్సిన రోజిది.

కామ్రేడ్స్!

మనమందరం స్త్రీ పురుష కమ్యూనిస్టులం, ప్రజా గెరిల్లాలం ఒక ప్రత్యేక కర్తవ్య నిర్వహణ కోసం ఇక్కడ కలిసి వుంటున్నాం. మనం వందలు, వేలు, లక్షలాదిమంది ప్రజలతో కలిసి జరుపుకోవాల్సిన ఈ ప్రపంచ శ్రామిక మహిళా దినోత్సవాన్ని ఫాసిస్ట్ శత్రు నిర్బంధం వల్ల కొద్దిమందితో జరుపుకోవలసి వస్తున్నది.

మన పార్టీ నాయకత్వం కింద కొనసాగుతున్న శ్రామిక మహిళా ఉద్యమానికి సంబంధించి ఈరోజుకు ఒక ప్రత్యేకత కూడా వుంది. ఆంధ్ర రాష్ట్రంలో గత 5 సం॥లుగా పదుల సంఖ్యలో కమ్యూనిస్ట్ మహిళా గెరిల్లాలను చంపించిన, తెలంగాణా పల్లె ప్రజలను తన ఆట, పాటతో ఉర్రూతలూగించి చైతన్యపరచిన కామ్రేడ్ బెల్లి లలితను తన కిరాయి హంతక ముఠాచే ముక్కలు ముక్కలుగా (17 ముక్కలు) నరికించిన, లక్షలాదిమంది పేద మహిళల బ్రతుకుల్ని దుర్లభం చేసిన, నరరూప రాక్షసుడు, పరమ క్రూరుడైన ప్రజాశత్రువు, రాష్ట్ర మంత్రి మాధవరెడ్డిని 7వ తేదీ రాత్రి 11 గంటలకు వీర ప్రజా గెరిల్లాలు అంతమొందించి, నూతన శతాబ్దిలోని ప్రథమ శ్రామిక మహిళా దినోత్సవానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రామిక ప్రతినిధులుగా మనమందరం పితృస్వామిక వ్యవస్థకు, దోపిడీవర్గ వ్యవస్థకూ రక్షకుడైన మాధవరెడ్డిని అంతమొందించిన మన వీర గెరిల్లా యోధులకు విప్లవాభివందనాలు పంపాల్సిన అవసరం వుంది.

మన పార్టీ నాయకత్వంలో దేశం నలుమూలలా వివిధ రాష్ట్రాలలో గల పలు విప్లవ మహిళా సంస్థలు, వేలాది శ్రామిక మహిళలు, ప్రజా గెరిల్లా బలగాలు ఈ మహిళా దినోత్సవాన్ని అత్యంత శ్రద్ధాసక్తులతో జరుపుకొంటారు. అలా ప్రపంచం నలుమూలలా అన్ని ఖండాల లోనూ, పలు దేశాలలో విప్లవ కమ్యూనిస్ట్ పార్టీల నాయకత్వం కిందగల అన్ని విప్లవ సంఘాలు, లక్షలాది శ్రామిక మహిళా ప్రజారాసులు మరియు ప్రజా విముక్తి సైనిక బలగాలు ఈ మహిళా దినోత్సవాన్ని నూతనోత్సాహంతో జరుపుకొంటారు. గత సంవత్సర కాలంలో అంటే గత మహిళా దినోత్సవం నుండి ఈనాటి వరకు మన దేశంలోనూ, ఇతర దేశాలలోనూ మహిళా విముక్తి పోరులో, వర్గ దోపిడీ విముక్తి పోరులో నేలకొరిగిన మహిళా వీరయోధులందరికీ, శ్రామిక మహిళలందరికీ అరుణారుణ జోహార్లు చెబుదాం! మహిళా అమరుల ఆశయసాధనకు బిగిపిడికిళ్ళెత్తి ప్రతిన బూనుదాం!

కామ్రేడ్స్!

శ్రామిక మహిళలు తమ విముక్తి కోసం, మొత్తం సమాజ విముక్తి కోసం పెరూ, ఫిలిప్పైన్స్, టర్కీ, నేపాల్, విప్లవ ప్రజాయుద్ధాల్లోనూ మన పార్టీ నాయకత్వంలోనూ మహిళలు అనేక రూపాల్లో పోరాడుతున్నారు. వీరు ఈ పోరాటంలో అసమాన ధైర్య సాహసాలతో పోరాడుతూ ఎనలేని త్యాగాలు చేస్తున్నారు. వర్గ పోరాటంలో, ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక పోరాటాలలో, పలు రహస్య, బహిరంగ ప్రజాసంఘాలలో విప్లవకర సహకార ఉద్యమంలో, సాహితీ సాంస్కృతిక రంగాలలో, పార్టీలో, గెరిల్లా బలగాల్లో, టెక్నికల్ రంగాల్లో, ఇంకా అనేక రంగాల్లో శ్రామిక, మధ్య తరగతి మహిళలు వివిధ స్థాయిల్లో తమవంతు పాత్రను నిర్వహిస్తున్నారు.

మన పార్టీ నాయకత్వంలో దిన దినం శ్రామిక మహిళా సంఘాలు, మహిళా ఉద్యమం బలపడుతూ పెంపొందుతున్నాయి. ఇప్పటివరకూ మన పార్టీ, విప్లవోద్యమం ఈ స్థాయికి చేరుకోవటానికి మహిళల పాత్ర గణనీయంగానే వుంది. వర్గ పోరాటం బలంగా వున్న ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, దండకారణ్య ప్రాంతాలలో మహిళల పాత్ర ప్రశంసనీయంగా వుంది. విప్లవోద్యమం సాపేక్షికంగా బలహీనంగా వున్న కొన్ని ప్రాంతాలలో కూడా మన పార్టీలో 20-25 శాతం మంది మహిళలు పనిచేస్తున్నారు. అయితే మన పార్టీ, మహిళా ఉద్యమ రంగంలో సాధించిన విజయాలు ఏ మాత్రం సరిపోవు. నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా భారత అర్ధవలస-అర్ధ భూస్వామ్య వ్యవస్థను సమూలంగా మార్చివేసి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించటానికి మనం ఇంతవరకూ సాధించిన విజయాలు ఏ మాత్రం సరిపోవు. ఈ రంగంలో మన కృషి ఆరంభం మాత్రమే అనీ; తొలి ప్రయత్నం మాత్రమే అని చెప్పుకోవాలి. గుర్తించాలి. అలా గుర్తించినప్పుడే మహిళా ఉద్యమాన్ని బాగా అభివృద్ధి చేయటానికి, విప్లవోద్యమాన్ని బాగా అభివృద్ధి చేయటానికి సామాజిక విముక్తిని త్వరితం చేయటానికి, అడ్డంకిగా వున్న మన బలహీనతల్ని సరిగా గుర్తించ గల్గుతాం. మనం చేపట్టవలసిన కార్యక్రమాల్ని సరిగా

గుర్తించ గలుగుతాం. దీనివల్ల మన పార్టీలోని రాజకీయ సైద్ధాంతిక, నిర్మాణ, మిలటరీ విషయాలన్నింటిలోనూ, అన్ని స్థాయిలలోనూ మహిళలను సంఖ్య రీత్యానే కాకుండా, నాయకత్వపరంగానూ కూడా అభివృద్ధి చేయటానికి కృషి ఇనుమడింప చేయగల్గుతాం. నేను ఈ సందర్భంగా మహిళా కామ్రేడ్స్ అభివృద్ధికి, మహిళా ఉద్యమ అభివృద్ధికి ఆటంకంగా వున్న, మన పార్టీ ఎదుర్కొంటున్న ఒక ముఖ్యమైన సమస్యను గురించి ప్రసంగించాలనుకుంటున్నాను.

మన ఉద్యమంలోనూ, పార్టీలోనూ, గెరిల్లా బలగాల్లోనూ పితృస్వామిక భావజాలం, పురుషాధిక్యతా భావజాలం ఇంకా చెప్పుకోదగిన స్థాయిలోనే వున్నాయి. ఇవి విప్లవకర మహిళా ఉద్యమ అభివృద్ధికి; పార్టీలో, గెరిల్లా సాయుధ బలగాల్లో మహిళల అభివృద్ధికి తీవ్రంగా ఆటంకం కల్గిస్తున్నాయి. మన పార్టీలో పితృస్వామిక భావజాలం, పురుషాధిక్యతా భావజాలం వున్నాయని చెప్పుకోవట మంటే అర్థం, ముఖ్యంగా పార్టీలో ఉన్నటువంటి పురుష కామ్రేడ్స్‌లో ఈ పితృస్వామిక భావజాలం, ఆధిక్యతా భావం ఉన్నాయనే అర్థం. ఇది ఈ సమస్య యొక్క ఒక ముఖం, ప్రధానాంశం. దీనితోపాటు, ఇందులో భాగంగా మహిళల్లో కూడా మరొక రూపంలో ఈ భావజాలం న్యూనతా భావన రూపంలో కొనసాగుతున్నది. ఇది సమస్య యొక్క మరొక ముఖం, ద్వితీయాంశం, అప్రధానాంశం. మన వ్యవస్థ పితృస్వామిక వ్యవస్థ కావటం వల్ల పితృస్వామిక భావజాలం మొత్తం సమాజంమీద విస్తృతంగా పరచుకొని వుంది. ఇది స్త్రీ పురుషులందరినీ ప్రభావితం చేస్తున్నది. అందువల్లనే పురుషుల్లో ఆధిక్యతా భావం, స్త్రీలలో న్యూనతాభావం నెలకొని వున్నాయి. ఈ రెండురకాల భావనలు అంటే పితృస్వామ్యానికి వున్న రెండు ముఖాలు, ప్రత్యేకంగా పురుషాధిక్యతా భావన విప్లవోద్యమానికి, మహిళల అభివృద్ధికి తీవ్రంగా ఆటంకం కల్గిస్తున్నాయి. అది మహిళలు సంఘాల్లో చేరే విషయంలో కావచ్చు, సంఘాల్లో పనిచేసే విషయంలో కావచ్చు, మన పార్టీలోకి, సైనిక దళాల్లోకి రిక్రూట్ చేసుకొనే దాంట్లో కావచ్చు, వచ్చిన తర్వాత పనిచేయటంలో కావచ్చు అన్ని విషయాల్లో కూడా ఈ రెండు రకాల తప్పుడు భావనలు, ప్రత్యేకంగా పురుషాధిక్యత విప్లవోద్యమానికి తీవ్ర ఆటంకం కల్గిస్తున్నాయి.

చాలామంది పురుష కామ్రేడ్స్ పితృస్వామ్య భావజాలంతో, మన పార్టీలోను, గెరిల్లా బలగాల్లోనూ మహిళలు పురుషులతో సమానంగా పనిచేయలేరు అనే అభిప్రాయాలు, ఏ విషయంలోనూ పోటీ పడలేరు అనే అభిప్రాయాలు వివిధ సందర్భాలలో, వివిధ రూపాలలో వ్యక్తపరుస్తున్నారు. ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని తాము ఈ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నామని వీరు భావిస్తున్నారు. పురుష కామ్రేడ్స్ నుండి ఇలాంటి కామెంట్స్ వెలువడిన ప్రతి సందర్భంలోనూ వివిధ రూపాలలో ఈ కామెంట్స్‌ను మహిళా కామ్రేడ్స్ నిరసించారు. ఈ కామెంట్స్ చేసే పురుష కామ్రేడ్స్‌లో అత్యధికులు తాము మహిళా కామ్రేడ్స్‌ను కించపరుస్తున్నారనో, బాధిస్తున్నారనో భావించటం లేదు. తమ కామెంట్లు వారిలో న్యూనతాభావన పెరగటానికి, పార్టీలో పురుషాధిక్యతా భావన బలపడటానికి తోడ్పడుతున్నాయని భావించటంలేదు. వీరు అనుకోకుండానే (అన్‌కాన్షియస్‌గా) చాలా సులభంగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాల వెనకనున్న భావాలు ఏమిటని గ్రహించలేక పోతున్నారు. మనదేశంలో పురుషులలో వుండే ఈ ఆధిక్యతా భావన, పోటీతత్వం, ఫ్యూడల్ విలువల నుండీ, పెట్టుబడిదారీ విలువల నుండి పుట్టినవని అర్థం చేసుకోలేక పోతున్నారు. అందువల్లనే వీరి దృక్పథం, ఆలోచనలు తప్పుగా వున్నాయి.

కమ్యూనిస్టు దృక్పథం ప్రకారం, కమ్యూనిస్టు విలువల ప్రకారం, ప్రతి కమ్యూనిస్టు, ప్రతి విప్లవ ప్రజా గెరిల్లా సమిష్టి ఆశయసిద్ధి కోసం, నూతన సమాజ నిర్మాణం కోసం విప్లవ పరిపూర్తి కోసం, స్వచ్ఛందంగా, సంపూర్ణంగా తమని తాము సమర్పించుకొని త్రికరణశుద్ధితో తన శక్తి యుక్తులన్నింటినీ వినియోగించి పనిచేయాలని ఆలోచిస్తారు. కామ్రేడ్స్ అంతా తమ శారీరక, భౌద్ధిక శక్తి సమర్థతల్ని సంపూర్ణంగా వినియోగించుకోవటానికి ప్రయత్నిస్తున్నారా లేదా అని పరిశీలిస్తాం. అందుకనుగుణంగా వీరికి అడుగడుగునా తోడ్పడటం పార్టీకి, ప్రత్యేకంగా నాయకత్వానికి బాధ్యతగా వుంటుందని భావిస్తాం. అంతేగానీ స్త్రీ పురుషులు సమానంగా పనిచేస్తున్నారా లేదా అని చూడం. వివిధ రకాలయిన వర్గ, సామాజిక అణచివేతలు కొనసాగుతున్న అర్ధవలస, అర్ధభూస్వామ్య సాంఘిక పరిస్థితులలో, దోపిడీ వర్గాల ప్రయోజనం కోసం మానవ కల్పితాలుగా వున్న తీవ్రమైన సాంఘిక అసమానతలు నెలకొనివున్న పరిస్థితులలో సమున్నతాశయం కోసం ఏర్పడి స్వేచ్ఛగా కృషి చేస్తున్నప్పటికీ కమ్యూనిస్టు పార్టీ దాని సభ్యులుగానీ, పార్టీ నాయకత్వంలో నిర్మించబడి పోరాడుతున్న గెరిల్లా బలగాలలోని సభ్యులుగానీ వారు స్త్రీలుగానీ, పురుషులుగానీ సమానంగా పనిచేయగలరని ఎలా భావిస్తాం?

కమ్యూనిస్టు భావజాలం, రాజకీయాలు ప్రజల మస్తిష్కాలను చైతన్యవంతం చేసిన వెనువెంటనే వారు వేల సంవత్సరాల అణచివేత బానిస సంకెళ్ళు తెంచుకొని ప్రపంచాన్ని తలక్రిందులు చేయగల్గినా, దోపిడీ సమాజంలో మనుషుల మధ్య వుండే కృత్రిమమైన, వికృతమైన అంతరాలను (అసమానతలను) ఛేదించగల్గినా, గతం మోపిన పీడనవల్ల విప్లవకాలంలో విప్లవ సంస్థలోని వ్యక్తుల చైతన్యంలోనూ, శక్తి సమర్థతలోనూ తేడాలు వుంటాయి. విప్లవ కాలంలో కొంతవరకు, విప్లవానంతరం చాలా వరకూ ఇలాంటి తేడాలు తగ్గించ గల్గుతాం. అయినప్పటికీ కమ్యూనిస్టు సమాజంలో కూడా స్త్రీ పురుషుల మధ్య; స్త్రీల మధ్య, పురుషుల మధ్య జీవపరమైన (బయలాజికల్) కారణాలవల్ల, భౌగోళిక వాతావరణ కారణాలవల్ల శారీరక, భౌద్ధిక తేడాలు వుంటాయి. అయితే ఆ తేడాలు క్వాలిటీలోనే నేటి అంతరాలకు భిన్నమైనవీ, సహజమైనవీ, అసమానతలుగా గుర్తించబడటానికి తగని అసమానతలుగా చెప్పబడేటటువంటివి వుంటాయి. ఈ తేడాలు, అసమానతలు మానవుడి విజ్ఞానానికి లోబడి వుండేటటువంటివి కావు.

నేడు మహిళా కామ్రేడ్స్‌లో చాలామంది సాపేక్షికంగా వెనుకబడి వుండటానికి కారణాలను మొత్తం మన పార్టీ, ప్రత్యేకంగా పురుష కామ్రేడ్స్ చారిత్రకంగా పరిశీలించి అర్థం చేసుకోవాల్సి వుంది. విప్లవాచరణలో మహిళా కామ్రేడ్స్ తమ శారీరక, భౌద్ధిక శక్తి సామర్థ్యతలను పూర్తిగా వినియోగించటానికి, వాటిని పెంపొందించ టానికి మొత్తం పార్టీ ఏమి చేయాలనేది, ప్రత్యేకంగా పురుష కామ్రేడ్స్ ఎలాంటి తోడ్పాటునందించాలనే ఆలోచించకుండా, వారిని చులకనగా చూడటంగానీ, కించపరిచే కామెంట్స్ చేయటంగానీ తప్పుడు పద్ధతుల్లో విమర్శించటంగానీ, సరయింది కాదు. ఈ తప్పుడు వైఖరి సమస్యతో సంబంధంలేని పరిష్కార మార్గం చూపించటం లాంటిది. దీనినే మన ప్రజలు సులభమైన భాషలో 'రోగమొకటైతే మందొకటి' అని అంటుంటారు. ఇలాంటి తప్పుడు వైద్య విధానం వల్ల విప్లవోద్యమానికి నష్టం కలుగుతుంది తప్ప ఎలాంటి ప్రయోజనం

నెరవేరదు. మన దేశంలో రెండున్నర వేల సం॥రాలకు పైగా మహిళలు ఏవిధంగా వర్గ అణచివేతతోపాటు పితృస్వామిక అణచివేతకు గురౌతూ వస్తున్నారనే సమస్యతో సంబంధం లేకుండా ఆలోచించే వారు మాత్రమే పురుషాధిక్యతా భావంతో మహిళా కామ్రేడ్స్‌ని చులకనగా చూస్తారు. ఉత్పత్తి సాధనాలు వ్యక్తిగత యాజమాన్య పునాదులపైన ప్రత్యేకంగా పెట్టుబడిదారీ యాజమాన్య పునాదులపైన ఆధారపడి కొనసాగుతున్న ఆర్థిక వ్యవస్థలో వేతన బానిసలైన శ్రామికులు చేసే ప్రతి పని కేవలం సంబంధిత మనుషులకు ఏ మేరకు ఉపయోగ పడుతుందనేది గీటురాయిగా ఉంటుంది తప్ప ఇక్కడ శ్రామికుల ప్రయోజనాలకు గానీ, మొత్తం సామాజిక సమిష్టి ప్రయోజనాలకుగానీ ఎలాంటి ప్రాముఖ్యతా లేదు. అలాగే పెట్టుబడిదారీ వ్యవస్థలో కేవలం వ్యక్తిగత లాభాల కోసం పెట్టుబడిదారుల మధ్య పోటీ, గుత్తాధిపత్యం ఫలితంగా నిరుద్యోగ కార్మికుల మధ్య పోటీ నెలకొని వున్నాయి. వీటి ఫలితంగా సమాజంలో పోటీతత్వం, ప్రతి పని ఏ మేరకు ఉపయోగపడుతుంది అనే భావనలు ఏర్పడుతున్నాయి. మొత్తం సమాజంపై పడుతున్న ఈ పెట్టుబడిదారీ భావనల ప్రభావంవల్ల, మహిళా కామ్రేడ్స్ చేసే పనుల ఉపయోగాన్ని పురుష కామ్రేడ్స్ చేసే పనితో ముడిపెట్టి, పోటీపెట్టి ఆలోచిస్తున్నారు. వీరు సమిష్టి ప్రయోజనాన్ని ఆశిస్తూ కూడా తమకు తెలియకుండానే, మహిళా కామ్రేడ్స్ చేసే పనిని పురుషులు చేసే పనితో ముడిపెట్టి ఆలోచిస్తున్నారు. వెరసి, పితృస్వామిక భావజాలం, పురుషాధిక్యతా రూపంలోనూ, పోటీతత్వం రూపంలోనూ పార్టీలో చోటు చేసుకొని విప్లవోద్యమానికి నష్టం చేస్తున్నదన్నమాట.

నూతన ప్రజాస్వామిక సంస్కృతి గురించి, సోషలిస్టు సంస్కృతి గురించి మన అధ్యయన కృషి వెనుకబడి వుండడం వల్ల ఈ రంగంలో మన అనుభవాలను మన దైనందిన ఉద్యమ పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి వుండక పోవడంవల్ల, ఈ రంగంలో మన పార్టీలో తగినంత విద్య గరపబడలేదు. నిరంతరం మన పార్టీలో చేరుతున్న నూతన శక్తులు సమాజం నుండి ఫ్యూడల్, బూర్జువా సంస్కృతిని, భావజాలాన్ని తమ వెంట మోసుకొస్తూనే వున్నారు. అందువల్ల మన పార్టీలో ఈ రంగంలో ఫ్యూడల్ బూర్జువా భావజాల ప్రభావం కొంత ఎక్కువగానే వుందని చెప్పవచ్చు.

కమ్యూనిస్టు పార్టీలోని ప్రతి మెంబర్ విప్లవ ఆశయం కోసం వర్గపోరాటం ముందుకు తీసుకుపోవటం కోసం, తనను గట్టి కమ్యూనిస్టుగా మలచుకోవటం కోసం చేస్తున్న కృషినీ, ప్రజల ప్రయోజనాలను, సమిష్టి ప్రయోజనానికి ఇస్తున్న ప్రాముఖ్యతనూ మనం గుర్తిస్తే, విప్లవోద్యమానికి వాటి అవసరం ఏమిటనేది సరిగా అర్థం చేసుకోగల్గుతాం. అప్పుడే మహిళా కామ్రేడ్స్ చేసే పనినీ, సాపేక్షికంగా తక్కువగా పనిచేసే ఏ కామ్రేడ్స్ పనినైనా సరిగా అర్థం చేసుకోవటం సాధ్యమవుతుంది. ఈ సమస్యను అర్థం చేసుకోవటానికి సులభంగా వుండే ఒక ఉదాహరణ తీసుకొని చర్చిద్దాం. ఒక కామ్రేడ్ గంటకు 6 కిలోమీటర్లు నడిచాడనుకొందాం. మరో కామ్రేడ్ అదే టెర్రయిన్‌లో, అదే సమయంలో, అంతే బరువుతో 4 కిలోమీటర్లే నడిచాడనుకొందాం. మనం గంటకు 4 కిలోమీటర్లు దూరం నడచిన కామ్రేడ్‌ని చులకనగా చూడకుండా అతను తక్కువ దూరం నడవటానికి అతని శారీరక మానసిక పరిస్థితులను పరిశీలించవలసి వుంటుంది. ఒకవేళ ఆ కామ్రేడ్ తన శారీరక, మానసిక శక్తులను పూర్తిగా వినియోగించలేదని గ్రహిస్తే, అతనిని సరిదిద్దటానికి అవసరమైన సహాయం చేయాల్సి వుంటుంది (శారీరకంగా, రాజకీయంగా శక్తివంతం కావటానికి తోడ్పడటం). ఈ సహాయంలో ఒక భాగం సద్విమర్శ కూడా వుంటుంది.

ఈ విధానం బౌద్ధిక, భావజాల రంగాలకు కూడా వర్తిస్తుంది. సైద్ధాంతిక, రాజకీయ పరమైన తప్పుల విషయంలో నిజాయితీతో కూడిన విమర్శ-స్వయంవిమర్శ, రెక్టిఫికేషన్ ఎడ్యుకేషన్ క్యాంపెయిన్స్ సక్రమ పద్ధతుల్లో నిర్వహించే ఆంతరంగిక పోరాటం కూడా అవసరం అవుతాయి. ఈ విధానం పార్టీలో అంతర్గతంగానూ, ప్రజల మధ్యలోనూ మనం కొనసాగిస్తాం. వున్న తేడా అంతా పార్టీలో ఈ విధానాన్ని మరింత చైతన్యయుతంగా, శక్తివంతంగా అమలు చేయటానికి కృషి చేస్తాం. ఈ విధానం వల్లనే రాజకీయంగా చైతన్యవంతులై ప్రతి పార్టీ మెంబర్ అపారమైన శక్తి సమర్థతలను, సృజనాత్మకతను ప్రదర్శిస్తూ, మనస్ఫూర్తిగా, స్వేచ్ఛగా ఒకరిని మించి ఒకరు పనిచేయగల్గుతారు. ఈ విధానం అవలంభించటం వల్లనే కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనాలో సోషలిస్టు నిర్మాణ కాలంలోను, సాంస్కృతిక విప్లవ కాలంలోనూ మహిళలు ప్రపంచంలో మానవాళి ఎప్పుడూ కనీ వినీ ఎరుగనీ వండర్స్ చేశారు. ఈ విధానాన్ని మనం గట్టిగా అనుసరిస్తే విప్లవకాలంలోనే మహిళలు అలాంటి అద్భుతాలు చేయగలరని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను.

మన పార్టీలోని చాలామంది పురుషులు మహిళా కామ్రేడ్స్‌పట్ల చులకన భావంతో చేసే కామెంట్స్‌తో చాలామంది మహిళా కామ్రేడ్స్ బాధపడుతున్నారు. ఈ విషయంలో పురుష కామ్రేడ్స్‌లో వున్న తప్పుడు అవగాహనను వ్యతిరేకించాల్సిందే! కానీ బాధపడటం వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. ఇక్కడ అసలు సమస్య, తమ శారీరక బౌద్ధిక శక్తులను మహిళలు ఎలా సద్వినియోగ పరచుకోవాలి? వీటిని అభివృద్ధి పరచుకోవటానికి ఏమి చేయాలి? అని ఆలోచించాలి తప్ప పురుషులతో పోటీ పడటం గురించి ఆలోచించగూడదు.

పోటీ కమ్యూనిస్టుల మధ్య కూడా వుంటుంది. కానీ అది బూర్జువా పోటీకి పూర్తిగా చుక్కెదురు. స్త్రీలయినా, పురుషులైనా ప్రతి ఒక్కరూ తమ శక్తి సామర్థ్యతలను నిస్వార్థంగా పూర్తిగా ప్రజలకోసం వినియోగించటంలో పోటీ పడాలి. పనిలో ముందున్నటువంటి వానిని ఆదర్శంగా స్వీకరించి ప్రజలకు సేవ చేయటం కోసం సమిష్టి ప్రయోజనాల కోసం పోటీ పడటం వల్ల ఎంతగానో వినియోగ పడుతుంది. ఈ పోటీ సమాజంలో వ్యక్తివాదానికి, అంతరాలు పెరగటానికి, మానవ భౌతిక వనరులను వృధా చేయటానికి దారితీయదు సరికదా, ఇందుకు భిన్నంగా సమిష్టితత్వం పెరగటానికి, అంతరాలు తరిగిపోవటానికి, మానవ, భౌతిక వనరుల సక్రమ వినియోగానికి చాలా గొప్పగా తోడ్పడుతుంది. చైతన్యవంతమైన ఇలాంటి కృషి ద్వారానే విప్లవం విజయవంతం కావటంగానీ, విప్లవానంతరం పెద్ద పెద్ద అంగలతో సోషలిస్ట్ నిర్మాణం జరగటంకానీ సాధ్యమౌతుంది. అందుకనుగుణంగానే మానవుల బౌద్ధిక, భౌతిక సంపదలు చైతన్యం బ్రహ్మాండంగా పెరుగుతూ నూతన మానవుల ఆవిర్భావం, ఉన్నత కమ్యూనిస్ట్ సమాజం ఏర్పడుతుంది. అప్పుడు కమ్యూనిస్ట్ సొసైటీలో ప్రతి వ్యక్తి తన శక్తి (బౌద్ధిక, శారీరక) కొద్దీ పనిచేస్తాడు/చేస్తుంది. అవసరం కొద్దీ వినియోగించు కొంటాడు/వినియోగించుకుంటుంది. ఈ సూత్రం స్పిరిట్‌తోనే నేడు కూడా మన పార్టీలోని ప్రతి ఒక్కరూ పని చేయాలి. మనం మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి మన దేశ ప్రాంత నిర్దిష్ట పరిస్థితులకు అనువర్తింప జేసుకోవడం ద్వారా వర్గపోరాటంలో పూర్తిగా పాల్గోవటం ద్వారా ఇందుకు ఆటంకంగా వున్న తప్పుడు ధోరణులకు వ్యతిరేకంగా సైద్ధాంతికంగా పోరాడడం ద్వారా, మహిళలను కించపరిచే తప్పుడు

భావాలన్నింటినీ ఓడించి, మహిళల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింప జేయగల్గుతాం. అయితే సైద్ధాంతికంగా శ్రామిక మహిళా ఉద్యమ నిర్మాణానికి, పార్టీ నిర్మాణానికి, గెరిల్లా బలగాల నిర్మాణానికి ఆటంకంగా వున్న, స్త్రీలను చులకనగా చూసే పితృస్వామిక పురుషాధిక్యతా తప్పుడు భావజాలం పార్టీలో తలెత్తే ఇతర తప్పుడు ధోరణుల లాంటిది అని అనుకోకూడదు. పితృస్వామిక భావజాలానికి వున్న చారిత్రక కారణాలను, ప్రత్యేకతనూ సరిగా అర్థం చేసుకోలేకపోతే ఈ భావజాలానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం సక్రమంగా నిర్వహించలేం. పైగా ఈ పోరాటం ప్రక్కదార్లు పట్టి విప్లవోద్యమానికి నష్టం కలుగుతుంది. కాబట్టి, పితృస్వామిక భావజాలాన్ని, ప్రత్యేకంగా పితృస్వామిక ఆధిక్యతా భావజాలాన్ని, స్త్రీలలో వుండే న్యూనతా భావజాలాన్ని సరిదిద్దటానికి ఈ సమస్యపై ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్ని ప్రధానంగా చేయాలి. ఇందుకోసం మనం మరింత లోతుగా ఈ సమస్యను సమీక్షించుకోవల్సిన అవసరం వుంది.

మన దేశంలో ఫ్యూడల్ దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద విధానాలు ఆర్థిక రాజకీయ సైద్ధాంతిక, సాంస్కృతిక తదితర పునాది, ఉపరితల జీవన రంగాలన్నింటితో మిలాఖతై వుండడం వల్ల ఫ్యూడలిజాన్ని ప్రాపుగా చేసుకొని పై రెండు విధానాలు మనగల్గుతున్నాయి. అవి ఫ్యూడల్ భావజాలంపై, సంస్కృతిపై ఆధారపడుతూనే, ప్రజాస్వామిక భావాల సంస్కృతి ముసుగులో దళారీ బూర్జువా సామ్రాజ్యవాద భావజాలాన్ని, సంస్కృతిని, ప్రజలపై రుద్దుతున్నాయి. అందువల్ల నూతన ప్రజాస్వామిక విప్లవ దశలో మనం ప్రజలలో (కార్మికవర్గం, రైతాంగం, పట్టణ మధ్యతరగతి, జాతీయ బూర్జువావర్గం) పార్టీలో ప్రజా సైనిక బలగాలలో, ప్రజాస్వామిక భావాలు, సంస్కృతి వ్యాపింపజేస్తాం. పార్టీలోను, ప్రజా సైనిక బలగాల్లోని అడ్వాన్స్డ్ శక్తులలోనూ ప్రజలలోని పురోగామి సెక్షన్స్లోనూ సోషలిస్ట్ భావాలను, సంస్కృతినీ వ్యాపింప జేస్తాము. ఈ విప్లవ దశలో సోషలిస్ట్ భావాలు, సంస్కృతి సామాజిక పురోగమనానికి ఈ రెండు రంగాలలో నాయకత్వ పాత్ర వహిస్తాయి. భారతదేశంలో ప్రజాస్వామిక భావజాలం సంస్కృతి ముసుగులో నూతన రూపాలలో పితృస్వామిక భావజాలం, సంస్కృతి వికృత రూపంలో రాజ్యమేలుతూ ప్రజల ప్రజాస్వామిక సోషలిస్ట్ భావజాలాలపై క్రూరంగా దాడి చేస్తున్నాయి. అందువల్ల మనం భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరుపుతున్న రాజకీయ పోరాటంతో పాటు సైద్ధాంతిక భావజాల సాంస్కృతిక రంగాలలో పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సిన అవసరం ఎంతో వుంది. పార్టీని అన్నిరకాల విప్లవకర నిర్మాణాలను, ప్రజలను సైద్ధాంతికంగా శక్తివంతం చేయటానికి ఆంతరంగికంగా పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా, సోషలిస్ట్ భావజాలంతో, సంస్కృతిలో సైద్ధాంతిక ఎడ్యుకేషన్, రెక్టిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టవలసిన అవసరం ఎంతో వుందని ఈ నూతన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా గుర్తిద్దాం!

**కామ్రేడ్స్!**

నేడు మన పార్టీలో గెరిల్లా బలగాల్లో మహిళల సంఖ్య చెప్పుకోదగినంత వుంది. ఇవి మన తొలి అడుగులే కావచ్చుగాక, ఇది ప్రాథమికమైన కృషే కావచ్చుగాక, కానీ ఇప్పటికే మనకు ఒక పునాది వుంది. మనం బలపడి అభివృద్ధి చెందగలం అనే దానికి ఇది ఆధారంగా వుంటుంది. దీనిని మనం సరిగా ఉపయోగించుకొంటేే, సైద్ధాంతిక, నిర్మాణ రంగాల్లో మన బలహీనతలు సరిదిద్దుకొంటే మన విప్లవ మహిళా ఉద్యమం బాగా అభివృద్ధి చెందుతుంది. భారతదేశం అధిక జనాభా, ప్రకృతి వనరులు కల్గిన విశాలమైన దేశం కావటం వల్ల, మన పార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధం కొనసాగుతుండటం వల్ల, ఇక్కడ మన విప్లవోద్యమం ప్రపంచ విప్లవోద్యమాలను ఎంతగా ప్రభావితం చేస్తుందో, ఇందులో భాగంగా కొనసాగుతున్న శ్రామికవర్గ మహిళా ఉద్యమం కూడా ప్రపంచ శ్రామిక మహిళా ఉద్యమాన్ని అంతగా ప్రభావితం చేస్తుంది. మన విప్లవం ప్రపంచ సామ్రాజ్యవాదానికి, మన దేశంలో దాని తొత్తులకు వ్యతిరేకంగా కొనసాగుతూండటంతో పాటు, అది ప్రపంచ కార్మికవర్గ విప్లవ పోరాట అనుభవాల నుండి, మొత్తం ప్రపంచ ప్రజల విప్లవ పోరాట అనుభవాల నుండి నేర్చుకొంటూ ప్రపంచ సోషలిస్ట్ అనుభవంలో భాగంగా కొనసాగుతుండటంవల్ల అది ప్రపంచ విప్లవ పోరాటాలను ప్రభావితం చేస్తుంది.

ఈనాడు మన దేశంలోనూ, యావత్తు ప్రపంచంలోనూ గతంలో ఎన్నడూ లేనంత తీవ్రంగా గ్లోబలైజేషన్, లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, రీస్ట్రక్చరింగ్ విధానాల పేరుతో గుప్పెడుమంది ప్రపంచ సామ్రాజ్యవాద పెట్టుబడిదారులు, వారి తొత్తులు, కోట్లాది అశేష ప్రపంచ కార్మిక పీడిత ప్రజానీకంపై అత్యంత అమానుషంగా, క్రూరంగా చేస్తున్న ఈ దాడిని తిప్పికొట్టి తమ అంతిమ సమరం కొనసాగించటానికి, సన్నాహాలు చేసుకోవటానికి 1848 కమ్యూనిస్ట్ ప్రణాళిక కాలం నాటికంటే, గొప్ప ప్యారిస్ కమ్యూన్ రోజుల నాటికంటే, రష్యా, చైనా మహా విప్లవాల కాలంనాటికంటే, గొప్ప కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ కల్లోల కాలంనాటి కంటే, గొప్ప నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు కాలం నాటికంటే అనుకూలంగా వున్నాయి. దినదినం ఈ విప్లవకర భౌతిక పరిస్థితులు దానికి అనుకూలంగా పెంపొందు తున్నాయి. కాలం చెల్లిన ప్రపంచ సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ సేనలకు వ్యతిరేకంగా తుది సమరం కోసం కోటానుకోట్ల అశేష కార్మిక, పీడిత ప్రజా సేనా వాహినులు మోహరించటానికి కావలసిన సన్నాహాలు ఆరంభమై వాటిని పెంపొందించు కొంటున్న విప్లవ కాలం ఇది. ఇందులో భాగంగానే కోటానుకోట్ల అశేష మహిళా కార్మిక పీడిత ప్రజారాసులు యుద్ధ సన్నాహాలు చేసుకుంటున్న. విప్లవకర మహిళా విముక్తి కాలం ఇది. ఇలాంటి విప్లవకర భౌతిక వస్తుగత పరిస్థితులు పెంపొందుతున్న కాలంలో మనదేశంలో విప్లవకర మహిళా ఉద్యమానికి చాలా గొప్ప భవిష్యత్తు వుంది.

**కామ్రేడ్స్!**

ఈ నూతన శతాబ్దాన్ని ప్రపంచ సోషలిస్ట్ విప్లవ శతాబ్దంగా, మహిళా విముక్తి శతాబ్దంగా మార్చటానికి ఈ నూతన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతిన బూనుదాం! ఈ శతాబ్దాన్ని మనం పూర్తిగా వర్గ విముక్తితోపాటు, మహిళా విముక్తి, పితృ స్వామికం నుండి విముక్తి శతాబ్దంగా మార్చటానికి జరిగే విప్లవ ప్రజా పోరాటంలో మన సర్వస్వాన్ని ఒడ్డి పోరాడదామని ఈ నూతన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం సందర్భంగా మరోసారి శపథం చేద్దాం!

ఇప్పటివరకూ ప్రపంచ పెట్టుబడిదారీ విధానానికి, పితృస్వామిక విధానానికి వ్యతిరేకంగా పోరాడుతూ నేలకొరిగిన శ్రామికవర్గ విప్లవకారులందరికీ మరోసారి జోహార్లు చెబుదాం!

రెడ్ శాల్యూట్స్ కామ్రేడ్స్! ❑

అంతర్జాతీయం

# మధ్య ఆసియాలో సామ్రాజ్యవాదుల జూదం
# చెచెన్యాపై రష్యన్ మాఫియా పాలన ఎక్కుపెట్టిన యుద్ధం

'ప్రచ్ఛన్న యుద్ధం' ముగిసిన తరువాత, 'శాంతి సుస్థిరతల నూతన శకం' ప్రారంభ దశలోనే ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో ఒకదాని తరువాత ఒకటిగా ఘర్షణలు బ్రద్దలవుతున్నాయి. ముందుగా పర్షియన్ జలసంధిలో (గల్ఫ్), ఇక ఆ తరువాత ఒకదాని తరువాత ఒకటిగా యుగోస్లేవియా, బోస్నియా, కొసావో, తూర్పుతైమూర్- ఇక ఈనాడు మధ్య ఆసియాలో మంటలు రేగాయి. ఇక్కడ ఆఫ్ఘనిస్థాన్‌తో ప్రారంభమై రష్యాలోని కాకసస్ వరకు ఈ సెగలు ప్రాకాయి. కాగా చెచెన్యా మంటల మధ్యలో చిక్కుకుంది. మధ్య ఆఫ్రికా, నైరుతి ఆఫ్రికా (సౌత్ వెస్ట్) అలానే ఆఫ్రికా కొమ్ము (Horn of Africa) అని పేరుబడ్డ దేశాలు ఇవన్నీ వాటి వాటి సైనిక బలగాల మధ్య చెలరేగిన పరస్పర ఘర్షణలు మోహరింపులతో చెట్టుకో దిక్కుగా చెదిరిపోయాయి. కాగా ప్రస్తుతానికి యావత్ ప్రపంచం దృష్టి చెచెన్యా చుట్టూతానే పరిభ్రమిస్తోంది. ఇక్కడ చెచెన్యా (ఇఖేరియా) అనే చిన్న గూడెం లాంటి దేశాన్ని మాజీ అగ్రరాజ్యం అణచి పారేయదలచింది; ఏమంటే ఈ బుడుత దేశం 1991 నుంచే రష్యా మాజీ అగ్రరాజ్యంపై తిరుగుబాటు జెండా ఎగరేసింది, కనుక ఈ చిన్న దేశాన్ని చిదిమేయడానికి మాజీ అగ్రరాజ్యం అత్యాధునిక ఆయుధ సామాగ్రిని ప్రయోగిస్తూ కరడుగట్టిన నేరస్థ స్వభావంతో దాడికి దిగింది. చెచెన్యాపై రష్యా ఎక్కుపెట్టిన యుద్ధం మరోసారి మనకు జ్ఞాపకం చేస్తున్న సత్యం ఏమంటే ఒకప్పటి సోవియట్ యూనియన్‌లోని రివిజనిస్టులు లెనిన్ భూమిని మాస్కోలోని నిరంకుశ పెట్టుబడిదారీ వర్గపాలనకి అప్పగించేసి దాన్ని వివిధ జాతుల జైలుగా మార్చేశారన్నదే.

1991లో రివిజనిస్టు సామ్రాజ్యం కుప్పకూలి పోయినప్పుడు 18 స్వతంత్ర దేశాలు రంగంమీదికొచ్చాయి. ఈ 18 దేశాలలో అక్కడక్కడి నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలు రాజ్యాధికారాన్ని కైవశం చేసుకొని కొత్త కొత్త సోషల్ డెమొక్రటిక్ నామాలని తగిలించు కున్నాయి. ఇక అప్పటి నుంచి ఈ 18 దేశాలలోని నిరంకుశ పెట్టుబడిదారీ పాలకవర్గాలు ఆయా దేశాల ప్రజలపైన అక్కడి సహజ వనరులపైన తమ పట్టుని బిగిస్తూ వచ్చాయి. కొత్తగా ఏర్పడిన ఈ దేశాలలో చాలా దేశాలు ప్రత్యేక జాతులతో కూడినవే అయి వుండగా మరికొన్ని దేశాలలో ఒకటికి మించిన జాతులు కూడా వుండే కొన్ని ప్రాంతాలు సైతం వుంటున్నాయి. ఖజకిస్తాన్, కిర్గిస్థాన్, ఉజ్బెకిస్థాన్ అనేవి ఏదో ఒకే జాతి (ఏకజాతి) జనాభాతో కూడిన దేశాలు కాగా ఆర్మేనియా, జార్జియా లాంటి మరికొన్ని దేశాలు ఒకటికి మించిన జాతుల ప్రజలతో కూడినవిగా వుంటాయి. కానీ, రష్యా విషయం మరింత సంక్లిష్టమైనది. ఏమంటే ఇది అనేక జాతి సమ్మేళనాల సమాఖ్య! సోవియట్ యూనియన్‌లో వుంటుండిన ఒకప్పటి రిపబ్లిక్‌లకి చెందిన ఆయా బూర్జువా వర్గాలు, నేడు ఆయా రిపబ్లిక్‌లన్నీ కొత్త దేశాలుగా అవతరించడంతో తామే ఈ 'స్వతంత్ర' దేశాల పాలక యజమానులుగా మారిపోయారు. కాగా రష్యన్ సమాఖ్యలోని వివిధ జాతులకి మాత్రం సమాఖ్య నుంచి విడిపోగల వీలు, అవకాశాలు లేకుండా పోయాయి. వీటిలో చాలా జాతులు రష్యన్ యజమానుల చెరనుంచి విముక్తి కావాలనే ఆశిస్తున్నాయి. 1991లోనే రష్యా నుంచి చెచెన్యా విడిపోయి తన స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుని తదుపరి ఎల్సిన్ పాలనతో యుద్ధానికి తలపడి 1994-96 యుద్ధంలో గెలుపొందింది కానీ, యుద్ధాన్ని అంతరింపజేస్తూ రష్యన్ జనరల్ లెబెడ్ ఆధ్వర్యం వహించిన శాంతి చర్చలలో, శాంతి ఒప్పందం సందర్భంగా సదరు ఒప్పందాంశంగా చెచెన్యా స్వాతంత్ర్య సమస్యని చేర్చడానికి రష్యన్ పాలకులు అంగీకరించలేదు. కాని ఆ యుద్ధంలో ఓటమిని అంగీకరించిన రష్యా చెచెన్యాకి రాగల 5 సంవత్సరాల వ్యవధిలో స్వాతంత్ర్యాన్ని ఇవ్వగల ఒక క్రమాన్ని అంగీకరించింది. కాని, యుద్ధం ముగిసి, సదరు ఒప్పందం కుదిరి మూడు సంవత్సరాలు గడచినా కూడా అలాంటి క్రమం గురించి రష్యా అసలేమీ పట్టించుకోకుండా ఒక పథకం ప్రకారం మౌనాన్ని పాటించింది. నిజం చెప్పాలంటే ఎలిట్సిన్ పాలనకు చెచెన్యాకి ఎంతమాత్రం స్వాతంత్ర్యం ఇవ్వడానికి ఇష్టం లేదు, అదును చూసి చెచెన్యాని దెబ్బ తీయడానికే అది కాచుకునుంది.

## నేపథ్యం

ప్రస్తుతం చెచెన్యాపై రష్యా తలపడిన యుద్ధం కేవలం చెచెన్యాకే పరిమితమైనది కాదు, ఇందులో మరిన్ని పెద్ద తీవ్ర సమస్యలే ఇమిడి వున్నాయి. సోషలిస్టు సోవియట్ యూనియన్ రివిజనిస్టు బూర్జువా సామ్రాజ్యంగా పతనం అయిపోయినది లగాయితూ అది ఆ క్షణంనుంచే మరోసారి జాతుల బందిఖానాగా మారిపోయింది. దీనికి ముందు, సోషలిస్టు సోవియట్ యూనియన్‌లో అన్ని రిపబ్లిక్‌లు అలానే వివిధ స్వయంప్రతిపత్తితో కూడిన జాతీయ మైనారిటీ ప్రాంతాలు అన్నీ సమాన ప్రాతిపదికపై గౌరవించ బడటమే కాదు, వాటిలోని అత్యంత వెనుకబడ్డ జాతి బృందాలు తమతమ జాతీయ సంస్కృతుల్ని, భాషల్ని అభివృద్ధి పరచుకోడానికి వీలుగా తదనుగుణంగా బాగా ప్రోత్సహించబడ్డాయి, శతాబ్దాల తరబడిగా అభివృద్ధి నిరోధక రష్యన్ జార్‌ల చేత అణగద్రొక్కబడిన వీరంతా తమతమ భాషా సంస్కృతుల్ని అభివృద్ధి చేసుకునే అవకాశాలు పుష్కలంగా కల్పించబడ్డాయి. జార్ చక్రవర్తుల హయాంలో రష్యాలోని అనేక జాతుల బృందాల గురించి బయటి ప్రపంచానికి ఏమీ తెలీదు, కాని సోషలిస్టు దశలో అనేక కొత్త జాతులు రంగంమీదికొచ్చి అవి పూర్తిస్థాయి జాతులుగా అభివృద్ధి చెందాయి. జార్ హయాంలోని రష్యాలో ఘనత వహించిన రష్యా జాతి మాత్రమే మొత్తం ప్రాంతంలో తన ఆధిక్యతని చాటుకుంటూ వుంటే చెచెన్లు, తాతార్లు, దగిస్తానీలు తదితర అనేక మైనారిటీ జాతులు బృందాలకి చెందిన ప్రజలంతా అల్పమానవులుగాను (సబ్ హ్యూమన్స్) అమాయకులు గాను పరిగణింపబడుతూ వచ్చారు. వారెల్లప్పుడూ చిన్నచూపు చూడబడుతూ రష్యన్ యజమానుల సేవకే వారున్నారన్నట్టుగా చూడబడేవారు. ఈ మహా రష్యన్ ఆధిపత్య దురహంకారానికి వ్యతిరేకంగా బోల్షివిక్ కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది,

తద్వారా సమస్త జాతులు సమానమేనంటూ రష్యన్ కమ్యూనిస్టులు యావన్మంది ప్రజలకు విద్య గరపుతూ విడిపోయే హక్కుతో సహా ఇతర జాతుల స్వయం నిర్ణయాధికార హక్కుని గుర్తించేట్టుగా బోల్షివిక్ కమ్యూనిస్టు పార్టీ కృషి చేసింది. నిజమైన శ్రామికవర్గ అంతర్జాతీయ స్ఫూర్తిని ఆకళింపు చేసుకుంటూ తదనుగుణంగా రష్యన్ కమ్యూనిస్టు పార్టీ మలచబడినప్పుడు మాత్రమే రష్యాలోని శ్రామికవర్గ విప్లవం విజయవంతం కాగలదని లెనిన్ భావించాడు. తదనుగుణంగానే జాతుల సమస్య అనేది రాజ్యాధికారం కోసం సాగే సమగ్ర విప్లవంలో ఒక భాగమేననే స్ఫూర్తితో బోల్షివిక్ పార్టీ పనిచేయాలని లెనిన్ భావించాడు. కనుకనే జాతుల స్వయం నిర్ణయాధికారానికి హామీ పడాల్సిన అవసరాన్ని లెనిన్ గుర్తిస్తూ పార్టీ చేత గుర్తింపజేశాడు. కనుకనే అక్టోబర్ సోషలిస్ట్ విప్లవం విజయం తరువాత ఫిన్లాండ్ అభివృద్ధి నిరోధక బూర్జువా శక్తుల నాయకత్వంలో వుండినప్పటికీ, అక్కడి శ్రామికవర్గ శక్తులు తమ పునాదిని కోల్పోయి నష్టపోయే ప్రమాదం వుందని తెలుస్తున్నప్పటికీ కూడా ఆ రకంగా ఫిన్‌లాండ్ కార్మికవర్గానికి అననుకూలాంశమే అయినా లెనిన్ విడిపోయే హక్కుని ఫిన్‌లాండ్‌కి ఇచ్చేసాడు. ఇదొక రకంగా నష్టదాయకమే కావచ్చు, కాని ఈ రకంగా ఫిన్‌లాండ్‌కి విడిపోయే హక్కుని ఇచ్చేయడం ద్వారా సాధించబడిన మరో పెద్ద విజయం ఏమంటే రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) పట్ల ఇతర జాతులన్నీ తమ విశ్వాసాన్ని మరింత పెంచుకోడానికి అవి స్వచ్ఛందంగానే సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌ల యూనియన్‌లో కలియడానికి దోహదపడింది.

క్రుశ్చేవ్ రివిజనిజం దాన్నంతటినీ తారుమారు చేసేసింది, ఈ కొత్త జార్లు రష్యాని, సోవియట్ యూనియన్‌ని మరోసారి జాతుల బంధిఖానాగా మార్చేశారు. దీనితో జరిగిన విపరిణామం ఏమంటే ప్రభుత్వ పెట్టుబడిదారీ విధానం పుణ్యమా అని 'స్వతంత్ర' జాతి ప్రాతిపదికగా కల్గిన పాలనా వ్యవస్థలను రివిజనిస్టులు సోవియట్ యూనియన్‌లో సుస్థాపితం చేసారు. పెట్టుబడిదారీ విధానం కార్మికవర్గ ఐక్యతని విచ్ఛిన్నం చేసేసి, ఆయా జాతి ప్రజల అభీష్టానుసారంగా అమలులోకి వచ్చిన ఆయా జాతుల ఐక్యతను మొరటుగా తిరస్కరిస్తూ తిరిగి జాతుల సమస్యని కొత్తగా రంగంమీదికి నెట్టింది. ఇకిప్పుడు వర్గ చైతన్యంతో కూడిన శ్రామికవర్గం రంగంలో లేకుండా పోయి జాతుల సమస్య మొత్తంగా బూర్జువావర్గ శక్తుల చేతుల్లో పడిన కారణంగా వారు తమ సహజవర్గ ధోరణికి అనుగుణంగా కార్మికవర్గాన్ని వెనక్కి నెట్టేసి జాతుల సమస్య పరిష్కారం విషయంలో తమ నాయకత్వాన్ని అంగీకరించేట్టు కార్మికవర్గాన్ని మెడలువంచి ఒప్పిస్తున్నారు. ఇలా బూర్జువా వర్గాల నాయకత్వంలో విడివడిన జాతి తానుగా స్వాతంత్ర్యాన్ని పొందిన ఉత్తర క్షణంలోనే రాజ్యాధికారాన్ని అందుకోగానే పచ్చి అభివృద్ధి నిరోధక శక్తిగా అవతరిస్తోంది. రివిజనిస్టు సామ్రాజ్యం కుప్పగూలిన నేపథ్యంతో స్థాపితమవుతూ వచ్చిన, జాతి ప్రాతిపదికతో కూడిన బూర్జువా రాజ్యాల అనుభవం చాటిచెబుతున్న రెండు సత్యాలు ఏమంటే-ఒకటి కేవలం నిర్బంధపూరితంగా భిన్న జాతులు ఒకే రాజ్యం క్రింద ఐక్యం కాజాలవనేది కాగా రెండోది ఏమంటే ఒక జాతిని వేరొక జాతి అణచివేయడాన్ని అనుమతించబోమని అలానే ఒక జాతి ప్రజలపై దోపిడీ సాగబోదనే హామీలు ఇస్తూ అమలు చేయగల సోషలిజం లేకుండా వివిధ జాతుల మధ్య శాంతి సామరస్యాలని స్థాపించడం అసాధ్యం అనే. మాజీ సోవియట్ ఫెడరేషన్‌లో వుంటుండిన (ఇప్పుడు స్వతంత్ర దేశాలుగా మారిపోయిన) దేశాలలోని బూర్జువా శక్తులు తమ ఏలుబడిలో ఇప్పుడు తమ తమ దేశాలలోని శ్రామిక ప్రజల్ని, దేశాలలోని సహజ వనరులన్నింటినీ దోచుకోవడమే కాదు, వారిప్పుడు ఏదో ఒక సామ్రాజ్యవాదంతో మిలాఖత్తు అయిపోతూ తమ తమ దేశాలలో సామ్రాజ్యవాద నిలువు దోపిడీకి తలుపులు బార్లా తెరిచేస్తూ కమీషన్ల కక్కుర్తితో దేశ ప్రజల్ని దేశ సహజ వనరుల్ని సామ్రాజ్యవాద శక్తులకి తాకట్టు పెట్టేస్తుండటం సైతం ఒక పరిణామంగా జరిగి పోతోంది. ఈ తీరులో ఈ కొత్త జాతి రాజ్యాలలోని (నేషన్ స్టేట్స్) శ్రామిక ప్రజానీకం నానా రకాల దోపిడీ శక్తులకి ఫలహారంగా మారిపోతూ తమ తమ దేశాలలోని బూర్జువా వర్గాలకి, వారు మిలాఖత్తయిపోతున్న సామ్రాజ్యవాద శక్తులకి బలిపశువులై పోతున్నారు. ఈ రకంగా మధ్య ఆసియాలో తలెత్తిన ఘర్షణ వాతావరణం సాధారణంగాను, ప్రత్యేకించి చెచెన్యాలో రగిలిన జ్వాల అనేవి, తమ తమ స్వప్రయోజనాల్ని ఆధిపత్యాలని నిలుపుకోడానికి విస్తృతస్థాయిలో తలపడుతున్న వివిధ శక్తులను మన ముందు ప్రదర్శిస్తాయి.

## ఛిద్రమవుతున్న సామ్రాజ్యాన్ని చెచెన్ యుద్ధం ద్వారా కాపాడుకో జూస్తున్న రష్యా

సోవియట్ యూనియన్ కుప్పకూలి పోయిన తరువాత ఎల్సిన్ ఏలుబడి క్రిందికి సువిశాల రష్యన్ ఫెడరేషన్ వారసత్వంగా వచ్చింది. సోవియట్ యూనియన్ క్రింద ఒకప్పుడు వుంటుండిన మాజీ రిపబ్లిక్‌లను పోగొట్టుకున్నప్పటికీ, రష్యా ప్రజల్ని అలానే రష్యన్ ఫెడరేషన్‌లోని మైనారిటీ జాతుల బృందాలని దోచుకుతినే హక్కుని మాత్రం ఎల్సిన్ హయాం నిలబెట్టుకుంది. మారిన కొత్త రాజకీయ రంగంలో మాజీ రిపబ్లిక్‌లలోని ఆయా రివిజనిస్టు దొరలే ప్రస్తుతపు స్వతంత్ర దేశాల్లో ఆయా దేశాల అధినేతలుగా మారిపోయారనే వాస్తవాన్ని మనం మరువరాదు. ఎల్సిన్, చెచెన్యా నాయకుడు దుదయేవ్ (Dudayav) ఉభయులూ కూడా అత్యున్నత స్థాయి పార్టీ నేతలే అనేది మరువరాదు. కాగా ఈ దుదయేవ్ 'చెచెన్యాని పాలించే, చెచెన్యా ప్రజల్ని దోచుకునే హక్కు రష్యన్ బూర్జువాజీకి ఎందుకుండాలి?' అని ప్రశ్నించడంతో ఎల్సిన్-దుదయేవ్‌ల మధ్య ఘర్షణ తీవ్రతరమైంది. 1991 నాటికే దుదయేవ్ చెచెన్యా స్వాతంత్ర్యాన్ని ప్రకటించేసాడు. తదుపరి ప్రథమ చెచెన్యా యుద్ధంలో దుదయేవ్ చనిపోగా అతడి స్థానంలో చెచెన్ జాతీయవాదుల నాయకుడుగా మస్కనోవ్ నాయకత్వాన్ని చేపట్టాడు. రష్యన్ ఏలుబడి దృష్టికోణం నుంచి చూసినట్లయితే ప్రస్తుత చెచెన్యా యుద్ధం అనేది అది చెబుతున్నట్టుగా ముస్లిమ్ ఛాందసవాదులు అనబడే వారికి వ్యతిరేకంగాను, తిరుగుబాటు చేసిన చెచెన్ రిపబ్లిక్‌కి వ్యతిరేకంగాను మాత్రమే ఎక్కుపెట్టబడినది ఎంతమాత్రం కాదు, ఈ రెండింటికి వ్యతిరేకంగానే గాక, ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో, భాగాలుగా వుండిన మధ్య ఆసియా దేశాలన్నింటిపైన రష్యా అమలు చేస్తున్న అప్రతిహత హక్కుకి బయటనుంచి, ఏ వైపు నుంచీ కూడా వ్యతిరేకతని సహించబోమనే హెచ్చరిక, సహించని స్వభావం ఈ యుద్ధానికున్నాయి. చెచెన్యాగాని రష్యా పట్టునుంచి జారిపోయినట్లయితే ఇకప్పుడు మధ్య ఆసియాపై రష్యా పట్టు కోల్పోవడం మాత్రమే కాదు, అదనంగా జరగబోయే

పరిణామం ఏమంటే- దగెస్థాన్, ఒస్సేషియా, ఇంగ్షేసియా, తాతార్‌స్థాన్‌లు సైతం చెచెన్యా దారినే పట్టి పర్యవసానంగా మొత్తం రష్యన్ ఫెడరేషన్ అస్థిత్వమే ప్రమాదంలో పడుతుంది. 1999 సెప్టెంబర్‌లో జరిగిన మాస్కో మందుపాతరల విస్ఫోటనలు రష్యన్ సామ్రాజ్యవాద మాఫియా ఏలికలకు మరింత పెద్ద ఎత్తున దాడి చేయడానికి ఒక వరంలా పరిణమించి పనిచేసాయి.

మధ్య ఆసియా దేశాలలోని ముస్లిం ఛాందసవాద శక్తులు ఆయా దేశాలలో బలపడటంతో మధ్య ఆసియాలో రష్యా ఆధిపత్యానికి ముప్పు ప్రారంభమైంది. ఏమంటే, ఆర్మేనియా, జార్జియాలు మినహా మధ్య ఆసియాలోని ఇతర సి.ఐ.ఎస్. (కామన్ ఇండిపెండెంట్ స్టేట్స్) దేశాలన్నీ ప్రధానంగా ముస్లిం దేశాలుగానే వుంటున్నాయి. ఈ దేశాలలో దశాబ్దాల తరబడిగా అమలులో వుంటూ వచ్చిన బూటకపు సోషలిజం పుణ్యమా అని ఈ దేశాలలోని ప్రజలలో శ్రామికవర్గ దృక్పథం కుదించుకుపోయి, కుంచించుకుపోయి అనేక రకాల అన్యవర్గ భావజాలాలకి, ఫ్యూడల్ భావజాలాలకి గట్టి భూమిక ఏర్పడిపోయింది. సోషల్ సామ్రాజ్య వాదులు అమలు చేస్తూ వచ్చిన ''సోషలిస్టు తరహా శ్రమ విభజన'' పర్యవసానంగాను, రివిజనిస్టు పాలన పర్యవసానంగానూ ఈ దేశాలన్నీ ఆర్థికంగా చాలా వెనుకబాటు స్థితిలో మిగిలిపోయాయి. (ఈ ''సోషలిస్టు తరహా శ్రమ విభజన'' 1960, 70 లలో బ్రెజ్నెవ్ హయాంలో సిద్ధాంతీకరించబడింది) ఈ సిద్ధాంతం వలన ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు విలోమాభివృద్ధికి గురైపోయాయి. ఈ ప్రాంతాలన్నీ పుష్కలమైన సహజవనరులతో కూడినవి, ప్రత్యేకంగా చమురు నిక్షేపాలతో కూడినవి, ఈ నిక్షేపాలని దోచుకోవడం మినహా ఇతరత్రా ఈ ప్రాంతాల అభివృద్ధికి రివిజనిస్టు పాలకులు చేసిందేమీ లేకపోవడంతో అవి ఆర్థికంగా కునారిల్లి పోయాయి. లేకుంటే ఇవన్నీ స్వయంసమృద్ధిని సాధించి వుండేవే! పర్యవసానం ఏమంటే ఈ దేశాలన్నింటి ఆర్థిక వ్యవస్థలు కునారిల్లిపోగా, సామాజిక వ్యవస్థలు వెనుకబాటుతనంతో మిగిలి పోయాయి. 1979లో ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యా పాల్పడిన సైనిక జోక్యానికి ప్రతిస్పందిస్తూ ఆఫ్ఘనిస్థాన్‌లోని మతఛాందస శక్తులు తిరుగుబాటు చేసాయి- ఇందుకు పశ్చిమ సామ్రాజ్యవాద శక్తుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం ప్రోత్సాహం ప్రోద్బలాలున్నాయి. అలానే సౌదీ అరేబియా, పాకిస్థాన్‌ల అందదండలు సైతం వున్నాయి- ఈ తిరుగుబాటు ఈ దేశాలలోని ముస్లిం ప్రజానీకంపై బలమైన ప్రభావాన్ని కలిగించింది. ఈ తిరుగుబాటుతో ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబాన్లు విజయం సాధించడం ఒక కారణంగానూ, అక్కడుండే అపార చమురు నిక్షేపాలు రెండో కారణంగాను అక్కడి చాందసవాద శక్తులు ఉత్సాహాన్ని పుంజుకుంటూ బలపడడం ప్రారంభమైంది. ఆఫ్ఘనిస్థాన్ నుండి అందుతుండే సహాయ సహకారాలతో ఈ మతవాదశక్తులు తిరుగుబాటు ప్రాంతం చెచెన్యాలో తమ బలమైన స్థావరాలను ఏర్పరచుకుని 1999 ఆగస్టు చివరిలో కిర్గిస్థాన్‌లో వుంటుండే జపానీ శాస్త్రవేత్తల ఇంజనీర్ల పరిశోధనా బృందంపై దాడికి తలపడ్డారు. కిర్గిస్థాన్‌లో చమురు వనరుల నిక్షేపాలను కనుగొని వాటిని పటంపై ఎక్కించే (మ్యాపింగ్) నిమిత్తం అక్కడ విడిదిచేసి వున్న ఈ జపాన్ ఇంజనీర్ల బృందాన్ని ముస్లిం పోరాటవాదులు కిడ్నాప్ చేసి బంధీలుగా చేసుకున్నారు. దీంతో ఖంగుతిన్న కిర్గిస్థాన్ అధికార్లు ఇస్లామిక్ గెరిల్లాల చేతిలో బందీలైన ఇంజనీర్లను విడిపించుకోడానికి మధ్య ఆసియా దేశాలని అలానే రష్యాని కూడా సహకరించమని అర్థించారు. అడిగిందే తడవుగా రష్యా తన యుద్ధ విమానాలతో ముస్లిం గెరిల్లా స్థావరాలపై పెద్ద ఎత్తున దాడిచేసి ముస్లిం గెరిల్లాలు తమ కిర్గిజ్ స్థావరాలను విడిచి వెనక్కి పోయేటట్టు నెట్టింది. రష్యాతో మాత్రమేగాక ఇతర సామ్రాజ్యవాద శక్తులతో సైతం కిర్గిస్థాన్ పాలకాధిపతులు తమ వ్యాపార పారిశ్రామిక సంబంధాలని విస్తృత పరచుకోవాలని విస్తరించుకోవాలని ప్రయత్నిస్తున్నారనే వైనాన్ని ఈ కథనం తేటతెల్లం చేస్తుంది, కాగా, కేవలం రష్యా మాత్రమే కిర్గిస్థాన్ పాలనాభద్రతకి రక్షణకి హామీ పడగలదని, ఏమంటే అక్కడ పెరుగుతున్న ముస్లిం చాందసవాద ప్రమాదాన్ని ఇతర శక్తులేవీ ఎదుర్కోజాలవని రష్యన్‌లు నమ్మించ ప్రయత్నించారు. పాశ్చాత్య ప్రపంచం నుండి గాని లేక జపాన్‌నుంచి గాని ప్రత్యర్థులెవ్వరినీ ఆహ్వానించాల్సిన అవసరం లేదని చాటి చెప్పే తీరులో అలాంటి సంకేతం కిర్గిస్థాన్ పాలకులకందించే లక్ష్యంతోనే కిర్గిస్థాన్ తన ఆధిపత్యాన్ని కిమ్మనకుండా అంగీకరింపజేసే లక్ష్యంతోనే రష్యా అతి దురుసుగా దాడి చేసింది. కాని కొద్దిరోజుల తేడాలోనే ఇస్లామిక్ గెరిల్లాలు మరోదెబ్బ వేసారు, ఈసారి రష్యా రాష్ట్రం దాఘెస్థాన్‌పై దాడి చేసారు. ఈ దాడిలో గెరిల్లాలు దాఘెస్థాన్ రాష్టంలోని నాలుగు గ్రామాలతో పాటు నోవోలాక్షి అనే నగరాన్ని సైతం వశపరచుకుని దాఘెస్థాన్‌లో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించనున్నట్లు ప్రకటించారు. దాఘెస్థాన్‌లో ఒక ఇస్లామిక్ రాజ్యం అవతరించడమంటే రష్యన్ ఫెడరేషన్ విచ్ఛిత్తి ప్రారంభమవడమే! అంతేకాదు, దీంతో రష్యాకి నష్టదాయకంగా జరిగే మరో విపరిణామమేమంటే మధ్య ఆసియాలోని చమురు మార్గాలు ముస్లిం గెరిల్లాలకు అందుబాటు లోకి వచ్చేస్తాయి, ఏమంటే మధ్య ఆసియా ప్రాంతం నుంచి రష్యాకు పోయే చమురు పైప్‌లైన్ చెచెన్యా దాఘెస్థాన్‌ల గుండానే పోతుంది.

మారణాయుధశక్తిలో తమకున్న ఆధిక్యతను నిర్విచక్షణగాను, నిర్దాక్షిణ్యంగాను ఉపయోగిస్తూ రష్యన్ బలగాలు దాఘెస్థాన్‌లో తిరుగుబాటు ముస్లిం బలగాలలో చాలా వాటిని రెండు వారాల వ్యవధిలోనే నాశనం చేసేయగా మిగిలిన కొద్దిమంది చెచెన్యా పోయి తలదాచుకున్నారు. ఇది జరిగిన తరువాతనే రష్యాలోని మాస్కో తదితర పట్టణాలలో వరుస బాంబు ప్రేలుళ్ళు సంభవించాయి. దాఘెస్థాన్‌లోని గెరిల్లా స్థావరాలుగా వుండే గ్రామాలపైపడి చేసిన వినాశనానికి ముస్లిం ప్రజలపై జరిపిన మారణకాండకి ఈ ప్రేలుళ్ళు తమ సమాధానమని ఇస్లామిక్ గెరిల్లాలు ప్రకటించారు.

ఇళ్ళు సముదాయం కుప్పకూలిపోయి 300 మంది ప్రజల మరణాలకి కారణమైన బాంబు విస్ఫోటనలతో మాస్కో దద్దరిల్లుతున్న సమయంలోనే ఆసియాలో పరస్పర విశ్వాసం ఏర్పరచుకునే లక్ష్యంతో ఖజకిస్థాన్‌లో ఒక సభ జరుగుతోంది. ఇందులో టర్కీ, పాలస్తీనా, చైనా, ఇరాన్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, మధ్య ఆసియాలోని అన్ని రిపబ్లిక్‌లు, రష్యా, అమెరికాలతో పాటు 16 దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. తాలిబాన్ విజయంతో ముస్లిం ఛాందస ప్రభావాల నేపథ్యంలో ఆ ప్రాంతంలోని ముస్లిం దేశాలన్నింటిని ఒకచోట చేర్చి ఛాందసవాద శక్తుల్ని ఎదిరించి నిలవరించే వ్యూహరచన కోసం అంటూ ఈ 16 దేశాల సమావేశానికి పిలుపివ్వడం జరిగింది. కాని దీని వెనుక పనిచేసిన అసలు సమస్య వేరు. అదేమంటే- ఆ ప్రాంతంలోని సంపద్వంతమైన సహజవనరుల నిక్షేపాలపై అదుపుకోసం

ఆయా దేశాల అభివృద్ధి నిరోధక పాలకవర్గ ముఠాలు వారి వారి వెనుకుండే సామ్రాజ్యవాద శక్తుల మధ్య సాగే పోటీయే సదరు సమావేశానికి అసలు నేపథ్యం అని చెప్పాలి. మధ్య ఆసియా దేశాల పాలకులు, రష్యా అధినేతలు ప్రత్యేకించి పెరుగుతున్న ఇస్లామిక్ శక్తులతో ప్రమాదాన్ని శంకించాయి, కాగా రష్యాకి ఎదురైన ఇంకో బెడద, ఇంకో ముఖ్య సమస్య ఏమంటే మధ్య ఆసియాలోని చమురు నిక్షేపాలపై తన పట్టు సడలిపోతోందనే బాధ. కాగా తన భూభాగంలో సింకియాంగ్‌లోని ఉగోర్ ముస్లింల అసంతృప్తి పట్ల చైనా బెంగతో వుంది, మరోప్రక్క ఆఫ్ఘనిస్థాన్‌కి చెందిన తాలిబాన్లు రష్యా దన్నుతో చెలాయించుకుపోతున్న అహమ్మద్ మసూద్‌ని ఎదుర్కోడానికి రష్యాపై ఒత్తిడి పెంచదలిచారు, అందుకే దాని పెరట్లోనే పొగ పెట్టారు, అదే సమయంలో మధ్య ఆసియాలోని మత ఛాందసవాదుల నుంచి సాధ్యమైనంత ఎక్కువగా లబ్ధి పొందాలని కూడా వారు ఎదురు చూస్తున్నారు. వేరొక ప్రక్క, ఇరాన్ మధ్య ఆసియా ద్వారా పశ్చిమ దేశాలకి చమురు సరఫరాని సుగమం చేస్తూ తద్వారా పెద్ద మొత్తాలలో కమీషన్లను పొందడమేగాక మధ్య ఆసియాలో తన ప్రభావాన్ని పెంచుకోవాలని కూడా వాంఛిస్తోంది. ప్రస్తుతానికి, మధ్య ఆసియాలో ఎక్కువగా నష్టపోతున్నది రష్యానే. కాగా టెర్రరిజంపై తీవ్రంగా విరుచుకుపడుతూ దాఘెస్థాన్, చెచెన్యాల నుండి ముస్లిం తిరుగుబాటుదార్లని తుడిచిపెట్టేస్తానని బెదిరిస్తున్నది సైతం రష్యానే. ముస్లిం తిరుగుబాటుదార్లకి ఆశ్రయం కల్పించినందుకు, నాలుగు గ్రామాలని దురాక్రమించుకున్నందుకు రష్యా చెచెన్యాను తప్పుపడుతూ నిందించింది కాని, అది జరగకపోయిన పక్షంలో కూడా చెచెన్యాపై దాడికి రష్యా వేరు సాకులు వెతికే వుండేది, ఏమంటే రష్యా ఎదుర్కొంటున్న ముఖ్య సమస్య ముస్లిం తిరుగుబాటుదార్లు కానే కాదు, అసలు సమస్యల్లా చెచెన్యా, దాఘెస్థాన్, ఇంగ్సేషియా, తాతార్‌స్థాన్, ఒస్సేషియా అనేవి రష్యా నుంచి విడిపోవడమనేదే, ఈ పరిణామంతో మధ్య ఆసియాలోని సంపద్వంతమైన సహజవనరులపై పట్టు కోల్పోతాననే బెంగ రష్యాని పట్టి పీడిస్తుండగా, వేరొక ప్రక్క మధ్య ఆసియాలోని అపార చమురు సంపదలపై అమెరికా కన్నేసి వుంచింది, మధ్య ఆసియాలో చొరబాటుకి అది మార్గాన్వేషణకి దిగింది. ఈ దిశలో అమెరికా అనేక మార్గాలలో తన ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. కనుక చెచెన్యాలో బ్రద్దలైన యుద్ధం అమెరికాకి దాని ఐరోపా మిత్రులకి రష్యాలో తలెత్తిన అసమ్మతి శక్తులతో నేరుగా సంబంధాలు నెరపుకోడానికి అవకాశం కల్పించింది.

1999 సెప్టెంబర్‌లో చెచెన్యా మెడచుట్టూ రష్యన్ సైనిక బలగాలు ఉచ్చుబిగిస్తున్నప్పుడు, కొంత ఓరిమిని ప్రదర్శిస్తూ సమస్యను సంప్రదింపుల ద్వారా పరిష్కరించడానికి సహకరించాల్సిందిగా రష్యా అధ్యక్షుడు ఎల్సిన్‌కి చెచెన్యా అధ్యక్షుడు మాష్కడోవ్ పదే పదే విజ్ఞప్తి చేస్తూనే వచ్చాడు. కాని ఎల్సిన్ సదరు విజ్ఞప్తుల్ని పట్టించుకోకుండా పెడరసంతో వ్యవహరించాడు. మధ్య ఆసియాలో ఎల్సిన్‌కి ద్వివిధ వ్యూహాలున్నాయి. ఒకటేమిటంటే-తిరుగుబాటు చేసిన చెచెన్ రాష్ట్రం ఏనాటికీ కూడా స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకోలేని తీరులో దాన్ని త్రొక్కి వుంచుతూనే ఆ సమస్యను పరిష్కరించాలనేది-ఈ లక్ష్యంతోనే తన సైనికశక్తులు వీలైనంత తక్కువ నష్టం ఎదుర్కొంటూనే చెచెన్యాని ఎడతెరిపిలేని బాంబు విస్ఫోటనలతో దద్దరిల్లజేసి చెచెన్యా ప్రతిఘటనని నొక్కిపారేసే వ్యూహానికి రష్యా దిగింది. 1991లో గల్ఫ్‌లో, 1999లో సెర్బియాలో అమెరికా చేసిన పద్ధతిలోనే, సుమారు రెండు మాసాలపాటు చెచెన్ ప్రతిఘటనతో నేరుగా తలపడిపోకుండా రష్యా గమ్మున వుండిపోయే వైఖరిని ఒక ప్రక్క పాటిస్తూనే వేరొక ప్రక్క అప్పటికే పూర్తి వినాశనానికి గురై పోయిన ప్రాంతాలను వశపరచుకుంటూ ఆయా ప్రాంతాలలోని ప్రజలంతా చుట్టు ప్రక్కలుండే ఇంగ్సేషియా, దాఘెస్థాన్‌లకి వలసలు పోయేట్టుగా నెట్టుకొస్తూ వచ్చింది. చెచెన్యాలో నివసించే జనాభా కేవలం 12 లక్షలు మాత్రమే! అంటే ఈనాటి భారతదేశ నగరాలలోని ఒక నగర జనాభా అంత! వీరిలో 3 లక్షల మంది రష్యా అదుపులోని ప్రాంతాలలో శరణార్థులుగా వుంటున్నారు. ఆకాశమార్గాన జరిగే వైమానిక దాడుల్ని ఎదుర్కొని త్రిప్పికొట్టగల సామర్థ్యం సాధన సంపత్తి చెచెన్యాకిగాని ముస్లిం తిరుగుబాటుదార్లకిగాని లేవు. కనుక ఇప్పటికే రష్యా చెచెన్యాలోని డజన్ల కొద్దీ గ్రామాలను అనేక పట్టణాలను సైతం వశపరచుకొని ఇకిప్పుడు చెచెన్యా రాజధాని గ్రోజ్నీపై దాడిని కేంద్రీకరించి నిప్పుల వర్షం కురిపిస్తోంది. ఇదేరకంగాను సమఉజ్జీల మధ్య యుద్ధం కానేరదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో (హైటెక్) సాగుతున్న ఈ యుద్ధం పూర్తిగా ఏకపక్ష యుద్ధమనే చెప్పాలి, ఇందులో చెచెన్యా ఓటమి నిస్సందేహం! కనుకనే చెచెన్ అనువంశిక లక్షణాలు (ఆరిజిన్) వుండే రష్యాలోని తన స్వంత మనుషుల్ని పంపి, (వీరు రష్యా మాజీ పార్లమెంటు సభ్యులు కూడా,) చెచెన్యాలో తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్టు రష్యా ప్రకటించింది. (ఈ పెద్ద మనుషులంతా 1994-96 నాటి యుద్ధంలో తమ పార్లమెంటు సభ్యత్వాన్ని పదవుల్ని కోల్పోయి ఇకప్పటినుంచి రష్యాలో ఊరకే పడున్నారు). కనుక చెచెన్యాని రష్యా స్వాధీన పరచుకుంటే వీరంతా నిఖార్సయిన చెచెన్యా కీలుబొమ్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని రష్యాకి అందిస్తారు.

కాగా, రష్యా వ్యూహంలోని రెండో అంశం ఏమంటే-మధ్య ఆసియాలో రష్యా ప్రయోజనాల పరిరక్షణ కోసం అది బయటివారి జోక్యాన్ని ప్రతిఘటించి తీరుతుందని ఎల్సిన్ ప్రపంచ శక్తులకి (సామ్రాజ్యవాదులకి) స్పష్టం చేయదలిచాడు. అయితే ఈ రెండు లక్ష్యాలను కూడా రష్యా సాధించగలదా అనేది ప్రశ్నార్థకమే! ఏమంటే, మధ్య ప్రాచ్యాన్ని (మిడిల్ ఈస్ట్) ఆఫ్ఘనిస్తాన్‌ని, ఆఫ్రికాని, తూర్పు యూరోప్‌ని పోగొట్టుకోవడంతో, మధ్య ఆసియాలో రష్యా ప్రయోజనాలకు ముప్పు ఏర్పడటం మాత్రమే కాదు, ఇకిప్పుడు అది తన స్వంత సరిహద్దుల్ని కాపాడుకోడానికే నానాతంటాలు పడాల్సిన స్థితిలో పడింది. కనుక చెచెన్యాను పాదాక్రాంతం చేసుకోడానికి పరమ అనాగరిక పద్ధతుల్లో దాని విధ్వంసానికి రష్యా దిగిందంటే దాని నేపథ్యం ఇదే!

కాగా రష్యా ఈ యుద్ధంతో సాధించదలచిన మరో ముఖ్యమైన స్వల్పకాలిక ప్రాధాన్యతాంశం కూడా వుంది. చెచెన్యాతో యుద్ధానికి ముందు ఎల్సిన్ పాలన రష్యన్ ప్రజానీకంలో బాగా భ్రష్టు పట్టిపోయింది. దాని అవినీతి చర్యలు, ప్రభుత్వ ఆస్తుల నుంచి, ప్రభుత్వ ఖజానానుంచి కోట్ల కోట్ల డాలర్లను అది దిగమింగేయడం, ఇంకోపక్క వివిధ మాఫియా ముఠాలతో కుమ్మక్కు కావడం ఇదంతా తన స్వంత గడ్డమీదనే తీవ్ర సమస్య అయి కూర్చుంది. ఈ కారణంగా 2000లో జరిగే ఎన్నికలు ఎల్సిన్ వర్గానికి ఒక వాటర్లూ యుద్ధమే అయి వుండేది (అంటే ఓటమి పాలయ్యేవారు) కాని, చెచెన్యాపై

యుద్ధాన్ని రుద్దడంతో ఎల్సిన్ అతడి ప్రధాని పుతిన్ జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టి తద్వారా రష్యన్ ప్రజల్లో కొంత పలుకుబడిని కూడగట్టుకోగలిగారు. ఎల్సిన్‌ని అభిశంసించాలని పట్టుపట్టిన వారంతా చప్పబడిపోయి అతడి సరసన చేరిపోయారు. ఈ తీరులో చరిత్ర పూర్తిగా వెనక్కి తిరిగిపోయింది, లెనిన్ కాలంలో లెనిన్ నేతృత్వంలో శ్రామికవర్గ రాజకీయాలు విజయవంతంగా ఎదిరిస్తూ నిలవరిస్తూ వచ్చిన 'మహా రష్యన్ తత్వం' అనేది రష్యన్ సామాన్య ప్రజల మస్తిష్కాలని మరోసారి మసకబార్చింది. రోగకారక క్రిమికీటకాదుల్ని, చెత్తా చెదారాల్ని మాత్రమే రివిజనిజం పండించగలదనే సత్యాన్ని నేటి రష్యా దండోరావేసి మరీ చాటుతోంది. సాధారణ అమెరికన్ జాతీయ దురహంకారులకి మల్లే ఇతర ప్రజానీకాన్ని అణచివేయడం ద్వారానే ఔన్నత్యం సిద్ధిస్తుందనే దురహంకార దురవగాహనతో రష్యన్ జనసామాన్యం మస్తిష్కాలని మలినపరిచేశారు. తమ పుత్రుల, సోదరుల శవాల పెట్టెలు యుద్ధరంగం నుండి తిరిగి రావటం సంభవించనంత వరకూ ఈ మకిలి అలాగే కొనసాగుతుంది.

## జాతీయ మైనారిటీ ప్రాంతాల వైఖరి

మహా గొప్పదిగా చెప్పబడే రష్యన్ జాతి ప్రజలను ఏమార్చి వారంతా చెచెన్యాపై ఎల్సిన్ హయాం ఎక్కుపెట్టిన నేరపూరితమైన దాడులు న్యాయమేనని నమ్మేట్టు చేసినప్పటికీ, ఆ దాడులలో అమలవుతుండే పాశవికత అనేది జాతీయ మైనారిటీ బృందాలని మాస్కోలోని ఫెడరల్ ప్రభుత్వానికి మరింత దూరం చేసేయడం తథ్యం! చర్చలద్వారా సమస్యని పరిష్కరించుకోవాలని అస్లాన్ మస్కడోవ్ చేసిన విజ్ఞప్తిని మొరటుగా తిరస్కరించడం ద్వారా ఎల్సిన్ హయాం తన ఫాసిస్టు అనాగరిక స్వభావాన్ని నగ్నంగా బయట పెట్టుకుంది. ఇస్లామిక్ గెరిల్లాల్ని ఎదుర్కోవడానికి సంబంధించి మస్కడోవ్ ఎల్సిన్‌తో ఒక అవగాహనకు రావాలని నిజంగానే తలపోసాడని అనిపిస్తుంది. గెరిల్లా శక్తులపై పెద్దగా పట్టులేని మస్కడోవ్ గెరిల్లాల్ని నిలవరించడంలో రష్యన్ పాలనకి ఒక ప్రక్క సహకరిస్తూనే ఇంకో ప్రక్క చెచెన్యా స్వతంత్రంగానే వుండాలని కూడా ఆశిస్తున్నట్లు కనబడుతుంది. కానైతే ఎల్సిన్ అతడి ప్రధాని పుతిన్ బుర్రల్లో తొలుస్తున్న పురుగు వేరు కనుకనే మస్కడోవ్ చర్చల కోసం నిరంతరాయంగా చేస్తూ వచ్చిన విజ్ఞప్తుల్ని వారు తిరస్కరించారు. తరువాత మానవతావాద ప్రాతిపదికపై సమస్యలో, పరిస్థితిలో జోక్యం చేసుకోవాలని మస్కడోవ్ ''అంతర్జాతీయ సమాజం''ని ఆహ్వానించాడు.

రష్యన్ ఫెడరేషన్‌లో రిపబ్లిక్‌లుగా వుండే ఒస్సేషియా, దాఘెస్థాన్‌లు ఎల్సిన్ మస్కడోవ్‌ల మధ్య దౌత్యం నెరపడానికి ముందుకొచ్చాయి, కాని ఆ ప్రయత్నాల్ని ప్రతిపాదనల్ని కూడా ఎల్సిన్ తిరస్కరించాడు. నిజం చెప్పాలంటే ఆ రెండు రిపబ్లిక్‌లు కూడా మాస్కోకి దూరంగా జరిగిపోతూ ఈ సంక్షోభంలో మస్కడోవ్‌కి చేయూతనివ్వాలనే వాంఛించాము.

మరో రిపబ్లిక్ అయిన తాతార్‌స్థాన్ ప్రభుత్వం అయితే చెచెన్యాకు వ్యతిరేకంగా సాగే పోరాటంలో పాల్గోడానికి తాతార్ ప్రజల్ని పంప బోమని రష్యన్ పాలకులకి స్పష్టం చేసింది. ఇలాంటి తీరు భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలలో మనం చూడగలగటం ప్రస్తుతానికి అసంభవమైనట్టిదే, కాని రష్యాలో మాత్రం జాతీయ మైనారిటీలు దృఢమైన స్వాతంత్ర్యేచ్ఛతో ముందుకు రావడం ప్రారంభమైంది.

చెచెన్యా నుంచి వరదలా వచ్చిపడిన 2 లక్షల మంది పై చిలుకు శరణార్థుల్ని ఇముడ్చుకోడానికి ఇబ్బంది పడుతున్న ఇంగ్సేషియా (ఇంగ్సేషియా స్వంత జనాభా కేవలం 3 లక్షలే) అంతర్జాతీయ సహకారం కోసం ఐక్యరాజ్య సమితిని అభ్యర్థించింది. అయితే ఇలాంటి సందర్భాలలో ఐక్యరాజ్య సమితి పోషించగల పాత్రేమిటో, ఎలా వుంటుందో బాగా తెలిసివున్న రష్యా అధినేతలు ఇందులో సమితి జోక్యాన్ని అనుమతించలేదు. ఇవన్నీ స్పష్టపరుస్తున్న వాస్తవం ఏమంటే రష్యన్ ఫెడరేషన్‌లోని రిపబ్లిక్లన్నీ కూడా రష్యా చేతుల్లో తమ భద్రతకి హామీ లేదనే భావిస్తున్నాయి. కనుకనే చెచెన్యా యుద్ధం సందర్భంగా ఈ నాలుగు రిపబ్లిక్‌లు తమ అభిప్రాయాలను బహిర్గతపరుస్తూ రష్యాకు ఈ యుద్ధం వినాశనకారి కాగలదనే భావించాయి.

చెచెన్ జాతీయవాద ఉద్యమ ఛాంపియన్‌గా మస్కడోవ్ తననితాను ప్రదర్శించుకున్నప్పటికీ, అవకాశం అంటూ వస్తే అతడు తప్పనిసరిగా పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద రాబందులతో మిలాఖత్తయిపోయి చెచెన్ దేశ సంపదల్ని, సహజవనరుల్ని ఆ రాబందులకి ఆహారంగా అందించగల ఘనుడే! ఒకప్పటి సోషలిస్టు దేశాలన్నింటిలోను సోషలిజం వెనుకడుగేసి వున్న ప్రస్తుత పరిస్థితుల్లో, బూర్జువా జాతీయవాదశక్తులనేవి ఎక్కువకాలం నిలబడజాలని స్థితిలో వుంటూ చివరికి వారు తమ రాజకీయ స్వాతంత్ర్యాన్ని డాలర్లకి తాకట్టు పెట్టేసి, సామ్రాజ్యవాదులకి దాసోహమైపోయి, తిరిగి జాతీయ బానిసత్వంలోకి జారిపోతాయి. కనుక జాతీయవాదానికి ఆచరణయోగ్యం ఆమోదయోగ్యం అయిన తదుపరి మెట్టు సోషలిజమే, కాని జాతీయ పోరాటంలో శ్రామికవర్గం నాయకత్వ స్థానంలో వుండి ఆ పాత్ర పోషించకుండా ఇది అసాధ్యం, అనూహ్యం!

పైగా, యుద్ధం ఒక ప్రక్క కొనసాగుతుండగానే, అజర్‌బైజాన్, జార్జియా, మరియు కజఖిస్థాన్‌లు యూరోప్‌కు మధ్య ఆసియానుంచి చమురుని సరఫరా చేసేందుకు ఒక పైపులైన్‌ను వేయాలనే ఒప్పందాన్ని టర్కీతో చేసుకున్నాయి. ఇది రష్యాకి అశనిపాతం లాంటిదే! ఇది జరిగిన మరునాడే రష్యన్ విదేశాంగమంత్రి ఇరాన్‌కి పరుగెత్తి ఒక ఉమ్మడి ప్రతివ్యూహ రచనకు దిగాడు, ఏమంటే ఈ ఇరు దేశాలు కూడా 'టర్కీ అమెరికాల చేతుల్లో' చమురు ఒప్పందాల విషయమై అనూహ్యమైన దెబ్బలు తిన్నాయి. ఇంకా అదనంగా జరిగిన ఇంకో పరిణామం ఏమంటే రష్యాతోనూ మరో ఐదు సంబంధిత రాజ్యాలతోనూ కుదుర్చుకుని వున్న సమిష్టి భద్రతా ఒప్పందంలో భాగస్వాములైన అజర్-బైజాన్, జార్జియా, ఉజ్బెకిస్తాన్‌లు దాంట్లో తమ భాగస్వామ్యాన్ని పునరుద్ధరించుకోడానికి కొనసాగించడానికి తిరస్కరించాయి. కాగా జార్జియా 'నాటో'లో కలియాలని కూడా కోరుకుంది. ఈ పరిణామపరంపరతో పశ్చిమ ప్రపంచం మొత్తంగా లబ్ధి పొందే స్థితిలో వుండగా, రష్యా మాత్రం ఒకదాని తరువాత ఒకటిగా దాని దుర్గాలను పోగొట్టుకొంటోంది. తమతమ దేశాలలోని వ్యతిరేక శక్తుల్ని ఆంతరంగిక భద్రత రక్షణ పేరుతో ఢీకొని నిలవరించడానికి ఈ మధ్య ఆసియా దేశాలు రేపు భవిష్యత్తులో 'నాటో'లో చేరగల అవకాశాలున్నాయి, కాగా అక్కడ పశ్చిమ

దేశాల ప్రయోజనాలను నెరవేర్చడానికి 'నాటో' సంతోషంగానే ముందుకొస్తుంది. ఈ దేశాలకి పెట్టుబడులవసరం, సాంకేతిక పరిజ్ఞానం అవసరం, తమ తమ దేశీయ ఉత్పత్తుల అమ్మకాల కోసం మార్కెట్లకి మౌలిక సదుపాయాల కల్పన అవసరం. ఈ అవసరాలన్నీ తీరాలంటే ఆర్థిక సంక్షోభం ఊబిలో ఊపిరాడకుండా దిగబడిపోయిన రష్యా వల్ల కాదు. కనుకనే ఈ దేశాల పాలక ముఠాలన్నీ తమ తమ దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థల్ని స్థాపించడానికి పశ్చిమదేశాల సహాయానికి మోరలెత్తాయి, తద్వారా తమ దేశాలలోని అపార సహజవనరులన్నింటినీ దోచుకోవచ్చని అభిలషించాయి. ఈ దేశాల పాలకులంతా తమ తమ దేశాలలోని ప్రజల్ని దోచుకుతింటూ వారిని అణచివుంచడానికి పశ్చిమ సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లగలవారే ననడంలో సందేహం లేదు.

రష్యా ప్రజలు అలానే రష్యన్ ఫెడరేషన్‌లో భాగస్వాములైన వివిధ జాతుల బృందాలకు చెందిన ప్రజలు ఈనాడు సామ్రాజ్యవాద దేశాలలో ప్రజాస్వామ్యంగా చెలామణి అయిపోతున్న బూటకపు ప్రజాస్వామ్య ఫలాల్ని రుచి చూస్తున్నారు. ఏమంటే అది ప్రజాస్వామ్యం ముసుగులో చెలాయించుకుపోతున్న అమానుషమైన పెట్టుబడిదారీ వర్గ పాలన తప్ప వేరుకాదు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పాటుపడిన ఛాంపియన్‌గా శ్లాఘిస్తూ పశ్చిమ ప్రపంచమంతా 1992 లో ఎల్సిన్‌ని ఆకాశానికెత్తింది. నేటి చెచెన్యా, దాఘెస్థాన్‌లు ఎల్సిన్ ప్రజాస్వామ్యం ఎంతటి భయంకరమైనదో స్వానుభవంగా చవిచూస్తున్నాయి. ఇవేకాదు రష్యన్ ఫెడరేషన్‌లోని భాగస్వామ్య పక్షాలుగా వుండే వివిధ జాతుల బృందాలకి ఎల్సిన్ ఏమేరకు ప్రజాస్వామ్య హక్కులు కల్పిస్తున్నాడో కూడా చెచెన్యా, దాఘెస్థాన్‌లు చూస్తున్నాయి. సోషలిజం కుప్పకూలిపోయిన తరువాత మధ్య ఆసియా దేశాలలో ఎల్సిన్ అతని అనుయాయులు క్రూరనియంతలుగా ముందుకొచ్చిన వైనాన్నే ఇవన్నీ తేటతెల్లం చేస్తున్నాయి.

## చెచెన్యాలో యుద్ధం-అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్‌ల వైఖరి

అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్‌లు సంపద్వంతమైన వనరులతో నిండివున్న మధ్య ఆసియాలోకి చొరబడటానికి మార్గాల్ని అన్వేషిస్తూనే వున్నాయి. కాగా, రష్యన్ ఏలుబడి స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థతో చెట్టాపట్టాలేసుకు తిరగడం ప్రారంభించాక ఆర్థిక సంక్షోభంలో చిక్కిపోయిన కారణంగా మధ్య ఆసియాలోని చాలా దేశాలు తమ తమ దేశాలలోని వనరుల్ని దోచుకోడానికి పశ్చిమ ప్రపంచం వేపు చూడటం ప్రారంభమైంది. కనుకనే కిర్గిస్థాన్ జపాన్‌ని ఆహ్వానించింది. మధ్య ఆసియానుంచి చమురుని తరలించడానికి తనని బయటకు పోయే ద్వారంగా (ఎక్జిట్) వుపయోగించుకోమంటూ ఇరాన్ యూరోపియన్ యూనియన్‌కి ఎంతగానో నచ్చజెప్పింది. టర్క్‌మెనిస్థాన్- ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దులు అలానే టర్క్‌మెనిస్థాన్-ఇరాన్ సరిహద్దుల పహరా నిమిత్తం రష్యా సహకారంతో రష్యన్ సైనికుల్ని వాడుకోడానికి వీలుగా టర్క్‌మెనిస్థాన్ రష్యాతో గతంలో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. చెచెన్యాలో యుద్ధం బద్ధలైన నేపథ్యంలో సదరు ఒప్పందాన్ని మరోసారి పునరుద్ధరించరాదని దాంట్లో ఇకపై కొనసాగరాదని టర్క్‌మెనిస్థాన్ నిర్ణయించింది. రాను రాను మధ్య ఆసియా దేశాలన్నీ రష్యాకి దూరంగా పోతూ వాటి వాటి ప్రస్తుత పాలకులంతా పశ్చిమ దేశాలతో తమ బంధాల్ని సంబంధాల్ని ముడివేసుకోడానికి తహతహలాడుతున్నారు. ఇక పశ్చిమ సామ్రాజ్యవాదుల విషయానికొస్తే రష్యన్ ఆధిపత్యాన్ని వ్యతిరేకించే ప్రతి దేశాన్ని వారు మెచ్చుకోలుగా భుజం తడుతూ భవిష్యత్‌లో ఏదో రోజు రష్యన్ రాజ్యంలోకి చొరబాటుకి ఎదురు చూస్తున్నారు. ఇంతవరకు తమకు తలుపులు మూసి వేయబడిన ప్రాంతాలలోకి ప్రవేశించడానికి ఏ చిన్న అవకాశం దొరికినా దాన్ని జారవిడచుకోకుండా వినియోగించుకునే తీరులో పశ్చిమ సామ్రాజ్యవాదులున్నారు. 1979లో అయతుల్లా ఖొమైనీ నాయకత్వంలోని ఇస్లామిక్ విప్లవంతో ఇరాన్‌ని పోగొట్టుకున్న అమెరికా, ఇప్పుడు రష్యన్ల నుండి ఆఫ్ఘనిస్థాన్‌ని సాధించి పాకిస్థాన్‌ని, తాలిబాన్ పాలనని ఉపయోగించుకుంటూ మధ్య ఆసియాలోని ప్రవేశానికి మార్గం సుగమం చేసుకుంటోంది. అయితే ఒసామా బిన్‌లాడెన్ వ్యవహారంతోను అలానే ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన సైనిక కుట్ర పర్యవసానంగాను అమెరికాకు కొంత పరిస్థితి అననుకూలంగా మారినా, చెచెన్యాలో రగిలిన యుద్ధం మాత్రం దానికి వరంగానే పరిణమించింది.

అనేక దేశాల ప్రజల రక్తంతో తన చేతులు మలినపరచుకున్న అమెరికా, 1991 గల్ఫ్ యుద్ధం తరువాత సుమారుగా ప్రతిదినం ఇరాక్‌పై బాంబుల వర్షం కురిపిస్తూనే వస్తున్న అమెరికా, అరవై రోజులు పైగా ఎడతెగని బాంబుదాడులతో సెర్బియాని చిన్నాభిన్నం చేసేసిన అమెరికా ఇక ఈనాడు గురివింద నీతులు వల్లిస్తూ చెచెన్యా విషయంలో ''సంయమనాన్ని వివేచనని'' ప్రదర్శించాల్సిందిగా రష్యాకి విజ్ఞప్తి చేస్తోంది. చెచెన్యాలోని యుద్ధం కారణంగా ''ఆ ప్రాంతంలో సుస్థిరతకి మరింత ప్రమాదం ఏర్పడుతుంది'' అని అమెరికా దేశీయాంగ శాఖ అధికార ప్రతినిధి జేమ్స్ రూబిన్ రష్యాని హెచ్చరిస్తున్నాడు.

'మానవ మారణహోమాన్ని నిలవరించడానికి' చెచెన్యాలో యుద్ధానికి స్వస్తి చెపుతూ 'ఇతర మార్గాలని అన్వేషించాలి' అని యూరోపియన్ యూనియన్ సైతం రష్యాకి హితవు చెబుతోంది. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు వల్లిస్తున్న ఈ హితవచనాలు అనేవి మాస్కోడోవ్‌కి, ఇంగ్సేషియా నాయకులకి తాము వారికి బాసటగా నిలవనున్నామనే సంకేతాలు అందించడానికే! ఈ హిత వచనాలు విన్న తక్షణమే 'చెచెన్యాలో యుద్ధాన్ని అంతం చేయడానికి' సహకరిస్తూ ముందుకు రావాలని దుర్మార్గమైన నాటోని అభ్యర్థించాడు మస్కోడోవ్!

'సంయమనం పాటించాలి' అని, 'మానవ మారణహోమాన్ని ఆపాలి' అని ప్రపంచ నరహంతకులు మరో నరహంతక మూకకి విజ్ఞప్తి చేయడం అనే వింతనే ఇక్కడ మనం చూస్తాం. ఈ రకంగా ప్రపంచ సామ్రాజ్యవాద నరహంతక ముఠాలు కల్లోల చెచెన్యాపై తమ వల విసురుతున్నారు. ఇగేరియన్ల కష్టాలతోను కడగండ్లతోనూ ఈ సామ్రాజ్యవాదులకెలాంటి పనిలేదని వీటిపట్ల వారికెలాంటి సానుభూతి లేదని అందరికీ అర్థం అయ్యేదే. వారి నీచ ప్రయత్నమల్లా, నీచ పథకమల్లా కష్టాల్లోపడ్డ చెచెన్యాని కబ్జా చేయడమే! ప్రజలు చేపట్టే ప్రతి నిజాయితీతో కూడిన సాయుధ పోరాటాలపై టెర్రరిజం ముద్ర

*( 41 వ పేజీ తరువాయి.....)*

ఏరియా రైతాంగ, దళిత, గిరిజన కార్మిక పోరాటాలను ప్రారంభించి వాటికి నాయకత్వం వహించాడు. యానాది గిరిజనులకు తక్కువ కూలీ ఇచ్చి దోపిడీ చేస్తున్న భూస్వాములపై పోరాటం చేసి కూలిరేట్లు పెంచటం జరిగింది. చిందేపల్లి భూస్వామి రామస్వామి యానాది స్త్రీలపై చేసే లైంగిక దోపిడీపై ప్రజాకోర్టు నిర్వహించి వాడి చేతిలో బానిసగా వున్న ఒక గిరిజన బాలికను విడిపించి, వాడికి దేహశుద్ధి చేసి, 10 వేల రూ॥లు నష్టపరిహారం కట్టించాడు. ఒక ఫ్యాక్టరీలో కార్మికుల సమస్యలపై అనేకసార్లు యూనియన్ నాయకత్వంలోనే అనేక సమ్మెలు నడిపించి డిమాండ్లు సాధించాడు. తిమ్మాపురం వెలమ, రెడ్డి భూస్వాములు దళితులపై చేసే దాడులకు వ్యతిరేకంగా దళితులను కదిలించి భూస్వాములకు దేహశుద్ధి చేశాడు. కోవనూరు భూపోరాటంలో 110 ఎకరాల (గతంలో దళితుల చేతవున్న ఈ భూమిని భూస్వాములు అక్రమంగా ఆక్రమించగా) భూమిపైకి దళితులను కదిలించి, వారి భూమిని వారికే స్వాధీనం చేయటం జరిగింది.

కా॥ శంకరన్న మిలటరీపరంగా కమాండర్‌గా ధైర్య సాహసాలను చూపేవాడు. స్వతహాగా సున్నితమైన శరీరం, అలవాటులేని గ్రామీణ వుద్యమ జీవితం అనే పరిమితులను దాటి నడకను, బరువులు మోయడంలోను పట్టుదల చూపేవాడు. సైద్ధాంతిక, రాజకీయ విషయాలను క్యాడర్‌కు అర్థమయ్యేలా ఒక టీచర్‌గా క్లాసులు నిర్వహించి, వారి చైతన్యాన్ని పెంచటానికి కృషి చేసేవాడు. జైలులో నేర్చుకున్న హోమియో వైద్యం-ఏరియాలో ప్రజలకు అందించటానికి, ప్రజలకు సేవ చేయటానికి అంకిత భావాన్ని ప్రదర్శించేవాడు.

కుటుంబంలో తాను ఒక్కడే కొడుకు అయి, తండ్రి కుటుంబంపట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి గాలికి వదిలేసినా, తనతో ఎంతో అనుబంధాన్ని పెంచుకున్న తల్లి, ముగ్గురు చెల్లెళ్ళు నిరంతరం అనేక బాధలతో తల్లడిల్లినా విప్లవం పట్ల చలించని దీక్షతో ముందుకే నడిచాడు.

కాళంగి ఏరియాలో ఉద్యమం ముందుకెళ్ళే క్రమంలో కా॥ శంకరన్న 1999 ఏప్రిల్ 5వ తేదీన అనారోగ్య కారణంగా బయటకు వెళుతూ వేర్పేడు మండల కేంద్రంలో ఒక ఇన్‌ఫార్మర్ ఆచూకీ ద్వారా అరెస్టయి, తీవ్రమైన చిత్రహింసలకు గురై హత్య చేయబడ్డాడు. 6వ తేదీ తెల్లవారు జామున దళ ఏరియాలోనే శవాన్ని పడవేసి పోలీసులు ఎన్‌కౌంటర్ కథ అల్లారు. శవం దగ్గరికి ఎవరినీ రానీయకుండా, కనీసం తల్లిదండ్రులకు శవాన్ని ఇవ్వకుండా పోలీసులే ఖననం చేశారు. దీనికి నిరసనగా ఏప్రిల్ 17వ తేదీన జిల్లా బంద్ పాటించారు. దళ ఏరియాలో గ్రామాల్లో, వూరేగింపులు, సభలు నిర్వహించారు. కా॥ శంకరన్న లేని లోటు జిల్లాలో పూడ్చలేనిది. ఆశయ సాధన కోసం చివరి వరకు నిలిచిన కా॥ సురేష్ జీవితం విద్యార్థి, యువజనులందరికీ ఆదర్శప్రాయం. ❑

---

వేసి వ్యతిరేక ప్రచారానికి లంఖించేది ఈ నయవంచకులే! ఒసామా బిన్‌లాడెన్ కథనాలతో, ముస్లిం ఛాందసవాదంపై అవాకులు చవాకులతో ప్రసార మాధ్యమాల ద్వారా ఊదరగొట్టిస్తూ ఆయా పోరాటాలు అన్నింటిని అణచేయాల్సిన అవసరం గూర్చి నిత్యం గొంతు చించుకునేది ఈ ఆషాఢభూతులే! పశ్చిమ దేశాల మద్దత్తు కూడగట్టడానికి ఎల్సిన్ ప్రారంభంలో ఇస్లామిక్ ఛాందసవాదం అనే తురుపుముక్కని ప్రయోగించదలచాడు. అయితే ఈ తురుపుముక్క అనుకున్న తీరులో కలిసిరాకపోవడంతో పశ్చిమ దేశాల నాయకుల్ని ఆషాఢభూతులుగా అభివర్ణిస్తూ వారి ద్వంద్వ ప్రమాణాల్ని దుయ్యబడుతూ ''ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో వారికి తలదూర్చే హక్కు లేదు'' అంటూ అరుపులు ప్రారంభించాడు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి అనధికారవాణిగా వ్యవహరించే ''ది ఇకానమిస్టు' అనే పత్రిక చెచెన్యా సమస్య పరిష్కారానికిగాను రష్యా, యూరోపియన్ భద్రతా శిఖరాగ్ర సభ మధ్యవర్తిత్వాన్ని అభ్యర్థించాలని సలహా ఇచ్చింది. అంతేకాదు, చెచెన్యా విడిపోవడం అనేదే న్యాయమైన పరిష్కారం అని కూడా ఆ పత్రిక వాదించింది, అయితే ఉత్తర ఐర్లాండు విషయంలో మాత్రం ఇలాంటి ''న్యాయమైన పరిష్కారం''ని అది ప్రతిపాదించదు. అమెరికా పాలకులు అలానే యూరోపియన్ యూనియన్ నేతలు మాట్లాడిన మాటలన్నీ నిజమేనని చెచెన్యా ప్రజలు నమ్మివుంటే వారు ఖచ్చితంగా ఈ దేశాలు తమ స్నేహితులనే భావిస్తారు; చెప్పే ఈ మాటలుగాక వీటి వెనుక వారి ఉద్దేశ్యాలు, పథకాలు వాస్తవ ఆచరణ అనే వాటిని గూర్చి చెచెన్యా ప్రజలు సాలోచనగా పట్టించుకుంటే మాత్రం ప్రపంచం మొత్తంపై వారి వారి పాత్రలు వైఖరులు పట్టించుకుంటే, ఇటు రష్యాలోనే కాదు అటు అమెరికాలోను యూరోపియన్ యూనియన్‌లో సైతం తమకు నిజమైన మిత్రులు లేరనే సత్యాన్ని చెచెన్యా ప్రజలు గ్రహించకపోరు. వారికక్కడుండేది శత్రువులు మాత్రమే! అయితే వారిలో కొందరు బయటపడి వున్నారు, కొందరు ఇంకా మరుగున వున్నారు. గుహలోంచి ఎలుగ్గొడ్డు బయటకొస్తే పులి లోపలికొస్తుంది. కనుక ఈ విషవలయాన్ని అంతటినీ ఛేదిస్తూ లోపలి బయటి శత్రు మూకలన్నింటినీ ఎండగడుతూ రివిజనిస్టు మాజీ నాయకుల తీర్పుల్ని చర్యల్ని అన్నింటినీ తిరగరాస్తూ శ్రామికవర్గ రాజకీయాల్ని ఆధిపత్య స్థానంలోకి తెస్తూ మరోసారి సోషలిస్టు పథంలోకి ప్రవేశించడంలోనే చెచెన్యా ప్రజలకి నిజమైన పరిష్కారం విముక్తి మార్గం అనేవి వున్నాయి. ఇతర ఏ మార్గాన్ని చేపట్టినా అది గుడ్డిగా ఎవరో ఒక దోపిడీశక్తిని, దొంగని అంటకాగడానికే దారి తీస్తుంది, చీకట్లోకే అది తీసుకెళుతోంది. చెచెన్యా ప్రజలు అలానే మధ్య ఆసియా రిపబ్లిక్‌ల ప్రజలంతా మహా రష్యన్ జాతి దురహంకారానికి వ్యతిరేకంగా పీడిత జాతులు చేసే న్యాయమైన, అవసరమైన పోరాటాలని సమర్థిస్తూ, అంతకంటే ఘనత వహించిన ఇతర సామ్రాజ్యవాద శక్తుల కుట్రకుహకాల పట్ల కూడా నిరంతర అప్రమత్తతో మెలగాల్సిన అవసరం వుంది.

❑

# విరుద్ధాంశాల మధ్య ఐక్యతకు సంబంధించిన

విరుద్ధాంశాల మధ్య ఐక్యతకు సంబంధించిన గతితార్కిక అవగాహనను అనుసరిస్తూ, శ్రామికవర్గ నియంతృత్వ సిద్ధాంత సమస్యపై ఛైర్మన్ మావో అందించిన ముఖ్య సందేశం సోషలిస్టు వ్యవస్థలోని ఆంతరంగిక వైరుధ్యాలను ప్రస్ఫుటంగా వెల్లడి చేయడమేగాక వర్గ పోరాటం యొక్క అలానే రెండు పంథాల మధ్య పోరాటం యొక్క దీర్ఘకాలిక, సంక్లిష్ట, బాధాకర స్వభావాన్ని సైతం అది తెలియ జేస్తుంది. రివిజనిజంతో తలపడి దాన్ని నిరోధించడానికి మనం చేసే మహత్తర పోరాటంలోను, అలానే శ్రామికవర్గ నియంతృత్వాన్ని దృఢపరచడంలోనూ-వస్తుగత వాస్తవాంశాలలోని గతితార్కిక అంతః సూత్రానికి అనుగుణంగా పని చేయటం, విరుద్ధాంశాల మధ్య ఐక్యతకు సంబంధించిన గతితార్కిక అవగాహనను అధ్యయనం చేయడం అనే వాటికి గొప్ప ప్రాధాన్యత వుంటుంది.

ఛైర్మన్ మావో ఇలా చెప్పాడు: **''విరుద్ధాంశాల మధ్య ఐక్యత అనేది ఒక విశ్వజనీన మౌలిక సూత్రం అని మార్క్సిస్టు తత్వశాస్త్రం చెబుతుంది. ప్రాకృతిక ప్రపంచంలో, మానవ సమాజంలో లేక మనిషి ఆలోచనలో అన్నింటా కూడా ఇది విశ్వవ్యాపితంగా వర్తింపయ్యే సూత్రం! ఒకానొక వైరుధ్యంలోని విరుద్ధాంశాల మధ్య ఏక కాలంలోనే ఐక్యతా వుంటుంది, పోరాటమూ వుంటుంది. వస్తువుల చలనానికి, వాటి మార్పుకి దోహదపడేది విరుద్ధాంశాల మధ్యనుండే ఈ ఐక్యతా పోరాట సూత్రమే.''** (ప్రజల మధ్య వైరుధ్యాలతో సరిగా వ్యవహరించడం.) దీనర్థం ఏమంటే- ప్రపంచంలోని సకల వస్తువులూ పరస్పర విరుద్ధ అంశాలుగానే వుంటాయి. వైరుధ్యం లేనిదంటూ ఏదీ వుండదు. వైరుధ్యంతో కూడిలేనిదేదీ అస్థిత్వంలో మనజాలనే మనజాలదు కనుక ఇక అలాంటి దాని అభివృద్ధి గూర్చి చెప్పాల్సిన పనే లేదు. కనుక ఒక విషయాన్ని పరిశీలించేప్పుడు అందులోని రెండు పరస్పర విరుద్ధాంశాల పట్ల మనం అప్రమత్తంగా వుంటూ అవి ఒకటిగానే ఎలా కలసి వుండగలుగుతున్నాయో అదే సందర్భంలో అవి రెండూ పరస్పరంగా ఎలా ఘర్షించుకుంటున్నాయో కూడా పరిశీలన చేస్తూ కొన్ని పరిస్థితుల్లో అవి పరస్పరంగా ఒక దాంట్లోకి ఒకటి ఎలా మార్పు చెందుతాయో అధ్యయనం చేయాలి. ఒక అంశాన్ని మాత్రమే చూస్తూ రెండోదాన్ని చూడలేకపోతే, విరుద్ధాంశాల మధ్య ఐక్యతా పోరాటాల్ని నిర్లక్ష్యం చేస్తే మనం అధిభౌతికవాద, భావవాద తప్పిదాలకి పాల్పడటం తప్పనిసరి.

## సోషలిస్టు సమాజంలో వైరుధ్యాలు అస్థిత్వంలో వుంటాయి

మన సోషలిస్టు వ్యవస్థలో సైతం రెండు వైరుధ్యాంశాలు ఉనికిలో వుంటుంటాయి. బూర్జువా వర్గానికి, శ్రామిక వర్గానికి మధ్య పోరాటం సోషలిస్టు మార్గానికి, పెట్టుబడిదారీ మార్గానికి మధ్య పోరాటం అన్నదే సోషలిస్టు సమాజంలోని ప్రధాన వైరుధ్యం.

సోషలిస్టు సమాజానికి సంబంధించి మావో చేసిన సమగ్రమైన సంపద్వంతమైన నిర్దిష్ట విశ్లేషణ మావో యొక్క ఒక ముఖ్య సందేశంగా మనం భావించాల్సి వుంటుంది. మావో ఇలా అంటాడు **''ఒక మాటలో చెప్పాలంటే చైనా సోషలిస్టు దేశం. విముక్తి పూర్వం అది ఒక పెట్టుబడిదారీ దేశం లాంటిదే. ఇప్పటికీ ఈ దేశంలో ఎనిమిది తరగతుల వేతన విధానం, పనినిబట్టి పంపిణీ, ద్రవ్యం ద్వారా మారకం అనేవి అమలవుతూనే వున్నాయి. వీటన్నింటి విషయంలో నేటి చైనా పూర్వపు చైనాకంటే పెద్ద భిన్నమైనదిగా ఏమీ లేదు. అయితే ఇప్పుడు కనబడే ఏకైక భేదం, తేడా అల్లా ఏమంటే-యాజమాన్య వ్యవస్థ అనేది మారడం మాత్రమే!''** ఇది మనకు స్పష్టం చేసేదేమంటే ఒక ప్రక్క శ్రామికవర్గ నియంతృత్వం సువ్యస్థితం అయి ఉత్పత్తి సాధనాలపై ప్రజా యాజమాన్యం నెలకొంది. ఆ రకంగా ''**చైనా ఒక సోషలిస్టు దేశం**''. వేరొక ప్రక్క ''**పాత సమాజం నుంచి చాలా స్వల్పంగానే తేడాతో కూడిన**'' అంశాలు కొన్ని కొనసాగుతూనే వున్నాయి. కొత్త వాటిలో పాతవాటి అవశేషాలింకా కొనసాగుతూనే వున్నాయి. ఈ రకంగా రెండు పరస్పర విరుద్ధాంశాలు ఏకకాలంలో ఉనికిలో వుంటున్నాయి; మరణిస్తున్న పెట్టుబడిదారీ విధానం పెరుగుతున్న కమ్యూనిజం అనే రెండూ కూడా పోరాటంలో పెనవేసుకున్నాయి. ఛైర్మన్ మావో ప్రతిపాదించిన విప్లవపంథా మార్గదర్శకత్వంలో శ్రామికవర్గం, విప్లవ ప్రజానీకం సోషలిస్టు మార్గాన్ని అంటి పెట్టుకొని వుంటూ, ప్రణాళికాబద్ధంగా కమ్యూనిస్టు అంశల్ని అభివృద్ధి పరుస్తూనే వున్నారు, కానైతే కూల్చబడ్డ దోపిడీ వర్గాలు, అలానే కొత్తగా తలెత్తుతున్న బూర్జువా శక్తులు శక్తులుడిగిన అవసాన దశలోని పెట్టుబడిదారీ విధానాన్ని పరిరక్షించుకోడానికి తద్వారా చరిత్ర గడియారాన్ని వెనక్కి తిప్పడానికి పడరాని పాట్లు పడతారని గ్రహించాలి. పర్యవసానం ఏమంటే-శ్రామిక వర్గానికి, బూర్జువా వర్గానికి మధ్య; సోషలిస్టు మార్గానికి, పెట్టుబడిదారీ మార్గానికి మధ్య సాగే పోరాటమనేది దీర్ఘకాలికం కాక తప్పదు, అది బాధామయంగాను కష్టనిష్ఠూరంగాను, కొన్ని సందర్భాల్లో చాలా తీవ్రంగాను వుండక తప్పదు. సోషలిజం చారిత్రక దశ అంతటి ద్వారా ఈ స్థితి ప్రతిఫలించక తప్పదు.

చైనా కమ్యూనిస్టు పార్టీలో సైతం పరస్పర విరుద్ధమైన రెండు అంశాలు ఉనికిలో వుంటున్నాయి; అంటే-సరైన పంథా, తప్పుడు పంథాల మధ్య పోరాటం ఇక్కడ పార్టీలో కొనసాగుతోందని చెప్పడమే దీనర్థం! సమాజంలోని వైరుధ్యాలూ, పాత-కొత్తల మధ్య వైరుధ్యాలూ పార్టీలో ప్రతిఫలిస్తాయన్నమాట! మన పార్టీలోని రెండు పంథాల మధ్య గడచిన సుమారు యాభై సంవత్సరాల కాల వ్యవధిలో పది పెద్ద ఆంతరంగిక పోరాటాలు సాగాయి, వీటిలో నాలుగు సోషలిస్టు విప్లవ దశలోనే సాగాయి. మనిషి ఇష్టాఇష్టాలకి అతీతంగా వాస్తవిక వస్తుగత వర్గపోరాట సూత్రం ఈ పోరాటాన్ని నిర్ధారిస్తుంది. సోషలిజం యావత్తు చారిత్రక దశలోనూ శ్రామికవర్గం, బూర్జువా వర్గాల మధ్య; సోషలిస్టు మార్గం, పెట్టుబడిదారీ మార్గాల మధ్య పోరాటం వుంటుంది. ఈ యావత్ చారిత్రక దశలోనూ సామ్రాజ్యవాదుల సోషల్ సామ్రాజ్యవాదుల దాడి, విచ్ఛిన్నాల ప్రమాదం పొంచి వుంటూనే వుంటుంది. అందుకే పార్టీలో మార్క్సిజం-లెనినిజాల మధ్య పోరాటం రెండు పంథాల మధ్య పోరాటంగా సుదీర్ఘకాలం కొనసాగడమనేది అనివార్యం! వర్గాలు అంతరించిపోయి సోషలిజం వాస్తవిక రూపం తీసికొన్న తరువాత కూడా భవిష్యత్తులో సైతం, అప్పుడు కూడా ఆర్థిక పునాదికీ, ఉపరితలానికి మధ్య వైరుధ్యం;

# గతితార్కిక అవగాహనను గ్రహించడం

**- యెన్‌ఫెంగ్**

అలానే ఉత్పత్తి శక్తులకీ, ఉత్పత్తి సంబంధాలకి మధ్య వైరుధ్యం కొనసాగుతూ ఆ రకంగా రెండు పరస్పర విరుద్ధాంశాలూ అస్థిత్వంలో వుంటూనే వుంటాయి. పర్యవసానం ఏమంటే-ఈ వైరుధ్యాల్ని ప్రతిఫలింపజేస్తూ అభివృద్ధి చెందిన శక్తులకీ, వెనుకబడిన శక్తులకీ మధ్యన; అలానే సరైన, తప్పుడు పంథాల మధ్య పోరాటాలు కొనసాగుతాయి. కనుకనే రెండు పంథాల మధ్య పోరాటం యొక్క దీర్ఘకాలిక స్వభావం గూర్చి మనకు అర్థం చేయించడానికి ఛైర్మన్ మావో నిరంతరం శ్రమించాడు.

## వైరుధ్యాలు ఒకదాంట్లోకి ఒకటి మారుతాయి

ఒకానొక వస్తుగతాంశంలోని పరస్పర విరుద్ధాంశాలు నిర్జీవమైనవిగాను, కొయ్యబారినవిగాను గాక సజీవంగా చలనంతో వుంటూ కొన్ని నియమాలకనుగుణంగా ఒకదాంట్లోకి ఒకటి మారుతూ వుంటుంటాయి. సోషలిస్టు సమాజంలో కమ్యూనిస్టు అంశాలు, పెట్టుబడిదారీ అంశాలు అలానే శ్రామికవర్గం మరియు బూర్జువా వర్గం అనేవి పరస్పరంగా ఒకదాన్నొకటి ప్రభావితం చేసుకుంటూ, ఒకదాంట్లోకి ఒకటి చొచ్చుకుపోతూ కొన్ని ప్రత్యేక సందర్భాలు, పరిస్థితుల్లో అవి ఒకటి ఇంకొకటిగా మారి పోతుంటాయి. శ్రామికవర్గం శక్తివంతమైన, చురుకైన విప్లవకర వర్గం, ఇది బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో తన శక్తిని మరింతగా పెంచుకుంటుంది, విస్తరింపజేసుకుంటుంది, సోషలిస్టు లక్ష్యాన్ని, ఆశయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ దాన్ని కమ్యూనిజం లక్ష్యం దిశగా నడిపిస్తుంది. చోదక పాత్రని పోషించే ప్రధానాంశంగా ఇదే వుంటుంది. బూర్జువా వర్గం దినదినం క్షీణించేదిగా వుండేదే అయినా కూడా అది తన ఓటమిని అంగీకరించకుండా శ్రామికవర్గానికి వ్యతిరేకంగా తిరిగి తిరిగి తిరగబడుతూ, ఆర్థిక, నైతిక, బౌద్ధిక రంగాలలో పాత అభివృద్ధి నిరోధక సామాజిక వ్యవస్థ విడచిపెట్టిపోయిన తన అవశేషాంశాలని ఆసరాగా చేసుకొని శ్రామికవర్గానికి వ్యతిరేకంగా దాడుల్ని ఎక్కుపెడుతూనే వుంటుంది, అంతేకాదు, విప్లవ ప్రతీఘాతుక కుట్రల్లో మునిగి తేలుతూ వుంటుంది. మన విప్లవ శక్తుల్ని అవినీతితో మలినపరచడానికి అది నిరంతరం అన్ని మార్గాల్లో ప్రయత్నిస్తుంది. మన పార్టీలోకి తన ఏజెంట్లని చొప్పించడానికి లేక సృష్టించడానికి ప్రయత్నిస్తుంది. అలాగే మన రాజ్య యంత్రాంగంలో తన ఏజెంట్లని పెట్ట ప్రయత్నిస్తుంది, పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ లక్ష్యంతో ఈ విఫల ప్రయత్నాలన్నీ అది అలుపూ సొలుపూ లేకుండా చేస్తూనే వుంటుంది. పర్యవసానంగా మనకు రెండే రెండు అవకాశాలు మిగిలుంటాయి-కమ్యూనిజం దిశలో ముందుకు పోవడం లేక పెట్టుబడిదారీ విధానం వైపు వెనక్కి పోవడం.

ఈ పోరాటంలో నెగ్గేది శ్రామికవర్గమా లేక బూర్జువా వర్గమా అనేది అలానే మన సమాజం పురోగమిస్తుందా లేక తిరోగమిస్తోందా అనేది కొన్ని పరిస్థితులపై కొన్ని షరతులపై ఆధారపడి వుంటాయి. ఈ పోరాటంలోని రెండు అంశాలూ ఒకానొక నిర్దిష్ట షరతు (కండీషన్) కారణంగా తప్ప పరివర్తన చెందజాలవు, ఆ షరతు ఏదంటే మన పార్టీ పంథాయే తప్ప వేరు కాదు. అందుకే ఛైర్మన్ మావో ఏమంటాడంటే **''సైద్ధాంతిక రాజకీయపంథా సరైందిగా వుండడంలేక తప్పుడు పంథా కావడం అనేదే సర్వాన్ని నిర్ణయిస్తుంది''**. శ్రామికవర్గం నాయకత్వాన మనం పట్టువిడవకుండా నిరంతరాయంగా విప్లవాన్ని కొనసాగించినట్లయితే, బూర్జువా హక్కు అనే దానికి పరిమితులు విధిస్తే, ఏమరుపాటు లేకుండా సమాజంలోని రాజకీయ, ఆర్థిక, భావజాల, సాంస్కృతిక తదితర రంగాలన్నింటిలోనూ బూర్జువా వర్గంపై అన్ని వైపులనుంచీ శ్రామికవర్గ నియంతృత్వాన్ని అమలు చేయగలిగితే, వీటన్నింటిలోనూ మన పంథా సరైనదిగా వున్ననాడు మన సోషలిస్టు లక్ష్యం అనేది పురోగమిస్తుంది, అభివృద్ధి చెందుతుంది. అలా కాని పక్షంలో అంటే మన పంథా సరైనదిగా లేకపోతే, మనం బూర్జువా హక్కుని నిరోధించక పోతే, దాన్ని కావాలనే మరింత విస్తరింప జేస్తే అలానే పెట్టుబడిదారీ విధానం స్వేచ్ఛగా అభివృద్ధి కావడానికి అనుమతింపజేస్తే అప్పుడిక మన సోషలిస్టు సమాజం తిరోగమించక తప్పదు.

## పాతని కొత్త జయిస్తుంది

**''కొత్త దానిచేత పాతది అణచివేయ బడటమనేది ఒక సాధారణ, సర్వకాలిక, అనుల్లంఘనీయ, విశ్వజనీన సూత్రం''** (''వైరుధ్యాలు''- మావో). పాత, కొత్తల మధ్య జరిగే పోరాటం పదే పదే జరిగేదే అయినా; అమిత కష్ట నిష్ఠూరమైనదే అయినా కూడా పాత దానిపై కొత్తది విజయం సాధించడంతోనే, అలా సాధించడంగానే పాత కొత్త అంశాల మధ్య వైరుధ్యం పోరాటం వుంటూ పాత దానిపై కొత్తది ఆధిపత్యాన్ని సాధించేదిగానే వుంటుంది, ఇది అనివార్య పరిణామంగానే చోటు చేసుకుంటుంది. నూతనాంశాల విషయాని కొస్తే-వీటి విషయంలో ఎదురు దెబ్బలు వెనుకంజలు అనేవి తాత్కాలికం మాత్రమే, వీటికి సంబంధించిన సాధారణ ధోరణి ఏమంటే పురోభివృద్ధి చెందడం మరింత శక్తివంతమైనవిగా పెరగడం ఆ క్రమంలో అంతిమంగా ఇక పాతని అధిగమిస్తూ పోవడమనేదే! సుదీర్ఘమైన సోషలిస్టు సామాజిక దశలో పురోభివృద్ధి అనేదే సారాంశంగాను ప్రధాన స్రవంతిగాను వుంటుంది. తిరోగమన అంశ అనేది కేవలం అప్రధానంగానూ, స్వల్పకాలికంగానూ మాత్రమే వుంటుంది. సోవియట్ యూనియన్‌లో సంభవించిన పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణ కమ్యూనిస్టు ఉద్యమ పురోగమన దశను ప్రభావితం చేసేదిగా వుంటే వుంటుందేమో గాని చారిత్రక అభివృద్ధి గమనానికి సంబంధించిన సాధారణ ధోరణిని అదే రకంగాను దెబ్బతీయజాలదు. లెనిన్ చేత ఆవిష్కరింపబడ్డ ప్రప్రథమ సోషలిస్టు దేశం తన రాజకీయ రంగుని మార్చుకుంది, కాని తీవ్రమైన అత్యంత కష్టభరితమైన వర్గ పోరాటం తరువాత తప్పనిసరిగా ఆ దేశం తిరిగి లెనిన్ మార్గానికి మళ్ళగలదని చెప్పగలం. చైనాలో పెట్టుబడిదారీ

*( రాజ్యాంగ సమీక్ష: 43వ పేజీ తరువాయి.....)*

ఎన్నికలను పరిమితం చేస్తూ, ప్రజలచే ఎన్నుకోబడటం కాకుండా ప్రభుత్వం చేత నామినేట్ చేయబడే విధంగా వుంటుంది. గ్రామ పంచాయితీ ఒక్కటే ప్రత్యక్షంగా ఎన్నుకోబడుతుంది. పంచాయితీ సమితులకు, జిల్లా పరిషత్‌లకు ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సభ్యులుండరు. అన్ని అధికారాలు గుప్పిట్లో పెట్టుకుని, హైటెక్ పద్ధతుల (వీడియో కాన్ఫరెన్స్‌లు మొ॥నవి) ద్వారా, హైదరాబాదు నుండి కలెక్టర్ల పాలన కొనసాగించాలని తెలుగుదేశం ప్రభుత్వం కోరుకుంటున్నది. జన్మభూమి మొ॥న పథకాల పేరుతో, గ్రామాలలో వివిధ పేర్లతో సమాంతర కమిటీల నిర్మాణం చేస్తూ, ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వం పంచాయితీరాజ్ వ్యవస్థకున్న నామమాత్రపు అధికారాలను కూడా తోసి పుచ్చుతోంది. పంచాయితీరాజ్ బిల్లు సవరణ ద్వారా ప్రజల చేతికే 'అధికార పగ్గాలు' అని వాళ్ళు చెప్తున్నదంతా, వాస్తవానికి తద్విరుద్ధంగా, అధికారమంతా ముఖ్యమంత్రి చేతుల్లో కేంద్రీకరించు కోవటానికే!

సమీక్ష జరిగినా, జరగక పోయినా, బి.జె.పి. నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం మాత్రం నిరంకుశ, అప్రజాస్వామిక విధానాలను ప్రవేశపెడ్తూనే వుంది. ప్రచార మాధ్యమాలు, ప్రజలు రాజ్యాంగ సమీక్ష గురించి చర్చలు జరుపుతుంటే, ఎటువంటి చర్చలూ లేకుండానే ప్రభుత్వం పంచాయితీరాజ్ బిల్లు ద్వారా రాజ్యాంగానికి మౌలిక సవరణ చేపట్టింది. ఇటువంటి నిరంకుశ చట్టాలను ప్రజలు అప్రమత్తతతోను, ప్రజా పోరాటాల ద్వారా నిలవరించాల్సి వుంది. ప్రజలమీద జరుగుతున్న ఈ ఫాసిస్టు దాడుల్ని, బలమైన ప్రజాస్వామిక ఉద్యమం, అదీ సమరశీల ఉద్యమం మాత్రమే తిప్పికొట్టగలదు. అంతేగాక, ఈ దోపిడీ రాజ్యాంగాన్ని సమూలంగా ధ్వంసం చేసి, నూతన రాజ్యాంగాన్ని నిర్మించుకోవలసిన అవసరం నేడు మన ముందుంది.

ఇపుడున్న దోపిడీ రాజకీయ సాంఘిక, ఆర్థిక న్యాయ వ్యవస్థకు ప్రత్యామ్నాయాలుగా ఆంధ్ర, దండకారణ్య, బీహార్ ఉద్యమ ప్రాంతాల్లోని ప్రజలు గ్రామరాజ్య కమిటీలు, న్యాయ కమిటీలు, అభివృద్ధి కమిటీలు మొదలైన నూతన నిర్మాణ రూపాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజల చేతుల్లో భవిష్యత్‌లో రూపుదిద్దు కోబోయే ప్రజల రాజ్యాంగానికి ఈ నూతన నిర్మాణ రూపాలే పునాదిరాళ్ళు. ❑

---

పునరుద్ధరణ కోసం బూర్జువా వర్గం పన్నే అన్నిరకాల కుట్ర పథకాలు భగ్నమై విఫలంకాక తప్పవని చెబుతూ మావో ఏమంటాడంటే **''చైనాలో మితవాదులు సైనిక కుట్రకు పాల్పడినట్లయితే వారికిక శాంతి అంటూ వుండబోదని, వారి విజయం అనేది కేవల బూర్జువా ప్రాయంగానే ముగుస్తుందని నేను నమ్మకంగా చెప్పదలుస్తున్నాను. ఏమంటే అలాంటి కుట్ర ప్రయత్నాల్ని పథకాల్ని దేశంలో 90 శాతం ప్రజలకి, ప్రజల ప్రయోజనాలకి ప్రాతినిధ్యం వహిస్తున్న విప్లవకారులు ఎంత మాత్రం సహించబోరు''**. మావో ప్రతిపాదించిన ఈ సైద్ధాంతిక సూత్రీకరణలు పెట్టుబడిదారీ విధానంపై కమ్యూనిజం విజయం అప్రతిహతం, అనివార్యం అనే సత్యాన్ని నొక్కి చెప్పేవిగా వుంటాయి.

లెనిన్ తన ''అతివాద కమ్యూనిజం ఒక బాలారిష్టం'' అనే గ్రంథంలో నొక్కి చెప్పిందేమంటే **''ఎలాంటి పరిస్థితుల్లోనూ భవిష్యత్తు తమదేనని కమ్యూనిస్టులు తెలుసుకోవాలి''** మావో సైతం ఇదే విషయంపై చెప్పినదేమంటే, **''మార్గం దుర్గమమైందే, దురవస్థలతో కూడినదే అయినా కూడా భవిష్యత్తు ఉజ్వలమైనదే''** శ్రామికవర్గ విప్లవ లక్ష్యం ఇప్పటికే ఘనమైన విజయాన్ని సాధించింది, అదింకా ఘనమైన విజయాల్ని సాధించనుంది. సమస్యల్ని అధ్యయనం చేయడంలో మనం విరుద్ధాంశాల మధ్య ఐక్యతా సూత్రాన్ని ఉపయోగించడం ద్వారా, వర్గ పోరాటం యొక్క అలానే రెండు పంథాల మధ్య పోరాటం యొక్క దీర్ఘకాలిక స్వభావాన్ని ధైర్యంగా గుర్తిస్తూ, చారిత్రక దశలో పెట్టుబడిదారీ పునరుద్ధరణకి గల అవకాశానికి సంబంధించిన తీవ్ర సమస్యను ఎదుర్కొంటూ-చైనా విప్లవ ప్రజలకి ధైర్యంగా వీటన్నింటినీ తెలియజేస్తూ వారిముందు ప్రకటిస్తూ అలానే ప్రపంచం ముందు సైతం వీటిని వుంచుతూ మనం మాట్లాడాలి. ఇదంతా మన శక్తికి, భవిష్యత్‌పై మన అచంచల విశ్వాసానికి తార్కాణం. నిష్ణాతులైన రాటుదేలిన గతితార్కిక భౌతికవాదుల ధోరణి ఇలాగే వుంటుంది. ఏ ఒక్క రివిజనిస్టుగాని భావవాదిగానీ ఇలా వుండజాలడు, ఇలా ప్రవర్తించ జాలడు. శ్రామికవర్గనియంతృత్వం క్రింద విప్లవాన్ని నిరంతరాయంగా కొనసాగించడానికి వీలుగా మనం ఇప్పుడు ఛైర్మన్ మావో ప్రబోధం, ఆచరణల వెలుగులో పనిచేస్తూ మన ఆచరణని కొనసాగిస్తున్నాం; అదే మంటే **''మార్క్సిస్టు-లెనినిస్టు రచనలను ఎక్కువగా అధ్యయనం చేయడం''** సమస్యల్ని గుర్తించి వాటిని అధ్యయనం చేయడానికి గతితార్కిక భౌతికవాద దృష్టి కోణాన్ని వర్తింప జేయడమెలాగో నేర్చుకోవడం; భావవాదానికి అధిభౌతికవాదాలకి వ్యతిరేకంగా పోరాడటం; ఆలోచనలో మంకుతనాన్ని (రిజిడ్‌నెస్) నిరోధిస్తూ, వాస్తవికత నుంచి ఆలోచనని వేరుచేసే తీరుని నిరోధిస్తూ ఏకపక్ష ధోరణిని వ్యక్తివాద ధోరణుల్ని అధిగమించే కృషి చేయడం. గందరగోళం లేని విప్లవకారులంగా, సోషలిజం చారిత్రక దశలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగే ప్రమాదంపట్ల మనం అప్రమత్తంగా వుండాలి; అయితే వీటన్నింటి కంటే హెచ్చుగా మార్క్సిజం-లెనినిజం యొక్క అంతిమ విజయం అప్రతిహతం అనే సత్యంపట్ల మనం అచంచల విశ్వాసంతో వుంటుండాలి, కష్టనిష్ఠూరమైన, బాధామయం అయిన పోరాటంపట్ల మనం గుడ్డిగా వ్యవహరించజాలం, మన భవిష్యత్తు ఉజ్వలమే అనే భరోసాతో ఈ పోరాట ఆవశ్యకతని మనం విస్మరించజాలం, అంతే కాదు, చేయాల్సిన పోరాటం దీర్ఘకాలిక స్వభావంతో కూడినది, తీవ్ర కష్టనష్టాలతో కూడినది అయినందువల్ల నిరాశోపహతులం కాజాలం. ఆ రకంగా మనం ఎంతమాత్రం అర్ధమనస్కపు విప్లవకారులుగా మిగిలుండి పోడానికి ఒప్పుకోం.

***పెకింగ్ రివ్యూ: నెం:51, డిసెంబర్ 19, 1975.*** ❑

**ముఖ్యమంత్రుల సమావేశం**

# బందిపోట్ల గూడుపుఠాణి

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] ప్రభావంలో వున్న అయిదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెరుగుతున్న విప్లవ శక్తుల పలుకుబడిని ఎదుర్కోవడంలో మరొక వ్యూహాన్ని పన్నేందుకుగాను ఏప్రిల్ 4వ తేదీన ఢిల్లీలో సమావేశమైనారు. ఆయా రాష్ట్రాల పోలీస్ డి.ఐ.జి.లూ, హోంశాఖ కార్యదర్శులు కూడా ఈ అత్యున్నత స్థాయి సమావేశానికి హాజరైనారు. నరహంతక హోంమంత్రి అద్వానీ ఈ సమావేశానికి అధ్యక్షత వహించగా హోంశాఖా కార్యదర్శి కమల్‌పాండే (ఆర్.యస్.యస్.) అతనికి సహకరించాడు. ఈ అయిదుగురు ముఖ్యమంత్రులూ విభిన్న రాజకీయ పార్టీలకు చెందిన వారే అయినప్పటికీ (రబ్రీదేవి హాజరు కాలేదు) విప్లవ రాజకీయాలతో ప్రభావితులైన పోరాట ప్రజలకు వ్యతిరేకంగా మరింతగా బీభత్సాన్ని ఎలా మొదలెట్టాలి అన్న అంశంపై వీరికి ఏకాభిప్రాయమే వుంది. ఈ సమావేశంలో వీరు ఉమ్మడిగా తీసుకున్న విధానాలు తీవ్రంగా బాధలకు గురవుతున్న ప్రజారాసులను అభివృద్ధిలోకి తేవడమెలా అన్న దాన్ని పరిశీలించ లేదుగాని, నిర్బంధపు స్థాయిని ఎలా పెంచాలన్న అంశంపైనే అవి దృష్టి పెట్టాయి. రోడ్లను నిర్మించటానికి (ప్రజలకు సహాయ పడేందుకు కాదుగానీ తిరుగుబాటు వ్యతిరేక చర్యలను పెంచేందుకు మాత్రమే) భారీ పథకంతో కూడుకున్న 'అభివృద్ధి' పథకంగా చెప్పబడుతున్న దానిపై నిర్ణయం తీసుకోవటం ద్వారా ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులపై కూడా పాలకులు ఈ సమావేశంలో 'సానుభూతి' ప్రకటించారు.

అయితే ఈ సామ్రాజ్యవాద తొత్తుల ప్రతి కొత్త వ్యూహం కూడా సంపూర్ణ వైఫల్యంతోనే ముగుస్తూ వచ్చింది. ఒక సందర్భంలో మావో చెప్పినట్లుగా ప్రగతి నిరోధకులు తమ కాళ్ళమీదే పడవేసుకునేందుకు రాయినెత్తుకుంటారు. అయితే ఈ సమావేశానికి, అంతకు మునుపటి సమావేశాలకు మధ్యగల తేడా అల్లా ఏదంటే ఈ పందికొక్కుల కళ్ళలో పెద్ద ఎత్తున భీతి పేరుకుపోయి కన్పించటమే. తమ తిరుగుబాటు వ్యతిరేక చర్యలకు సహాయం కొరకు వీరంతా అమెరికా, వియత్నాం, చివరకు టర్కీ పాదాల ముందు పడిపోడానికి కూడా సంసిద్ధ పడిపోయారు. ప్రత్యేకించి కసాయి హంతకుడైన చంద్రబాబు నాయుడు తన ప్రధాన సహచరుడు అయిన మాధవరెడ్డి మట్టికరచిన పిమ్మట భయకంపితుడై పోయాడు.

## ఈ గూడుపుఠాణికి నేపథ్యం

మన పార్టీకి చెందిన ముగ్గురు కేంద్రకమిటీ సభ్యులను డిసెంబర్ 1, 1999న అమానుషంగా హింసించి కిరాతకంగా హత్య గావించటంతో విప్లవోద్యమం కథ ముగిసిపోయినట్లే అని పాలకవర్గాలు భావించాయి. అయితే వారు బాగా పొరపడ్డారు. ఇందుకు భిన్నంగా ప్రజాస్వామిక, విప్లవకర శక్తులు మున్నెన్నడూ లేనంత ఆగ్రహంతో ఈ చట్ట వ్యతిరేక హత్యలపట్ల స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రజాతంత్రవాదులూ, పౌరహక్కుల కార్యకర్తలూ తీవ్రంగా నిరసన ప్రకటించారు. ప్రపంచంలోని పలు దేశాల నుండి అంతర్జాతీయ సంస్థలు తమ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ముందు ఈ హత్యలను ఖండిస్తూ తీవ్రస్థాయిలో నిరసనలు ప్రకటించాయి. వీటన్నింటికీ మించి ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, దండకారణ్య, బీహార్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజల దాడుల పరంపర మొదలైంది. ప్రతీకారమొక్కటే యధార్థమైన పోరాటమై పోయింది.

పాలకులు ఈ పరిణామాలతో ఎంతగా భయపడి పోయారంటే డిసెంబర్ 19న పీపుల్స్‌వార్ పార్టీని ఎదుర్కొనేందుకు నూతన వ్యూహం కోసమై అయిదు రాష్ట్రాల (బీహార్‌ని ఇందులో మొదటిసారిగా చేర్చారు) పోలీస్ డి.ఐ.జి.లతో 2000 సం॥రం జనవరి ప్రారంభంలో సమావేశం జరపాలని కేంద్ర ప్రభుత్వం '99 డిసెంబర్ 19న నిర్ణయించుకుంది. ఒక ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించి అమలు జరపడానికై కేంద్రం వెనువెంటనే 35 బెటాలియన్ల 'భారత రిజర్వ్ ఫోర్స్' ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఆయుధాల, కమ్యూనికేషన్ల శిక్షణనందించడానికి, ప్రతి బెటాలియన్‌ని పోషించ డానికి 13 కోట్ల రూ॥లను ఇవ్వడానికి కేంద్రం నిశ్చయించుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రేహౌండ్స్ బలగాల్లాగా ఒక యుద్ధోన్మాద పీడక బలగాన్ని ఏర్పర్చు కోవాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా స్థాయిలో, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యక్ష కమ్యూనికేషన్ యంత్రాంగాన్ని నెలకొల్పుకోవాలని ప్రతిపాదించారు. నక్సల్స్ సమస్యతో ఇబ్బంది పడుతున్న రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ స్టేషన్లలో డైరెక్ట్ డయలింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్న పథకం గురించి కమ్యూనికేషన్ల శాఖతో చర్చించాలని నిర్ణయించు కున్నారు.

అయితే శత్రువు తదుపరి దశకి పథకమేయకముందే పీపుల్స్‌వార్ గెరిల్లాల మెరుపు ప్రతీకార దాడుల విజృంభణతో ప్రజాతంత్ర శక్తుల తక్షణ ప్రతిఘటన మొదలైంది. మొదట మధ్యప్రదేశ్ రవాణాశాఖా మంత్రి ఖతమై పోయాడు. తర్వాత బీహార్‌లో విజయ వంతమైన మందుపాతర విస్ఫోటనల పరంపర మొదలైంది. తర్వాత ఆంధ్రప్రదేశ్ తూర్పు డివిజన్‌లో, మహారాష్ట్రలోని ఘడ్‌చిరోలిలో పోలీస్ స్టేషన్లపై రెయిడ్లు విజయవంతమైనాయి. తర్వాత బస్తర్‌లో సీనియర్ అధికారితో సహా 23 మంది పోలీసులు మందుపాతరలో చనిపోయిన సంఘటన జరిగింది. చివరగా అత్యంత క్రూరుడు, నీచుడు, నికృష్టుడు అయిన ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి మాధవరెడ్డి ఖతమయ్యాడు. ఈ ప్రముఖ చర్యలతోపాటు తెలుగుదేశం పార్టీని, ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను వారి ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని డజన్లకొద్దీ చిన్న చర్యలూ జరుగుతూ వచ్చాయి. సహజంగానే దీంతో ప్రభుత్వం భీతిల్లి పోయింది.

ఇప్పుడు పెరుగుతున్న విప్లవోద్యమాన్ని ఎదుర్కోవడానికి వారు మూడంచెల దాడిని చేపట్టారు. మొదట వారు పీపుల్స్‌వార్ పార్టీని ప్రజలనుండి వేరుపర్చడానికై భారీ ఎత్తున దుష్ప్రచారానికి దిగారు. రెండు. ఆర్థిక పరమైన ఎరలతో, సాధారణ 'లొంగుబాటు విధానం'తో ఉద్యమానికి వున్న విస్తృత ప్రజాపునాదిని తగ్గించాలని చూశారు.

మూడు. ప్రధానంగా మరింత శక్తివంతమైన బలగాన్ని ఉపయోగించటం ద్వారా, టెర్రరిస్ట్ పద్ధతులను విస్తృతం చేయటం ద్వారా ఉద్యమాన్ని నలిపి వేయాలని వారు ఆశించారు. టి.డి.పి.-బి.జె.పి. కూటమి మరింత దూకుడుగా ముందుకు రావడంతో ఈ పథకంలో అన్ని పాలకవర్గ పార్టీలు ఐక్యమైనాయి.

## దుష్ప్రచార కేంపెయిన్

పీపుల్స్‌వార్‌కి పాకిస్తాన్ ఐ.ఎస్.ఐ.తో సంబంధం అంటగట్టేందుకు తీవ్ర ప్రయత్నం జరిగింది. ఇందుకు ఎలాంటి సాక్ష్యం చూపించక పోయినప్పటికీ పరోక్షంగా ఆధారాలు చూపించటం నిరవధికంగా జరుగుతూ వచ్చింది. పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ అలాంటి ఆరోపణలను తిరస్కరిస్తూ పత్రికా ప్రకటన ఇచ్చినా పాలకవర్గాలు తమ ప్రచారాన్ని కొనసాగించాయి. పీపుల్స్‌వార్ తన ప్రస్తుత వుద్యమాన్ని మొదటగా ప్రారంభించిన కరీంనగర్ జిల్లా జగిత్యాల పట్టణంలో, ఏప్రిల్ 16న లష్కర్ తోయిబా సభ్యుడుగా అనుమానించబడుతున్న అజంఘోరీ అనే వ్యక్తిని పోలీసులు కాల్చి చంపటంతో ఈ దుష్ప్రచారం పతాక స్థాయికి చేరుకుంది. ఇతడు ఒకప్పుడు పీపుల్స్‌వార్ సభ్యుడని పత్రికలు ప్రకటించటంతో ఇలా జరిగింది.

ఇదే సమయంలోనే, పీపుల్స్‌వార్‌కి సిద్ధాంతం లేదని, అది స్వార్థపూరిత నేరస్థులతో కూడుకుని వుందని గతంలో ప్రకటించిన అద్వానీ ఇపుడు బాణీ మార్చి పీపుల్స్‌వార్‌కి ఒకప్పుడు సిద్ధాంత ముండిందని కాని ఈరోజు అదేమాత్రం వునికిలో లేదని చెప్పాడు. పార్టీ సైద్ధాంతిక పునాదులను, దాని బలమైన స్పష్టమైన రాజకీయ, ఆర్థిక దృక్పథాన్ని తోసిపుచ్చే అభిలాషతో అద్వానీ, ప్రచార సాధనాలు పార్టీకి సిద్ధాంతం కొరవడిందని, ఒక దృక్పథమంటూ లేదని లక్ష్యంలేని హింసచుట్టూ అది నిర్మించబడిందని ఉద్యమాన్ని వేలెత్తి చూపాలని ప్రయత్నిస్తున్నారు. దీనికితోడు సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకమైన పార్టీ ఆర్థిక, రాజకీయ కార్యక్రమానికి వారి వద్ద ఏ సమాధానం లేనందున అలాంటి కార్యక్రమమంటూ ఏదీ లేదని నటించటమే వారికి సులభమైన, ఉత్తమమైన పని అయిపోయింది.

చివరగా చంద్రబాబు నాయుడు పలు ఎదురుదెబ్బలు తిన్నాక 'హేతుబద్ధమైన' వ్యక్తిగా కనిపించాలనే ప్రయత్నంలో భాగంగా 'నక్సల్స్' సమస్యపై అఖిలపక్ష సమావేశానికి గద్దర్‌ని, వరవరరావుని ఆహ్వానించడానికి తన సంసిద్ధతను ప్రకటించాడు. అదే సమయంలో మరిన్ని కిరాతక దాడులకు దృఢంగా సిద్ధమవుతున్నాడు. తన చిత్రహింసల, విప్లవకారుల నిర్మూలనా విధానాలను కొనసాగిస్తూనే పీపుల్స్‌వార్‌ను మొండిదిగా, నిర్ణయాలను మార్చుకోనట్టిదిగా చూపించటానికి, మరోవైపు తానెంత పట్టువిడుపులు గలవాడుగా వుంటున్నాడో ప్రదర్శించుకోవటానికి ఈ కసాయి హంతకుడు ప్రయత్నిస్తున్నాడు. అయితే ఆ మరునాడే, అసలు రంగును బయట పెట్టాడు. ఏప్రిల్ 4న ఢిల్లీలో జరిగిన 'బందిపోట్ల గూడుపుఠాణీ'లో దేశ వ్యాప్తంగా పీపుల్స్‌వార్‌ని నిషేధించాలంటూ డిమాండ్ చేసింది కూడా వీడే. భారీ ఎత్తున ఆయుధాల, మందుగుండును కోరే జాబితాను వెంటబెట్టుకునే ఇతగాడు ఢిల్లీకి వెళ్ళాడు!

## ఆర్థికపరమైన ఎరలు, క్రూర నిర్బంధం

ఈ సందర్భంగా 'నక్సలైట్ సమస్య' కూడా సామాజిక, ఆర్థిక పరమైనదే అని పాలకులు అంగీకరించక తప్పింది కాదుగాని ముఖ్యమంత్రుల సమావేశం ప్రజల బాధలను తొలగించే ఒక్కటంటే ఒక్క ప్రతిపాదనను కూడా ముందుకు తీసుకు రాలేదు. దాని నిర్ణయాలన్నీ పూర్తిగా సైనికపరమైనవిగానే వున్నాయి.

ముఖ్యమంత్రుల సమావేశం ఒక 'జాయింట్ ఆపరేషనల్ కమాండ్'ని ఢిల్లీలో ఏర్పర్చాలని నిర్ణయించింది. ఇది 'ఆపరేషన్లు', ఇంటలిజెన్సు రెంటినీ సమన్వయిస్తుంది. నక్సలైట్ దళాల జాడను పసిగట్టేందుకుగాను కౌంటర్ ఇన్‌సర్జెన్సీ బలగాలకు పైలెట్‌లేని విమానాలను సమకూర్చాలన్న ప్రతిపాదన తక్షణ పరిశీలనాంశంగా పెట్టుకున్నారు. పైగా, రాష్ట్రాలకు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాలకు గాను కేంద్రం అందించే 50 శాతం సహాయం అన్నది ఉద్యమాన్ని అవి సమర్థంగా అణచివేసే అంశంపై ఆధారపడి షరతులతో కూడి వుంటుందని అద్వానీ ప్రకటించాడు. పీపుల్స్‌వార్‌ని దేశ వ్యాప్తంగా నిషేధించేందుకు పథకం రచించినట్లు కూడా ఇతడు చెప్పాడు. అట్లే ''పునరావాసానికి''గాను భారీ నిధులను కేటాయించే 'లొంగుబాటు విధానంపై ముసాయిదా'ను సిద్ధం చేయాలని కూడా ఈ సమావేశం నిర్ణయించింది. తీవ్రవాదులను ప్రధాన స్రవంతిలోకి తేవడానికిగాను వారితో చర్చలను ప్రోత్సహించదల్చినట్లు కూడా వారు ప్రకటించారు. కాబట్టి ఉద్యమంలోని బలహీనులకు ఆర్థికపరమైన ఎరలు వేయటం, దృఢంగాను, శక్తివంతంగానూ వుండే వారిని కాల్చి చంపటం రూపంలో వీరి విధానం వుంటుందన్నమాట.

నిఘా హెలికాప్టర్, ఏ.కె.-47 రైఫిల్స్, రాత్రిపూట సైతం స్పష్టంగా చూడగల సామాగ్రి, ఉపగ్రహాల ఆధారంతో ఆధునిక కమ్యూనికేషన్ సౌకర్యాలు వంటి వాటిని డిమాండు చేస్తూ చంద్రబాబునాయుడు ఈ సమావేశానికి పెద్ద జాబితాను పట్టుకుని మరీ వచ్చాడు. ఈ జాయింట్ కమాండును కేంద్రమే నిర్వహించాలని అత్యాధునాతన ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలతో పోలీసులను సాయుధం చేయటాన్ని కూడా దీనిలో చేర్చాలని, రాష్ట్రాల సరిహద్దులు సృష్టించిన చట్టపరమైన ప్రతిబంధకాలను నిర్మూలించాలని, ఢిల్లీ నుండి తగిన నిధులు పంపాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ కోరాడు. ఇక మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి అయితే నక్సలిజంతో రాజకీయ, పాలనా స్థాయిలో వ్యవహరించాలని చెబుతూనే, ఒక ఐక్య పోలీస్ కమాండ్ తక్షణంగా అవసరమని చెప్పాడు.

ఈ అయిదు రాష్ట్రాలలో రోడ్ల నిర్మాణానికిగాను ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఇప్పటికే 309 కోట్ల రూ॥లను కేటాయించిందని అద్వానీ ఈ సమావేశంలోనే చెప్పాడు. నిజానికి కొన్నిరోజుల తర్వాత కేంద్ర ఉపరితల రవాణా శాఖామంత్రి సుందర్‌లాల్ పట్వా 'ప్రధానమంత్రి గ్రామోదయ్ యోజన్' అనే నూతనంగా ప్రారంభించబడిన పథకం కింద గ్రామీణ రహదార్ల నిర్మాణానికిగాను 2,500 కోట్ల రూ॥ల భారీ మొత్తాన్ని ఈ ఆర్థిక సం॥రంలో కేటాయించినట్లు ప్రకటించాడు. తొలి దశలో 1000 మంది జనాభాతో కూడిన గ్రామాలన్నీ అన్ని కాలాలలో పనికొచ్చే

రోడ్లతో అనుసంధించబడ్తాయని అతడు చెప్పాడు. వాస్తవానికి దిగ్విజయ్‌సింగ్ ఢిల్లీలో పట్వాని కలుసుకుని మధ్యప్రదేశ్‌లో పీపుల్స్‌వార్ ప్రభావిత ప్రాంతాల్లో 201 కోట్ల రూ॥ల ఖర్చుతో 2,700 కి.మీ. రోడ్లను నిర్మించే ప్రతిపాదనను సమర్పించాడు.

సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్]కి వ్యతిరేకంగా చేపట్టిన సైనిక పథకాలు ఇవన్నమాట. ఇవి ఇంకా ఒక రూపం దాల్చలేదు. వాస్తవానికి మరిన్ని పథకాలు రహస్యంగా వుంచబడినాయి. ఇవి తర్వాత వెలుగులోకి రావచ్చు. అయితే ఒకటి మాత్రం స్పష్టంగానే వుంది. పాలకవర్గాలు ప్రజల నుండి పూర్తిగా వేరుపడి పోయారు. ప్రజలను అదుపులో పెట్టడానికి తుపాకులు తప్ప వేరు మార్గం లేదని వారు అభిప్రాయానికి వచ్చేశారు. ప్రపంచబ్యాంకు వారి గొంతు నులుము తుండటంతో కనీసపాటి ప్రజా సంక్షేమ సంస్కరణలు కూడా అసాధ్యమై పోయినాయి. ఈ విధంగా ప్రజలనుండి వేరుపడి పోయిన పాలకులు తమ వునికి కోసం విదేశీ ఏజెన్సీల నుండి పెరగనున్న సహాయంపై ఆధారపడబోతున్నారు.

## విదేశీ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ 'నిపుణుల' ఆగమనం

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పీపుల్స్‌వార్ కార్యకలాపాలపై జరిగిన ఒక ముఖ్యమైన చర్చలో పాలకుల ఈ ఒంటరితనం బాగా ప్రతిబింబించింది. ఈ చర్చలో పాలకవర్గ సభ్యులు మాత్రమే పాల్గొన్నారు. భయకంపితుడైన బి.జె.పి. పక్ష నేత రహస్య సమావేశాన్ని కోరుకున్నాడు. పలువురు సభ్యులు పీపుల్స్‌వార్ హిట్‌లిస్టులో వున్నారని అందువల్ల బహిరంగ చర్చలో పాల్గొనడానికి వారు భయపడుతున్నారని అతడు చెప్పాడు. మాజీ (కాంగ్రెస్) హోంమంత్రి మైసూరారెడ్డిని ఈ సమస్యపై సూచనలు అందజేయమని ముఖ్యమంత్రి ప్రత్యేకించి కోరగా, ముఖ్యమంత్రే స్వయంగా శాంతి భద్రతలను సమీక్షిస్తున్నందువల్ల తాను చెప్పడానికి ఏమీ లేదని అతడన్నాడు. ఆ విధంగా శాసనసభలో సైతం ముఖ్యమంత్రి, అతడి అనుయాయులు వేరుపడి పోయిన పరిస్థితి ఏర్పడింది. పీపుల్స్‌వార్‌కి వ్యతిరేకంగా కొంతమంది మాత్రమే బహిరంగంగా ముందుకు రావడానికి ఇష్టపడ్డారు. ఉదాహరణకు ప్రజల నుండి వారు ఎంతగా వేరుపడి పోయారంటే ఆ సమావేశం జరుగుతుండగానే అంగన్‌వాడీ మహిళలపై పోలీసులు చేసిన లాఠీ చార్జీకి ముఖ్యమంత్రే క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. కేవలం 500 రూ॥లు స్టైఫండ్ మీద నియమించబడి, ఇపుడు ఆ మొత్తాన్ని పెంచాలని డిమాండు చేస్తున్న విద్యా వాలంటీర్ల ప్రతినిధి బృందం ఆగ్రహాన్ని కూడా ముఖ్యమంత్రి చవిచూడాల్సి వచ్చింది.

పాలకులు రాన్రానూ మరింతగా వేరుపడి పోవటంతో వారు చావు భయంతో తీవ్రవాద వ్యతిరేక చర్యలలో సహాయానికిగాను తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇది ఏప్రిల్ నాటికి తీవ్రస్థాయికి చేరింది.

అమెరికాతో 'టెర్రరిజం'కి వ్యతిరేకంగా 'జాయింట్ వర్కింగ్ గ్రూప్'ని ఏర్పర్చిన నాటి నుంచి అమెరికన్ ఇంటెలిజెన్స్ సర్వీస్‌లు మన దేశంలో చురుకైన పాత్ర వహిస్తున్నాయి. అనేక దేశాలలో కోవర్ట్ ఆపరేషన్లకు పాల్పడిన దుష్ట చరిత్ర గల్గిన ఎఫ్.బి.ఐ. (అమెరికా నేర పరిశోధక శాఖ) సొంత ఆఫీసును అధికార పూర్వకంగానే దేశంలో అనుమతించారు. ఏప్రిల్ 3న భారతదేశానికి మూడురోజుల పర్యటన నిమిత్తం వచ్చిన యఫ్.బి.ఐ. చీఫ్, హోంమంత్రితో ప్రధానమంత్రి జాతీయ భద్రతా సలహాదారు బ్రిజేష్‌మిశ్రాతో, సి.బి.ఐ. నేతతో, ఇంటెలిజెన్స్ నేతలతో అత్యున్నత స్థాయి సమావేశాలు జరిపాడు. టెర్రరిజాన్ని ఎలా ఎదుర్కోవాలన్నదే ఈ సమావేశాల్లో ఏకైక చర్చనీయాంశమై పోయింది. దేశం లోపలి కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కార్యకలాపాలలో జాయింట్ వర్కింగ్ గ్రూప్ అమెరికాకే పెద్ద పాత్రను కల్పించింది. నిజానికి ఇది దేశంలోపల అమెరికా ప్రత్యక్ష జోక్యానికి తలుపులు తెరచింది.

ఈ ముఖ్యమైన పథకానికి తోడుగా, రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్ సుదీర్ఘ పర్యటన కోసం వియత్నాం వెళ్ళాడు. గెరిల్లా యుద్ధతంత్రంలో సుదీర్ఘ అనుభవం కల్గిన వియత్నామీయులను తిరుగుబాటు వ్యతిరేక చర్యలలో భారతీయ అధికార్లకు శిక్షణనివ్వాలంటూ అభ్యర్థించడమే ఈ పర్యటనలో అతని కార్యక్రమం. కమ్యూనిస్టు విప్లవకారులకు, కుర్దిష్ యోధులకు వ్యతిరేకంగా దశాబ్దంపాటు నిర్దాక్షిణ్యమైన, పాశవిక కేంపెయిన్‌ను సాగించిన టర్కీ ప్రధానమంత్రి భారతదేశంలో పర్యటించినపుడు సైతం, భారత ప్రభుత్వం టెర్రరిజంతో పోరాడేందుకు ఉమ్మడి కేంపెయిన్ చేపడదామంటూ టర్కీని అభ్యర్థించింది.

చివరగా ప్రధానమంత్రి, హోంమంత్రి, మానవ వనరుల అభివృద్ధి మంత్రి, భద్రతా విషయాలపై చర్చించేందుకుగాను హిందూ ఫాసిస్టు సంస్థల ప్రధాన నేతలందరితో అత్యున్నత సమావేశాన్ని జరిపారు. ఆర్.యస్.యస్., విశ్వహిందూ పరిషత్, స్వదేశీ జాగరణ్ మంచ్, ట్రేడ్ యూనియన్ అయిన భారతీయ మజ్దూర్ సంఘంకి చెందిన ముఖ్యులందరూ ఈసమావేశానికి హాజరయినారు. స్పష్టంగానే ప్రజల ఆగ్రహాన్ని పక్కకు మళ్ళించడానికిగాను మతపరమైన హింసకు సంబంధించిన కుట్ర ఈ సమావేశంలో జరిగే వుంటుంది!! హిందూ ఫాసిస్టులు అంతా సమావేశమవడానికి ఇంతకు మించిన ''భద్రతా విషయాలు'' ఏముంటాయి మరి?

## చరిత్ర నిర్మాణంలో ప్రజలు మాత్రమే చోదకశక్తి

కానీ, ఈ అన్ని పథకాలూ వీగిపోక తప్పదు. భూమ్మీద ఏ శక్తి కూడా మేల్కొన్న చైతన్యవంతులైన ప్రజలను అణచివేయలేదు. హైటెక్ కౌంటర్ ఇన్‌సర్జెన్సీకి కూడా దాని లోపాలు దానికుంటాయి. ఎందుకంటే తన చర్యలకుగాను ఆర్థికపరమైన ప్రయోజనాలను మాత్రమే ఆశించే కిరాయి బలగాలు దాన్ని ఉపయోగిస్తున్నాయి. దీనికి తోడుగా దిగువ శ్రేణి పోలీసులు, సైన్యం తమ యజమానుల ప్రయోజనాలను కాపాడేందుకు తాము బలిపశువుల్లాగా ఉపయోగింప బడుతున్నామని త్వరలోనే గ్రహిస్తారు. ఏదో ఒక రోజు వీరు తమ తుపాకులను వారి నిజమైన శత్రువు వైపే గురిపెడతారు. ఈలోపుగా, విప్లవ చైతన్యంమీద నిర్మింపబడిన వుద్యమం వందలాది వేలాది కేడర్లను నేలకొరిగిన వారి ప్రియతముల స్థానంలో ప్రవేశ పెడుతుంది. అందువల్లే గత కొద్ది సం॥లుగా భారీ నష్టాలను చవి చూసినప్పటికీ పీపుల్స్‌వార్ పార్టీ మరెంతో విశాల ప్రాంతాలకు విస్తరించడం కొనసాగిస్తోంది. శత్రువు సైతం దీనిని అంగీకరించక తప్పలేదు. భారత విప్లవం మరింత నూతన శిఖరాలకు పురోగమించడాన్ని కొనసాగిస్తూనే వుంది. ❑

**ప్రజా పోరాటాలు**

# జీవించే హక్కు కొరకు 'దబ్బ' సారిస్తున్న నల్లమల ప్రాంత చెంచు గిరిజనులు

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'హైటెక్' మాటలతో ప్రజలకు అరచేతిలో కంప్యూటర్ స్వర్గాలు చూయిస్తూ అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ రాష్ట్ర పర్యటనకొచ్చినపుడు ఒక నిముషంలోనే కంప్యూటర్ ద్వారా క్లింటన్‌కు డ్రైవింగ్ లైసెన్స్ జారీచేసి, ఎలక్ట్రానిక్ పాలనతో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటూ, మరో ప్రక్క ప్రచారం చేయించు కుంటున్నాడు. ఎలక్ట్రానిక్ పరిపాలన పేరుతో, వీడియో కాన్ఫరెన్స్‌ల పటాటోపం ప్రదర్శించుతున్న చంద్రబాబు పాలనలో, ఇంకా వేల సంవత్సరాల నాటి, క్రీస్తు పూర్వం నాటి 'ఆహార సేకరణ' దశలోనే, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు బ్రతుకుతున్నారు అంటే, బ్రతకాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి అంటే, అది చంద్రబాబు హైటెక్ నయవంచనా శిల్పానికి మచ్చుతునకగానే చెప్పుకోవాలి. ప్రకాశం జిల్లాలోని యర్రగొండ పాలెం, డోర్నాల మండలాల పరిధిలోని నల్లమల అడవిలో జీవించే చెంచు గిరిజనులను చూస్తే, ఆ విషయం బోధ పడుతుంది. ఈ రెండు మండలాల్లో దాదాపు 25 చెంచు గిరిజన గూడాలున్నాయి. అడవిలో దొరికే చింతపండు, కుంకుడు కాయలు, బంక, తేనె, సుగంధ పాలవేర్లు, చిల్ల గింజలు, ముష్టి గింజలు, కానుగ పప్పు, ఇప్ప పలుకు, సారపప్పు మొ॥నవి సేకరించి, అమ్ముకుని జీవిస్తున్నారు.

కానీ, ప్రభుత్వం అనుసరిస్తున్న విచక్షణా రహిత అడవుల నరికివేత విధానం వలన, క్రమంగా అటవీ సంపద తరిగిపోతున్నది. దానికి తోడు అడవి వెలుపలి గ్రామాల నుండి గిరిజనేతరులు వచ్చి అటవీ సంపద సేకరించి తీసుకు వెళ్తుండటంతో సేకరణ కష్టమవుతున్నది. గిరిజన కార్పోరేషన్ వాళ్ళ స్టోర్‌లు వున్నా, రకరకాల మోసాలతో తిండికీ, బట్టకూ కరువు నెదుర్కొంటున్నారు. సరైన తిండిలేక, పోషకాహారం లోపం వల్ల టి.బి., నెమ్ము, ఆయాసం, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలతో బాధపడుతున్నారు. రక్తహీనత వల్ల ప్రసవ సమయాల్లో తల్లో, బిడ్డో మరణిస్తున్నారు. ఈమధ్య కాలంలో యర్రగొండ పాలెం మండలంలో ఆరుగురు మహిళలు వైద్యంలేక మరణించారంటే, ప్రభుత్వం వాళ్ళని ఎంతగా ఆదుకుంటుందో అర్థం చేసుకోవచ్చు. గజ్జి, తామర లాంటి వ్యాధులు సోకి ఆసుపత్రికి వెళ్ళినా, మందులు లేవని, బడ్జెట్ లేదని చెప్తున్నారు. తిండి, వైద్య సౌకర్యాలు లేక చెంచుల మరణాలు పెరుగుతున్నాయి. అందువల్ల గతంతో పోల్చుకున్నపుడు, నేడు చెంచుజాతి తగ్గి పోతున్నది.

1987లో ఆదిలాబాద్ జిల్లా అల్లంపెల్లిలో పోలీసుల్ని మన పార్టీ గెరిల్లా దళాలు మట్టి గరిపించిన తర్వాత, అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, ఆదిలాబాద్‌లోనేగాక, మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులను పోరాటాల నుండి ప్రక్కదోవ పట్టించడానికి, పోరాటాలలోకి రాకుండా చేయటానికికని, సంస్కరణల నాటకం మొదలు పెట్టాడు. దానిలో భాగంగా, ప్రకాశం, గుంటూరు, కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ జిలాలలోని నల్లమల అటవీ ప్రాంతంలో నివశిస్తున్న చెంచు గిరిజనులను 'అభివృద్ధి' చేసే పేరుతో 1988లో సున్నిపెంట (శ్రీశైలం)లో ముఖ్యంగా చెంచు గిరిజనుల కోసం ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు స్థాపించాడు. అప్పటినుండి కోట్లాది రూపాయలు గిరిజనుల పేరుమీద విడుదల చేస్తూ, గిరిజనులకు అరా కొరా, నామమాత్రపు సహాయాలు చేస్తూ, రాజకీయ ప్రముఖులు, అధికారులు డబ్బు దిగమింగుతున్నారు.

ముఖ్యంగా, 'ఆహార సేకరణ దశ'లో జీవించిన ఆదిమ మానవులలాగా ఇంకా ప్రధానంగా 'ఆహార సేకరణ' మీదే ఆధారపడి జీవిస్తున్న చెంచు గిరిజనులను ఆహార ఉత్పత్తి చేసేటట్లుగా మార్పు చేయాలని, చెంచు గిరిజనుల్లో వ్యవసాయం ప్రోత్సహించటానికి ఆర్భాటంగా పథకం మొదలుపెట్టినా, అప్పటినుండి ఇప్పటిదాకా అనేక గూడాలలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే వున్నట్లుగా వుంది. ప్రతి గిరిజనుడికీ 5 ఎకరాల అటవీ భూమినిచ్చి, దాన్ని వ్యవసాయ యోగ్యం చేసి (దానిలోని చెట్లు, మొద్దులు తీసేయించి) వ్యవసాయం చేయటానికి కావలసిన జ్ఞానం నేర్పి, అన్ని రకాల సహాయ సౌకర్యాలు కల్పిస్తే, గిరిజనులు అభివృద్ధి కావటానికి అవకాశం వుండేది. కానీ, గిరిజనుల అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయలు స్వాహా అవుతున్నాయి కానీ, అభివృద్ధి మాత్రం లేదు. ఎద్దులు, అరక సామాన్లు, విత్తనాలు, ఎరువులు ఇచ్చి, బోర్లు, బావులు వేయించి సేద్యాన్ని వృద్ధి చేయకపోగా, కేటాయించిన నిధులన్నీ అధికారులు, అనధికారులు, నాయకులు దిగమింగుతున్నారు. కాళ్ళు అరిగేదాకా తిరిగితే, వ్యవసాయానికి పనికిరాని ముసలెద్దులు, పుచ్చిపోయిన విత్తనాలు, గజ్జి మేకలు ఇస్తున్నారు.

భూములు నరికి మొద్దులు తీస్తే, చెంచు గిరిజనులకు తిండిభత్యం నిమిత్తం ఇవ్వాల్సి వుండగా అవీ సక్రమంగా ఇవ్వటం లేదు. కొన్ని గూడేలలో చింత మొక్కలు, మామిడి మొక్కలు చెంచు గిరిజనుల భూముల్లో నాటిస్తూ, అవి పెరిగిన తర్వాత వాటిపై వచ్చే ఫలసాయం మీకే అంటూ గిరిజనులను ఆహార పంటలకు, భూమికి దూరం చేస్తున్నారు. ఏ రోజు తిండికి ఆ రోజు వెతుక్కునే 'కరువు' పరిస్థితి నెదుర్కొంటున్న గిరిజనులకు ప్రకాశం, కర్నూలు జిల్లాలలో నెలకొని వున్న ఈ ఏటి కరువు పరిస్థితులలో, ప్రభుత్వం కనీస సహాయం కూడా అందించక పోవటంతో, ఇవాళ నల్లమల ఫారెస్ట్ డివిజన్ ఏరియాలో (కర్నూలు, ప్రకాశం జిల్లా అటవీ ప్రాంతం) ఉన్న చెంచు గిరిజనులు పోరాటం చేయాల్సిన అనివార్య స్థితిలో పడ్డారు. అందుకోసం ప్రస్తుతం తాము తీవ్రంగా ఎదుర్కొంటున్న కరువు సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, పోరాటానికి నడుం కట్టారు.

దానికోసం 9 మందితో కరువు వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రింది డిమాండ్‌లతో సున్నిపెంట, ఐ.టి.డి.ఏ. ఆఫీస్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు.

**డిమాండ్స్:**

1. పొలాలలో మొద్దులు తీయించటం, చెక్ డాములు కట్టించడం లాంటి కరువు సహాయక పనులు వెంటనే కల్పించాలి.
2. కరువు భత్యం నిమిత్తం ప్రతి కుటుంబానికి క్వింటాలు బియ్యం, జొన్నలు ఉచితంగా ఇవ్వాలి.
3. చెంచు గూడాలలో వైద్య సౌకర్యం కల్పించాలి. టి.బి. పేషెంట్లకు ఆహారం, మందులు ఇవ్వాలి.
4. అటవీ ఉత్పత్తులకు వెంటనే న్యాయమైన ధరలు కల్పించాలి.
5. వ్యవసాయ భూమితోపాటు, బోర్లు, బావులు, ఎద్దులు, పనిముట్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించి, చెంచు గూడాలలో శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలి.
6. తాత్కాలిక టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలి.

ఈ డిమాండ్స్‌తో, మార్చి 20 వ తేదీన 15 గూడేలకు చెందిన 400 మంది చెంచులు సున్నిపెంట తరలి వెళ్ళారు. సున్నిపెంటలో ఊరేగింపు తీయటానికి స్కూల్ వద్దకు చేరిన చెంచుల దగ్గరకు ఐ.టి.డి.ఏ. ప్రాజెక్టు ఆఫీసర్ వీరభద్రుడు వస్తే తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేయటానికొచ్చామని చెంచులు చెప్పారు.

గిరిజనుల కోసం ఎంతో కృషి చేస్తున్నానని ప్రచారం చేసుకుంటున్న ప్రాజెక్టు ఆఫీసర్ (పి.ఓ.), చెంచులు ఊరేగింపుతీసి, ధర్నా జరిపితే, తన బండారం బయటపడుతుందని గ్రహించి, ధర్నా జరగకుండా చేయటానికి ఇక్కడే, ఇప్పుడే మాట్లాడుకుందాం అని ప్రతిపాదన పెట్టాడు. కానీ, పి.ఓ. కపటత్వం గ్రహించిన చెంచులు ఊరేగింపు, ధర్నా చేస్తామని, అప్పుడే అక్కడకు వచ్చి మాట్లాడమని తేగేసి చెప్పారు.

ఆ తర్వాత, తమ డిమాండ్స్‌తో కూడుకున్న బ్యానర్లు చేతబట్టి, 400 మంది గిరిజనులు సున్నిపెంటలో ఊరేగింపు తీసి, ఐ.టి.డి.ఏ. ఆఫీస్ వద్ద గంటసేపు ధర్నా చేశారు. అక్కడికి వచ్చి సమాధానం చెప్పటానికి పి.ఓ. ముఖం చాటేయగా, మిగిలిన అధికార్లతో గిరిజనులు మాట్లాడారు.

జంతువుల నుండి ఆత్మరక్షణ కొరకు, ఆహారం కొరకు 'దబ్బ' సారించే చెంచు గిరిజనులు, జీవించే హక్కు కొరకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా 'దబ్బ' సారించటానికి ఉద్యుక్తులవు తున్నారన్న విషయం తెలియజేస్తున్న ఈ పోరాటం, నల్లమల వ్యాప్తంగా, ఐ.టి.డి.ఏ. పరిధిలో వున్న చెంచు గిరిజనులందరూ మరింతగా సంఘటితమై, ప్రభుత్వ దోపిడీని, సంస్కరణలను, నిర్బంధాన్ని తిప్పి కొడ్తారన్న దానికి సంకేతంగా భావించాలి.

## సాహుకార్లను నిలదీసి గిట్టుబాటు ధరలను సాధించుకున్న విశాఖ గిరిజన రైతాంగం

విశాఖ ఏజెన్సీలో గిరిజన రైతాంగం పండించే పంటలలో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల్లో అపరాలు ఎక్కువగా పండిస్తారు. ఈ వ్యాపారం కోట్ల రూపాయలలోనే సాగుతుంది. నర్సీపట్నంలో వుండే కొంతమంది లైసెన్స్‌డ్ షావుకార్లు తమ బ్రోకర్ల ద్వారా అన్ని సంతలు, మరియు గ్రామాలలో కొనుగోలు చేయిస్తుంటారు. రైతాంగం దగ్గర అతి చౌకగా అపరాలు కొని, రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నారు.

రైతాంగ పంటలపై జరిగే షావుకార్ల దోపిడీని ఎదిరించడానికి వేర్వేరుగా కొనే షావుకార్లను నిలదీయడానికై, ఈ సంవత్సరం తాండవ లోకల్‌గెరిల్లా దళం ఏరియాలో ప్రజలు సంఘటితపడ్డారు. ఏరియా మొత్తాన్ని 2 ప్రాంతాలుగా విభజించి, ''రైతాంగ పంటల గిట్టుబాటు ధరల పోరాట కమిటీ''లు రెండింటిని ఏర్పాటు చేసుకున్నారు. అలాగే మూడు క్యాంపెయిన్ దళాలతో, ఏరియాలో ప్రచారం చేశారు. రైతాంగం వద్ద నుండి అపరాలు కొనే షావుకార్లు (వారి బ్రోకర్లు) తో 'రైతాంగ గిట్టుబాటు ధరల పోరాట కమిటీ'లు చర్చలు జరిపాయి. వేర్వేరుగా రెండు సెంటర్లలో ఆయా కమిటీల నాయకత్వంలో జరిగిన చర్చల్లో సుమారు 55 మంది రైతాంగం పాల్గొన్నారు. ముందు అతి తక్కువ రేట్లు ప్రకటించిన షావుకార్లు, చివరకు రేట్లు పెంచి కొనుగోలు చేయటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. అవి ఈ క్రింది విధంగా వున్నాయి.

| ధాన్యం రకాలు | కేజీకి | 4కేజీల కుంచానికి |
|---|---|---|
| తెలుపులు | 25 | 100 |
| ఎరుపులు | 18.75 | 75 |
| బిన్నీస్‌లు | 18.75 | 75 |
| కొండ కందులు | 25 | 100 |

వీటితోపాటు, మరికొన్ని షరతులకు కూడా షావుకార్లు ఒప్పుకున్నారు. అవి

1. అపరాలకు మార్కెట్లో ఒప్పందం కుదిరిన రేటుకంటే మరింతగా పెరిగితే, మళ్ళీ ఆ రేట్లకు తగిన విధంగా చర్చలు చేసి, నిర్ణయించుకోవటానికి,
2. తప్పుడు కొలతలతో షావుకార్లు కొలుచుకోవటం కాకుండా, ఖచ్చితంగా 4 కేజీల కుంచంతోనే పంట పండించిన రైతే కొలిచేటట్లుగాను;
3. ఇక్కడ ఒప్పందానికి వచ్చిన షావుకార్లు తాము కొనుగోలు చేసే ఏరియా మొత్తంగా ఒప్పందమైన పద్ధతిలో కొనుగోలు చేయాలని, రైతాంగానికి ఒకేసారి డబ్బంతా ఇవ్వటానికి ఒప్పుకున్నారు.

### కోరుకొండ ఏరియా:

కోరుకొండ లోకల్‌గెరిల్లా దళం ఏరియాలో (ఒరిస్సా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా, గుమ్మ బ్లాక్ పరిధిలో)ని సుమారు 35 గ్రామాల గిరిజనులు తాము ఏటా పండిస్తున్న పంటలకు (పసుపు, అపరాలు, అలుసులు, బిరి, సిరికందులు) గిట్టుబాటు ధరలను సాధించు కోవటానికై, గిట్టుబాటు ధరల పోరాట కమిటీను ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఏరియాలో కొనుగోలు చేస్తున్న ఆరుగురు షావుకార్లను, పోరాట కమిటీ నాయకత్వం క్రింద, సుమారు 400 మంది ప్రజలు గిట్టుబాటు ధరల కొరకు నిలదీశారు. దాంతో, ప్రజల సంఘటిత శక్తికి తలవంచిన షావుకార్లు ఈ క్రింది డిమాండ్లను అంగీకరించారు. అవి:

1. పంటకు న్యాయమైన ధరను కల్పించటం,
2. మార్కెట్‌లో రేటు డౌన్ అయిందనే పేరుతో మరలా రేటు తగ్గించి మోసం చేయకుండా, సీజనంతా ఒప్పందం కుదిరిన రేటుకు కొనుగోలు చేయడం.
3. రైతాంగమే పంటను కొలిచేటట్లు, షావుకార్ల తూకం, కాటాలను అనుమతించరని.
4. వాయిదాల పద్ధతిలో కాకుండా షావుకార్లు డబ్బంతా ఒకేసారి చెల్లించేటట్లుగాను.
5. దినుసులు ఎవరికైనా అమ్ముకునే స్వేచ్ఛ.

అలాగే ఈ సంవత్సరానికి సాధించుకున్న రేట్లు ఈ క్రింది విధంగా వున్నాయి.

| ధాన్యం రకాలు | 1 కేజీకి రూ॥లలో |
|---|---|
| తెలుపులు | 35.00 |
| ఎరుపులు | 22.50 |
| బిన్నీస్‌లు | 20.00 |
| ఛిరి | 20.00 |
| అలుసులు | 16.00 |
| సిరికందులు | 25.00 |
| చెల్ల-పసుపు | 150.00 |
| రాశి-పసుపు | 100.00 |

## ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న సర్పంచ్, సెక్రటరీ, సేల్స్‌మెన్‌లను నిలదీసిన ప్రజానీకం

కోరుకొండ యల్.జి.యస్. ఏరియా ప్రాంతంలో (ఒరిస్సా రాష్ట్రం, మల్కన్‌గిరి జిల్లా, గుమ్మి బ్లాక్ పరిధిలో)ని రాళ్ళగెడ్డ పంచాయితీ సర్పంచ్, సెక్రటరీ, సేల్స్‌మెన్ అనేక విధాలుగా ప్రజలను మోసగిస్తూ, నానా ఇబ్బందులు పెడుతున్నారు. పంచాయితీకి చెందిన పనులకు (రోడ్లు, బావులు, కల్వర్టులు, స్కూల్ భవనాలు, ఇళ్ళు) తామే కాంట్రాక్టర్లుగా నిలబడి పనులను సరిగా చేయించక పోవటమే కాకుండా, పనులను రోజువారీ కూలి పద్ధతిలో కాకుండా, గుత్త (కాంట్రాక్టు) పద్ధతిలో ఇస్తూ, వేలాది రూపాయలు స్వాహా చేస్తున్నారు. ఈ ముగ్గురూ కుమ్మక్కయి రేషన్ డిపోల ద్వారా ప్రజలకు ఇవ్వాల్సిన బియ్యాన్ని బ్లాక్ మార్కెట్లో, దుకాణాల్లో అమ్ముకుంటున్నారు. ఇదేమని అడిగిన వారిని కొట్టడం, బెదిరించటం చేస్తున్నారు. ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను భరించలేని ప్రజానీకం, సుమారు 30 గ్రామాల నుండి 300 మంది ప్రజలు కదిలి, గెరిల్లాల సమక్షంలో సర్పంచ్‌ను, సెక్రటరీని, సేల్స్‌మెన్‌లను గట్టిగా నిలదీశారు. దాంతో తలవంచిన ఆ ముగ్గురూ అప్పటివరకూ చేసిన తప్పులన్నీ ఒప్పుకున్నారు. ఈ క్రింది విధంగా చేయటానికి ఒప్పుకున్నారు.

1. పంచాయితీకి మంజూరయిన పనులను, దాని విలువ ప్రజలకు తెలియ చేయటానికి,
2. ఏ గ్రామానికి మంజూరయిన పనిని, ఆ గ్రామం వారికే ఇవ్వటం, కాంట్రాక్టు పద్ధతిన కాకుండా, రోజువారీ కూలీ పద్ధతిన ఇవ్వటానికి,
3. ఆడ, మగ తేడా లేకుండా, రోజువారీ కూలీ 30 రూ॥లు ఇవ్వటానికి,
4. రేషన్ దుకాణంలో తూకం సరిగా వేయటం, ఏ రైతు అయినా రేషన్ దుకాణంలో ఒక నెల తన కోటా తీసుకోకపోతే, మరో నెలలో అయినా ఇచ్చేటట్లుగా,
5. రేషన్ కార్డులు లేనివారికి రేషన్ కార్డులున్న వారికి ఇచ్చే దానికన్నా సగం తగ్గించి ఇచ్చేటట్లుగా, రేషన్ కార్డులు లేని వారికి ఇప్పించేటట్లుగానూ మొ॥న డిమాండ్లు సాధించుకున్నారు. అలాగే, ఇంతవరకూ ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడినందుకుగాను ప్రజలకు క్షమాపణలు చెబుతూ ప్రజలమధ్య గుంజీలు (ఒక్కొక్కరు 20 చొప్పున) తీయాలని ప్రజలు పట్టుపట్టగా పై ముగ్గురూ కూడా ప్రజలకు క్షమాపణలు చెప్తూ, గుంజీళ్ళు తీసారు. ఇదే సమయంలో సర్పంచ్, సెక్రటరీ, సేల్స్‌మెన్‌ల పెత్తనం నశించాలి, ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు ఇచ్చారు.

# భూపోరాటాలు

## కొనసాగుతున్న పట్టాభూముల ఆక్రమణలు

ఫ్యాక్షన్ రాజకీయాలకు నిలయమైన అనంతపూర్ జిల్లాలో, మన పార్టీ నాయకత్వంలో బలపడుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయటానికి ప్రభుత్వం నిర్బంధం పెంచుతూ, గ్రామాలమీద దాడులు చేస్తూ సంఘ నాయకత్వాన్ని, సభ్యులను, సానుభూతిపరులపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తోంది. ప్రజలు చైతన్యవంతులవుతూ, ఫ్యాక్షన్ రాజకీయాల నుండి, ఆ నాయకుల ప్రభావం నుండి బయటపడుతూ, వర్గ పోరాటంలో భాగస్వాములు కాకుండా చేయటానికే ఈ కుట్రంతా. కానీ, ప్రభుత్వ కుట్రనీ, దాడుల్నీ లెక్క చేయకుండా, ప్రజలు పోరాటాలు కొనసాగిస్తూనే వున్నారు. జిల్లాలో జరుగుతున్న భూపోరాటాలను ముందుకు తీసుకుపోతూనే వున్నారు. అందులో భాగంగా, పెన్నహోబిలం దళం ఏరియాలో ఆమిద్యాల గ్రామంలో విప్లవ రైతుకూలీ సంఘం, విప్లవ మహిళా సంఘం ఆధ్వర్యంలో భూపోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని, భూస్వాముల పట్టాభూమిని ఆక్రమించారు. 120 మంది మహిళలు 140 మంది పురుషులు మొ॥న వాళ్ళంతా ఎర్రజెండాలు, బ్యానర్లు చేతబూని ఊరేగింపుగా వెళ్ళి భూస్వాములు, టి.సి. సుబ్బరాయుడుకు చెందిన 50 ఎకరాల మాగాణి, వేలూరు చిన్న రామన్నకు చెందిన 30 ఎకరాల రేగడి, బిరిదేపల్లి నరసయ్యకు చెందిన 40 ఎకరాల రేగడి-భూమిని ఆక్రమించారు. తర్వాత 38 గేళాలు (అరకలు),తో 300 మంది ప్రజలు కలిసి ఆ 120 ఎకరాలలో ఉమ్మడిగా జొన్నపంట వేశారు.

అనంతపురం జిల్లా, పెన్న అహోబిలం దళం ఏరియాలోని రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో, 1998లో అప్పటి ఎం.ఎల్.ఏ. (ప్రస్తుతం తెలుగుదేశం జిల్లా పార్టీ అధ్యక్షుడు), భూస్వామి పయ్యావుల కేశవ్ పట్టాభూముల్ని రైతుకూలీ సంఘం నాయకత్వంలో ఆక్రమించిన విషయం 'క్రాంతి' పాఠకులకు తెలిసిందే! ఆ భూపోరాటాన్ని దెబ్బతీయటానికిగాను కేశవ్, తనకున్న అధికార ప్రాబల్యంతో, ఆ భూములను ఎస్.సి. కార్పోరేషన్‌కు అమ్ముకున్నాడు.

తద్వారా ప్రజల మధ్య వైరుధ్యాలు తీసుకు రావటానికి కూడా పూనుకున్నాడు. ఈ కుట్రకు వ్యతిరేకంగా, రైతుకూలీ సంఘం నాయకత్వంలో భూపోరాట కమిటీని ఏర్పాటు చేసుకుని పోరాటం చేశారు. గతంలో, ఆ భూముల ఆక్రమణ పోరాటంలో పాల్గొన్న భూమిలేని వారికే ఆ భూమి దక్కాలని, రాకెట్ల, కౌకుంట్ల గ్రామాల్లో ఎర్రజెండాలతో ఊరేగింపు తీసి సభ జరిపారు. ఎస్.సి. కార్పొరేషన్ భూస్వాముల ఏజెంట్‌గా వ్యవహరిస్తూ, పీడిత ప్రజల మధ్య చీలిక తీసుకువచ్చే పద్ధతులను అవలంభించడాన్ని, భూస్వామి కుత్రంతాల్ని



పెన్నహోబిలం దళ ఏరియాలోని ఆమిద్యాల గ్రామంలో భూమిని ఆక్రమించుకోవడానికి ఊరేగింపుగా వెళుతున్న ( ప్రజలు

ఎండగట్టారు. దానితో, భూస్వామి కుట్రను అర్థం చేసుకున్న దళితులు, ఎస్.సి. కార్పోరేషన్, భూస్వామి ద్వారా వచ్చిన భూముల్ని తీసుకోమని చెప్పారు.

ఈ సందర్భంలోనే, భూస్వాములు ఎం.ఎల్.ఏ. కేశవ్, కలగల్లు నారాయణరెడ్డిలు, పోలీసులు, ప్రభుత్వం అండతో ప్రజలపై చేయిస్తున్న దాడులకు, కుట్రలకు వ్యతిరేకంగా కూడేరు, ఉరవకొండ మండలాల్లో 13 మందితో క్యాంపెయిన్ చేసారు. భూస్వాముల దాడులపై, కుట్రలపై కరపత్రాలు, పోస్టర్లు ద్వారా ప్రచారం చేసారు.

## ప్రజాశక్తికి తలవంచిన కలగల్లు నారాయణరెడ్డి

పెన్నహోబిలం దళం ఏరియాలోని కూడేరు మండలం కలగల్లు గ్రామంలో భూస్వామి నారాయణరెడ్డి పట్టా భూముల్ని స్వాధీనం చేసుకున్న ప్రజలపై కేసులు పెట్టి అరెస్టులు చేయించాడు. పోలీసులతో తీవ్ర చిత్రహింసలు పెట్టించాడు. దీనికి ప్రతిఘటనగా ప్రజలు సంఘ నాయకత్వంలో భూస్వామి కరెంట్ మోటార్లు ధ్వంసం చేసారు. భూస్వామి ఇంటిని కాల్చివేశారు. భూస్వామి భూములు ఎవరూ సాగు చేయకుండా బంద్ పెట్టించారు.

అక్రమ కేసులు పెట్టి, ప్రజల్ని బెదిరించి లొంగదీసుకోవాలనుకున్న భూస్వామి నారాయణరెడ్డి కుట్ర, ప్రజల ప్రతిఘటనతో విఫలమవటమేగాక, ఈ ప్రతిఘటన చూసి, నారాయణరెడ్డి కుటుంబంతో సహా అనంతపూర్‌కు తోక ముడిచాడు.

నిర్బంధానికి ఏమాత్రం జంకకుండా, పోరాటం చేస్తున్న ప్రజల శక్తి చూసి, చివరకు భూస్వామి నారాయణరెడ్డి ప్రజలకు లొంగిపోక తప్పలేదు. వాడు ప్రజలపై దాడులు చేయించినందుకు గ్రామంలో బహిరంగంగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కేసులకు అయిన ఖర్చులు, ఆస్థి నష్టాలకు నష్టపరిహారం చెల్లించాలని, రైతుకూలీలు స్వాధీనం చేసుకున్న 25 ఎకరాల భూమిని వాళ్ళకే వదలి పెట్టాలని ప్రజలు చేసిన డిమాండ్లు అన్నింటినీ నారాయణరెడ్డి ఆమోదించాడు. గ్రామంలో ప్రజలందరిముందు బహిరంగంగా క్షమాపణలు చెప్పాడు. మిగతా వాటినీ అమలు చేశాడు.

## కౌలు (కోరు) పోరాటం

పెన్నహోబిలం దళం ఏరియాలోని ఉరవకొండ మండలంలోని అనేక గ్రామాల్లో బడా భూస్వాములు తమ భూముల్ని కౌలుకిచ్చి మొత్తం పంటనంతా దోపిడీ చేస్తున్నారు. గత్యంతరం లేని స్థితిలో పేదరైతులు, రైతుకూలీలు ఈ దోపిడీకి బలవుతున్నారు. ఏరియాలో జరుగుతున్న పోరాటాల ప్రభావంతో, రైతుకూలీ సంఘం నాయకత్వాన కౌలు రైతులు, పేదలు సంఘటితపడి, 'కోరు తగ్గింపు పోరాట కమిటీ'ని ఏర్పాటు చేసుకుని, కోరు తగ్గించాలని భూస్వాములను డిమాండ్ చేసారు. పేదల శ్రమ దోపిడీ రుచి మరిగిన భూస్వాములు కౌలు తగ్గింపునకు సిద్ధపడలేదు. దాంతో ప్రజలు మరింత సంఘటితంగా నిలబడి, ప్రజలందరిచేతా భూస్వాముల పొలం పనులు బంద్ పెట్టించారు. ఒక భూస్వామి మొండిగా పని చేయించటానికి సిద్ధపడితే, అడ్డుకున్నారు. అలాగే రైతుకూలీల మధ్య చీలికలు తీసుకు రావాలని ప్రయత్నిస్తే దాన్ని తిప్పికొట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పోస్టర్లు వేశారు. ఎర్రజెండాలు చేబూని ఊరేగింపు జరిపి, సభ జరిపారు. 12 రోజులు ఇలా పోరాటం నడిచిన తర్వాత, ఇక ఈ పోరాటాన్ని అడ్డుకోవటం, గతంలోలా ఇష్టమొచ్చినట్లు కౌలు దోపిడీ చేయటం తమకిక సాధ్యం కాదని గ్రహించిన భూస్వాములు చివరకు దిగివచ్చి, కౌలు రేట్లు తగ్గించటానికి అంగీకరించారు.

## తప్పుడు తూకాలను అరికట్టుకున్న రైతాంగం

రైతాంగం పరిస్థితి అమ్మబోతే అడివి-కొనబోతే కొరివి అన్న నానుడి తెలిసిందే! గ్రామసీమల్లో రైతులు వ్యవసాయ పెట్టుబడుల కొరకు వ్యాపారస్థుల మీదనే ఆధారపడవలసిన పరిస్థితే ఉన్నది. నూతన ఆర్థిక విధానాల పుణ్యమా అని, బ్యాంకులు రైతాంగానికి ఇచ్చే అప్పులు తగ్గించటంతో మరింతగా అప్పుల కొరకు వ్యాపారస్థుల మీదనే ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికితోడు కరువుజిల్లా అయిన అనంతపూర్‌లో, రైతాంగం పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. వీటిని ఆసరా చేసుకుని వ్యాపారస్థులు అనేకరకాలుగా రైతాంగాన్ని మోసం చేస్తున్నారు. పండిన పంటే అంతంత మాత్రమైతే, దాన్నికూడా మార్కెట్ రేటు కంటే తక్కువకి తీసుకోవడం, తప్పుడు తూకాలతో మోసం చేస్తూ, ఎక్కువ కాయలు కాటా వేసుకోవడం

మొదలైన పద్ధతుల్లో దగా చేస్తున్నారు. వ్యాపారస్తుల దగా, మోసం రైతాంగానికి అర్థమైనా, వారితో అప్పుల లావాదేవీలున్న రైతులు, మార్కెట్‌కు తీసుకెళ్ళి అమ్ముకోలేని రైతులు మౌనంగా భరిస్తూ వస్తున్నారు. అయితే ఏరియాలో రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలను చూస్తున్న రైతులు, ఉత్తేజితులై, తామూ సంఘం అండతో పోరాటం చేయటానికి నడుం బిగించారు. అలా, రామగిరి దళం ఏరియాలోని రామగిరి మండలంలోని పి.ఆర్. కొట్టాల, కనగానపల్లి మండలంలోని తగరకుంట, నర్సంపల్లి గ్రామాల్లో రైతాంగం సంఘటితపడి, వ్యాపారస్థుల్ని నిలదీశారు. దాని ఫలితంగా, తగరకుంటలో సరిగాలేని కాటాను మార్చి, కొత్త కాటాతో తూకం వేసేటట్లుగాను, 40 కేజీల వేరుశెనగల సంచికి 530 రూ॥లు ధరను సాధించుకున్నారు. నర్సంపల్లిలో తప్పుడు తూకంతో, మోసపు కాటాతో 40 కేజీల సంచికి 5 కేజీలు ఎక్కువగా కాజేస్తున్న వ్యాపారస్తుల్ని పట్టుకుని, గ్రామంలో బహిరంగంగా పంచాయితీ చేసి, ఒక్కొక్కరికి 5 వేల రూ॥ల చొప్పున ముగ్గురు వ్యాపారస్తుల చేత దండుగ కట్టించారు. అలాగే పి.ఆర్. కొట్టాలలో కూడా సంచికి 4 కేజీల నుండి 5 కేజీల వరకు ఎక్కువ కాయలు తూచుకున్నందుకు గ్రామంలో బహిరంగంగా పంచాయితీ జరిపి వ్యాపారస్తులతో ప్రజలకు క్షమాపణ చెప్పించారు. 15 వేల రూ॥ల దండుగ వసూలు చేసారు.

## మహిళా సమస్యలపై:

### వరకట్న హత్యకు నిరసనగా వెల్లువెత్తిన మహిళలు

నల్గొండ జిల్లా, సంస్థాన్ నారాయణపూర్ (మండల కేంద్రం)కి చెందిన బంటు కులానికి చెందిన వెంకటేశుకు, పొల్కంపల్లి గ్రామానికి చెందిన జ్యోతికి సంవత్సరం క్రితం వివాహం అయింది. వెంకటేశు టీచర్‌గా పనిచేస్తున్నాడు. జ్యోతి 10వ తరగతి చదువుతుంది. పెండ్లి కట్నంగా లక్ష యాభైవేల రూపాయలు ఇస్తామన్నారు. పెళ్ళి అప్పుడు లక్ష రూపాయలు ఇచ్చి, మిగిలినవి తర్వాత ఇస్తామని చెప్పారు. జ్యోతి తల్లిదండ్రులు మిగిలిన డబ్బు ఇవ్వటం ఆలస్యం అయితే, జ్యోతిని వేధించటం మొదలుపెట్టాడు. జ్యోతి స్కూల్‌కు వెడుతుంటే, నువ్వు 'ఎవ్వరితోనో పోతున్నావు' అని నిందలు మోపుతూ, రకరకాలుగా వేధించేవాడు. అలా ఒక రోజు జ్యోతిని చిత్రహింసలు పెట్టి, బెడ్‌రూమ్‌లో చంపి, శవాన్ని వంటింట్లో పడవేసి, సిలిండర్ పేలి కాలిపోయిందని తప్పుడు ప్రచారం చేసాడు. పోలీసు అధికారులకు లంచాలు ఇచ్చి, కేసును కప్పిపుచ్చ ప్రయత్నం చేసాడు. దీనికి వ్యతిరేకంగా, విప్లవ మహిళా సంఘం ప్రజల్ని, ముఖ్యంగా మహిళలను కదిలించి, మండల కేంద్రంలో నిరసన ర్యాలీ జరిపింది. ప్రజలు వెల్లువలా కదిలి వచ్చిన ఈ ర్యాలీలో 2వేల మంది ప్రజలు పాల్గొన్నారు. జ్యోతి హత్యకు నిరసనగా స్కూలు, దుకాణాలు బంద్ పెట్టించారు. 'స్త్రీలపై అత్యాచారాలు నశించాలి', 'వరకట్నపు హత్యలను ఖండించండి', 'జ్యోతి భర్తను శిక్షించాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలిచ్చారు. ఆ డిమాండ్స్‌తో ఎం.ఆర్.ఓ.కు విజ్ఞాపన పత్రం ఇచ్చారు. ప్రజల నుండి రక్షించటానికి వెంకటేశును పోలీసులు లాకప్‌లో పెట్టారు. అది గమనించిన మహిళలు, ఎం.ఆర్.ఓ. ఆఫీసు నుండి పోలీసు స్టేషన్ వద్దకు ప్రజలను కదిలించి, హంతకుడిని కాపాడుతున్నారంటూ పోలీసులకు వ్యతిరేకంగా స్టేషన్ ముందు బైఠాయించారు. వాడిని చంపుతాం, బయటకు పంపండి అని పోలీసుల్ని నిలదీశారు.

### అగ్రకుల భూస్వాములు దళిత యువతిని గర్భవతిని చేసి, ఆమె కుటుంబాన్ని వేధించటాన్ని అరికట్టిన పంచాయితీ

మెదక్ జిల్లా, గిరాయిపల్లి దళం ఏరియాలోని సింగాటం గ్రామంలోని దళిత పురుషులు జీతగాళ్ళుగాను, స్త్రీలు రోజు కూలీలుగానూ పని చేస్తుంటారు. కూలీల, జీతగాళ్ళ పరాధీనతను అవకాశంగా తీసుకుని, భూస్వాములు శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డిలు దళిత యువతి లక్ష్మిపై కన్నేసి, ఆమెకు భూమి ఇస్తామని, డబ్బులు ఇస్తామని అనేక రకాలుగా ఆశలు చూపి, లక్ష్మి నర్సమ్మ అనే మరో మహిళ ద్వారా లొంగదీసుకుని లక్ష్మితో వివాహేతర సంబంధాలు కొనసాగించారు. లక్ష్మి భూస్వాముల బెదిరింపులకు భయపడి ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా దాచి పెట్టింది. కానీ, లక్ష్మికి గర్భం రావటంతో, విషయం బయట పడే పరిస్థితి వచ్చింది. దాంతో శ్రీనివాసరెడ్డి, భూమి రెడ్డిలు లక్ష్మి తల్లిదండ్రులను భయపెట్టి ఎవరికీ చెప్పవద్దని బెదిరించారు. దీంట్లో మాజీ మిలిటెంట్ నర్సింహారెడ్డి కూడా భూస్వాములకు తోడ్పడ్డాడు. అయితే, ఈ విషయం లక్ష్మి నర్సమ్మ ద్వారా అందరికీ తెలిసింది. తర్వాత పత్రికల్లో కూడా వచ్చింది. అపుడు గజ్వేల్‌లోని దళిత సంఘం లక్ష్మి తల్లిదండ్రులతో పోలీసు కేసు పెట్టించింది.

ఈకేసు నుండి భూస్వాములను రక్షించటానికిగాను, గ్రామంలో 'పెద్దలు' పంచాయితీ పెట్టి, శ్రీనివాసరెడ్డి, భూమిరెడ్డిలు లక్ష్మికి నష్టపరిహారం ఇవ్వాలని, లక్ష్మి తల్లిదండ్రులు కేసు రద్దు చేసుకోవాలని, భూస్వాములకు అనుకూలంగా తీర్పు చెప్పారు. అయితే, శ్రీనివాసులు రెడ్డి అన్న మాధవరెడ్డి దీన్ని కూడా అమలు చేయకుండా, కేసు కొట్టివేసిన తర్వాతనే డబ్బులు ఇస్తామని పేచీ పెట్టి, మరలా పంచాయితీ తిరగదోడి, తన తమ్ముడు శ్రీనివాసరెడ్డికి పెళ్ళి అయి 5, 6 సంవత్సరాలు అయినా పిల్లలు పుట్టలేదని, తన తమ్ముడి ద్వారా లక్ష్మికి గర్భం వచ్చే అవకాశం లేదని డాక్టర్ సర్టిఫికెట్ తెచ్చాడు. అంతేకాకుండా లక్ష్మి దగ్గరకు కొంతమంది పెత్తందారులను పంపించి, సభ్య సమాజం తలదించుకునే పద్ధతిలో ప్రశ్నలు అడుగుతూ, తమకనుకూలంగా సమాధానాలు రాబట్టుకుంటూ, అదంతా టేపరికార్డర్ ద్వారా రికార్డు చేసుకుని వెళ్ళారు. అలా లక్ష్మి కుటుంబాన్ని అభాసుపాలు చేయటమే కాకుండా, వేధించడం మొదలుపెట్టారు. ఈ విషయాన్ని దళిత సంఘం, పోలీసులు, కోర్టు ఏ మాత్రం పట్టించుకోలేదు. లక్ష్మి సమస్య తల్లిదండ్రులకు మెడమీద కత్తిలా తయారైంది. ఈ స్థితిలో తమ బిడ్డకు న్యాయం జరగాలంటే 'అన్నల'కు చెప్పుకోక తప్పదనే నిశ్చయానికొచ్చి, పార్టీ దృష్టికి తెచ్చారు.

దళం ఈ విషయమై గ్రామంలో పంచాయితీ నిర్వహించింది. అంతకుముందు పంచాయితీలో తమకు అనుకూలంగా తీర్పు చెప్పించుకుని కూడా, దాన్ని అమలు చేయకుండా, లక్ష్మిని, కుటుంబాన్ని వేధించిన వైనాన్ని ప్రజల ముందు బహిర్గత పర్చారు. వీళ్ళచేత లక్ష్మికి క్షమాపణ చెప్పించారు. లక్షా 20 వేల రూ॥లు లక్ష్మికి ఇవ్వాలని తీర్పు చెప్పారు. ఈ పంచాయితీతో లక్ష్మి కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ❑

**అమరుల జీవిత చరిత్రలు**

# విద్యార్థి, యువజనులకు ఆదర్శంగా నిలిచిన కా॥ భగత్ (శంకరన్న, సురేష్, వాసు) అమర్ రహే!

ప్రజల కోసం జీవించి మరణించడం అత్యంత ఉన్నతమైన అంశం. అటువంటి వారినే ప్రజలు తమ వీరులుగా కీర్తిస్తారు. వారెప్పుడూ ప్రజల హృదయాలలో నిలిచిపోయే వుంటారు. అటువంటి వీరులలో ఒకడు...ఆయన్ను భగత్ అనండి, శంకర్ అనండి, వాసు అనండి, ఆ కామ్రేడ్ అసలు పేరు సురేష్. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరుతో...ఏ ప్రాంతం వెళ్ళినా అక్కడి ప్రజల్ని ప్రేమించి, వారితో మమేకమై కార్మికవర్గ అంతర్జాతీయతా లక్షణాన్ని చాటాడు.

గుంటూరు జిల్లా నర్సరావుపేట పట్టణంలో ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన కా॥ సురేష్ హైస్కూల్ విద్యార్థిగా వుండే రోజుల్లో ఆర్.ఎస్.ఎస్.లోను, కాలేజీలో వున్నపుడు ఎ.ఐ.యస్.యఫ్.లోను, యన్.సి.సి.లో అండర్ ఆఫీసర్‌గా పనిచేసే క్రమంలో ఆయా సంస్థలలో నిత్యం ఊదరగొట్టే కుహనా క్రమశిక్షణ, అభ్యుదయం, బూర్జువా మిలటరీ పద్ధతులను అసహ్యించుకుని, మార్పుకొరకు నిరంతరం అన్వేషణలో నిజమైన విప్లవకర శిబిరానికి తుట్ట తుదకు చేరుకోగలిగాడు. అందుకే మొదటి నుండి చురుకుగా వుండేవాడు. అందమైన జీవితాన్ని గడపాలని అనేకమంది మధ్యతరగతి జీవులు భావించినట్లే సురేష్ కూడా ఊహల్లో విహరించక పోలేదు. కాలేజీలో పగలు లాబ్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూ, రాత్రి యం.యస్.సి. చదువు కొనసాగించాడు. కానైతే, విప్లవ భావాల పరిచయం ఆయన్ను విప్లవం వైపు నడిపించింది. చదువు, ఉద్యోగం వదిలేసి ఎందరో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో విప్లవ కార్యక్రమంలోకి దూకాడు. ఒక ప్రైవేట్ స్కూల్ నడుపుతూ నర్సరావుపేటలోనే ఒక కవర్ సంఘాన్ని స్థాపించి దాన్ని ప్రగతిశీలంగా నడపడంలో అనుభవం సంపాదించాడు. బూర్జువా సంస్కృతిలో కొట్టుకుపోయే విద్యార్థులకు సామాజిక సూత్రాలు, చరిత్ర వివరించి-అత్యంత నేర్పుతో-వారిని ప్రగతిశీలురుగా తీర్చి దిద్దేవాడు. శ్రీలంక తమిళులపై భారత సైన్యం దాడిపై, పత్రికల స్వేచ్ఛను హరించే పత్రికాబిల్లుకు వ్యతిరేకంగా, రాజ్యాంగంలో ప్రవేశపెట్టిన నూతన సవరణకు వ్యతిరేకంగా గోష్టులు, శ్రీశ్రీ స్మారకసభ, ఆర్.యస్.యు. రాష్ట్ర కార్యదర్శి కా॥ విజయ్ మాయం కేసు, ఐ.టి.ఐ. విద్యార్థుల సమస్యలపై, సమ్మెలు చేయడంలో కలిసివచ్చే అన్ని సంఘాలను కలుపుకొని కవర్‌సంఘాన్ని నాయకత్వ సంస్థగా తీర్చిదిద్దాడు. ఈ క్రమంలో ఎంతోమంది విద్యార్థులను, యువతను, మేధావులను నూతన ఆదర్శాల వైపు ఆకర్షించటానికి తీవ్రంగా కృషి చేసేవాడు. అప్పుడే కవర్ సంఘంలో ఏర్పరిచిన పార్టీ సెల్‌లో కా॥ సురేష్ సభ్యుడయ్యాడు.

అయితే సురేష్ కవర్ సంఘ పరిమితుల్లో ఏనాడు వుండలేక పోయేవాడు. కోస్తా జిల్లాల పార్టీ నాయకుడు అమరుడు కా॥ సూర్యంను అరెస్టు చేసినపుడు రహస్యంగా ఒక యాక్షన్‌లో వీరోచితంగా పాల్గొన్నాడు. పార్టీ నిధుల కోసం పబ్లిక్ వసూళ్ళు చేయాలనే పార్టీ పిలుపు నందుకొని ఒక టీంకు నాయకత్వం వహించి ఆ క్రమంలో అరెస్టు కూడా అయ్యాడు. రెండు అక్రమ కేసులు బనాయించారు. బెయిల్‌పై విడుదలైన కొద్ది కాలానికే పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయటానికి నిర్ణయించుకున్నాడు. నర్సరావుపేట టౌన్‌లో విద్యార్థి ఆర్గనైజర్‌గా పనిచేస్తూ అనతి కాలంలోనే కార్యకర్తగా నిలబడగలిగాడు. టౌన్‌లో విద్యార్థులపై గూండాయిజం చేస్తూ, మామూళ్ళు వసూలు చేస్తూ, ఆడపిల్లలను వేధించే ఆనందరాజు అనే గూండాకు దేహశుద్ధి చేయటంలో ముందుపీఠిన నిలిచి ధైర్య సాహసాల్ని ప్రదర్శించాడు. దీంతో శత్రువు నిఘాను తీవ్రతరం చేసి వెంటాడటం ప్రారంభించి చివరికి అరెస్టు చేశాడు. అక్కడ విద్యార్థి వుద్యమం ముందుకెళ్ళే క్రమంలో సురేష్ అరెస్టు నష్టం కల్గచేసింది. బెయిల్‌పై విడుదలై వచ్చిన తర్వాత ఏలూరు పట్టణ విద్యార్థి ఆర్గనైజర్‌గా వెళ్ళాడు.

ఏలూరులో భగత్, వాసు అనే పేర్లతో విద్యార్థులలోకి చొరవగావెళ్ళి పనిచేశాడు. తాను వుండేచోట ఎప్పుడూ చిరుహాస్యపు జల్లులు చిందిస్తూ, తోటి వారికి వుత్సాహాన్ని కల్పిస్తూ ఏదో ఒక నూతన విషయాన్ని బోధిస్తూ, తలలో నాలుకలాగా వుంటూ విద్యార్థులను అపరిమితంగా ఆకర్షించగలిగాడు. ఆ లక్షణమే అమరుడు కా॥ సునీల్ (ఆర్.యస్.యు. రాష్ట్ర ఇ.సి. మెంబర్) లాంటి వారిని రిక్రూట్ చేయడానికి తోడ్పడింది. ఏలూరు పాలిటెక్నిక్, లా కాలేజీలను విప్లవ విద్యార్థి శిబిరాలుగా తీర్చి దిద్దింది. అక్కడ కాలేజీ నిరంకుశ యాజమాన్యం పద్ధతులకు వ్యతిరేకంగా, విద్యార్థి సమస్యలపై విద్యార్థులను కూడగట్టేందుకు కృషి చేశాడు. అనతి కాలంలోనే ఏలూరు పాలిటెక్నిక్‌లో రగిలిన విద్యార్థుల సమ్మె చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయింది. ఆ సమ్మెలో విద్యార్థులే కాక, అధ్యాపకేతర సిబ్బంది సైతం పాల్గొని అత్యంత మిలిటెంట్‌గా నిర్వహించటం వెనుక కా॥ వాసు (భగత్) పాత్ర అడుగడుగునా వుంది. ఈ క్రమంలో టౌన్ సి.ఓ.గా ఎదిగాడు. కార్మికులలో యువకులలో కూడా పనిచేసాడు. జిల్లా నాయకులు లొంగిపోయినప్పటికీ పట్టణంలో వుద్యమాన్ని నిలబెట్టేందుకు పై కమిటీ నుండి ఎటువంటి గైడెన్స్ లేకుండానే స్వతంత్రంగా పనిచేశాడు. పెరుగుతున్న పోరాటాలతోపాటు నిర్బంధం కూడా పెరిగి కా॥ వాసు మళ్ళీ అరెస్టయి సుమారు 2 సం॥ల పాటు జైలులో వున్నాడు.

కా॥ సురేష్ జైలులో తోటి విప్లవకారుల నాయకత్వంలో జైలుని పోరాటకేంద్రంగా మలచటంలో తనవంతు పాత్ర నిర్వహించాడు. చివరకు బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత 1994లో చిత్తూరు జిల్లాలో కాళంగి దళ కమాండర్‌గా పంపబడ్డాడు. అక్కడ శంకరన్న పేరుతో పరిచయమై, గ్రామాలు, రైతాంగం, వారి జీవన విధానం గురించి స్వయంగా ఏమీ పరిచయం లేకపోయినా, వారిని ప్రేమించి, చొరవగా కలసి పోవటం ద్వారా వారి ఆప్తమిత్రుడయ్యాడు. 1995 మొదట్లో కాళంగి దళాన్ని మొత్తంగా కాల్చి చంపి, ఉద్యమాన్ని అణచి వేశామని శత్రువు చేస్తున్న ప్రచారాన్ని వమ్ము చేస్తూ తిరిగి కాళంగి

*(తరువాయి 29వ పేజీలో.....)*

# మరిన్ని నిరంకుశ చట్టాలు తీసుకురావటానికి, మరింతగా అధికారాన్ని కేంద్రీకరించుకోవటానికే రాజ్యాంగ సమీక్ష

బి.జె.పి., టి.డి.పి. లు భారత రాజ్యాంగ సమీక్ష జరపాలని నిర్ణయించిన తర్వాత పార్లమెంట్ హాల్‌లో ప్రధాని వాజ్‌పేయి, రాష్ట్రపతిల మధ్య దానిపై వివాదం రేగిన దగ్గర నుండి, 'సమీక్ష' కేంద్రంగా, దేశ వ్యాప్తంగా నేడు చర్చలు జరుగుతున్నాయి. దీనిపై సమీక్ష జరపాలనే, వద్దనే అభిప్రాయాలతో రాజకీయ పక్షాలు చర్చలు చేస్తున్నాయి. కానీ, రాజ్యాంగం ఏ విధంగా ప్రజల మౌలిక ప్రయోజనాలను నెరవేరుస్తుంది అన్న విషయం మాత్రం ఒక్కరూ మాట్లాడటం లేదు. మనదేశంలో కొనసాగుతున్న అర్ధ భూస్వామ్య-అర్ధ వలస వ్యవస్థకు సేవ చేయటానికి, నూటికి 5 శాతంగా వున్న బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాలు మరింత సంపద కూడబెట్టుకోవటానికే, రాజ్యాంగం (ఇప్పటిదాకా చేసిన 84 సవరణలతో సహా) సేవ చేస్తుందన్నది వాస్తవం.

అయితే, ఇవాళ గొంతు లోతు ఆర్థిక, రాజకీయ సంక్షోభాలలో కూరుకుపోయి వున్న పాలకవర్గాలు, పతనోన్ముఖంగా వున్న ఈ స్థితి నుండి ఏ విధంగా రక్షణ చేసుకోవాలి, తమ యధాతథ (దోపిడీని) స్థితిని ఏ విధంగా నిలుపుకోవాలి అన్న దాని కోసమే ఈ సమీక్షకు పూనుకున్నాయి. రాజ్యాంగ సమీక్షకు అనుకూలంగా, వ్యతిరేకంగా మాట్లాడుతున్న పాలకవర్గాలలోని పక్షాలన్నీ పతనమవుతున్న తమ వ్యవస్థకు ఏదో ఒక రకంగా స్థిరత్వం కల్పించటానికే కేవలం నీడతో యుద్ధం చేస్తున్నాయి.

**నిరంకుశ అధికారాలతో, పచ్చి ఫాసిస్టు పాలనను అమలు చేయటం ద్వారా, దేశంలో 'పరిస్థితులను చక్కదిద్ద వచ్చని' బి.జె.పి., టి.డి.పి. తలపోస్తున్నాయి. ఇప్పుడున్న 'బూటకపు' పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే ఆ పని చేయవచ్చునని మిగతా పక్షాలు మాట్లాడుతున్నాయి. మాట్లాడే దానిలో తేడా అల్లా, బి.జె.పి., టి.డి.పి.లది అతి నగ్నంగా పోరాటకారులను కాల్చిచంపే విధానం కాగా-ప్రతిపక్షం వాళ్ళది ''పాపం ఎదురుకాల్పుల్లో మరణించారు'' అని చెపుతూ ప్రజాస్వామ్య ముసుగును కొనసాగించాలని చూసే విధానం.**

పార్లమెంట్‌లో రాష్ట్రపతి చేసిన ప్రసంగంలో ఈ అభిప్రాయాలు స్పష్టంగా కన్పించాయి. దేశంలో దినదినం పెరిగిపోతున్న దారిద్ర్యాన్ని గురించి, ఆకట్టుకునే విధంగా మాట్లాడినవాడు, దేశంలో తిరుగుబాట్లు వెల్లువలా చెలరేగే పరిస్థితులు నెలకొంటున్నాయి అన్న విషయం మాట్లాడుతూ నేరుగా అసలు విషయం దగ్గరకు వచ్చాడు. ***'మరీ కఠినమైన విధానాలు అవలంభిస్తే, వ్యవస్థలో పెద్ద విస్ఫోటనాలు చెలరేగవచ్చునీ, అందువలన మరీ కఠినమైన విధానాలని వదలి పెట్టాలని'' చెప్తూ, పెద్ద ఎత్తున ప్రజల అసంతృప్తి 'విస్ఫోటనంలా' బద్దలు కాకుండా నిరోధించాలంటే, వాళ్ళ అసంతృప్తులు, నిరాశా నిస్పృహలు వ్యక్తం చేసే రాజకీయ మార్గం వుండాలని, పార్లమెంటరీ వ్యవస్థ అటువంటి మార్గాన్ని కలగ చేస్తుందనీ చెప్పాడు.***

ప్రజల అసంతృప్తిని అదుపుచేసి, దేశంలో (పాలకవర్గాల) స్థిరత్వం సాధించటానికి ఇప్పుడు అమలులో వున్న చట్టాలతో పార్లమెంటరీ వ్యవస్థ సరిపోతుందని రాష్ట్రపతి, కాదు, మరింత నిరంకుశ పాలనాధికారాలతోనే స్థిరత్వం వస్తుంది అని బి.జె.పి.... వాళ్ళు జెఫర్సన్, అబేంద్కర్ మొదలైన రాజ్యాంగ నిపుణుల పేరుమీద మాట్లాడినా, బ్రిటన్, జర్మనీ వ్యవస్థల పేరుమీద మాట్లాడినా పార్లమెంట్‌లో రాష్ట్రపతికి, ప్రభుత్వానికి మధ్య వివాదంలో సారాంశం ఇదే.

## బి.జె.పి. ఎజెండా

ప్రజాస్వామిక పద్ధతులు అవలంభించటానికి సంఘ పరివార్ (ఆర్.యస్.యస్., విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్, ఏ.బి.వి.పి. మొ॥నవి) ఏ మాత్రం సిద్ధంగా లేదు. హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుని, ఆ విధానాలతో పెంచి పోషింపబడుతున్న సంఘ్ పరివార్ ఎప్పటినుంచో అధ్యక్ష తరహా పాలన గురించి మాట్లాడుతోంది. దాన్నే కసాయి చంద్రబాబు నాయుడు కూడా అభిలషిస్తున్నాడు. అందువలన బి.జె.పి., హిందూ మతోన్మాదంతో కూడుకున్న ఫాసిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్నది. రాజ్యాంగ సమీక్ష చేయాలన్న దాని నిర్ణయంలో ఇదీ ఒక భాగమే. రాజ్యాన్ని కాషాయీకరించాలనే ప్రధాన ఆలోచనల్ని కప్పిపుచ్చు కోవటం కొరకే, రాజ్యాంగ సమీక్ష కమీషన్‌ను వేసింది. ఏ విషయం సమీక్ష చేయవలసిన అవసరం వుందో కూడా అది ప్రకటించలేదు. ఎటువంటి నిర్మాణమూ ఏర్పాటు చేయలేదు, మార్గదర్శక సూత్రాలు ఏర్పరచలేదు. అయితేనేం ఒకటి మాత్రం చేసారు. అది కమీషన్‌ను కరడుగట్టిన కాషాయి దొంగలతో నింపటం. 11 మందితో ఏర్పాటు చేసిన ఈ కమీషన్‌కు పెద్ద మొత్తంలో, సంవత్సరానికి ఒక కోటి రూపాయలు కేటాయించారు. అంటే, కమీషన్‌లోని ప్రతి సభ్యుడికి పెద్ద మొత్తంలో నెలకు 40 వేల రూపాయలు (గౌరవ) వేతనం ఇస్తారంతే. మిగిలిన 50 లక్షలు కార్యనిర్వహణ ఖర్చులకని కేటాయించారు.

ఇంకా ఒక్కరోజులో రిటైర్ అవుతాడనగా, ముందు రోజు ఇచ్చిన తీర్పులో, బాబ్రీమసీదు కూల్చివేత ఘటనలో అప్పటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి కళ్యాణ్‌సింగ్ నిర్దోషి అని తీర్పు చెప్పిన ఘనుడు, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి వెంకటాచలయ్య నేతృత్వంలో ఈ కమిటీని ఏర్పాటు చేసారు. 'క్రిమిలేయర్' కిందికి వచ్చే ఎస్.సి., ఎస్.టి. మరియు బి.సి.లకు రిజర్వేషన్ చెల్లదని తీర్పు చెప్పిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏడుగురికి నాయకత్వం వహించిన న్యాయమూర్తి జీవన్‌రెడ్డి అందులో ఒకడు. అగ్రవర్ణ దురహంకారాన్ని చాటే మనుస్మృతికి నకలే ఈ తీర్పు. ఇంకొక సభ్యుడు ఎవరయ్యా అంటే, ఎన్‌కౌంటర్ రాజ్యం చేస్తున్న కసాయి చంద్రబాబునాయుడు పార్టీ యం.ఎల్.ఏ.గా ఎన్నికై, స్పీకర్ పదవిలో వెలుగుతున్న ప్రతిభా భారతి తండ్రి జస్టిస్ కె.పున్నయ్య. ఇంకా ఆర్.యస్.యస్. ఉన్మాదులైన సి.కాశ్యప, సుమిత్రా కులకర్ణి, బి.జె.పి. అనుకూల అటార్నీ జనరల్ సొలీసొరాబ్జీ, అమెరికాలో మాజీ భారత రాయభారి,

అమెరికా తొత్తు అబీద్ హుస్సేన్ మరియు సోనియా వ్యతిరేకిగా పేరుగాంచిన మాజీ లోక్‌సభ స్పీకర్ పి.ఏ. సంగ్మా. ఈ కమీషన్‌కు గౌరవ ప్రతిపత్తి కల్పించటం కోసమని, జర్నలిస్టు సి.ఆర్.ఇరాని, 85 సం॥రాల వృద్ధుడు సర్కారియా (కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కేంద్ర ప్రభుత్వం అటకెక్కించిన నివేదిక రూపశిల్పి సర్కారియా ఈయనే) లకు నచ్చచెప్పి ఈ కమీషన్‌లో చేర్చారు.

సమీక్షా కమీషన్ ఇప్పుడు చెప్తున్న దాని ప్రకారం, సమీక్ష కోసం తీసుకున్న 8 అంశాలలో, 4 అంశాలు కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించటానికి కూడుకున్నవి. అంటే, ఇప్పటికే కేంద్ర రాష్ట్ర సంబంధాలపై అటకెక్కించబడిన నివేదిక ఉండగా, మరలా అదే పనికి, ప్రజల గోళ్ళూడగొట్టి వసూలు చేసిన పన్నుల నుండి కోటి రూపాయలను భారత ప్రభుత్వం ధారపోస్తుందన్నమాట. కమీషన్ బహిరంగంగా ప్రకటించిన విషయం కంటే, ప్రకటించని అంశాలే చాలా వున్నాయి.

బి.జె.పి., టి.డి.పి.లకు ప్రకటించని స్పష్టమైన ఉద్దేశాలున్నాయి. వాస్తవానికి, వాటి మౌలిక ఉద్దేశాలు ఏమిటంటే, అధికారాన్ని మరింత కేంద్రీకరించటం, ఇప్పుడున్న నామమాత్రపు ఓటుహక్కుని తగ్గించటం (ఇప్పటికే 87వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పని చేసారు), అయిదేళ్ళపాటు అధికారంలో కొనసాగే విధంగా రాజ్యాంగం లో పొందుపరచటం, మరియు అధికార యంత్రాంగానికి, దాని నాయకుడికి మరిన్ని అధికారులు కట్టబెట్టడం. అయితే రాజ్యాన్ని కాషాయీకరించటం అన్నది బి.జె.పి. కి అదనంగా వున్న లక్ష్యం.

## ప్రతిపక్షాల దివాళాకోరు వైఖరి!

ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు కూడా 'పవిత్రమైన' రాజ్యాంగాన్ని (ఇప్పటికే 84సార్లు సవరించబడింది) సమీక్షించ కూడదని అంబేద్కర్‌వాదులు మాట్లాడుతున్న మాటలనే 'చిలక పలుకుల్లా' పలుకుతున్నారు. ఈ రాజ్యాంగం నీడలోనే నిత్యం దళితులు విచక్షణకు గురవుతున్న, కటిక దారిద్ర్యం అనుభవిస్తున్న విషయం పట్టించుకోకుండా, రాజ్యాంగం రూపొందించిన కమిటీకి అధ్యక్షుడుగా అంబేద్కర్ ఉన్నాడనే ఏకైక కారణంతో, ఈ అంబేద్కర్‌వాదులు అనబడే కుహనా దళిత నాయకులు సమీక్షను వ్యతిరేకిస్తున్నారు. ఎమర్జెన్సీలో, రాజ్యాంగానికి 42వ సవరణ ద్వారా, రాజ్యాంగానికి పెనుమార్పులు చేసి, 59 నిబంధనలు చేర్చినపుడు, ఈ నాయకులంతా విచిత్రంగా మౌనం పాటించారు. ఇపుడు బి.జె.పి. ప్రభుత్వం లాగానే, అపుడు ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నిరంకుశ పరిపాలనా అధికారాలను, పాలనా యంత్రాంగానికి, ప్రధానమంత్రికి కట్టబెట్టింది. కానీ, అప్పుడు దళిత 'నాయకుల' మని చెప్పుకుంటున్న వాళ్ళ నోళ్ళు పెగల్లేదు.

అంతే కాదు, పరిశ్రమలను, భూమిని జాతీయం చేయాలని, వ్యక్తిగత ఆస్తిహక్కును నిరాకరించాలని మొ॥న నిబంధనలను రాజ్యాంగంలో చేర్చాలని అంబేద్కర్ వ్యక్తిగతంగా ప్రవేశపెట్టగా, వాటిని రాజ్యంగ నిర్మాణ శాసనసభ తిరస్కరించిందన్న వాస్తవ విషయం పట్ల కూడా ఈ 'దళిత నాయకులు' మహా మౌనం పాటిస్తున్నారు. అలాగే మన రాజ్యాంగం బ్రిటీష్ వలస రాజ్యాంగానికి నకలు అనే విషయంలో కూడా వీరు మౌనమూర్తులే!

## రాజ్యాంగ సమీక్ష కాదు-సమూలంగా తగలబెట్టాలి

వలస పాలనలో తయారు చేసిన భారత ప్రభుత్వ చట్టం 1935 చుట్టూతానే ప్రధానంగా 'స్వతంత్ర' భారత రాజ్యాంగం రూపొందించ బడింది. 1946లో, బ్రిటీష్ ప్రభుత్వ కాబినెట్‌మిషన్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాణసభ చేత అది రూపొందించబడింది. ఆ రాజ్యాంగ నిర్మాణసభ యావత్తూ, రాజులు, మహారాజులతోను, దళారీ బూర్జువా వర్గంతోనూ నిండి వున్నదే! రాజులు, సంస్థానాధీశుల పరిపాలనలో వున్న ప్రాంతాల నుండి ప్రభుత్వమే నేరుగా నియమించగా, బ్రిటీష్ ప్రత్యక్ష పాలన వున్న రాష్ట్రాల నుండి అతి తక్కువ మందికే ఓటుహక్కును కల్పించి, అశేష ప్రజలకు ఎన్నుకునే ఓటు హక్కు లేకుండా చేసి, అతి పరిమితమైన ఓటర్లచే ఎన్నుకోబడిన వాళ్ళు, రాజ్యాంగ నిర్మాణమండలిలో సభ్యులయ్యారు. పాలకవర్గాలకు, వారి దోపిడీ పరిపాలనను కొనసాగించటానికి మౌలిక హక్కుల పత్రమే ఈ రాజ్యాంగం. వలస ప్రభుత్వం నుండి వారసత్వంగా తీసుకున్న విధానాలతోనే అది రూపొంది కొనసాగుతున్నది. రాజ్యాంగానికి ఇప్పటిదాకా చేసిన సవరణలన్నీ కూడా, ఆయా పరిస్థితులలో, దోపిడీ పరిపాలనను 'సజావుగా' సాగించుకోవటానికి చేసినవే! ఈ రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులకు అనేక పరిమితులేర్పరచారు. దాని కోసం (ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్టు- ముందు జాగ్రత్త చర్యగా నిర్బంధించటం), అన్ని హక్కుల్ని రద్దు చేస్తూ ఎమర్జెన్సీ విధించే హక్కు, సైనిక పాలన విధించటానికి అవకాశాలు కల్పించుతూ అనేక నిబంధనలున్నాయి. వీటిమీద ఇంత నిర్నిబంధంగా వున్న సూత్రాలు, ప్రజల మౌలిక అవసరాలైన కూడు-గూడు-బట్ట మొ॥న సాంఘిక న్యాయం చేకూర్చే విషయాల దగ్గరకొచ్చేటప్పటికి అది రాజ్యాంగంలో ఆదేశిక సూత్రంగా రూపొందించలేదు. అవి ప్రభుత్వం అభిమతానికి వదిలేశారు. అంటే, ప్రభుత్వం దయా, ధర్మాలకి వదిలేశారు.

గడచిన 50 సంవత్సరాల చరిత్రను ఒకసారి చూస్తే, రాజ్యాంగం ఏ విధంగా పేద ప్రజలను అణచివేతకు, దోపిడీకి గురిచేస్తూ, అతి కొద్దిమంది మరింత సంపన్నులు కావటానికి దోహదపడిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాల ప్రకటన చట్టం, ప్రత్యేక సాయుధ బలాల చట్టం మొ॥న వాటి ద్వారా, 'రాజ్యాంగబద్ధంగా' ప్రభుత్వమే ఏ విధంగా టెర్రరిస్టు విధానాలను అవలంభిస్తుందో కూడా చూడవచ్చు. అనేక వేలమంది క్రూర చిత్రహింసలకు గురిచేయబడటము, బూటకపు ఎదురుకాల్పులలో చంపబడటమూ అనునిత్యం కన్పించే దృశ్యాలే! మరియు రోజురోజుకూ దుర్భరమౌతున్న ప్రజల జీవన పరిస్థితులు, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగం, వీధిన పడుతున్న ఇతర రంగాల ప్రజలు కన్పిస్తున్న దృశ్యాలే! రాజ్యాంగం పరిస్థితి అదైతే ప్రతిపక్షాలూ, 'అంబేద్కర్ వాదులు' ఈ రాజ్యాంగం శాశ్వతంగా వుండాలని కోరుకుంటున్నారు. బి.జె.పి., తెలుగుదేశం పాలకులేమో మరింత నిరంకుశ పాలనాధికారాలు కావాలని కోరుకుంటున్నారు.

కానీ, ముఖ్యమైన విషయం ఏమిటంటే, రాజ్యాంగ సమీక్షపై చర్చోపచర్చలు జరుగుతున్న పరిస్థితిలోనే, ప్రభుత్వం గుట్టు చప్పుడు కాకుండా 87వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది; తెలుగుదేశం వత్తిడితో ప్రవేశపెట్టబడిన ఈ బిల్లు, తాలూకా, జిల్లా స్థాయి

***(తరువాయి 32వ పేజీలో.....)***

**జాతుల సమస్య**

# కుట్రకుహకాలు, అనాగరిక అణచివేతల మధ్య చిక్కుకున్న కాశ్మీర్! కాశ్మీర్‌లో తీవ్రతరమవుతున్న జాతీయ విముక్తి పోరాటం!!

కాశ్మీర్‌ని తమ మధ్య వాటాలేసుకుని శాశ్వతంగా దాన్ని విభజించుకుని పంచేసుకోడానికి దానికి ఇరుగుపొరుగుగా వుండే శక్తివంతమైన దేశాలు కుట్రలు పన్నుతున్నప్పటికీ, వేరొకప్రక్క భారత అభివృద్ధి నిరోధక సైనిక బలగాలు పెద్ద ఎత్తున అణచివేతకి దిగి భయోత్పాతాన్ని సృష్టిస్తున్నా సరే కాశ్మీర్‌లో జాతీయ విముక్తి పోరాటం రగిలి మండుతూనే వుంది. కార్గిల్ అనంతర పరిణామంగా భారత ఆక్రమిత సైన్యాలకి వ్యతిరేకంగా తిరుగుబాటు దళాల గెరిల్లా దాడులు నిరంతరాయంగానే సాగుతున్నాయి. ఇంతవరకు ఎంతో సురక్షితం అని భావించబడుతూ వస్తున్న భారత సైనిక స్థావరాలపై సైతం కాశ్మీరీ స్వాతంత్ర్య సమరయోధులు సాహసిక దాడులెన్నో విజయవంతంగా చేసారు. ఈ దాడుల్లో భారత సైనిక మూకలు భారీ నష్టాల్నే చవిచూశాయి. కార్గిల్ 'విజయం' కాశ్మీరీ గెరిల్లా శక్తుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయగలదని, 'టెర్రరిజం' నుంచి ఊపిరి తీసికోవచ్చుని భారత ఆక్రమిత సైనికమూకలు భావించిన దానికి భిన్నంగా, ఇచ్చిన భరోసాలకి చేసిన బాసలకి భిన్నంగా జరుగుతూ వస్తున్న పరిణామ పరంపర ఇది. విజయోత్సాహం వెలిగించిన ఆశా దీపాలు ఆరిపోయి, 'సరిహద్దు బీభత్సవాదం'కి వ్యతిరేకంగా భారత పాలకవర్గాలు ప్రభుత్వ సైనికాధికార వర్గాలు చేస్తూ వచ్చిన ఊదరగొట్టుడంతా ఉస్సురని సన్నగిల్లి పోయింది. పర్యవసానంగా భారత ఆక్రమిత సైన్యం కాశ్మీర్ లోయలో పిచ్చెత్తిపోయినట్లు మరింత తీవ్రస్థాయి మారణకాండలకి గృహ దహనకాండకి దిగిపోయింది. 'టెర్రరిజం'కి వ్యతిరేకంగా చేసే పోరాటంలో భారత సైనిక బలగాలు చాలా ఎంపిక దృష్టితో వుంటూ ఆచితూచి లక్ష్యాల్ని ఎంచుకొంటున్నాయి అంటూను, కాశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో మానవహక్కుల పరిరక్షణ విషయంలో అత్యంత జాగరూకతను ప్రదర్శిస్తాయంటూనూ భారత దేశీయాంగమంత్రి లాల్‌క్రిష్ణ అద్వానీ ఇస్తూ వచ్చిన పెద్ద పెద్ద హామీలు, చేస్తూ వచ్చిన వాగ్దానాలు గాలిలో పేలపిండిలా ఎగిరిపోయాయి. భారత ఆక్రమిత సైనికుల విచక్షణలేని నిత్య మారణకాండలతో అవన్నీ అపహాస్యం పాలయ్యాయి. మానవహక్కుల్ని ఎంతో చక్కగా పరిరక్షిస్తున్నామంటూ భారత ప్రభుత్వం పదే పదే చేస్తున్న దబాయింపుల్ని ఎత్తి ఎండగడుతూ ''అరెస్టుకాబడిన వారు''గా ఆ తరువాత ''కనపడకుండా పోయినవారు'' గా నమోదైన వందలాది మంది యువతీయువకుల తల్లిదండ్రులంతా ప్రపంచ మానవహక్కుల దినాన్ని పురస్కరించుకొని 1999 డిసెంబర్ 10వ తేదీన జమ్ము కాశ్మీర్‌లో సంపూర్ణమైన సమ్మె నిర్వహించారు. ప్రభుత్వ పోలీసులు, సైనికుల చేతుల్లో అరెస్టు కాబడిన అసంఖ్యాక యువజనుల తల్లిదండ్రులు తమ బిడ్డల్ని కోర్టుల్లో ప్రవేశపెట్టాలని లేదంటే చనిపోయినట్టు ప్రకటించాలని భారత ప్రభుత్వాన్ని నిలదీశారు. కాని ఈ రెండింటిలో ఏ ఒక్క డిమాండ్‌ని భారత ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఈ యువతీ యువకులందరినీ భారత సైన్యం పట్టి బంధించి, చిత్రహింసల పాల్జేసి చంపేసి వారి ఆచూకీ అంటూ లేకుండా చేసారనేది వారు ఏ నాటికీ అంగీకరించని, ప్రజలందరికీ తెలిసిన ఒక నగ్న సత్యం. భారత ఆక్రమిత అధికారులు విచ్చలవిడిగా చావగొట్టడాలు, గృహదహనాలు, మానభంగాలు లాంటి ఆరోపణలను ఏనాడూ అంగీకరించక పోయినా భారత సైనిక మూకలు ఈ ఆకృత్యాలన్నీ అనునిత్యం చేస్తూనే వుంటారు, వారికి ఇవన్నీ దినవారీ చర్యలేనని చెప్పవచ్చు. అయినప్పటికీ ఇలాంటి ఈ కిరాతకులే స్వయంగా అంగీకరించిన భయంకర వాస్తవం ఏమంటే గడచిన పది సంవత్సరాల కాలంలో తాము కేవలం 10,600 మంది సమరశీల పోరాటవాదులైన కార్యకర్తల్ని చంపామని అంగీకరించడం. భారత అధికారులు అంగీకరించే మరో వాస్తవం ఏమంటే మిలిటెంట్లతో సైనికులు జరిపే కాల్పుల మధ్య చిక్కి 2,600 మంది కాశ్మీరీ ప్రజలు సైతం చనిపోయారనేది. నిజానికీ 2,600 మంది భారత ఆక్రమిత సైనిక మూకల చేతుల్లో బందీ అయి కిరాతకంగా హత్య చేయబడిన వారే తప్ప ప్రభుత్వం చెప్పినట్లు కాల్పుల మధ్య చిక్కి చనిపోయినవారు కానే కారు. ఈ దశాబ్దిలో 2000 మంది పైగా భద్రతా సిబ్బందిని సైతం కాశ్మీర్ తిరుగుబాటు అణచివేత క్రమంలో కోల్పోయినట్లు భారత అధికారులు అంగీకరిస్తారు. కాశ్మీరీ పోరాటవాద మిలిటెంట్ల చేతుల్లో బలి అయిపోయిన అమాయక పౌరులుగా భారత అధికార్లు, ప్రభుత్వం ప్రచారం చేస్తున్న 8000 మందిలో హెచ్చుమంది ముసుగులోని భారత సైనికులే కాగా మిగిలిన వారిలో చాలామంది వారు ఆక్రమిత సైనికాధికార వర్గాలతో కలిగుండే సంబంధాలు, కుమ్మక్కుల కారణంగా స్వాతంత్ర్య యోధుల ఆగ్రహావేశాలకి గురై వారి చేతుల్లో మరణించారని స్వతంత్ర పరిశీలనలు చేసిన అనేక పౌరహక్కుల, మానవహక్కుల సంఘాల నిజనిర్ధారణ బృందాల నివేదికలు చెబుతాయి. ముసుగులో వుంటూ భారత సైనిక మూకలు తలపడే రహస్య కార్యకలాపాల గూర్చి కాశ్మీరు ప్రజలు తరచుగా ఫిర్యాదు చేస్తూ, పోరాటవాద మిలిటెంట్ల కార్యక్రమ సరళికి, ముసుగులో వుండే భారత సైనికుల పనిశైలికి మధ్య స్పష్టమైన తేడా తాము కనిపెట్టలేని విషయం కాదని వారు స్పష్టం చేస్తారు. భారత సైనికులు-కాశ్మీరీ మిలిటెంట్లు వీరి ఉభయుల పాత్ర గురించి అంచనా కట్టే విషయం కష్టమే అయినా ఒక సత్యం ఏమంటే కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికారాన్ని తిరస్కరించడం వలన, వారి వ్యవహారాలు వారే నిర్వహించుకోడానికి అంగీకరించక పోవడం వలన భూతల స్వర్గంగా చెప్పబడే కాశ్మీర్, ఈనాడు ఒక నరకకూపంగా మారిపోయింది.

భారత పాలకులు, భారత సైనికాధికార అత్యాచారాలు, ఆకృత్యాలతో కాశ్మీరీ ప్రజలు భయపడిపోయి వెనకంజ వేయడం లేదు, వారేనాడూ అలా కృంగి లొంగిపోజాలరు. తుపాకీ బైనెట్లతో చీల్చబడిన

పొట్టలు, వికృతంగా మార్చబడ్డ ముఖాలు, కాల్చిన సిగరెట్లతో వాతలు, విద్యుత్‌ఘాతాలతో కాల్చబడిన శరీరాలు, మానభంగాలు, చితకబాదుడులు, గ్రామాలకు గ్రామాలను మొత్తంగా నివాస ప్రాంతాలను తగలెయ్యడాలు అలానే కొన్ని కాలనీలని తగలెయ్యడాలు లాంటివి కాశ్మీర్‌లోయ అంతటా మనకి అగుపడే దృశ్యాలు. ఇవి భారత ఆక్రమిత కాశ్మీరీ ప్రజల కన్నీటి గాథల్ని చెబుతాయి. ఇవన్నీ ఈ దేశంలో భాగం అనుకొంటున్న ఒక ప్రాంతంలోని ప్రజలపై ఈదేశ సైనికులు పాల్పడుతున్న క్రూర ఘోర నేర కృత్యాలే తప్ప, కొండలు, అడవుల్లో ఏ విదేశీ సైన్యమో చేస్తున్న పనులు కావివి. తిరుగుబాటు వేళ్ళు ఆక్రమిత కాశ్మీర్ మధ్యలోనే వున్నాయి తప్ప అభివృద్ధి నిరోధక భారత పాలకులు ప్రజల్ని నమ్మించ ప్రయత్నిస్తున్నట్టుగా ఈ తిరుగుబాటు కార్యకలాపాలు అనేవి సరిహద్దు ప్రాంత సమస్య ఎంతమాత్రం కాదు. కాగా ముందు చెప్పిన 10,600+2000+8,000 వెరసి 20,600 మంది కూడా కాశ్మీరీ ప్రజలే, ఎవరో కొద్దిమంది తప్ప. ఆ కొద్దిమంది కూడా కాశ్మీరీ ప్రజల పోరాటాన్ని సమర్థించే వారే! ఇదంతా చాటిచెప్పే నగ్నసత్యం ఏమంటే సమరశీల స్వాతంత్ర్య పోరాట యోధులంతా తయారై వస్తున్నది కాశ్మీరీ ప్రజలలోనుంచే. కాగా వీరిని చంపుతున్న తూటాలు ఇండియానుంచి వెళుతున్నాయి. 'సరిహద్దు టెర్రరిజం' అంటూ జరుగుతున్న గగ్గోలు వెనుకవుండే అసలు ఆంతర్యం అల్లా ఒకానొక జాతిని అణచి, భయోత్పాతానికి గురిచేసి, లొంగదీసుకోవడమే! ఆ జాతి భారత ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూ ధిక్కరిస్తోంది గనుక ఇక అది అణచివేయబడాలన్నమాట!

## ప్రజాస్వామిక అసత్యాలు, అప్రజాస్వామిక సత్యాలు, ఫాసిస్టు పథకాలు

కార్గిల్ యుద్ధం ముగిసీ ముగియడంతోనే ఒక్కసారిగా గెరిల్లా కార్యకలాపాలు (కాశ్మీరీ పోరాటవాదుల) ఊపందుకోవడంతో, కాశ్మీర్‌ను భారత రాజకీయ వ్యవస్థతో కలుపుకు రావడానికి సంబంధించి దేశ మేధావి వర్గాలలో చర్చ ప్రారంభమైంది. కొంతమంది మేధావులతో పాటు మాజీ సైనికాధికార్లు, (వీరిలో ఇటీవలి వరకు ఉద్యోగ విధిలో వుండి రిటైర్ అయినవారు కొందరు). వీరు చేసిన సూచన, వీరిచ్చే సలహా ఏమంటే సమస్యకు పూర్తి సైనిక పరిష్కారమే మార్గం. అంటే వాస్తవాధీన రేఖను అతిక్రమించుకుపోయి, జమ్మూకాశ్మీర్ యావత్ ప్రాంతాన్ని ఆక్రమించేసుకొని, పాకిస్తానీ సైన్యాన్ని పశ్చిమ పంజాబ్‌కి వాయువ్య సరిహద్దు రాష్ట్రానికి తరిమేసి, తద్వారా కాశ్మీర్‌ని 'విముక్తి' చేసి దాన్ని భారతదేశంలో చిరస్థాయిగా కలుపుకుని ఆ రకంగా సుస్థిర, శాశ్వత శాంతికి హామీపడాలనేది వారి వాదన. మరికొంతమంది మేధావులు మాత్రం కాశ్మీర్ సమస్యా పరిష్కారంపట్ల నిశితదృష్టితో కూడిన వైఖరి అవసరమని చెబుతారు, కాని వీరు కాశ్మీర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు సాగాలని చెబుతారు, రాష్ట్రానికి మరింత ప్రజాస్వామ్యం స్వయంప్రతిపత్తి అవసరమంటారు, భారత సైనికులు విచక్షణారహితమైన బీభత్స చర్యలకు పాల్పడకుండా కట్టడి చేయాలని, సైనికులు ప్రజల విశ్వాసం చూరగొనే తీరులో ప్రవర్తించేట్టు చూడాలని, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని వీరంటుంటారు. కాని ఈ ఉభయ శిబిరాలవారూ కూడా కాశ్మీర్ జాతీయ విముక్తి సమస్యకి సంబంధించి అభివృద్ధి నిరోధకులేనని చెప్పాలి. అయితే వీరిని బూర్జువా ప్రచారమాధ్యమాలు మాత్రమే ''డేగలు'' ''పావురాలు'' అంటూ రెండుగా విభజించి చూపుతున్నాయి. ఈ రెండు శిబిరాల మధ్య వున్న తేడా అల్లా ఏమంటే ఆధీన రేఖకి సంబంధించిన యధాతథ స్థితిని పాటించాలా లేక మరింత పశ్చిమం వేపు దాన్ని నెట్టాలా అనేది మాత్రమే! ఈ రెండూ శిబిరాల వారూ కూడా కాశ్మీర్‌ని భారత్‌లో కలుపుకురావడం పట్లే తప్ప దాని స్వయం నిర్ణయాధికార హక్కు-పట్ల ఎలాంటి ఆసక్తి లేనివారే, అంతేకాదు కాశ్మీర్ స్వయం నిర్ణయాధికార హక్కుని ఈ 'డేగల' 'పావురాల' శిబిరాలు రెండూ తిరస్కరిస్తాయి. అయితే 'పావురాలు' తమని తాము గొప్ప ప్రజాస్వామ్యవాదులుగా భావిస్తూ 'డేగల'ని జాతీయ తీవ్రవాదులుగాను, వారిది సైనికవాదం అంటూ విమర్శిస్తుంటే, 'డేగలు', మరోవైపున 'పావురాల' బుజ్జగింపు ధోరణిని, రాయితీలిచ్చి ఒప్పించే ధోరణిని విమర్శిస్తూ అసలు నెహ్రూ కాలం నుంచీ ఇలాంటి లాలింపు బుజ్జగింపు ధోరణుల కారణంగానే కాశ్మీర్ సమస్య రావణ కాష్టంలా మిగిలిందని 'పావురాల' శిబిరాన్ని నిందిస్తూ వుంటారు. ఈ సందర్భంగా 'డేగల' శిబిరం చేసే వాదన ఏమంటే- ''అఫ్రిదీలని వారి పాకిస్థానీ మద్దతుదార్లని ప్రస్తుత పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుంచి తరిమేయడానికి బదులుగా 1948లలో నెహ్రూ సమస్యని పట్టుకొని ఐక్యరాజ్యసమితికి పరువులెత్తడం అనేది జరిగుండాల్సింది కాదని'' వీరు నెహ్రూని తప్పుపడతారు. భారతదేశం గొంతులో ముల్లులా గుచ్చుకుపోయిన కాశ్మీర్ సమస్యకి కారకుడు నెహ్రూయే అంటూ ఈ 'డేగలు' ఇక దీనికి పూర్తిస్థాయి సైనిక పరిష్కారం తప్ప ఇతరత్రా ఎలాంటి పరిష్కారం లేదంటారు. ఈ అన్ని రకాల ఐక్యతావాదులు సమైక్యతావాదులు విస్మరించేది ఏమంటే అసలు కాశ్మీర్‌కి స్వాతంత్ర్యం ఇవ్వనిరాకరించడంలోనే అసలు సమస్యల్లా వుందనే నగ్నసత్యాన్ని! కనుకనే ఎలాంటి ఎంతటి తీవ్ర చర్యలు గాని లేక వీరిలోని కొందరు 'సామరస్యవాదులు' చెప్పే కాశ్మీర్‌కి స్వాతంత్ర్యం మినహా, తద్భిన్నంగా సూచించే ఎలాంటి రాయితీలు ప్రోత్సాహక చర్యలైనా కూడా ఆ ప్రాంతంలో శాంతి స్థాపనకు హామీ పడజాలవు. అసలు కాశ్మీరీ ప్రజల సహజమైన అత్యంత న్యాయమైన, హేతుబద్ధమైన స్వయం నిర్ణయాధికార హక్కుని తిరస్కరించడమనేదే హింసాయుత చర్య. ఈ తిరస్కారం అనేదే హింసలోంచి పుట్టింది, కనుక ఈ విధానం అంటే కాశ్మీర్ స్వయం నిర్ణయాధికార హక్కుని తిరస్కరించే విధానం కొనసాగినంత కాలం అదెలాంటి 'శాంతి'కి దోహదపడజాలదు, ఆ విధానాన్ని విడిచిపెడితే తప్ప అక్కడ 'శాంతి'కి ఆస్కారం లేదు.

కాశ్మీర్‌లో నెలకొన్న హింసాయుత వాతావరణంపట్ల అక్కడ నిత్యం ధిక్కరణకి గురవుతున్న మానవహక్కులపట్ల నిజాయితీగానే కలతచెందే మరో భాగం మేధావివర్గం కూడా వుంది, వీరు ఇక్కడి స్థితి తక్షణం అంతం కావాలని ఆశిస్తారు. కాశ్మీర్ ప్రజల దురవస్థలపట్ల వారి దుస్థితిపట్ల వీరు సానుభూతితోనే వుంటూ కాశ్మీర్‌పై అదుపుకోసం భారత ప్రభుత్వం వ్యయపరుస్తున్న అపారమైన ఖర్చుల్ని వీరు ఖండిస్తారు. వారి విమర్శ ఏమంటే భారతీయ పాలకులు భారీ మొత్తాలలో దుర్వ్యయం చేస్తున్నారని దీన్ని దేశంలోని పేదల కోసం ఖర్చుచేస్తే బాగుంటుందనేదే! కాశ్మీర్‌లో సాయుధ బలగాల్ని మోహరింపజేయడానికి సంవత్సరానికి కొన్ని కోట్ల రూపాయల్ని యధేచ్ఛగా ఖర్చు చేయడంతోపాటు, పన్ను చెల్లింపుదార్లయిన ప్రజల నుంచి పిండిన 4500 కోట్ల రూపాయల్ని పరిమిత యుద్ధంగా

వ్యవహరించే కార్గిల్ యుద్ధంలో ఖర్చు చేసారు, అదీ కేవలం రెండు మాసాలలోనే! ఈ మేధావి శ్రేణులు కార్గిల్ తరహా మంచు ఎడారుల్లో వేలాదిగా మన సైనికులు అసహాయంగా ఆహుతి అయిపోవడంపట్ల, శాశ్వత అంగవికలురు అయిపోవడంపట్ల కూడా తీవ్ర నిరసనతో వుంటూ కార్గిల్, సియాచిన్‌లలో మనం తీసుకునే కష్టనష్టాలకి ప్రతిగా సాధించే ఫలం ఏమీ లేదు గనుక ఆ కష్టాలు త్యాగాలు వ్యర్థం అంటూ ఆవేదన చెందుతారు కనుకనే, ఈ తరహా మేధావి వర్గ ప్రజలు కార్గిల్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ సమస్యకు శాంతియుత పరిష్కారాన్ని డిమాండ్ చేసారు. ఆ రకంగా భారతదేశ ధనాన్ని భారత సైనిక బలగాల్ని దుర్వ్యయం అయిపోకుండా బలైపోకుండా రక్షించుకోవాలని వారంతా కోరారు. అయితే అభివృద్ధి నిరోధక పాలకవర్గాల భౌగోళిక రాజకీయ వ్యూహాల లోతుపాతుల్లోకిగాని, అలానే సమస్య రాజకీయ సంక్లిష్టతలలోకిగాని పోకుండానే ఈ తరహా మేధావులు కేవలం మంచి మనసుతో, ప్రజాస్వామ్యయుత మానవతావాద పార్శ్వం నుంచి మాత్రమే ఇలాంటి విజ్ఞప్తులు, విమర్శలు చేస్తారు.

కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య కాంక్షని, వారి స్వాతంత్ర్య లక్ష్యం యొక్క న్యాయబద్ధతని హృదయపూర్వకంగా సమర్థించే విప్లవకర ప్రజాతంత్ర శక్తులు సైతం భారతదేశంలో వున్నాయి. కాని ఈదేశాన్ని సామ్రాజ్యవాదులకి, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకి కారుచవగ్గా అమ్మేస్తున్న దేశ పాలకవర్గాలే ఈ విప్లవకర ప్రజాతంత్ర శక్తుల్ని జాతి వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు. మొదటి రెండు తరహాల మేధావి వర్గాలు కార్గిల్ యుద్ధాన్ని సమర్థిస్తూనే ప్రగతి నిరోధక పాలకులకి తామందించే సూచనలు సలహాలతో ఒక జాతీయ దురహంకార జాతర వాతావరణం సృష్టికి దోహదపడ్డారు. వీరు సమస్యని ఇంకా చర్చిస్తూనే వున్నారు. పాలకులు ఇలాంటి మేధావి వర్గాల పాత్ర ప్రమేయాలతో చాలా సంతృప్తిగా వుంటున్నారు, ఏమంటే ప్రజాభిప్రాయాన్ని రూపకల్పన చేయగల మేధావులలో హెచ్చుమందిని తమవెంట తిప్పుకోగలిగినందుకు తమ అభివృద్ధి నిరోధక దుష్ట పథకాల రూపకల్పనలో వారిని భాగస్వామ్యం చేయగలిగినందుకు వారు సహజంగానే సంతోషిస్తారు కదా!

ఈ తరహా మేధావులు, వీరితో గొంతు కలిపే ప్రసార, ప్రచార మాధ్యమాలు మాత్రమే 'ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని' ఉన్మత్తంగా సమర్థించేస్తూ కాశ్మీరీ ప్రజలకి, మనం మాత్రమే 'ఓటువేసే ప్రజాతంత్ర హక్కుని' ఇస్తున్నామని, కాని పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రజలకి పాకిస్తాన్ ఇలాంటి హక్కుని ఇవ్వదని వారు చాలా తీవ్రంగా వాదిస్తుంటారు. కనుకనే కాశ్మీర్ ప్రజలకి తమ అభిప్రాయం వెలిబుచ్చే అవకాశం ఎప్పుడూ లభిస్తున్నందున ఇక ప్లెబిసైట్, రిఫరెండం లాంటి వాటితో పనిలేదని వీరు వాదిస్తుంటారు, కాని తీవ్రస్థాయి అణచివేతల్ని అధిగమిస్తూ అక్కడ ప్రజలు ఈ ఎన్నికల తంతుని బహిష్కరిస్తూ వేలాదిగా ఈ బహిష్కరణలో పాల్గొంటూ వస్తున్నారనే వాస్తవాన్ని ఏమాత్రం పట్టించుకోకుండానే, ఈ ఎన్నికల పట్ల కాశ్మీర్ ప్రజలు ఎంతో విశ్వాసంతో వుంటున్నట్టుగ చెప్పడం దగాకోరువాదనే! పాలకవర్గాల బాకాలుగా వీరు కాశ్మీర్‌లో ఎన్నికల ప్రజాస్వామ్యం గూర్చి ఎంత గొంతులు చించుకున్నా అక్కడి ప్రజల్ని నమ్మించ జాలరు. కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుని తిరస్కరించే అతిగొప్ప బూర్జువా ప్రజాతంత్రవాదులు సైతం అప్రజాస్వామిక వాదులుగా పరిగణించబడక తప్పదు. ఏమంటే ఘనతవహించిన మన ఈ గొప్ప ప్రజాస్వామ్యం ఇంకో జాతిని బలప్రయోగంతో ఆక్రమించుకుంది. అభివృద్ధి నిరోధక పాలకవర్గాల, వారి వంధి మాగధుల ప్రజాస్వామ్యయుత అబద్ధాలన్నింటినీ నగ్నంగా నిలబెట్టి చూపే గొప్ప అప్రజాస్వామిక సత్యం ఇది.

ఈ ఉద్దండ మేధావుల వాదన తీరు ఎలా వుంటుందంటే **''భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా వుండినంత కాలం భారత యూనియన్‌లోని ఏ ఒక్క రాష్ట్రం కూడా యూనియన్ నుంచి విడిపోయే హక్కుని కలిగి వుండదు, యూనియన్ చట్రంలో ఇమిడి వుంటూనే ఆ రాష్ట్ర ప్రజలు తమ హక్కుల గురించి ఎంత పట్టుదలగానైనా సరే పోరాడాల్సి వుంటుంది''.** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యాయశాస్త్రాన్ని బోధించే ఒకానొక ఆచార్యులవారి (ప్రొఫెసర్) మాటల మూటలివి. సమాజంలో గౌరవనీయులైన ఈ పెద్ద మనుషులు తమ విద్యార్థులకి చట్టం గూర్చి బోధించే ముందు ఒక్క క్షణం ఆగి తమ విద్యార్థులకు తామేమి బోధిస్తున్నాం అని కనీసంగా కూడా ఆలోచించరేమో అనిపిస్తోంది. ఏమంటే-ఒకానొక యూనియన్ విడిపోయే హక్కుని అందులోని ఒక సభ్య రాష్ట్రానికి ఇవ్వ నిరాకరించడం అంటే, అలానే ఒక జాతి విడిపోడానికి వీలులేదనడమంటేనే దానర్థం ఒక జాతి ఇంకో జాతిని యూనియన్‌లో వుండి తీరాలని బలవంతంగా నిర్బంధపూరితంగా వుంచ ప్రయత్నించడమే. అలాంటి యూనియన్‌లో వుండ కూడదనుకుంటే దాన్నుండి బయటికి పోయే స్వేచ్ఛ అందులోని సభ్య జాతులకి లేకపోవడమంటే ఇక అక్కడ ఇంకా ప్రజాస్వామ్యం వుందని ఎలా అనుకోవాలి? స్వచ్ఛందంగా ఒకానొక యూనియన్‌లో సభ్యునిగా కలిసిన జాతి కూడా సదరు యూనియన్‌లోని శక్తివంతమైన భాగస్వామి నుంచి ఏదో రకమైన ఒత్తిడి బలప్రయోగం లాంటివి ఎదురవుతుంటే తప్ప లేకుంటే సదరు యూనియన్ నుంచి వైదొలగాలని అనుకోవడమే జరగదు. 'విడిపోయే హక్కు' అనేది ఒకానొక యూనియన్‌లోని బలమైన జాతి బలహీనమైన జాతిపై దౌర్జన్యానికి దిగి దాన్ని లొంగదీసుకొనే ప్రయత్నానికి దిగకుండా వుండడానికి ఒక హామీగా పనిచేస్తుంది, కనుక ఆ యూనియన్‌లోని సభ్య జాతులు అన్ని అత్యంత ప్రజాస్వామ్యయుతంగా స్వచ్ఛందంగా సదరు యూనియన్‌లో కొనసాగ గలుగుతాయి. ఇలాంటి హక్కు లేకుండా ఇండియా ఇక 'ప్రజాస్వామ్యయుతంగా' వుండజాలదు. కాని మన ప్రొఫెసర్ గారు తననితాను ప్రజాస్వామ్యవాదిగా ప్రకటించు కొంటూనే ఒక అణచివేతదారుని భాషలోనే మాట్లాడుతున్నారు. పీడకులు, అణచివేతదార్లంతా ఈ తీరులోనే మాట్లాడుతారు, ఇలానే వాదిస్తుంటారు. వారి మాటలకి, వాదనలకి విరుద్ధంగా వచ్చే వాటిని వారేమాత్రం పట్టించుకోరు. ఇక యూనియన్‌ని ''నిర్వహించడం'' అనే విషయం దగ్గరికి వచ్చేటప్పటికి, ఇందుకోసం బలప్రయోగాన్ని వీరు వ్యతిరేకించరు, బలప్రయోగానికి తలపడాలంటారు, తలపడతారు, ఆ రకంగా సదరు యూనియన్ అనేది బలప్రయోగంతో అస్థిత్వంలో వుండేదిగానే మిగులుతుంది. **''కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గల భారత పవిత్ర భూమి''** అని పదే పదే వల్లిస్తూ కాశ్మీర్‌లో ప్లెబిసైట్ నిర్వహణను భారత రాజకీయ నాయకులు తిరస్కరిస్తూ వస్తున్నారు. ''భారత ప్రజాస్వామ్యం'' సారమల్లా ఏమంటే ఇందులో ఒత్తిడి, నిర్బంధం అనేవే వాస్తవం కాగా

ప్రజాస్వామ్యం అనేది పచ్చి బూటకం.

భారతదేశంలో వుంటున్న ప్రజాస్వామ్యం గురించి తెగ ఊదరగొట్టుకుంటున్న భారత పాలకవర్గాలు భారత సైన్యాలు ఇప్పటికే ఆక్రమించిన కాశ్మీర్ భూభాగాన్ని శాశ్వతంగా వశపరచుకొని అనుభవించగలమని కలలు కంటున్నారు. ఈ భారత ఆక్రమిత కాశ్మీర్‌ని భారత యూనియన్‌లో విడదీయరాని ఒక భాగంగా చేసేస్తూ భారత పాలకవర్గాల పార్లమెంట్ ఇప్పటికే 'ప్రజాస్వామ్యబద్ధం'గానే అత్యంత అప్రజాస్వామిక తీర్మానాన్ని అంగీకరించేసింది. అధీనరేఖ (లైన్ ఆఫ్ కంట్రోల్) అదేదో 'అతి పవిత్రం', 'అనుల్లంఘనీయం' అంటూ భారత పాలకవర్గాలు ప్రచారం చేయిస్తుంటాయి. ఎందుకంటే ఈ అధీనరేఖకు ఈవల తమ స్వాధీనంలో వున్న భూభాగమంతా ఇక తమదేనని చెప్పడానికి, అలా చెప్పడానికి అవసరమైన సాధికారతని సృష్టించడానికే ఈ తతంగమంతా! ఈ తీరులో తమ ఆధీనంలో వుండే కాశ్మీర్ భూభాగాన్నంతటినీ శాశ్వతంగా కబ్జా చేసేయవచ్చని పాలకవర్గాలు ఉబలాటపడుతూ 'అధీనరేఖ'కి అంతటి 'పవిత్రతని' ఆపాదించేస్తున్నాయి. భారత పాలకవర్గాలకు మల్లే అంతే అభివృద్ధి నిరోధక ప్రజా వ్యతిరేక పథకాలతో వుండే పాకిస్తాన్ పాలకవర్గాలతో ఒక అవగాహనకొస్తూ వారి ఆమోదంతోనే కాశ్మీర్ సమస్యని శాశ్వతంగానే పరిష్కరించుకోవాలని భారత పాలకులు తలపోస్తున్నారు. సిమ్లా ఒప్పందం సందర్భంగా అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ నాటి పాకిస్తాన్ ప్రధాని భుట్టోని-ఆధీనరేఖనే ఇరు దేశాల మధ్య ఒక శాశ్వత సరిహద్దు రేఖగా అంగీకరించేట్టు ఒప్పించింది. భుట్టో వరకు ఈ ప్రతిపాదన అంగీకారమే గానీ, ఇది అప్పటివరకు పాటిస్తూ వస్తుండిన ''కాశ్మీరీ సోదరుల ప్రయోజనాలకి'' విరుద్ధమైనది గనుక ఆ రకంగా ఇటు పాకిస్థాన్ అటు కాశ్మీర్ ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురికాగల ప్రతిపాదనే అవుతుంది గనుక, ఆ రకంగా అప్పటిదాకా పాకిస్తాన్ అనుసరిస్తుండిన రాజకీయ వైఖరికి పూర్తి మళ్లింపు అవుతుంది కనుక అంతటి సాహసం భుట్టో చేయలేక పోయాడు. ఆ సందర్భంలో భుట్టో గురైన సంకటస్థితిని మాజీ విదేశీ వ్యవహారాల కార్యదర్శి జె.ఎన్. దీక్షిత్ ఒక పుస్తకంలో అభివర్ణించాడు. భారత పాలకులు కాశ్మీర్ సమస్యను ఈ తీరులో పరిష్కరించుకోడానికి రహస్యంగా పాకిస్థాన్ పాలకులతో మంతనాలు జరుపుతూనే వున్నారు. కార్గిల్ సంక్షోభ సమయంలో సైతం ఇలాంటి ప్రయత్నాలు సాగాయి. భారత పాలకవర్గాల ఈ పరిష్కార ప్రతిపాదనకి అమెరికా పాలకుల మద్దత్తు కూడా వుంది. కార్గిల్ సంక్షోభం బద్ధలై అది భారత విజయంగా ముగిసిన తరువాత ఈ నిజాన్ని ఇటు భారత పత్రికలు అటు పాకిస్థాన్ పత్రికలు కూడా బహిర్గత పరిచాయి. అమెరికా పాలకుల మద్దత్తు సైతం వుండిన కారణంగానే భారత పాలకుల ఈ రాజీ ప్రతిపాదనకి మిలటరీ కుట్ర ద్వారా పదవీచ్యుతుడు కావడానికి ముందు నవాజ్ షరీఫ్ అంగీకరించాడు. అయితే 1999 అక్టోబర్ 12న అతడు పదవీచ్యుతుడైనాడు. కాగా అక్టోబర్ 13వ తేదీనాటి ఒక రేడియో సంభాషణా కార్యక్రమంలో మాజీ భారత ప్రధాని ఐ.కె. గుజ్రాల్ నవాజ్ షరీఫ్ తనతో స్వయంగా చెప్పినవిగా చెప్పిన మాటలేమంటే **''నేను మా కాశ్మీర్‌ని మీకిచ్చేయలేను. అది మీకు తెలుసు, అలానే మీ కాశ్మీర్‌ని నేను లాక్కోలేను. అది నాకు తెలుసు. కనుక మనం ఈ వాస్తవాల నేపథ్యంలో సంప్రదింపులు ప్రారంభించగలం, ప్రారంభించాలి.''** తాలిబాను ఆఫ్ఘనిస్థాన్ నుంచి తలెత్తుతున్న ముస్లిం ఛాందసవాదం అనే సమస్య, అలానే ఎప్పటినుంచో వస్తున్న కాశ్మీర్ సమస్య ఈ ప్రాంతంలోని ఈ రెండు సమస్యలకి సంబంధించి అమెరికా-పాకిస్థాన్- ఇండియాల మధ్య విశాల అవగాహన వుందనే చెప్పాలి. ఇలాంటి విశాల అవగాహన ప్రాతిపదికగానే పాకిస్థాన్ కార్గిల్ నుంచి ఉపసంహ రించుకుంది. భారత పాకిస్థాన్ అభివృద్ధి నిరోధక రాజ్యాల మధ్య కాశ్మీర్‌ని శాశ్వత ప్రాతిపదికపై విభజించి పంచే విధంగా కాశ్మీర్ సమస్య 'పరిష్కరించబడటం' అనేది ఈ విశాల అవగాహనలో భాగమే! కాశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికార హక్కుని తిరస్కరించే దుష్ట పథకంలో ఏకాభిప్రాయంతోనే వుంటూ ఈ పథకాన్ని అమలు చేయ ప్రయత్నిస్తున్న భారత, పాకిస్థాన్, అమెరికా పాలకవర్గాల నిజ స్వరూపం కాశ్మీర్ ప్రజలముందు బహిర్గతమవుతోంది. 'భారత ప్రజాస్వామ్యం' గురించి, పాకిస్థాన్ ముస్లిం పాలకుల గురించి, ఇక అమెరికా సామ్రాజ్యవాదుల కుట్రలకి సంబంధించి కాశ్మీరు ప్రజలు పాఠం తీసుకోగలరు. అమెరికా పథకాలనేవి 'బృహత్ ప్రయత్నాలు, అమెరికా విలువల అవలోకనం' అనే ముసుగులో తరచుగా వస్తుంటాయి. భారత్, పాకిస్థాన్, అమెరికాలు మూడూ కూడా కాశ్మీరీ విమోచనోద్యమాన్ని వ్యతిరేకించేవే. కొన్ని పరోక్షంగా, కొన్ని ప్రత్యక్షంగా!

'కాశ్మీర్ తూర్పుతైమూర్ కాబోదు' అని అమెరికా అధ్యక్షుడు క్లింటన్ పదే పదే ప్రకటించడంలో అంతరార్థమల్లా ఏమంటే కాశ్మీర్‌ని తూర్పుతైమూర్‌తో పోలుస్తూ ఇక్కడ కూడా రిఫరెండం కావాలనే డిమాండ్‌ని పాకిస్థాన్ విడిచిపెట్టాలని, మరచి పోవాలని సూచించడమే! ఈ సంకేతాన్ని చక్కగానే అందుకున్న భారత ప్రచార సాధనాలు ఇక ఎడతెరిపి లేకుండా కాశ్మీర్-తూర్పుతైమూర్‌ల మధ్య ఎలాంటి పోలిక లేదని వాదిస్తూ బళ్ళకొద్దీ సాహిత్యాన్ని వ్యాసాల్ని గుప్పిస్తూ వచ్చారు. ఈ వ్యాసాలు, వ్యాసకర్తలంతా బలంగా చెప్పదలచిన, చెప్పిన అంశం ఏమంటే తూర్పు తైమూర్ సమస్య ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని 'డికాలనైజేషన్ కమిటీ'కి అప్పగించబడిందని, అంతవరకూ ఒక వలసగా వుంటూ ఇక వలస స్థితి నుంచి బయటపడనున్న తరుణంలో దాని భూభాగం దురాక్రమణకి గురైందని, ఇలాంటి స్థితికి భిన్నంగా కాశ్మీర్‌ని భారతదేశంలో భారత యూనియన్‌లో కలుపుతూ కాశ్మీర్ రాజు ఒప్పందంపై సంతకం చేసారని, కాని తూర్పుతైమూర్‌ని ఇండోనేషియా ఆయుధశక్తిని ప్రయోగించి కబళించిందని వీరు వాదిస్తుంటారు. ఈ వ్యాసకర్తలంతా నొక్కి చెప్పే విషయం ఏమంటే 1948 నాటి భద్రతా సమితి తీర్మానం (కాశ్మీర్‌పై) స్వాతంత్ర్యం అనే దానికి అవకాశం లేని 'ప్లెబిసైట్'ని గూర్చే చెబుతోంది, కాగా తూర్పుతైమూర్‌లో జరిగిన 'రిఫరెండం' అనేది స్వాతంత్ర్యం కోసం జరిగింది. అయితే ఈ వాదనా తీరంతా కేవలం మాటల గారడీ తప్ప వేరు కాదు. కాశ్మీరీ ప్రజలు భారత్‌తో గాని లేక పాకిస్థాన్‌తోగాని కలిసివుండేందుకు వారు నిర్ణయించుకోగల హక్కుతో 'ప్లెబిసైట్'ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. అయితే ఇది అప్రజాస్వామ్యయుతమే, ఏమంటే కాశ్మీర్ ప్రజల స్వాతంత్ర్యానికి సంబంధించిన ప్రస్తావన ఇందులో లేదు. కాని ఒక ప్రపంచ సంస్థ ఈ సమస్యని వ్యక్తీకరించడంలో చేసిన తప్పు కారణంగా కాశ్మీర్‌కి తాను స్వతంత్రంగా నిలబడగల హక్కుని లేకుండా చేసేయలేదు,

భారత్‌తోగాని లేక పాకిస్థాన్‌తోగాని ఏ ఒక్క దేశంతో కూడా తాను కలిసి వుండదలచలేదనే వైఖరి అది తీసుకోగల హక్కు దానికుంది. నిజం చెప్పాలంటే తూర్పుతైమూర్‌లోని 'రిఫరెండం' సైతం ''స్వాతంత్ర్యం కోసం'' కాదు, ఐక్యరాజ్యసమితి మాట్లాడిందల్లా. ఇండోనేషియా పరిధిలోనే దానికి స్వయం ప్రతిపత్తి అనేదాన్ని ఇవ్వాలా వద్దా అనేదే, స్వయం ప్రతిపత్తా? లేక స్వాతంత్ర్యమా? అంటూ ఏదో ఒకటి ఎంపిక చేసుకొనే అవకాశం ,ఇక్కడ లేదు. కాని తూర్పుతైమూర్ ప్రజలు స్వాతంత్ర్యాన్ని కోరుకుంటే సమితి వైఖరి దానికి ఆటంకం కాజాలదు, ఆటంకం కల్గించలేదు కూడా. స్వాతంత్ర్యేచ్ఛతో పోరాడే ప్రజలు స్వాతంత్ర్యాన్ని సాధించకుండా ఐక్యరాజ్య సమితి అడ్డుకోగలిగి వుండేది కాదు. కనుక 1948 తీర్మాన పాఠం స్వాతంత్ర్య కాంక్షతో వుండే ప్రజల ఆకాంక్షని చంపేయజాలదు. జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో ఇవాళ వుంటున్న పరిస్థితికి భిన్నమైన స్థితిని ఇటు భారత్‌గాని అటు పాకిస్థాన్‌గాని కోరడం లేదనే చెప్పాలి. ఏమంటే- ప్లెబిసైట్ అనే దానికి ఇరుదేశాలు తిలోదకాలిచ్చేసి ఉభయులు కూడా ఎవరు ఆక్రమించుకున్న ప్రాంతం నుంచి వారు ఒక్క అంగుళం కూడా వెనక్కి మరలాల్సిన అవసరం లేని తీరులో కాశ్మీర్ సమస్య పరిష్కారాన్ని కోరుతున్నారు. ఇలాంటి స్థితి 1948 నుంచే కొనసాగుతున్నది. గనుక ఇక కాశ్మీర్‌ని తమ మధ్య వాటాలేసుకొని పంచేసుకునే హక్కు ఇండియా పాకిస్థాన్‌లకి వచ్చేసిందని భావించడం సరికాదు. 'ప్లెబిసైట్' ప్రతిపాదనను ఉభయులూ ఎందుకు కాదంటున్నారంటే ఎవరి స్వార్థ సంకుచిత ప్రయోజనాలు వారికున్నాయి. ఈ రకంగా పరిస్థితి 'ప్లెబిసైట్' నుంచి 'పంపకం' దగ్గర కొచ్చేసింది. అంటే ఆ జాతికి ఇది ఇంకో విద్రోహకర చర్య. ఒకానొక జాతి స్వతంత్రంగా మనగలగాలనే దాని వాంఛితాన్ని, ఇచ్ఛని ఎవరూ కాదనజాలరు, ఇతరులెవరు కాదన్నా, ఆ జాతి ఖాతరు చేయాల్సిన పనిలేదు అలానే సదరు జాతి అనేది బలవంతంగా విభజింపబడేది కాదు. కాశ్మీరీ ప్రజలతో సన్నిహిత సోదర బంధాన్ని పెనవేసుకున్న పాకిస్థాన్ ప్రజానీకాన్ని అదుపులో వుంచుకోవడమనే పాకిస్థాన్ పాలకుల క్రీడలో భాగమే ఇది. కనుక భారత్ చేస్తున్న అధికారయుత విభజన ప్రతిపాదనను పాకిస్థాన్ పాలకులు నేరుగా బహిరంగంగా అంగీకరించలేక పోవచ్చు. ఈ విషయంలో వారికి ఒక ''తృతీయపక్షం'' ఒక ''అంతర్జాతీయ మధ్య వర్తిత్వం'' అవసరం అవుతుంది. ఇక భారత్ విషయానికొస్తే కాశ్మీర్ ఒక సుందర ప్రదేశం అంతే తప్ప ప్రజావాసం కాదు. భారత అత్యాచారాలన్నీ కూడా కాశ్మీర్ సమస్యకి సంబంధించిన భారత ప్రజల సాధారణ మనస్తత్వాన్ని చాటుతాయి. కాశ్మీర్ ప్రజలతో ఎలాంటి మానసిక బంధాల్ని కాశ్మీరేతర భారత ప్రజలు పెనవేసుకున్న దాఖలాలు చూడం. ఇలాంటి బంధాలే ఏర్పడి వుండినట్లయితే కల్లోల కాశ్మీర్‌లోని ప్రజల కడగండ్లు అనేవి దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజల్ని బాగానే కదిలించేవి, భారత పాలకులకి వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్ర నిరసనని సృష్టించగలిగి వుండేవి. అధీన రేఖను భారత్-పాక్‌ల మధ్య శాశ్వత సరిహద్దు రేఖగా చేసే ప్రయత్నాలను నిరసిస్తూ అధీనరేఖను దాటతాననే 'జమ్మూ-కాశ్మీర్ విమోచన సమాఖ్య' (జె.కె.ఎల్.ఎఫ్.) ప్రకటనని ప్రయత్నాల్ని ఇరుదేశాల పాలకులు పరస్పరం కుమ్మక్కు అయిపోయి జె.కె.ఎల్.ఎఫ్. ప్రయత్నాల్ని భంగపరచడానికి చేతులు కలిపారు. పాకిస్తాన్ జె.కె.ఎల్.ఎఫ్.పై విరుచుకుపడి వందలాది కార్యకర్తలను నిర్బంధించి అది అధీనరేఖని చేరకుండా తీవ్ర అడ్డంకులు కలిగించింది. భారత సైన్యం ఈ సందర్భంగా ''అధీనరేఖను (పవిత్రం, పరమ పవిత్రం అయిన) అధిగమిస్తూ వచ్చేవారిని దురాక్రమణకు పూనుకున్న వారిగానే పరిగణిస్తూ తదనుగుణంగానే వారితో వ్యవహరించాల్సి వుంటుంది'' అని ప్రకటించింది. ఈ హెచ్చరిక ద్వారా భారత పాలకులు జె.కె.ఎల్.ఎఫ్.కి తమ ఫాసిస్టు విధానాన్ని గూర్చి తెలియజేయ దలిచారు, తానప్పటికే ఆక్రమించుకొన్న కాశ్మీర్‌ని నిలబెట్టుకోడానికి ఎలాంటి బీభత్స కాండకైనా, బుల్లెట్ల వర్షానికైనా సిద్ధమేనని భారత పాలకులు చాటుకున్నారు.

కాశ్మీర్ సమస్యపై భారత్ వైఖరిని అమెరికా సమర్థించడం పట్ల భారత పాలకులు బూర్జువా ప్రసార మాధ్యమాలు అమితానందాన్ని వ్యక్తపరిచారు, ఏమంటే కాశ్మీర్ విషయంలో అమెరికా తన గత వైఖరి నుండి 180 డిగ్రీలు తిరిగిపోయింది, పాకిస్థాన్ పాలకుల్ని సమర్థించే వైఖరినుంచి భారత పాలకుల్ని భుజం తట్టే వైఖరికి అమెరికా మారిపోయింది. అమెరికా సామ్రాజ్యవాదం యొక్క 'సూత్రబద్ధ వైఖరి' మారిన పరిస్థితులు, తలెత్తిన కొత్త అవసరాల నేపథ్యంలో కొత్తగా 'సూత్రబద్ధం' అవుతూ మారిపోయింది. అయినా నిన్నటిదీ సూత్రబద్ధమే, మారిన నేటి వైఖరీ సూత్రబద్ధమే! ఇవాల్టి అమెరికా అవసరం ఏమంటే- మరీ మితిమీరిపోయిన తాలిబాన్ ఛాందసవాదాన్ని అదుపు చేయడం, ఏమంటే ఇది ఈ ప్రాంతంలో అమెరికా వ్యూహాత్మక అంచనాలని దెబ్బతీస్తుంది. ఇక్కడ కాశ్మీర్ సమస్య అనేది ఐక్య స్వాతంత్ర్య కాశ్మీర్‌ని అనుమతించడంగా గాక దాన్ని భారత్ పాక్‌ల మధ్య వాటాలు వేసి పంచడం ద్వారానే పరిష్కరించబడాలనేది అమెరికా అభిమతం! కనుకనే అమెరికా పాకిస్థాన్‌లోని కొత్త సైనిక నేతల్ని తన ఆదేశాల కనుగుణంగా వర్తించేట్టు ఒత్తిడి కలిగిస్తోంది. ఈ అన్ని పరిస్థితులు, పరిణామాల నేపథ్యంలో కాశ్మీర్‌లోని నిజాయితీ చిత్తశుద్ధి గల జాతీయ పోరాటవాద శక్తులన్నీ ఈ ప్రాంతంలో పనిచేస్తున్న వివిధ రకాల నేరస్థ శక్తుల పట్ల, స్వయం నిర్ణయాధికార హక్కు కోసం, స్వాతంత్ర్యం కోసం తాము చేపట్టిన పోరాటం నుండి తమని దారి మళ్ళించడానికి ఈ దుష్టశక్తులు పన్నే పథకాలు ప్రయోగించే కుట్రలపట్ల కాశ్మీర్ పోరాటవాదులు అప్రమత్తంగా వుండాలి.

కాశ్మీర్‌లో తీవ్రం అవుతున్న సాయుధ పోరాటం ఇంకో రంగంలో కూడా అంటే రాజకీయ రంగంలో సైతం పోరాటం తీవ్రం కావాల్సిన అవసరాన్ని రంగంమీదికి తెస్తుంది. ఏమంటే జాతీయ విముక్తి కోసం సాగే సాయుధ పోరాటం యొక్క రాజకీయ గమనాన్ని నిర్ధారించే సిద్ధాంత రాజకీయ మార్గదర్శకత్వం చాలా అవసరం, అప్పుడు మాత్రమే దీనికి వ్యతిరేకంగా సాగే కుట్ర కుహకాలన్నింటినీ నిర్జిస్తూ పోరాటాన్ని ముందుకి తీసుకుపోవడం సాధ్యమవుతుంది. అన్నిరకాల విదేశీ దోపిడీల నుండి జాతీయ అణచివేతల నుంచి కాశ్మీర్ జాతి ప్రజలు విముక్తి కావడానికి వీలుగా వారు చేపట్టిన సాయుధ పోరాటం విజయవంతం కావాలంటే ఆ పోరాటానికి అవసరమైన సరైన సైద్ధాంతిక, రాజకీయ దిశానిర్దేశం అవసరమే! కనుక వారు తమ లక్ష్యాన్ని సాధించడానికి ప్రధానంగా తమ స్వంత కృషి, ప్రయత్నాల పైనే ఆధారపడాల్సి వుంటుంది.

❑

*( 51వ పేజీ తరువాయి.....)*

ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, సభ తీర్మానాలు ఆమోదించింది.

ప్రభుత్వం కల్పించిన అన్నిరకాల అడ్డంకులను అధిగమించి సభను దిగ్విజయంగా జరపటంలో కమిటీ విజయం సాధించింది. ఈ సభను జరగకుండా చేయటానికి, రాష్ట్ర ప్రభుత్వం తన చేతిలోని పనిముట్టు పోలీసు యంత్రాంగం ద్వారా అనేక రకాల ప్రయత్నాలు చేసింది.

బహిరంగ సభకు, ర్యాలీకి ఎటువంటి అడ్డంకులు లేకుండా అనుమతి ఇస్తున్నట్లుగా మొదట్లో అందర్నీ నమ్మించింది. తీరా, సభ తేదీ దగ్గర పడగానే, సభకు పెద్ద ఎత్తున తరలివచ్చే పీపుల్స్‌వార్ సానుభూతిపరుల వలన సిటీలో శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందనే కుంటిసాకు చూపి, సిటీ పోలీస్ కమీషనర్ సభకు పర్మిషన్ రద్దు చేశాడు. దాంతో, అప్పటికప్పుడు హైకోర్టుకి వెళ్ళి సభకు పర్మిషన్ తెచ్చుకోవలసి వచ్చింది. 12వ తేదీ మీటింగ్‌కు పర్మిషన్ ఇస్తూ కోర్టు ఆర్డర్ ఇచ్చింది. అయితే, కోర్టు కూడా ర్యాలీకి పర్మిషన్ ఇవ్వలేదు, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని చెప్పి. అలాగే, సభకు హాజరయ్యే ప్రజలకి ఎటువంటి ఆటంకాలు కల్పించవద్దని పోలీసులకి ఆదేశాలిచ్చింది. కోర్టు ఆదేశాన్ని ఏమాత్రం చెవిన పెట్టకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలను సభకు రాకుండా చేయటానికి పోలీసు యంత్రాంగం తన కుయుక్తులన్నీ ఉపయోగించింది. సభకు హాజరయ్యే ప్రజలకు లారీలనుగానీ, ట్రక్కులనుగానీ, జీపులనుగానీ, ఇతర వాహనాలనుగానీ బాడుగకుగానీ, ఇతరత్రా ఇవ్వవద్దని, ఇస్తే తీవ్ర పరిణామాలు వుంటాయని వాటి యజమానులను హెచ్చరించింది. సభకు బయల్దేరిన ప్రజలను, రాష్ట్రంలో పలుచోట్ల వేలాదిమందిని పోలీసులు నిర్బంధించారు. అలాగే, ప్రజలు సభకు హాజరు కాకుండా చేయాలని రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల నుండి, ముఖ్యంగా తెలంగాణా నుండి హైదరాబాద్‌కు వచ్చే బస్సులను కూడా రద్దు చేసారు. కానీ, ప్రభుత్వ ప్రయత్నాలన్నీ వ్యర్థ ప్రయత్నాలుగానే మిగిలి పోయాయి. ప్రభుత్వం కల్పించిన అడ్డంకులను, నిషేధాజ్ఞలను లెక్క చేయకుండా, బూటకపు ఎదురుకాల్పులకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఐక్యపోరాట కమిటీకి, ప్రజల కోసం పోరాడుతున్న వారికి సంఘీభావం తెల్పటానికి నగరానికి పదులు, వేలుగా తరలి వచ్చారు.

## పోలీసు పాలనను ధిక్కరించిన ప్రజలు

కా॥ శ్యామ్, మహేష్, మురళిలను కోవర్టు ఆపరేషన్ ద్వారా పట్టుకుని, పాశవికంగా చిత్రహింసలు పెట్టి చంపిన పోలీసు చర్యకు నిరసనగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున చెలరేగిన యాదృచ్ఛిక ప్రజా ప్రతిఘటన పోలీసులను నిశ్చేష్టులను, నిర్వీర్యులను చేసింది. ఎన్‌కౌంటర్‌పై పోలీసులు చెప్తున్న 'కథ'ను ప్రజలు విశ్వసించరనే విషయం పోలీసులకు బాగానే తెలుసు. వాళ్ళు కానీ, బూర్జువా పత్రికలుకానీ, ప్రజలను ఏమాత్రం అది నిజమైన ఎన్‌కౌంటర్ అని నమ్మించలేక పోయాయి. తమ ప్రియతమ నాయకుల క్రూరమైన హత్య, ప్రజల్లో ప్రభుత్వంపై మరింత ద్వేషాన్ని రగిల్చింది. దాంతో, ప్రభుత్వ ఆఫీసులు, అధికార పార్టీ నాయకుల ఆస్తుల పేల్చివేత నుండి, గ్రామాల్లో, మారుమూల ఆదివాసీ గూడాలతో సహా ర్యాలీలు, సభలు జరపటం వరకు అనేక రకాల పోరాట రూపాలు చేపట్టారు. ముగ్గురు అగ్ర నాయకులను చంపివేస్తే, క్యాడర్, ఉద్యమం నిర్వీర్యం అవుతుందనుకున్న ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, గోడను కొట్టిన బంతి కొట్టినంత వేగంతో తిరిగివచ్చి ఏ విధంగా అయితే ప్రతిచర్య చూపుతుందో ఆ విధంగా రాష్ట్రంలో జరుగుతున్న ప్రతిఘటనా చర్యలు, నిరసన కార్యక్రమాలను చూచి బెంబేలెత్తింది. దాంతో, ప్రజల నిరసనను అణగదొక్కటానికి కుట్ర పన్ని సభలకు, ప్రదర్శనలకు అనుమతి నిరాకరించే విధానం చేపట్టింది. అంతేగాక, నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులను అరెస్టు చేయటం మొదలు పెట్టింది. ఇలా కామ్రేడ్స్ వరవరరావు, గద్దర్, విమల, చల్లపల్లి శ్రీనివాసరావు మొదలైన వారినందరినీ, రాష్ట్రంలోని అనేక ప్రదేశాల్లో అక్రమంగా అరెస్టు చేసి కేసులు బనాయించారు. సభలకు, నిరసన ప్రదర్శనలకు ప్రజాసంఘాల నాయకులు రాకుండా చేయటానికి పోలీసులు పన్నిన కుట్రే ఇది. ఈ విధంగా చేయటం ద్వారా ప్రజల, నాయకుల పోరాట స్ఫూర్తిని దెబ్బతీయ వచ్చని భావించారు పోలీసులు. వివిధ విప్లవ ప్రజాసంఘాలు హైద్రాబాద్‌లో సెక్రటేరియట్ వద్ద ధర్నా చేస్తుంటే, ప్రజాసంఘాల నాయకుల్ని అరెస్టు చేసి చంచల్‌గూడా జైల్‌లో వేశారు; బూటకపు ఎదురు కాల్పులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి నాయకత్వం లేకుండా చేయటమే దీని ఉద్దేశం. కానీ, అనేకమంది రాజకీయ ఖైదీలు, ముఖ్యంగా మన పార్టీ కార్యకర్తలతో నిండి వున్న చంచల్‌గూడా జైలు ఒక విప్లవ క్యాంప్‌గా మారిపోయింది. జైలు అధికారులను దిమ్మెర పోయేటట్లు చేస్తూ ఉపన్యాసాలతో, పాటలతో, స్లోగన్స్‌తో జైలు గోడలు ప్రతిధ్వనించాయి. అయితే, కోర్టు కండీషన్ బెయిల్ ఇవ్వటంతో వీళ్ళు బయటకు రాగలిగారు. గుంటూరులో డిసెంబరులో జరుప తలపెట్టిన ఎన్‌కౌంటర్ వ్యతిరేక సభను అడ్డుకుని, వచ్చిన నాయకులందరినీ అరెస్టు చేయగా, పోలీసుల కళ్ళుగప్పి, మరుసటి రోజు కా॥ గద్దర్ బార్‌కౌన్సిల్ సమావేశంలో పాల్గొని ప్రసంగించి పోలీసులను నివ్వెర పరచాడు.

గుంటూరు జిల్లాను పోలీసు క్యాంప్‌గా మార్చిన పోలీస్ అధికారులు, జనవరిలో గుంటూరులో జరిగిన ఏ.ఐ.పి.ఆర్.ఎఫ్. సభకు వరవరరావు, ఇతర ప్రజాసంఘాల నాయకులు వస్తే, అరెస్టు చేయటానికి గుంటూరు రైల్వే స్టేషన్‌లో, టిక్కెట్ కలెక్టర్ల పక్కనే కాపుకాసారు. కానీ, ప్రజాసంఘాల కార్యకర్తలు, నాయకులను పోలీసుల చేతిలో పడకుండా రైల్వేస్టేషన్ నుండి జాగ్రత్తగా సభా స్థలంకు చేర్చారు. అయితే, పోలీసులు బహిరంగసభ జరగనివ్వలేదు. ఇదే ఎత్తుగడను గుంటూరు జిల్లా దాచేపల్లిలో కూడా అవలంభించారు. సభకు వచ్చిన నాయకులందరినీ అరెస్టు చేసారు. దీనికి నిరసనగా ప్రజలు అప్పటికప్పుడు ధర్నాతోపాటు, 4 గంటలపాటు రాస్తారోకో జరిపారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ, స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులందరూ బెయిల్ పిటీషన్ వేయగా, జడ్జీ వెంటనే బెయిల్ ఇచ్చాడు. ఆ వెంటనే సభ జరిపి, పోలీసుల పథకాల్ని తిప్పికొట్టారు. పోలీసులు సభలకు అనుమతి నిరాకరించినా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు సభలు జరుపుకున్నారు. ❑

సభలు

# కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి !

## నిజాం కాలేజీ బహిరంగ సభ డిమాండ్!!

'బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక ఐక్య పోరాట' కమిటీ ఇచ్చిన పిలుపునందుకుని, రాష్ట్రం నుండే కాక దేశం నలుమూలల నుండి వచ్చిన దాదాపు 30వేల మంది ప్రజానీకం, ఫిబ్రవరి 14వ తేదీన హైద్రాబాద్‌లోని నిజాం కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో, రాష్ట్రంలో కొనసాగుతున్న హంతక పరిపాలనను నిరసిస్తూ, బూటకపు ఎదురు కాల్పులను వెంటనే నిలిపి వేయాలని, సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] కేంద్రకమిటీ సభ్యులు కా॥ శ్యామ్ (నల్లా ఆదిరెడ్డి), కా॥ మహేష్ (ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి), కా॥ మురళి (శీలం నరేష్) వారితోపాటు చంపబడిన సాధారణ పౌరుడు కా॥ లక్ష్మీరాజంల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి చేత న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దోపిడీ రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతూ, తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరవీరుల త్యాగాలను గూర్చి కా॥ గద్దర్, ఇతర కళాకారులు పాడిన పాటలకు సభ యావత్తూ గొంతు కలిపి, అమరుల త్యాగాలను ఎత్తి పట్టింది. రాష్ట్రంలో సాగుతున్న బూటకపు ఎదురు కాల్పుల హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాడటానికి, కొయ్యూరు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణకు డిమాండ్ చేస్తూనూ 46 ప్రజాసంఘాలతో ఏర్పడిన 'బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక ఐక్య పోరాట కమిటీ' ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో అనేకమంది వక్తలు ప్రసంగించారు.



బెంగుళూరు–కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌ని ఖండిస్తూ ఫిబ్రవరి 14న హైద్రాబాద్ నిజాం కాలేజి గ్రౌండ్స్‌లో జరిగిన భారీ బహిరంగ సభ.

పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ సభ్యులు ముగ్గురి హత్యాకాండను నిరసిస్తూ, దేశంలోని విప్లవ సంస్థలు మరియు ప్రగతిశీల సంస్థలు చేతులు కలుపుతున్నాయని చెప్పారు. పీపుల్స్‌వార్ అగ్ర నాయకులను అమానుషంగా హత్య చేసినందుకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న ఫాసిస్టు అణచివేత విధానాలకు వ్యతిరేకంగా, తక్షణం దేశ వ్యాప్త ఆందోళనా కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందనీ చెప్పారు. పి.యు.సి.ఎల్. నాయకుడు కె.జి.కన్నాభిరన్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, దాని పోలీసులు అనుసరిస్తున్న విధానాలను తీవ్రంగా ఖండించాడు. ప్రాథమిక న్యాయ సూత్రాలను కాలరాచివేస్తూ, ప్రజలను చంపటం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ధోరణిగా మారిపోయిందని విమర్శించాడు. ''ఎదురు కాల్పులు గురించి పోలీసులు చెప్తున్న కథనాలు బూటకమని

రుజువు చేస్తూ, తగిన ఆధారాలతో మానవహక్కుల కమీషన్‌కి తెలియచేసామనీ, పోలీసుల చట్ట వ్యతిరేక పద్ధతులను అడ్డుకోవటానికి మా ప్రయత్నాలు చేస్తూనే వున్నామనీ, కానీ రాష్ట్రంలో బూటకపు ఎదురుకాల్పుల పాలన కొనసాగుతూనే వుంది'' అన్నాడు. మానవ హక్కుల కమీషన్ రాష్ట్రాన్ని సందర్శించి, రాష్ట్రంలో జరుగుతున్న 'ఎదురుకాల్పుల మరణాలు' అన్నిటిపై విచారణ జరపాలని కోరాడు. అలాగే, రాష్ట్రంలో 'ఎదురుకాల్పుల మరణాలు' వుండబోవని, చంద్రబాబు నాయుడు మానవ హక్కుల కమీషన్‌కు హామీ ఇవ్వాలని డిమాండ్ చేసాడు.

బొంబాయి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దావూద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి మూల స్థంభాలలో రెండు, అధికార యంత్రాంగం, చట్టసభలు అని, అవి వాటి విధుల్ని నిర్వర్తించడంలో విఫలం అయిన నేపథ్యంలో, ప్రజల్ని రక్షించటానికి న్యాయ యంత్రాంగం ముందుకు రావాలని కోరారు. న్యాయ వ్యవస్థను తప్పుదోవ పట్టించటానికి ప్రభుత్వాలు అతి నగ్నంగా ప్రయత్నిస్తున్నాయని, కావున ప్రభుత్వాల వాదనలను సీరియస్‌గా తీసుకోవద్దని కోర్టులకు విజ్ఞప్తి చేసారు. న్యాయమూర్తులు రాజ్యాంగ స్ఫూర్తికి (స్పిరిట్) కట్టుబడి తీర్పులివ్వ వలసిన అవసరం వుందని, ప్రభుత్వాలు ఇచ్చే 'సూచనల'కు ప్రభావితం కారాదని చెప్పారు. కోర్టు పర్మిషన్ తెచ్చుకుని సభ జరుపుకుంటున్న నేపథ్యంలో, 'వీధుల్లో సభలు జరుపు కోవటానికి అనుమతి కోసం కోర్టులకి వెళ్ళటం సాధ్యమవుతుందా!'' అని ప్రశ్నించాడు.

అనంతరం, ప్రముఖ కన్నడ సాహిత్య విమర్శకుడు ప్రొఫెసర్ (రిటైర్డ్) కె. గోవిందరావు మాట్లాడుతూ, ఫ్లై ఓవర్లను, ఆకాశ హర్మ్యాలను నిర్మించటం ద్వారా సిటీకి అందం రాదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, వాళ్ళు సంతోషంగా గడిపేలా చేయటమే అసలైన 'అందం' అని, ఫ్లైఓవర్లు, వెడల్పు రోడ్లు అభివృద్ధికి, అందానికి చిహ్నమని బాకాలూదుకుంటున్న చంద్రబాబుకి హితవు చెప్పాడు.


పీపుల్స్‌వార్ కేంద్రకమిటీ నాయకుల 'ఎన్‌కౌంటర్'పై నిజనిర్ధారణ కమిటీ రూపొందించిన నివేదికను, కర్నాటక రాష్ట్రానికి చెందిన పీపుల్స్ డెమోక్రటిక్ ఫోరమ్ నాయకుడు పి.జి. వెంకటేష్ సభకు సమర్పించాడు.

ఇంకా ఈ సభలో, ఎ.పి.సి.ఎల్.సి. అధ్యక్షురాలు రత్నమాల, బి.సి.వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జనశక్తి నాయకుడు చల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ శాసన సభ్యుడు ఎన్.వి. కృష్ణయ్య, చంద్రకాంత్ తారాగురు (నేపాల్), అశోక్ దేబ్రాయ్ (పశ్చిమ బెంగాల్), ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి, ప్రముఖ న్యాయవాదులు సెబాస్టియన్, బొజ్జా తారకంలు మాట్లాడారు. ఇంకా ఇల్లెందు శాసన సభ్యుడు గుమ్మడి నరసయ్య, వరవరరావులు కూడా ఈ సభలో పాల్గొన్నారు.

కొయ్యూరు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు జడ్జీ చేత న్యాయ విచారణ జరిపించాలని, బూటకపు ఎదురు కాల్పుల్లో పాల్గొన్న పోలీసు అధికారులందరిమీద హత్యానేరం నమోదు చేసి విచారణ చేయాలని, పీపుల్స్‌వార్ పార్టీ, ఇతర ప్రజాసంఘాలపైన వున్న నిషేధాన్ని

***(తరువాయి 49వ పేజీలో.....)***

## కుక్కకాటుకు చెప్పు దెబ్బలా జరిగిన పెద్ద ప్రజా ప్రదర్శనలు




నిషేధాన్ని ధిక్కరించి బహిరంగ సభ వేపుగా తరలివెళ్తున్న అనేక ర్యాలీలలో ఒకటి.

*పోలీసులు తమ శక్తి యుక్తులన్నీ ఒడ్డి, కోర్టు చేత కూడా అనుమతి నిరాకరింపజేసి, ప్రజా ప్రదర్శనను జరగకుండా చేయ గలిగామని మురిసి పోయారు. కానీ, వాళ్ళ కుట్రల్ని భగ్నం చేస్తూ, నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ, ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. చట్టమూ, అధికారమూ అన్నీ గుప్పిట్లో పెట్టుకున్న ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రజాస్వామిక హక్కును కాలరాచి, 'ఒక' ర్యాలీని నిషేధిస్తే, కుక్కకాటుకు చెప్పు దెబ్బలా, ప్రజలు అనేక ర్యాలీలు నిర్వహించారు. ప్రజలు అనేక నూతన పోరాట రూపాలను ఆవిష్కరిస్తారు, సృజనాత్మకతను ప్రదర్శిస్తారు, 'ప్రజలు తెలివైన వాళ్ళు' అన్న విషయాన్ని మరో మారు రుజువు చేసారు. సభరోజు అనేకమంది ప్రజలు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద గుమికూడి ఎరజెండాలు, బ్యానర్లు చేతపట్టుకుని, అక్కడనుండి నగరంలోని సందులు, గొందుల గుండా, నిజాం కాలేజీ గ్రౌండ్‌కు చేరుకున్నారు. ఇదే కాకుండా, నగరంలోని ఇంకా అనేక ప్రదేశాల నుండి కూడా ప్రజా ప్రదర్శనలు జరిగాయి. నదులన్నీ సముద్రంలో కలిసినట్లు, ఈ ప్రదర్శనలన్నీ బహిరంగ సభ జరిగే నిజాం కాలేజీ గ్రౌండ్‌లోకి ఒక్కొక్కటి వస్తుంటే, అక్కడే క్యాంప్ వేసి చూస్తున్న పోలీసు అధికారులకు వంటికి కారం రాసుకున్నట్లయింది. బూటకపు ఎదురు కాల్పులకు వ్యతిరేకంగా, ప్రభుత్వం అమలు చేస్తున్న పాశవిక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన నినాదాలు నగరంలోని సందుగొందుల నిండా ప్రతిధ్వనించాయి.*

ప్రతిఘటన

# పీపుల్స్‌వార్ వీరగెరిల్లాల చేతుల్లో మట్టి కరచిన నియంత మాధవరెడ్డి

ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ శాఖామంత్రి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ ఇంతవరకూ చూసిన అత్యంత కిరాతకమైన నియంతల్లోకెల్లా నియంత. 1995-99 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ హోంమంత్రిగా ఇతగాడు పెరూ, చిలీ, గ్వాటిమాలా, బ్రెజిల్ వంటి లాటిన్ అమెరికా దేశాల్లోనూ పిలిప్పైన్స్, ఇండోనేషియా, కాంగో వంటి దేశాల్లోనూ నీచ నికృష్ట నియంతృత్వ పాలనల్లో హోంశాఖా మంత్రులుగా పనిచేసిన వారికంటే మించిన క్రూరుడిగానూ, పీడకుడిగానూ తన్ను తాను నిరూపించుకున్నాడు. ప్రపంచబ్యాంకు, పలు సామ్రాజ్యవాద శక్తుల మార్గదర్శకత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించిన తెలుగుదేశం ప్రభుత్వ, నిర్బంధపూరిత విధానాలను తు.చ. తప్పకుండా పాటించిన వ్యక్తి ఇతడు. ముఖ్యమంత్రి తర్వాత తెలుగుదేశం ప్రభుత్వ మంత్రి వర్గంలో ఇతడిది రెండో స్థానం. సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆధ్వర్యం లోని విప్లవోద్యమాన్ని అణచి వేయటంలో ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్ అయిదు రాష్ట్రాలలోని పోలీసు చర్యల సమన్వయాన్ని పర్యవేక్షించే రాష్ట్రాల మధ్య సమన్వయ కమిటీకి ఇతగాడు కన్వీనర్‌గా పనిచేశాడు. 1985 నుండి నాలుగు సార్లు భువనగిరి ఎం.ఎల్.ఏ.గా ఎన్నికై, టి.డి.పి. జనరల్ సెక్రటరీగా పనిచేశాడు. 1989లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మంత్రివర్గంలో కూడా కొంతకాలం హోంమంత్రిగా పనిచేశాడు.



వేలాది కన్నతల్లుల గర్భశోకానికి కారణమైన కసాయి చంద్రబాబు తన అనుయాయి చావుకి ఏడుస్తున్న దృశ్యం!

15 సం॥ల క్రితం తెలుగుదేశం పార్టీలో చేరింది మొదలు ఆంధ్రప్రదేశ్‌లో పీపుల్స్-వార్‌ని అణచివేయడానికిగాను విధానాలను రూపొందించటంలో, వాటిని చురుగ్గా అమలు చేయటంలో ఇతడు ముందుపీఠిన నిలబడి పనిచేశాడు. హోంమంత్రిగా పనిచేసిన కేవలం 5 సం॥ల కాలంలో ఆంధ్రలో దాదాపు 1000 మంది హత్యలకు ఇతడు శ్రీకారం చుట్టాడు. వీరిలో చాలామంది సి.పి.ఐ. (యం-యల్) [పీపుల్స్‌వార్] పార్టీ, దాని ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలే. 1980ల చివర నుండి అంచెలంచెలుగా విప్లవోద్యమం పెరుగుతూ వచ్చిన దక్షిణ తెలంగాణాలోని నల్గొండ జిల్లాకి చెందిన ఇతడు ప్రత్యక్షంగానూ, దొంగచాటు పద్ధతులలోనూ (ఓవర్ట్ అండ్ కోవర్ట్) ఉద్యమాన్ని అణచివేయటాన్ని తన ప్రత్యేక కర్తవ్యంగా చేపట్టాడు. పాలకవర్గాల విశ్వాస పాత్రపు కుక్కగా ఇతగాడు ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని, పీపుల్స్‌వార్ పార్టీని కొద్ది నెలల కాలంలోనే కడతేరుస్తానంటూ పదే పదే మొరుగుతూ వచ్చాడు. సామ్రాజ్యవాదుల చెప్పుచేతుల్లో వుంటూ, పార్టీలోని బలహీనులైన కొద్దిమంది వ్యక్తులను పోలీస్ ఏజెంట్లుగా మార్చుకుని తోటి కామ్రేడ్స్‌ని, నాయకులను చంపేందుకు వారిని ఉపయోగించుకోవటం ద్వారా ఇతగాడు కోవర్ట్ ఆపరేషన్లకు నాంది పలికాడు. ఈ విధంగా మాధవరెడ్డి ప్రత్యక్ష నాయకత్వంలో పోలీసుల చేత నియమింపబడిన జడల నాగరాజు అనే ఏజెంటు ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కా॥ మల్కాపురం భాస్కర్ (రమేష్)ని నడిరేయి గాఢంగా నిద్రిస్తున్న సమయంలో కాల్చి చంపాడు. నల్గొండ జిల్లాలో రాష్ట్ర నాయకత్వాన్ని హత్య చేయడానికిగానూ పన్నిన మరింత క్రూరమైన పథకం విఫలమైనప్పటికీ ఆ సంఘటనలో కృష్ణపట్టి దళ కమాండర్ మరికొంతమంది దళ సభ్యులను చంపడానికి ఆ దళ సభ్యుడైన సోమ్లా నాయకే ఉపయోగపడినాడు. (వీడిని తర్వాత ప్రజలు వెంటాడి చంపారు).

అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడచిన తర్వాత 1995లో అధికారంలోకి చంద్రబాబు వచ్చినప్పటినుండి తెలుగుదేశం పాలనలో జరిగిన వందలాది విప్లవకారుల హత్యల న్నింటికీ ఈ క్రూర నియంతే ప్రత్యక్షంగా బాధ్యత వహించాడు. వీరితోపాటుగా వేలాదిమంది విప్లవకారులు, ఈకాలంలో అరెస్ట్ చేయబడి చిత్రహింసల పాలయ్యారు. ప్రజా గాయకుడు గద్దర్, ఏ.పి.సి.ఎల్.సి. నేత పురుషోత్తంలపై దాడి వంటి సంఘటనల ద్వారా లీగల్‌గా జీవిస్తూ విప్లవోద్యమాన్ని సమర్థించేటటువంటి వారిని, పౌరహక్కుల కార్యకర్తలను నిర్మూలించడానికి గూండాలు, మఫ్టీలోని పోలీసులు హంతక దళాలుగా పంపబడ్డారు. చంద్రబాబునాయుడు, మాధవరెడ్డిల పాలనలో ఆంధ్రప్రదేశ్ హంతక రాజ్యంగా మారింది.

చరిత్ర పదే పదే నిరూపిస్తున్నట్లుగా నియంతలందరూ ప్రజల చేతుల్లో మట్టికరవక తప్పదు. 2,000 సం॥రం మార్చి 7న పీపుల్స్‌వార్ సాయుధ గెరిల్లాలు ఈక్రూర నియంతను ఖతం చేసినపుడు ఆంధ్రప్రదేశ్‌లో సైతం చరిత్ర పై సత్యానికి తిరిగి సాక్షీభూతమై నిలిచింది. ఒక బుల్లెట్ ప్రూఫ్ కారు, మరో పైలట్‌కారు, అధునాతన ఆయుధాలను ధరించిన 10 మంది సాయుధ పోలీసులతో కూడిన మరో కారు, పోలీస్ కేడర్‌లోని సమర్థుల నుండి ఏరి పంపించిన వ్యక్తిగత భద్రతాధికారి, ఈ మూడు వాహనాలకు రేడియో లింకు ద్వారా నిత్యం సంబంధం కల్పించటం వంటి సౌకర్యాలన్నీ కల్పించే 'జెడ్ ప్లస్' కేటగిరీ (ప్రముఖుల్లోకెల్లా ప్రముఖులకు కల్పించే భద్రత) లోని భద్రతా వలయాన్ని ఇతగాడికి కల్పించారు. ఇవే కాక తన సొంత జిల్లా అయిన నల్గొండను ఇతడు సందర్శించేటపుడు ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీసులతో కూడిన రెండు వ్యాన్లతో కూడిన అదనపు భద్రతను కూడా కల్పించేవారు. అయితే ఈ అత్యున్నత భద్రతా సౌకర్యాలేవీ గెరిల్లాల ఆగ్రహం నుండి వీడిని కాపాడలేక పోయాయి. మంత్రి, అతడి పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసరయిన ఇన్‌స్పెక్టర్ రాంభూపాల్‌రెడ్డి, కారును నడుపుతున్న పోలీసు ముగ్గురూ గెరిల్లాలు పేల్చిన మందుపాతరకు అక్కడికక్కడే చనిపోయారు. నక్సలైట్ వ్యతిరేక గ్రేహౌండ్స్ బలగాలకు

చెందిన అత్యంత శిక్షణ పొందిన గన్‌మెన్లు ఈ పేలుడుతో ఎంతగా భీతిల్లి పోయారంటే చీకటిలో గాల్లోకి గుడ్డిగా పదే పదే కాల్పులు జరుపుతూ కూర్చున్నారు. మందుపాతర పేలిన ప్రదేశానికి తరలి వస్తున్న స్థానిక పోలీసులకు వీరి బుల్లెట్లు తాకుతూ కాస్తలో తప్పిపోయాయి.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రివర్గం, ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, మొత్తంగా భారత పాలకవర్గాలు అందరికీ నియంత మాధవరెడ్డి ఖతమైపోవడం వెన్నులో వణుకు పుట్టించింది. కేవలం ఒకరోజు ముందు అంటే మార్చి 6న కేంద్ర ప్రభుత్వం-ఆంధ్ర, మధ్యప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల పోలీస్ చీఫ్‌లు, హోంశాఖ అధికారులతో కూడిన సంయుక్త సమన్వయ కేంద్రం ఆరవ సమావేశాన్ని జరిపింది. ఈ సమావేశంలో హోంశాఖ కార్యదర్శి కమల్‌పాండే పలు చర్యలను ప్రకటించాడు. అవి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ నిఘా కోసం పైలెట్ లేని విమానాలను వాడటం; పోలీస్ బలగాలకు తగిన శిక్షణ కోసం అన్ని వనరులనూ అందించటం, ఈ అయిదు రాష్ట్రాలకూ తలొక భారతీయ రిజర్వ్ బెటాలియన్‌ని ఏర్పర్చటం, పోలీస్ బలగాల ఆధునీకరణకు అదనపు నిధులు అందించటం, సమాచారాన్ని పరస్పరం అందించుకోవటం వగైరా, వగైరాలు....మిలిటెంట్ సంస్థల సర్‌ప్రైజ్ దాడులకు వ్యతిరేకంగా అత్యంత జాగరూకతను పాటించాల్సిందిగా కూడా కేంద్రం ఈ అయిదు రాష్ట్రాలనూ హెచ్చరించింది. మాధవరెడ్డి హత్య జరిగిన మరుదినమే కేంద్ర హోంమంత్రి (హిందూ ఫాసిస్ట్) ఎల్.కె. అద్వానీ, లోక్‌సభ స్పీకర్ జి.యం.సి. బాలయోగి, ఇంకా ఢిల్లీ నుండి పలువురు యం.పి.లు మాధవరెడ్డి అంత్యక్రియలకుగాను హైద్రాబాద్‌కి తరలి వచ్చారు. వారి వర్గ స్వభావానికి అనుగుణంగా రాజకీయ పార్టీలన్నీ (కాంగ్రెస్, జనతాదళ్, సి.పి.ఐ., సి.పి.యం., బి.జె.పి. ఆధ్వర్యంలోని యన్.డి.ఏ. కూటమిలోని పలు భాగస్వామ్య పార్టీలూ) 'ప్రజాస్వామ్యం'లో హింసకు తావులేదంటూ మాధవరెడ్డిని హత్య చేసినందుకుగాను వాపోయాయి. అయితే వేయిమంది విప్లవకారుల హత్యకు, ప్రత్యేకించి సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) పార్టీ అగ్రనేతలు (కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళి) ముగ్గురినీ డిసెంబరు 1, 1999న పాశవికంగా హత్య చేసినందుకు ప్రతీకారంగానే ఈ ఖతం కార్యక్రమం జరిగిందనే వాస్తవాన్ని కప్పి వుంచేందుకే ఈ పార్టీలన్నీ ప్రయత్నించాయి. ఇక పత్రికలయితే, పీపుల్స్‌వార్ పార్టీని ''సాహసోపేతంగా ఎదుర్కొని'' నడుస్తున్న ప్రజాయుద్ధానికి ''పలు నష్టాలు'' కల్గించి 'గొప్ప' సేవ చేసినందుకుగానూ ఈ నియంతను ప్రశంసించాయి. తెలుగుదేశం అనధికారవాణిగా వుంటూ సామ్రాజ్య వాదుల ఆదేశాలకనుగుణంగా చంద్రబాబు తెలుగుదేశం పార్టీ అవలంభిస్తున్న ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణల నయా వుదారవాద విధానాలకు పూర్తిగా మద్దతునిస్తున్న 'ఈనాడు' పత్రిక ప్రజాయుద్ధంపై విష ప్రచారాన్ని, దాడులను ప్రారంభించింది. (బాక్స్‌లో చూడండి) రోజుల తరబడి అది నియంత మాధవరెడ్డిని కీర్తిస్తూ విప్లవోద్యమాన్ని పాశవికంగా నలిపి వేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపాదిస్తున్నది.

అద్వానీలకు, చంద్రబాబులకు, రివిజనిస్టులకు, ఇతర పాలకవర్గ ప్రతినిధులకు మాధవరెడ్డి హత్య పిరికి చర్యగానే కనిపించింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో, భారతదేశ వ్యాప్తంగా విప్లవశక్తులకు, పీడిత ప్రజారాసులకు ఈ చర్య భారత పాలకవర్గాలు మొదలెట్టిన తెల్ల బీభత్సం మధ్య విప్లవోద్యమం నిర్వర్తించిన వీరోచిత ప్రయత్నంగా, సాహసోపేత చర్యగానే కనిపించింది. ఈ క్రూరాత్ముడైన పాలకవర్గ నేత చేసిన లెక్కలేనన్ని నేరాలకు ప్రతీకారంగా చేపట్టిన వీరోచిత చర్య ఇది. విప్లవకారులకు వర్గ శత్రువులు పడిన నెత్తుటి అప్పుకు చెల్లింపే ఈ చర్య. భారత విప్లవాన్ని పురోగమింపజేయడానికి తమ జీవితాలనే అర్పించిన వందలాది ప్రియతమ అమరులకు గొప్ప నివాళిని సమర్పించిన చర్య ఇది. జనరల్ డయ్యర్ చంపబడినపుడు బ్రిటీష్ వలసవాదులు విలపిస్తుండగా మొత్తం బ్రిటీష్ ఇండియా పండుగ చేసుకుంది. ఆ విధంగానే ఈ ఆంధ్రా డయ్యర్ మట్టి కరిచినపుడు భారత పాలకవర్గాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఆంధ్ర ప్రభుత్వమయితే సెలవుదినాన్ని, మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. అదే సమయంలో ప్రజలు స్వీట్లు పంచుకుంటూ పండగ జేసుకున్నారు. ❑

---

*(కా॥ శ్యాం ప్రసంగం: 59 వ పేజీ తరువాయి.....)*

నష్టాలు కూడా, కొన్ని కొన్ని అనుమానాలు కూడా ప్రారంభమైనాయి. వాటి నుండి మనం బయటపడకుంటే మనమనుకున్న బలమైన పార్టీని ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీని నెలకొల్పడం సాధ్యం కాదు. మన ఆచరణలో జరుగుతున్న పొరపాట్లు మనందరికీ తెలుసు. మనం కొంతమందిని దేహశుద్ధి చేయబోయి చంపడం కావచ్చు లేదా కొంతమంది మన కార్యకర్తలు పెత్తందార్లుగా వ్యవహరించడం గావచ్చు, ఇవన్నీ కూడా మన పొరపాట్లు మనకు చాలానే కనబడుతున్నాయి. వీటన్నింటినీ మనం సరిదిద్దు కోవడం అంటే ప్రజలకు చెప్పుకోవడం, చెప్పుకోవడంతోటే సరిదిద్దుకోవడం అనేది ప్రారంభమవుతుంది. వాస్తవం చెప్పాలంటే సరిదిద్దు కోవడం అనేది, ఎక్కడైతే మన పొరపాట్లు జరిగినాయో, ఆ పొరపాట్లు ఏ ప్రజల మధ్యనయితే జరిగాయో ఆ ప్రజల మధ్య ఆ పొరపాట్లు ఒప్పుకోవడంతోటి మన సరిదిద్దుడు కార్యక్రమం అనేది ప్రారంభమవుతుంది. మన తప్పులు మన పొరపాట్లు ప్రజల ముందు ఒప్పుకోవడం ద్వారా మనకేమీ పోదు. వాస్తవానికి ప్రజలు మనల్ని ఇంకా ఎక్కువగా గౌరవిస్తారు. ఇంకా ఎక్కువగా విశ్వసిస్తారు. ఒక తప్పును ఒప్పుకోవడం ద్వారా అవతలి వారు ఇంకా ఎక్కువగా విశ్వసిస్తారు. అందుకని ఆ విశ్వాసాన్ని మనం సంపాదించుకోవాలంటే మన పొరపాట్లను మనం సరిదిద్దు కోవాల్సిన అవసరం వుంది. ప్రజలకు చెప్పుకోవాల్సిన అవసరం వుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ మధ్యలో ఆంధ్ర, ఉత్తర తెలంగాణా రాష్ట్ర ప్లీనాలు రెక్టిఫికేషన్ (దిద్దుబాటు) కార్యక్రమం చేపట్టాలి అని ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నాయి. ఆ నిర్ణయంలో భాగంగా ఎక్కడయితే ప్రజలకు నష్టాలు జరిగినాయో, ప్రజలను కష్టాలకు గురిచేసామో అక్కడ మనం వాటిని ఒప్పుకొని అక్కడ నుండి సరిదిద్దుడు అనేది ప్రారంభించాలి. అట్లా సరిదిద్దుకోలేని పార్టీ అది తప్పకుండా బ్యూరాక్రటిక్‌గా మారడం లేకుంటే ప్రజలమీద పెత్తందార్లుగా మారి పార్టీ దిగజారి పోవడానికి కారణమవుతుంది. అందుకని ఇది ఒక అంశంగా మనం దృష్టిలో పెట్టుకొని లెనిన్ చెప్పిన విప్లవకరమైన పార్టీని నిర్మించడంలో భాగంగా మన తప్పుల్ని మనం సరిదిద్దు కోవడమనే ఒక ముఖ్యమైన అంశాన్ని ఈరోజు మనం జోడించుకోవాల్సిన అవసరం వున్నది. ఇది జోడించుకోవడం ద్వారా మనం బలమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించి, ప్రజలకు విశ్వాసమైన ఒక పార్టీని, ఒక నాయకత్వాన్ని మనం అందించడం ద్వారా, ఆ పార్టీ ద్వారా, విప్లవాన్ని అడ్వాన్స్ చేయగలం. మన పార్టీ పుట్టిన దినం రోజు మన పార్టీని ఇంకా బలోపేతం చేయడానికి దానిని మనం చేయాల్సిన ఒక కర్తవ్యంగా కూడా చేపట్టాల్సిన అవసరం వున్నది. ❑

# మరింత పెద్ద విజయాలకు ప్రజలను ఆర్గనైజ్ చేసే కర్తవ్యంతో ముందుముందుకు సాగుదాం!

(మార్చి 7 రాత్రి 11 గంటలకు సి.పి.ఐ. (యం-యల్) (పీపుల్స్‌వార్) గెరిల్లాలు ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో గల ఘట్‌కేసర్ సమీపంలో మందుపాతరలు పేల్చి రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖామంత్రి ఎలిమినేటి మాధవరెడ్డిని ఖతం చేశారనే వార్తను, అదే రాత్రి ఒకానొక క్యాంపులో 2 గంటలకు రేడియో ద్వారా విన్న పీపుల్స్‌వార్ పార్టీ సభ్యులు, ప్రజా గెరిల్లాలు క్రూర నియంత కూలినవేళ విజయసూచికంగా జరుపుకున్న సభలో కామ్రేడ్స్ ప్రభాకర్, గణపతి లు మాట్లాడిన మాటలను ప్రచురిస్తున్నాము).

## కామ్రేడ్ ప్రభాకర్ ప్రసంగం:

మాధవరెడ్డిగాడు మట్టి కరిచాడు. కుక్కచావు చచ్చాడు. కొయ్యూరు బూటకపు ఎన్‌కౌంటర్‌లో మన నేతలు అమరులు అయినపుడు, ఆ దారుణ హత్యాకాండతో గాలీ, వెలుతురూ రెండూ అబద్ధం, కుట్రా, కుహకం, నీచత్వంతో కాలుష్యమయి పోయినాయి. కానీ మాధవరెడ్డిగాడి ఈ చావుతో వాతావరణంలో ఎటువంటి కాలుష్యమూ లేదు. రేపు వెలుతురు ఎప్పటికంటే చాలా స్వచ్ఛంగా వుంటుంది. రేపు వీచే గాలి ఎప్పటికంటే చాలా స్వచ్ఛంగా వుంటుంది. కారణం ఏమిటంటే ఇందులో దాచుకోవలసిందీ, మూసుకోవలసిందీ, అబద్ధాలు చెప్పుకోవలసిందీ ఏదీ లేదు. పాత్రికేయులు, ప్రజలు, పాలకవర్గాలు అందరూ కూడా వీడు పీపుల్స్‌వార్ గెరిల్లా యోధుల చేతుల్లో బలైపోయాడు అనే చెబుతారు. అంతకుమించి దానిని కాదనీ మనం అనం. అనవలసిన అవసరం మనకు లేదు. దోపిడీ పాలకవర్గాల, వాడి బంట్ల, ప్రజా శత్రువుల చావుకీ, మన వీర మరణానికీ, అమరత్వానికీ మధ్యవున్న తేడా అది. కనుకనే విప్లవం కుట్ర కాదు. విప్లవకారులు కుట్రదారులు కారు. నిజంగానే విప్లవం కుట్రా కాదు. విప్లవకారులూ కుట్రదారులు కానే కారు. ఈరోజు పాలకవర్గాలు, వారి బంట్లూ, పోలీసుకుక్కలూ వీరంతా మనం పదే పదే చెబుతున్నప్పటికీ, వారు గ్రహించలేకపోతున్నా, గ్రహించినా అంగీకరించలేక పోతున్న ఒక సత్యమేమిటంటే**.....విప్లవ పరిస్థితి విస్ఫోటించిన నాడు వాళ్ళు పీల్చే గాలి అంతా విప్లవ పొగబాంబుల మయమై వుంటుంది, నడిచే ప్రతి నేలా ల్యాండ్‌మైన్‌గానే అవుతుంది. ఇది సత్యం.....ఇదే.....సత్యం.**

## కామ్రేడ్ గణపతి ప్రసంగం:

నల్గొండ జిల్లాలో మన వీర గెరిల్లా సైనిక యూనిట్ అత్యంత సాహసోపేతంగా వర్గ శత్రువు, రక్తపిపాసి అయినటువంటి మాజీ హోంమంత్రి, ప్రస్తుత పంచాయితీరాజ్ శాఖామంత్రి ఎలిమినేటి మాధవరెడ్డిని అంతమొందించిన వార్త మనం ఇప్పుడే (రాత్రి 2 గంటలకు) విన్నాం. గత 3 దశాబ్దాల కాలంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకంపై భూస్వామ్య, దళారీ, నిరంకుశ బూర్జువా పాలకవర్గాలు తీవ్రమైనటువంటి దమనకాండను కొనసాగిస్తున్నాయి. ఇటీవలే మన పార్టీ నాయకులైన కామ్రేడ్స్ శ్యాం, మహేష్, మురళిలను ముగ్గురిని ఆంధ్ర రాష్ట్ర పోలీసులు అతి క్రూరంగా హింసించి హత్య చేశారు. శ్రీకాకుళం పోరాటం తరువాత ఆంధ్ర రాష్ట్రంలో మన ప్రియమైన నాయకులను ఎందరినో హత్య చేయటమే కాకుండా, కామ్రేడ్స్‌ని, గెరిల్లాలని, ప్రజలని హత్య చేశారు. లక్షలాది ప్రజలను కష్టాలకు, కన్నీళ్ళకు గురిచేశారు. వేలాది ఇండ్లను నేలమట్టం చేశారు. వేలాదిమందిని జైళ్ళలోకి తోశారు. ఇక చిత్రహింసలకయితే లెక్కే లేదు. ఫాసిస్టు శత్రువులు ప్రదర్శించిన క్రూరత్వాన్ని మనం మాటల్లో వర్ణించలేం. కేవలం ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా మన విప్లవోద్యమం నడుస్తున్నటువంటి వర్గ పోరాటం తీవ్రంగా కొనసాగుతున్నటువంటి ప్రతి ప్రాంతంలో ఉద్యమాన్ని అణచి వేయటానికి ప్రజలపై పాలకవర్గాలు తీవ్రమైన దమనకాండను కొనసాగిస్తున్నాయి. జనరల్‌గా మొత్తం ఈ హింసాకాండకు ప్రతీకారంగా, ప్రత్యేకంగా ఇటీవల మన ఉద్యమానికి శత్రువు కల్గించిన నష్టానికి ప్రతీకారంగా యావత్తు ఆంధ్ర రాష్ట్ర విప్లవ ప్రజానీకం కోర్కెలకు అనుగుణంగా, మన వీర గెరిల్లా కామ్రేడ్స్ అతి క్రూరుడు, నీచుడు అయినటువంటి మాధవరెడ్డిని అంతమొందించారు. ఆ వార్త విని మనం అందరం చాలా సంతోషిస్తున్నాం. హంతక మంత్రి మాధవరెడ్డిని మట్టుబెట్టడం ద్వారా దోపిడీ పాలకవర్గాలకు గుండె చెదిరేలా ఒక గట్టి దెబ్బని తీసిన సాహసీకులైన గెరిల్లాలకు విప్లవాభివందనాలు తెలియజేద్దాం.

విప్లవ పోరాటంలో మనం సాధించుకునే విజయం సందర్భంగా తప్పనిసరిగా సంతోషపడవల్సిందే, సంతోష పడుతున్నాం. సంతోష పడతాం కూడా. మాధవరెడ్డి చావుని పాలకవర్గాలు ఒక విషాదంగా చూస్తే, విప్లవ ప్రజానీకం ఒక వేడుకగా చూస్తారు. బహుశా రేపు ఆంధ్ర రాష్ట్రంలోని నలుమూలలా వేలాది, లక్షలాది కుటుంబాలు పండుగ చేసుకుంటాయి. ఈ వార్త విని ఆంధ్ర రాష్ట్ర ప్రజలే కాకుండా దేశంలోని విప్లవ ప్రజలందరూ, దేశంలోనే కాకుండా ప్రపంచంలో సాయుధ పోరాటం కొనసాగిస్తున్నటువంటి, సాయుధ పోరాటాన్ని అభిలషిస్తున్నటువంటి కార్మికవర్గ పార్టీలు, ప్రజలు చాలా సంతోషిస్తారు. మన వీర గెరిల్లా యోధులకు విప్లవాభివందనాలు పంపిస్తారు.

కామ్రేడ్స్!

''నేటి ఈ విజయం శత్రువుతో జరుగుతున్న ఒక యుద్ధంలో మనం సాధించుకున్న ప్రాముఖ్యం కల్గిన విజయం. **ఎత్తుగడల రీత్యా చూస్తే పోరాటంలో శత్రువుకు కల్గిన నష్టం రీత్యా చూస్తే ఇది మనకు ఒక పెద్ద విజయం. వ్యూహాత్మకంగా చూస్తే, మొత్తం పాలకవర్గాల బలాన్ని బట్టి చూస్తే మనకు ఇదొక చిన్న విజయం మాత్రమే.** మాధవరెడ్డిని ఖతం చేయటం అంటే మన మార్గమధ్యంలోని ఒక గులకరాయిని తొలగించటం మాత్రమే. మనం అడ్డు తొలగించాల్సిన పర్వతాలు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, భూస్వామ్య విధానాలు. ఈ మహా పర్వతాలు భారత పీడిత ప్రజల వీపులపై పెనుభారాన్ని మోపుతూ సుదీర్ఘ కాలంగా వారిని అణగదొక్కుతున్నాయి. ఆ పర్వతాలను మనం తొలగించాల్సిన అవసరం వుంది. అంతటి గురుతరమైనటువంటి కర్తవ్యం కోసం మనం పోరాడుతున్నాం. కామ్రేడ్స్! ఎత్తుగడల పరంగా మనం సాధించిన ఈ విజయం సందర్భంగా సంతోషపడాలి కానీ ఇది మాత్రమే మనకు పూర్తి సంతృప్తి

నివ్వదు. మనం తప్పనిసరిగా శత్రువర్గాలను వందలు, వేలాదిగా అంతమొందించాల్సిన అవసరం వుంది. మనం కసిదీర్చుకోవాల్సింది ఇంకా ఎంతో వుంది. కాబట్టి, ఈ కర్తవ్యాన్ని దృష్టిలో పెట్టుకున్నపుడు, ఇలాంటి ప్రతి విజయం సందర్భంలోనూ పాలకవర్గాలు మనకు కల్గించినటువంటి మొత్తం నష్టాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి. అప్పుడే అంటే, ఆంధ్ర రాష్ట్రంలో, మన పోరాట ప్రాంతాల్లో ప్రజలపై జరిగినటువంటి, జరుగుతున్నటువంటి పీడనను, దోపిడీని, దౌర్జన్యాన్ని, హత్యాకాండను మనం గుర్తుకు తెచ్చుకోవాలి. మనం బాగా ప్రేమించినటువంటి పార్టీ కామ్రేడ్స్, గెరిల్లాలు, ప్రజలు వేలాదిమంది నేలకొరిగారు. శతృవులు జరుపుతున్నటువంటి ఈ ఘోరాన్ని మనం ఇప్పుడు కళ్ళముందుకు తెచ్చుకోవాలి, వర్గకసిని పెంచుకోవాలి. అదే విధంగా, మన గెరిల్లా కామ్రేడ్స్ శత్రువు మాధవరెడ్డిని అంతమొందించటానికి పూర్తి ఆత్మ విశ్వాసంతో చావుకైనా తెగించి చేసినటువంటి పోరాటాన్ని, చర్యను మనం ఆదర్శంగా తీసుకోవాలి.

కామ్రేడ్స్!

అసలివ్వాళ ఈ సంఘటన జరిగిన తరువాత ప్రజలు ఏం కోరుకుంటున్నారంటే, మనం ఉద్యమ శత్రువులను మరింత పెద్ద దెబ్బతీస్తూ, మరింత పెద్ద విజయాలు సాధించాలనే. మనపార్టీ మీద ప్రజల విశ్వాసం మరింత పెరుగుతోంది. మన పార్టీమీద పెరుగుతున్నటువంటి ఈ విశ్వాసాన్ని గుర్తిస్తే, మనం ఇంతకంటే పెద్ద విజయాలను సాధించాల్సి వుందనే వీళ్ళ అభిలాషని గుర్తిస్తే, అలాంటి కర్తవ్యాలను కూడా మనం చేపట్టాల్సిన అవసరం వుంటుంది. కాబట్టి ఈ సందర్భంగా మనం గ్రహించాల్సింది ఏంటంటే, ఇవ్వాళ మనం కొద్దివేల మంది మాత్రమే వుండి చేసినటువంటి పోరాట ఫలితమిది. మనకు మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం అనే ప్రపంచాన్ని సరిగ్గా అర్థం చేసుకొని సుస్పష్టంగా చూడగలిగినటువంటి ఒక సైద్ధాంతిక చూపు వుంది. మనకు విశాల ప్రజా బాహుళ్యానికి నాయకత్వం వహించేటటువంటి ఆత్మ త్యాగంతో కూడిన కార్మికవర్గ రాజకీయాలు కూడా వున్నాయి. అయితే కేవలం ఈ కొద్దివేల మందికే పరిమితమై గెలిచే యుద్ధం కాదిది. మాధవరెడ్డి లాంటి కొద్దిమంది శత్రువులను అంతం చేయటం ద్వారా సంపూర్ణ విజయం సాధ్యమయ్యేది కాదు. మనం దేశ వ్యాపితంగా ఊరూరా ప్రజాసైన్యాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. మొత్తం శత్రు, పాలకవర్గాలను ప్రజాయుద్ధం అనే మహా సముద్రంలో ప్రజాసైన్యం అనే పెను అలలతో ఎక్కడికక్కడ ముంచేయాల్సిన అవసరం వుంది. అప్పుడే మనం ఈ దోపిడీ వర్గ పాలనను సంపూర్ణంగా అంతమొందించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయగలుగుతాం. కాబట్టి, ఈ సందర్భంగా మనం మరింత పెద్ద విజయాలకు ప్రజలను ఆర్గనైజ్ చెయ్యాల్సిన కర్తవ్యాలను ముందుంచుకుని ముందుకు పోదాం. కామ్రేడ్స్! మనం చాలా పోరాటాల సందర్భంగా, విజయాల తరువాత కొన్ని విషాదాలను కూడా చవిచూస్తున్నాం అన్నది గుర్తుంచుకోవాలి. ఈ విజయాలతోపాటే విషాదానికి సంబంధించిన మరికొన్ని వార్తలను కూడా మనం వింటున్నాం. ఇటీవలే ధారకొండ (తూర్పుకనుమల్లో) అవుట్‌పోస్టుపై మన గెరిల్లా కంపెనీ జరిపిన దాడి సందర్భంగా పోలీసులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు గెరిల్లా కామ్రేడ్స్ అమరులు అయ్యారు. ఒక విజయవార్తను వెన్నంటే ఒక విషాద వార్త కూడా వినాల్సి వచ్చింది. దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో ప్రతి యుద్ధం కేవలం విజయంగా మాత్రమే వుండదు. విజయంతోపాటు దాన్ని వెన్నంటి కొన్ని విషాదాలు కూడా వుంటాయి. అయితే, మనం విషాదం సందర్భంగా వర్గకసిని పెంచుకోవటంతోపాటు ఓటమినుండి పాఠాలు నేర్చుకుంటాం. విజయం సందర్భంగా మరింత పెద్ద విజయం సాధించే కర్తవ్యాన్ని ముందుంచుకుంటాం. తద్వారానే, ఆ విజయం వెలుగులో ప్రజలను మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం అనే అద్భుత శాస్త్రంతో పరిపూర్ణంగా విప్లవీకరించటం ద్వారా మాధవరెడ్డినే కాదు, మొత్తం భూప్రపంచం మీద సామ్రాజ్యవాదాన్నీ, సకల అభివృద్ధి నిరోధకత్వాన్ని, సకల దోపిడీ పీడనలను మనం అంతమొందించి నూతన సమాజాన్ని నిర్మించగలుగుతాం. దీన్ని దృష్టిలో పెట్టుకుని మనం ఈ విజయాన్ని మరింత పెద్ద విజయాలు సాధించటానికి సోపానంగా వినియోగించుకుందాం. సామ్రాజ్యవాదు లతో సహా మొత్తం దోపిడీదారులంతా కాగితం పులులే. అంతిమ విజయం విప్లవ ప్రజానీకందే, ప్రజాయుద్ధానిదే.

**రెడ్‌శాల్యూట్స్ కామ్రేడ్స్! రెడ్ శాల్యూట్స్!** ❑

---

***(దేశవ్యాప్త సమ్మెలు : 10వ పేజీ తరువాయి...)***

అయితే కార్మికవర్గం ప్రగతి నిరోధక శక్తుల లేక రివిజనిస్టుల ఆధ్వర్యంలోని యూనియన్లలో పూర్తిగా కూరుకుని పోయి వుండటంవల్ల అనేక పోరాటాలు తమ లక్ష్యాల సాధనలో విఫలమవు తున్నాయి. ఈ నాయకులు, కార్మికవర్గ ఉద్యమంలోపల వుండే పాలక వర్గ ఏజెంట్లే తప్ప మరొకరు కారు. వారి ఏకైక లక్ష్యమల్లా ఏమిటంటే కార్మికవర్గ మిలిటెన్సీని నిర్వీర్యపర్చి, పోరాటాలను చల్లబర్చేందుకుగాను కార్మికులను ప్రమాదరహిత మార్గంలోకి మళ్ళించే రక్షణ కవచంలాగా వ్యవహరించటమే. అయితే ఆ ఉద్యోగులూ, కార్మికులే తమ నాయకులు నిర్దేశించిన పరిమితులను దాటి పోతున్నారు. పోరాటాల వెల్లువలోని ప్రస్తుత మిలిటెన్సీ భవిష్యత్తులో రాబోయే దానికి సంకేతం లాంటిది. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులను తగ్గించి వేయడానికి పథకం ప్రకారం ప్రయత్నిస్తుండటంతో ఈ మిలిటెన్సీ మరింత పెరగనున్నది. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 44,000 మంది తాత్కాలిక కార్మికులను తొలగించడం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం రెండు లక్షల మంది ఉద్యోగులను ఇంటికి పంపించే పథకాలతో వుండటం ఇవన్నీ భవిష్యత్తు చిత్రణను స్పష్టంగానే సూచిస్తున్నాయి. అయితే తాము పోరాటాలలో గెలవాలని, పాలకవర్గాల అణచివేత విధానాలను విజయవంతంగా ఎదుర్కోవాలన్న ఉద్దేశం ప్రభుత్వ ఉద్యోగులకు, లాయర్లకు వుంటే వారు మూడు ప్రాథమిక అవసరాలను పూర్తి చేయాల్సి వుంటుందని గుర్తించి తీరాలి. ఒకటి. తమ పోరాటాన్ని బలోపేతం చేసుకోడానికిగాను వారు సాధారణంగా కార్మికవర్గంతోనూ, తర్వాత ఇతర పీడిత ప్రజాసెక్షన్లతోనూ పొత్తు కుదుర్చుకుని తీరాలి. రెండు. తమ డిమాండ్లకు ప్రజా మద్దతును గెల్చుకోడానికిగాను వారు గతంలోని తమ అవినీతి, ప్రజలను వేధించటం వంటి పద్ధతులను తప్పక వదిలేసుకుని తీరాలి. మూడు. వారు ఆర్థిక వాదాన్ని తప్పనిసరిగా వదిలి పెట్టాలి. దేశంలోని విప్లవశక్తులతో పొత్తు కుదుర్చుకోవాలి. ఇది మాత్రమే ప్రభుత్వ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా పోరాటంలో వారిని ముందుకు తీసుకు పోగలదు. ఈ విధంగా మాత్రమే వారు ప్రస్తుతం తమ హక్కులపై జరుగుతున్న దాడిని తిప్పి కొట్టగలరు. ప్రత్యేకించి భారతదేశంలో సామ్రాజ్యవాద దాడికి వ్యతిరేకంగా తమ పోరాటంలో ఉత్తరప్రదేశ్ విద్యుత్‌శాఖ సాగించిన చారిత్రాత్మక రాజకీయ సమ్మె భారత కార్మికవర్గానికి నిజమైన మార్గాన్ని చూపించింది. ఈ పోరాటం నుండి కార్మికవర్గం తగిన గుణపాఠాలు తీసుకుని పురోగమించాలి. ❑

# తెలుగుదేశం ప్రభుత్వ ఫాసిస్ట్ నిర్బంధపూరిత విధానాలకు వంత పాడుతూ, పీపుల్స్‌వార్ పార్టీపై విషం గ్రక్కుతున్న రామోజీరావు విషపత్రిక ''ఈనాడు''

మాజీ హోంమంత్రి, ప్రస్తుత పంచాయితీరాజ్ శాఖా మంత్రి మాధవరెడ్డిని 'పీపుల్స్‌వార్' పార్టీ ఖతం చేసినందుకుగాను దళారీ బూర్జువా రామోజీరావు యాజమాన్యంలోని తెలుగు దిన పత్రిక ఈనాడు, పీపుల్స్‌వార్ పార్టీపై విషం గ్రక్కుతూ మార్చి 9న ఒక సంపాదకీయం రాసింది. ఆ సంపాదకీయంలోని రాతలు తన యజమాని చచ్చినందుకు పిచ్చిపట్టి మొరుగుతున్న కుక్క మొరుగుళ్ళ మాదిరిగా మాత్రమే లేవు. అవి మరింత ముందుకు పోయి వర్తమాన ప్రపంచ పరిస్థితులలో కాలం చెల్లిపోయిన ''అర్ధరహితమైన హింస''గా విప్లవ యుద్ధతంత్రాన్ని చిత్రించేందుకు బరితెగించి ప్రయత్నిస్తున్నాయి.

''ప్రజల ద్వారా, ప్రజల కొరకు'' ఉనికిలోకి వచ్చిన ప్రజాస్వామిక వ్యవస్థకు వ్యతిరేకంగా నక్సలైట్లు యుద్ధం చేస్తున్నారని విలపిస్తూ ఈనాడు సంపాదకీయం మాధవరెడ్డి లాంటి ''ప్రజాసేవకుల''ను దొంగచాటు పద్ధతిలో చంపిన నక్సలైట్ల 'పిరికి' చర్యలపై పోరాడమంటూ పిలుపిచ్చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు-మాధవరెడ్డి పాలనలో కేవలం 5 సం॥ల కాలంలో **1000** మంది దాకా విప్లవకారులు పాశవికంగా చంపబడటాన్ని కనీసం ప్రస్తావించకుండా, తన వర్గ స్వభావానికి అనుగుణంగా ఈ సంపాదకీయం ప్రజాస్వామ్యంలో హింసకు, హింసాత్మక పద్ధతులకు తావు లేదని సుద్దులు చెప్పడానికి పూనుకుంది.

ప్రజాస్వామ్యం శ్రేష్టత గురించి, అందులో హింసకు తావే లేదని బోధించడానికి సంపాదకీయం ప్రయత్నించినప్పటికీ ఈ సంపాదకీయంలోనే నక్సలైట్ సమస్యకు సైనిక పరిష్కారాన్ని బలంగా ప్రతిపాదించడం ద్వారా రామోజీరావు వాడి తైనాతీల పరమ వికృతమైన ఫాసిస్ట్ లక్షణాలు బయటపడి పోయాయి. ప్రత్యేక సాయుధ బలగాలను ఏర్పర్చటం, అత్యంత ఆధునిక ఆయుధాలను శిక్షణను అందించటం ద్వారా పోలీసు బలగాలను మరింతగా ఆధునీకరించటం, విప్లవకారుల అదుపులో వున్న ప్రాంతాలపై నిఘా పెట్టేందుకై మానవ రహిత ఏరియల్ వాహనాలను (మినీ విమానాలు) కొనడం వంటి అంశాలను ఈ సంపాదకీయం తడిమింది. నక్సలైట్లను ఎదుర్కోవటంలో రాష్ట్రాలకు సహాయమందించటంలో చొరవ చూపలేదంటూ అది కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించింది. కార్గిల్ సెక్టార్‌లో జరిగినట్లుగా సరిహద్దుల్లో విదేశీ చొరబాటుదార్లపై జరిగిన యుద్ధం ఎంత ప్రమాదకరమైందో అట్లే దేశంలోపలి అంతర్గత యుద్ధాలు కూడా అంతే ప్రమాదకరమైనవే అంటూ సంపాదకీయం చెప్పింది. వనరులు లేవంటూ కేంద్రం పక్కకు తప్పుకోవద్దని అది హెచ్చరిస్తూ నక్సలిజం 'ఉపద్రవాన్ని' అణచివేయటంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అన్ని రకాల సహాయాలనూ చేయాల్సిందిగా కేంద్రాన్ని డిమాండ్ చేసింది. వ్యవస్థకు వ్యతిరేకంగా తిరగబడుతున్న ప్రజలకు అహింస గురించి బోధిస్తూ వాస్తవంగా తిరగబడిన వారిని అణచివేసేందుకు సంపూర్ణ యుద్ధానికి పిలుపిచ్చే పాలకవర్గాల ప్రతినిధుల రెండు నాలికల ధోరణి ఇలాంటిదే. విస్తృత ప్రజానీకం మద్దతు కల్గిన పీపుల్స్‌వార్‌పై దుమ్మెత్తి పోస్తూ, దానిపై నిర్బంధాన్ని సమర్థించుకుంటూ పాకిస్తాన్ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్‌వింగ్' (ఐ.ఎస్.ఐ.) తో 'పీపుల్స్‌వార్' పార్టీకి సంబంధాలున్నాయంటూ కూడా సంపాదకీయం మాట్లాడుతోంది. సాక్షాత్తూ తమకు తాముగా సామ్రాజ్యవాద శక్తుల బడితొత్తులైన పాలకవర్గాలు చేస్తున్న అసత్యాలు, అభాండాలతో కూడిన ప్రచారాన్ని దేశంలోని ప్రజాస్వామిక శక్తులందరూ ఖండించాల్సి వుంది. అణచివేత స్వభావం కల్గిన రాజ్య యంత్రాంగాన్ని మరింతగా ఫాసిజీకరించడానికి, పీపుల్స్‌వార్‌కి, ఇతర జనతా ప్రజాస్వామిక ఉద్యమాలకు వ్యతిరేకంగా మరింత పెద్ద ఎత్తున సైనికదాడిని ప్రారంభింప జేసేందుకుగాను పన్నుతున్న కుట్రే ఈ విధమైన కల్లబొల్లి ప్రచారం తప్ప మరొకటి కాదు.

అయినా, ప్రియా పచ్చళ్ళ నుంచి మొదలుకుని రామోజీ ఫిల్మ్ సిటీ దాకా గత పాతికేళ్ళలో పడగలెత్తిన తన వ్యాపార సంస్థల్లో, పెట్టుబడి విష పుత్రిక 'ఈనాడు'లో ప్రజాస్వామ్యాన్ని మచ్చుకైనా లేకుండా శిలువ వేసిన రామోజీరావు; హక్కుల కోసం రోడ్డుమీదికొచ్చిన ఈనాడు జర్నలిస్టుల్ని, సబ్ ఎడిటర్లను రౌడీలతో తలలు బద్దలు కొట్టించిన పరమ 'ప్రజాస్వామిక అహింసామూర్తి' రామోజీరావు, రైతుల ఆత్మహత్యలతో, కరువుతో, ఆకలి చావులతో, మెదడువాపు, మలేరియా వ్యాధులతో ఆదివాసీల, తదితర ప్రజల నిస్సహాయ మరణాలతో ఆంధ్ర రాష్ట్రం అట్టుడుకుతుంటే, అందుకు కారణమైన **సామ్రాజ్యవాద అనుకూల తెలుగుదేశం ప్రభుత్వ దోపిడీ విధానాలను శిరమెత్తి సమర్థిస్తూ వస్తున్న పత్రికాధిపతి రామోజీరావు 'ప్రజాస్వామ్యం' గురించి మాట్లాడటం కంటే మించిన నయవంచన మరొకటి వుండదు. తెలుగు మహిళల సారా వ్యతిరేక ఉద్యమాన్ని ఆకాశానికెత్తి, రాజకీయ ప్రయోజనం నెరవేరగానే దాన్ని రాష్ట్ర సారా లాబీ పాదాల ముందు విసిరేసి మద్య నిషేధం ఎత్తివేతను సమర్థించిన నీచాతినీచుడు వీడు.** అనుక్షణం తన పత్రికను దోపిడీవర్గాల బాకాగా రూపొందిస్తూ ఉద్యమాల వెనుక ప్రజల ఆకాంక్షలను కూడా వెలుగు చూడనీయకుండా తొక్కిపట్టిన నికృష్టుడు వీడు. రామోజీ ఫిల్మ్‌సిటీ కోసం మాదాపురంలో పెకిలించి వేయబడిన పేద ప్రజల గుడిసెల సాక్షిగా వీడి 'ప్రజాస్వామ్యపు' నేతి బీరకాయ రుచి ఏమిటో లోకానికి తేటతెల్లమై పోయింది. స్వయంగా జడ్‌ప్లస్ భద్రతా వలయాలను చుట్టూ పేర్చుకుని, నరహంతకులకు ప్రజా సేవకులుగా కితాబిస్తున్న దోపిడీ పత్రికాధిపతి రామోజీరావు తన ప్రజా వ్యతిరేక చర్యలకు సమాధానం చెప్పుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రజా ఉద్యమాలను సైనిక పరిష్కారాలతో అణచివేయాలని పాలకవర్గాలకు నీతి బోధ చేస్తున్న వీడి 'ఈనాడు' పత్రిక ప్రజా వ్యతిరేక స్వభావాన్ని, వీడి దోపిడీని ఎత్తి చూపుతూ విప్లవ ప్రజానీకం రాష్ట్రమంతటా ప్రచారం చేయాల్సిన అవసరముంది. ❑

*(కా॥ శ్యాం ప్రసంగం: 60వ పేజీ తరువాయి.....)*

ఇంక ఆ పార్టీ అవకాశవాదిగా మారడమో, రివిజనిస్టుగా మారడమో, విద్రోహపూరితంగా ప్రవర్తించడమో జరుగుతుంది. ఈ విప్లవ లక్ష్యాన్ని గత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కోల్పోవడం మూలంగానే అది రివిజనిజంలో కూరుకుపోవడం మూలంగానే దాని నడ్డి విరిచి విప్లవ సిద్ధాంతం ఆధారంగా చారుమజుందార్ నాయకత్వాన నక్సల్బరీ ఉద్యమం వచ్చింది. సాయుధ శక్తి ద్వారా అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలనే నినాదం, యుద్ధం ద్వారానే సమస్యను పరిష్కరించాలనే సిద్ధాంతాన్ని ఆచరణలో రుజువు చేస్తూ, నక్సల్బరీ ఏం చేసిందంటే సాయుధశక్తి ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవాలనే నినాదాన్ని మళ్లీ అది ఎజెండా మీదికి తెచ్చింది. అప్పటిదాకా కమ్యూనిస్టు పార్టీ భారత దేశంలో విప్లవం గురించి చెప్పటానికి చాలా చెబుతూనే వున్నది. ఆఖరికి, సి.పి.ఐ. నుండి విడిపోయినప్పుడు సి.పి.ఎం. కూడా ''చైనా మార్గమే మన మార్గం. భారతదేశంలో సాయుధ పోరాటం చేయాల్సిందే. సాయుధ పోరాటం ద్వారానే విప్లవం అనేది వస్తది'' అనే చిలుక పలుకులు పలికేది. కాని సి.పి.ఎం. కూడా ఆచరణలో అసలెక్కడా కూడా సాయుధ పోరాటాన్ని ప్రారంభించడం చేయనేలేదు. అందుకని దాని నుండి ఆనాటి రివిజనిజాన్నుండి నిజమైన కమ్యూనిస్టు పార్టీ సభ్యులు తెగతెంపులు చేసుకొని, ఆచరణలో ప్రజల్ని సాయుధ పోరాటానికి సంసిద్ధం చేయటం ప్రారంభించారు. దీంట్లో భాగంగానే నక్సల్బరీ పోరాటం జరగడం; ఆ నక్సల్బరీ పోరాటం దేశ వ్యాప్తంగా విస్తరించడం; ఆ విస్తరణలో భాగంగానే 1969 ఏప్రిల్ 22న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) అనే మన పార్టీ ఆవిర్భవించడం అనేది జరిగింది. ఇదీ మన పార్టీ పుట్టుకకు, గతానికి సంబంధించిన చరిత్ర.

ఇక ఆ తర్వాత మన పార్టీ పుట్టి ఇప్పటికి 30 ఏళ్లు గడచింది. మరి 30 యేళ్లను మనం నెమరు వేసుకుంటే దీంట్లో జరిగిన మంచి ఏమిటి? సాధించిన విజయాలేమిటి? మనం చేసిన తప్పులేంటి? ఇవి కూడా ఈ సందర్భంగా ఒకసారి నెమరు వేసుకొని వీటి నుంచెల్లి మనం గుణపాఠం తీసుకొని ముందుకు పోవాల్సిన అవసరం వుంది. మనం రివిజనిజాన్ని నడ్డి విరిచి సాయుధ పోరాటాన్ని ఎజెండా మీదికి తెచ్చాము. అయితే, ఈ తేవడం వరకు మనం కర్టెక్టే చేసినప్పటికీ, దానిని మళ్లీ అమలు చేసేటప్పుడు కొన్ని తప్పులు కూడా చేయడం జరిగింది. ముఖ్యంగా రివిజనిజం మీదున్న కసితోటి మనం కొన్ని అతివాద తప్పులు కూడా చేసినం. మనం ఇంతకుముందే మన డాక్యుమెంట్లలో రాసుకున్నాం. ''వర్గ శత్రు నిర్మూలనే ఏకైక మార్గం'' అనీ, ''ప్రజాసంఘాలు స్థాపించడం అవసరం లేద''నీ, ఎందుకంటే రివిజనిస్టులు ప్రజాసంఘాల పేరుతోటి మొత్తంగా ఒక రివిజనిస్టు ఆచరణని కొనసాగించడంతో దాని నుంచి మనం ఇంకొక వైపు కొట్టుకుపోయి, ప్రజాసంఘాలు అవసరం లేదనీ, తర్వాత వర్గ శత్రువు నిర్మూలనే ఏకైక మార్గమనీ ఇట్లా కొన్ని అతివాద తప్పులు, అతివాద ఎత్తుగడలు కూడా వేయడం తోటి, మనం నష్టపోవాల్సి వచ్చింది. మన ఉద్యమాలు కూడా నష్టపోవాల్సి వచ్చింది. ఈ రకంగా 1967లో నక్సల్బరీతో ప్రారంభమైన ఉద్యమం 1970 వచ్చేటప్పటికి చాలా ఎదురు దెబ్బలు తినాల్సి వచ్చింది. ఆ క్రమంలో '72 వరకు చాలా నష్టాలు పొందాం. అయితే ఈ నష్టాలను సాకు చేసుకొని పార్టీలోనే వుండే కొంతమంది అవకాశవాదులు పార్టీని చీల్చడం జరిగింది. సత్యనారాయణ సింగ్ లాంటి అవకాశవాదులు పార్టీని చీల్చారు. అట్లాగే కామ్రేడ్ చారుమజుందార్ అమరుడయిన తర్వాత పార్టీ కేంద్ర నాయకత్వం లేకపోవడం వలన దాదాపుగా అనేక గ్రూపులుగా పార్టీ చీలిపోయింది. అయితే, అనేక గ్రూపులుగా చీలిపోయినా, విప్లవం వెనుకపట్టు పట్టినా, నక్సల్బరీ వెలిగించిన నిప్పురవ్వ మాత్రం అది ఇంకా భారత దేశమంతటా వెలుగుతున్నది. దాన్ని ఆధారం చేసుకొని చారుమజుందార్ లైన్‌కు కట్టుబడి వున్న పార్టీ యూనిట్లన్నీ, ఎక్కడికక్కడ మళ్లీ ఉద్యమాల్ని నిర్మించడానికి పూనుకున్నాయి. దాంట్లో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో మన పార్టీ 74 నుండే ప్రయత్నం చేసినప్పటికీ ప్రధానంగా ప్రజల్లోకెళ్ళి ప్రజా పునాదులను నిర్మించడం అనేది 1977 నుండి ప్రారంభమైంది. 1977లో జగిత్యాల, సిరిసిల్ల ఉద్యమాలు రావడం, వాటి యొక్క కొనసాగింపుగా ఆదిలాబాద్, కరీంనగర్ ఉద్యమాలు-ఉద్యమాలుగా అవి పెంపొందడం; మనం కరీంనగర్, ఆదిలాబాద్ ఉద్యమాల ఆధారంగానూ, అలాగే అప్పటికే భారత దేశంలో వున్న కొన్ని ఎం-ఎల్ పార్టీలు మళ్లీ ఎక్కడికక్కడ ఉద్యమాల్ని సృష్టిస్తూండటంతో, ఈ ఉద్యమాల బేసిస్‌మీద కొంత కలవడం అనేది మొదలైంది. ఇంతకు ముందు కామ్రేడ్ సుజిత్ మాట్లాడినట్లు 1978లోనే బీహార్‌లో ఆ కామ్రేడ్స్ ఆర్గనైజేషన్ ప్రారంభించారు. అట్లా ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో మనం, తమిళనాడులో ఇంకా కొంతమంది కామ్రేడ్స్, ఇట్లా ఆర్గనైజేషన్ ప్రారంభించిన ఈ యూనిట్లన్నీ కూడా మళ్లీ ఐక్యతా చర్చల కోసం ప్రయత్నాలు జరిపాయి. అయితే, 1980 వరకూ ఈ ఐక్యతా చర్చలు జరిగినప్పటికీ ఈనాడిప్పుడు ఒక పార్టీగా కలసిపోయిన మనం పి.యు. కామ్రేడ్స్ అప్పుడే కలవాల్సిన పరిస్థితి వుండింది కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల కలువలేదు. ఆ కామ్రేడ్స్ దూరంగా వున్నప్పటికీ అప్పుడు మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ నాలుగు యూనిట్ల తోటి మన పార్టీ కేంద్రకమిటీ ఏర్పడింది. అప్పటి వరకూ ఇక్కడ కేంద్ర కమిటీ లేదు. ఈ నాలుగు రాష్ట్రాల యూనిట్స్‌తోటి ఒక కేంద్రకమిటీ ఏర్పడింది. ఆ తర్వాత అటు బీహార్‌లో పార్టీ యూనిటీ పార్టీ, ఎం.సి.సి. పార్టీ ఇటు మన పార్టీ ఇవి వాస్తవానికి సాయుధ పోరాటం చేస్తూ దేశంలో బలమైన గ్రూపులుగా '80 నుండే దేశంలో ఒక గుర్తింపు గల పార్టీలుగా నెలకొనడం అనేది జరిగింది. ఈ క్రమంలో ఒక ఉద్యమాన్ని అడ్వాన్స్ చేయడం ద్వారానే నిజమైన విప్లవకారులను ఐక్యం చేయగలం అనే అవగాహనలో భాగంగా ఈ పెరుగుతున్న ఆనాటి మన ఉద్యమాల్ని మనం ఇంకా ముందుకు తీసుకెళ్ళడానికి ఒక నిర్ణయం తీసుకున్నాం. అప్పటికి శత్రువు నిర్బంధం కూడా పెరుగుతూ వున్నది. దీనిని దృష్టిలో పెట్టుకొని మనం మన లక్ష్యసాధనకు ఏ సిద్ధాంతాన్ని అయితే ఆధారం చేసుకున్నామో దానిని మనం ఆచరణలో పెట్టడానికి ఈ కరీంనగర్, ఆదిలాబాద్ ఉద్యమాల్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాలి. అందుకోసం మనం గెరిల్లాజోన్ పర్‌స్పెక్టివ్ పెట్టుకొని మొత్తం దాని నిర్మాణాల్ని, ప్రజల్ని సాయుధం చేయడం అనే లక్ష్యాన్ని రూపొందించుకున్నాం. వాస్తవానికి మొత్తం ఉద్యమంలో మనకిది ఒక కీలకమయిన సమయం.

ఎందుకు కీలకమయిన సమయం? అని అనుకున్నపుడు భారత దేశ చరిత్ర మనం చూస్తున్నపుడు సాయుధ పోరాటం ప్రారంభించి, దానిని నిలబెట్టడం అనే దగ్గరికి వచ్చేటప్పటికి వైఫల్యాలు జరుగుతున్నాయి. అవి మిగతా ఎం-ఎల్ గ్రూపులకు సంబంధించినది కావచ్చు. అట్లాగే పాత కమ్యూనిస్టు పార్టీ చరిత్ర....ముఖ్యంగా ఎం-ఎల్ పార్టీ ముందు వున్నది. అందుకని ఆ ఉద్యమాలను ఆధారం చేసుకొని సాయుధ పోరాటం చేస్తూ నిలబడడం అనేది ఒక కీలకమైన నిర్ణయంగా మనం ఆరోజు తీసుకున్నాం. 1980 నుండి ఇప్పటిదాకా చూసుకున్నపుడు దాదాపుగా 19 ఏండ్లు...ఈ 19 ఏండ్లలో కూడా సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తూ, ఈ శత్రు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ నిలబడగలగడం అనేది ఈనాడు మన మొత్తం విప్లవోద్యమానికి ఒక ముఖ్యమైన మార్పు అనేది దృష్టిలో పెట్టుకోవాలి. ఇది మనకు సంబంధించినదే కాదు, మొన్నటి వరకూ పి.యు. పార్టీగా వున్న పార్టీగానీ, ఎం.సి.సి. పార్టీగానీ సాయుధ పోరాటంలో ఈనాడు నిలబడే వున్నాయి. అందుకనే ఈ మూడింటికి ఇవాళ భారతదేశ ప్రజల్లో విప్లవకర పార్టీలుగా గుర్తింపు వచ్చింది. అయితే, ఇది పార్టీ పుట్టిన తర్వాత మనం సాధించిన ఒక విజయంలో భాగం. గెరిల్లాజోన్స్‌ను స్థాపించడమనేది ఒక విజయం అన్నది మనం దృష్టిలో పెట్టుకోవాలి. అయితే, ఈ క్రమంలో మనకు మన పార్టీలో కూడ కొన్ని సంక్షోభాలు వచ్చినాయి. ముఖ్యంగా 1985లో మన ఉద్యమం ముందుకు పోతున్న సమయంలో, శత్రు నిర్బంధం ప్రారంభించిన సమయంలో మన పార్టీలో కూడా ఒక సంక్షోభం వచ్చింది. ఆ సంక్షోభం మన కేంద్రకమిటీలో వున్న అవకాశవాదం, ముఖ్యంగా ఆనాటి మన పార్టీ రాష్ట్రకమిటీలో కావచ్చు, కేంద్రకమిటీలో కావచ్చు వున్న ఉదారవాదం యొక్క కొనసాగింపుగా అవకాశవాదులు పార్టీని చీల్చడానికి ప్రయత్నం చేసి సంక్షోభాన్ని సృష్టించారు. ఈ చరిత్ర అంతా కూడా మనకు తెలుసు, ఆ సమయం లోపట శత్రు నిర్బంధం ఒకవైపు చాలా తీవ్రతరంగా వుంది. ఈ నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే మనం ఆ సంక్షోభాన్ని అధిగమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఆరోజు చాలా త్యాగాలు కూడా మనం చేయాల్సి వచ్చింది. ఈ త్యాగాల నుంచి మనం మన పార్టీని నిలబెట్టుకున్నాం. అట్లాగే అవకాశవాదాన్ని ఓడించడం ద్వారా మనం మన పార్టీని, ఉద్యమాన్ని నిలబెట్టుకోవడం అనేది జరిగింది.

ఈ క్రమం 1989 వరకు చాలా కష్టాలతో కొనసాగింది. ఆ తర్వాత ఆ కష్టాల నుండి బయటపడి ఉద్యమాన్ని ఇంకా అభివృద్ధి చేయగలిగాం. ఈ సమయంలోనే మనకు ఒక అవకాశం కూడా దొరికింది. ముఖ్యంగా 1990లో మనకు కొన్ని లీగల్ అవకాశాలు దొరికి, ప్రజల్లోకి మరింత విస్తృతంగా మనం వెళ్ళగలిగినాం. పెద్ద ఎత్తున ప్రజల్ని, లక్షలాది మంది ప్రజల్ని మనం విప్లవోద్యమంలోకి రాబట్ట గలిగినాం. ఆ తర్వాత మళ్లీ వెంటనే శత్రు నిర్బంధం ప్రారంభమై, ఆ శత్రు నిర్బంధం ప్రారంభమైన సమయంలోనే మరొక సంక్షోభం ముఖ్యంగా మన ఆంధ్ర రాష్ట్రంలో, మన పార్టీ నాయకుడైన కె.యస్. నుండి మనకు, పార్టీకి అనేక అడ్డంకులు ఎదురై, మన పార్టీలో మళ్లీ ఒక సంక్షోభం వచ్చింది. దానిని కూడా విప్లవం మధ్యలోనే, నిర్బంధం మధ్యలోనే మనం ఎదుర్కొని ముందుకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇట్లా మన పార్టీలో ఈ సంక్షోభాల కాలంలో పార్టీ క్యాడర్ కూడా దృఢంగా నిలబడ్డది. వాటిని దృఢంగా ఎదుర్కొన్నది. దీని నుండి అనేక గుణపాఠాలుకూడా మనం నేర్చుకున్నాం. పార్టీలో సంక్షోభాలు వస్తాయి, వాటికి చలించకుండా ప్రజలమీద విశ్వాసముంచి నిలబడగలిగితే మన పార్టీని ముందుకు తీసుకెళ్లవచ్చు. విప్లవాన్ని అడ్వాన్స్ చేయవచ్చునని ఒక విశ్వాసం మొత్తం పార్టీలో ఏర్పడింది. పార్టీ దృఢపడడానికి కూడా ఒక రకంగా పరోక్షంగా ఆ సంక్షోభాలు మనకు తోడ్పడ్డాయి.

అట్లా 1995కు వచ్చేటప్పటికి మనం అనేక విషయాలలో ప్రజల్ని ఆర్గనైజ్ చేయడంలో, సాయుధ పోరాటాన్ని అడ్వాన్స్ చేయడంలో, గెరిల్లా దళాలను నిర్మించడంలో వీటన్నింట్లో కూడా ఒక రకంగా మార్పును, ఒక విజయాన్ని, పురోగమనాన్ని మనం సాధించాం. వీటన్నింటిని మనం సమీక్షించుకొని 1995లో మనం మన పార్టీ మహాసభలు జరుపుకున్నాం. ఆ పార్టీ మహాసభలలో మొత్తం మన ఆచరణని సమీక్షించుకొని, మన లోపాలను సమీక్షించుకొని ఆ పునాదుల మీద ఈరోజు ఇంకా సంఘటితపడి ముందుకు వెళ్తున్నాం. ఆ సమీక్షల మీద ఆధారపడి మన రాజకీయాలను అభివృద్ధి చేసుకున్నాం. మన ఆచరణను అభివృద్ధి చేసుకున్నాం. అట్లానే నూతన కర్తవ్యాలను రూపొందించుకుని దానివైపు పురోగమించడానికి మనకు ఆ సమీక్షలన్నీ కూడా తోడ్పడ్డాయి. ఆ సమీక్షల్లో మనం ప్రధానంగా ఆరోజుకు నిర్ణయించుకున్నది; మనం గత 15 యేళ్లుగా చేస్తున్న మన ఉద్యమం ప్రాథమిక గెరిల్లాజోన్ స్థాయిలోకి వచ్చింది. వాటిని ఇంకా ఉన్నతస్థాయి గెరిల్లాజోన్లుగా అభివృద్ధి చేయాలనే ఒక కర్తవ్యాన్ని మనం తీసుకున్నాం. దాంట్లో భాగంగానే నిర్మాణ కర్తవ్యాలను, అంటే ఉన్నతస్థాయికి వెళ్లడానికి మనం సాయుధంగా ఇంకా పెరగాల్సిన అవసరం వుంది. సాయుధ శక్తిని మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం వుంది. దాంట్లో భాగంగా మనం ఈ దళాలే కాకుండా, దానికంటే అభివృద్ధికరమైన ప్లటూన్స్‌ను కూడా నిర్మించాలనే ఒక కర్తవ్యాన్ని కూడా తీసుకున్నాం. ఆ కర్తవ్యంలో భాగంగా కొన్ని ప్లటూన్స్ నిర్మాణం కూడాజరిగింది. ఇవి మనం సాధించిన విజయాలు, అట్లాగే గత 15 యేళ్లుగా కొనసాగిస్తున్న సాయుధ పోరాటం ముఖ్యంగా శత్రువును దెబ్బతీస్తున్న మన ప్రతిఘటనలు దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకానికి ఒక ఉత్సాహాన్ని ఇచ్చాయి. '95 వరకు మనం సమీక్షించుకున్న ఆచరణను, మన రాజకీయాల్లో భాగంగానే మళ్లీ తిరిగి పార్టీ యూనిటీ కామ్రేడ్స్‌తో చర్చలు జరిపి; ఇద్దరి రాజకీయాలు, ఆచరణ సమీక్షించుకున్న తర్వాత మనం ఒక పార్టీగా విలీనం కావడం ద్వారా ఈరోజు రెండు బలమైన ఉద్యమాలు కలవడం ద్వారా దేశంలో ఒక బలమైన పార్టీని నిర్మించి విప్లవోద్యమాన్ని ఇంకా మరింత ఎక్కువగా ముందుకు తీసుకెళ్ళడానికి అవకాశాలున్నాయనే నిర్ణయానికి రావడంతోపాటు, ఒక బలమైన కేంద్రకమిటీని కూడా ఏర్పాటు చేసుకోవడం జరిగింది. మన రెండు పార్టీలు ఏకం కావడం వలన భారతదేశంలో ఒక మార్పు అనేది, భారతదేశ విప్లవ ప్రజానీకంలో ఒక ఉత్సాహం అనేది చాలా పెరిగింది. గతం నుండి మనం చూసినప్పుడు ఈనాటి భారతదేశంలో అనేక పార్టీలు చీలికలు పేలికలయిపోయి ఒక రకంగా విప్లవ ప్రజానీకానికి నిరుత్సాహ వాతావరణం ఏర్పడి వున్నది. ఈ నిరుత్సాహ వాతావరణంలో మన రెండు పార్టీలు కలిసి ఒక బలమైన పార్టీగా ఏకం కావడం అనేది ఇవాళ విప్లవ ప్రజానీకాన్ని చాలా సంతోషపెట్టి, ఉత్సాహపరుస్తున్న విషయం. వాస్తవానికి మన రెండు పార్టీలు ఏకం

అయిన తర్వాత ఇతర గ్రూపులకు సంబంధించిన వాళ్లుగాని, అట్లాగే బయటి దేశాల్లో వున్న విప్లవ అభిమానులు, విప్లవ పార్టీలు కూడా చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మనకు అనేక సందేశాలు కూడా పంపడం జరిగింది. ఇది మనకు ఒక ముఖ్యమైన విజయం. విప్లవ పార్టీ లేకుండా విప్లవం లేదని లెనిన్ ఏదైతే చెప్పాడో అటువంటి ఒక బలమైన పార్టీని నిర్మించడం అనేది ఈరోజు ఈరెండు పార్టీల ఐక్యం ద్వారా మనం ఒక మేరకు సాధించుకున్నాం. విప్లవ శక్తులు మన దేశంలో ఇంకా వున్నాయి. ఆ విప్లవ శక్తులను కూడా ఐక్యం చేయడం కూడా ఒక కర్తవ్యం. అట్లాగే పార్టీని విస్తృత పర్చడం అనే కర్తవ్యం ఇంకా మనముందు వున్నది. ఇది ఒక అంశంలో మాత్రమే మనం బలమైన పార్టీగా చెప్పుకోవాలి. కాని మొత్తంగా శత్రువుతో పోల్చినపుడు ఇవాళ భారతదేశ వ్యాప్తంగా వున్న పరిస్థితిని చూస్తున్నపుడు మన పార్టీ ఇంకా చాలా చిన్నదే. అందుకని లెనిన్ చెప్పిన బలమైన పార్టీ అనుకున్నపుడు, ఒక అంశం నుంచి మాత్రమే ఈ రెండు కలవడం ద్వారా బలంగాని ఇంకా మొత్తం యుద్ధంతోటి, మొత్తం శత్రువుతోటి, మొత్తం విప్లవంతోటి, విప్లవ లక్ష్యాన్ని నెరవేర్చడంతోటి పోల్చుకున్నప్పుడు మనం ఇంకా చిన్న పార్టీగానే వున్నామన్నది మరువద్దు.

అందుకని లెనిన్ ఆశయాన్ని కొనసాగించడంలో భాగంగానే మన ఐక్యత కూడా జరిగింది. ఈ ఐక్యత ఇవ్వాళ భారత విప్లవ విజయానికి ఒక మంచి ఆశాజనకమైన పరిస్థితి అనేది మనకున్న అనుకూలాంశం. అట్లాగే ఈ రెండు పార్టీలు ఐక్యమవడమే కాకుండా పార్టీ పుట్టినప్పటినుండి అంటే ఈ 30 ఏళ్ళ కాలంలోపట చీలికలు పేలికలైన పార్టీ ఇవాళ ఒకే పార్టీ కేంద్రం క్రింద వుంటూ అనేక రాష్ట్రాలలో మన పార్టీ నిర్మాణం కూడా పెరిగింది. ఈరోజు చూసినప్పుడు మన రెండు పార్టీలు కలసిపోయిన తర్వాత మనం చూస్తే దాదాపుగా 8 రాష్ట్రాలలో మనకు రాష్ట్రకమిటీల నిర్మాణాలు వున్నాయి. అయితే, రాష్ట్రకమిటీలు అనంగానే మనం అన్ని రాష్ట్రాలలో దళాలు పెట్టి సమానంగా చూడలేం. కానీ, రాష్ట్రకమిటీల నిర్మాణం అనేది అక్కడ ఆ రాష్ట్రాలలో ఉద్యమానికి నాయకత్వం వహించడానికి, అడ్వాన్స్ చేయడానికి చాలా తోడ్పడే అంశం. అందుకని ఈరోజు మనకు ఎనిమిది రాష్ట్రాలలో రాష్ట్రకమిటీలు ఏర్పడడమనేది మామూలు విషయం కాదు. అట్లాగే ఈ రాష్ట్రాలలోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా రాష్ట్ర కమిటీలు, లేదా జిల్లా కమిటీలు లాంటి నిర్మాణాలు లేవు కానీ ఇంకా ఆర్గనైజర్స్‌గా, పార్టీ సభ్యులుగా, సానుభూతిపరులుగా, పార్టీ సెల్స్‌గా అనేక రాష్ట్రాలలో మనకు ఆర్గనైజేషన్ కొనసాగుతున్నది. ఇది ఒక విప్లవ పార్టీ బలోపేతం అయి విప్లవాన్ని అడ్వాన్స్ చేయడానికి మనం ఈనాడు సాధించుకున్న ఒక విజయం. దీనిమీద ఆధారపడి, ఈ విప్లవాన్ని మనం అడ్వాన్స్ చేయాల్సిన అవసరం వుంది. సాధించిన విజయాల్ని దృష్టిలో పెట్టుకొని, అట్లాగే మన పార్టీలో వచ్చిన సంక్షోభాలు, అవకాశవాదాల్ని దృష్టిలో పెట్టుకొని వాటిని తిరిగి రాకుండా ఈనాడు నిర్మాణమైన ఈ పార్టీని ఇంకా సంఘటితపరుస్తూ, ఇంకా ఐక్యపరుస్తూ, మన పార్టీని ఇంకా విస్తృతం చేయాల్సిన అవసరం వున్నది. అట్లాగే పార్టీపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందేలాగా చేయాల్సిన అవసరం కూడా వున్నది. ముఖ్యంగా ఈనాడు మన కర్తవ్యం బలమైన పార్టీని నిర్మించడం, గెరిల్లాజోన్‌లను నిర్మించడం ద్వారా విప్లవాన్ని అడ్వాన్స్ చేయడమే. ఈ బలమైన పార్టీని నిర్మించడం, గెరిల్లాజోన్స్‌ను ఇంకా బలోపేతం చేయడం, విప్లవాన్ని అడ్వాన్స్ చేయడం అంటే మనం లెనిన్ చెప్పిన ఇంకొక విషయాన్ని కూడా జోడించుకోవాల్సిన అవసరం వున్నది. పార్టీ చెప్పడానికీ, చేయడానికి; సిద్ధాంతానికి, ఆచరణకు సమన్వయం కుదుర్చుకోవడం, తాను చేస్తున్న పొరపాట్లను ప్రజలకు చెప్పి స్వయంవిమర్శను చేసుకోవడం; ఏ పార్టీ అయితే నిజాయితీగా తన తప్పులను ప్రజల ముందు చెప్పుకొని, తన్నుతాను సరిదిద్దు కుంటుందో అదే నిజమైన విప్లవకర పార్టీ. ఇది లెనిన్ చెప్పిన బలమైన విప్లవపార్టీ నిర్మాణంలో ఒక ముఖ్యమైన అంశం. ఈరోజు ఈ విషయం మనకు మరింత ఎక్కువగా వర్తిస్తుందనేది కామ్రేడ్స్ ఇక్కడ గుర్తు పెట్టుకోవాలి.

మన విప్లవోద్యమం పెరుగుతూ మనం ప్రజల్లోకి చొచ్చుకు పోయాము. ప్రజాపునాదిని మనం సంపాదించుకున్నాం. ప్రజల పునాదిని సంపాదించుకోవడంతోపాటు మన పార్టీ యొక్క ప్రభావం ప్రజల మీద ఇవాళ ఇంకా ఎక్కువగానే వున్నది. మన పార్టీని గౌరవించడం అనేది కూడా ప్రజల్లో ఎక్కువగానే వున్నది. ఈ పెరిగిన మన పార్టీ పలుకుబడిని, మనం సక్రమంగా వుపయోగించుకోకపోతే ప్రజలపట్ల మనం పెత్తందార్లుగా తయారయే అవకాశం లేదా ప్రజలపట్ల తప్పుడుగా ప్రవర్తించే అవకాశాలున్నాయి. ఇప్పటికీ మనలో అలాంటి పొరపాట్లు జరుగుతున్నాయి. మన ఎత్తుగడల్లో జరుగుతున్నాయి. మన వ్యవహారాల్లో జరుగుతున్నాయి. మనం చేసే కొన్ని పనుల్లో జరుగుతున్నాయి. దీని ద్వారా, అంటే ఈ పెరుగుతున్న మన పార్టీ యొక్క ప్రభావం ద్వారా, దాన్ని సరిగ్గా అర్థం చేసుకోక పోవడం ద్వారా, తప్పులు కూడా పెరుగుతున్నాయి. లేదా సిద్ధాంత జ్ఞానాన్ని మనం ఇంకా పెంపొందించుకోక పోవడం ద్వారా తప్పుడు ఎత్తుగడలు వేయడం ద్వారా కూడా కొన్ని పొరపాట్లు జరిగి, అవి ప్రజలకు నష్టాన్ని కలుగ జేస్తున్నాయి. ఇప్పటికే మన రాష్ట్ర ప్లీనాలు జరిగిన విషయం మీ అందరికీ తెలుసు. ఆ రాష్ట్ర ప్లీనాలలో మన ఆచరణలో దొర్లుతున్న తప్పుల్ని మనం అనేకం సమీక్షించుకున్నాం. చాలా విషయాల్నే సమీక్షించుకున్నాం. అట్లాగే మన పార్టీ ఆచరణకు సంబంధించిన విషయాలమీద ఈరోజు బూర్జువా పత్రికలు, కొంతమంది బూర్జువా మేధావులు మన తప్పుల్ని ఆధారంగా చేసుకొని బయట మనపార్టీ మీద దుష్ప్రచారం చేయడం చాలా పెద్ద ఎత్తునే జరుగుతున్నది. ఈ దుష్ప్రచార ప్రభావం తక్కువేం లేదు. ఇంకా మన పార్టీ లేని దగ్గర, అక్కడి ప్రజలమీద దాని యొక్క ప్రభావం చాలా ఎక్కువగానే వున్నది. అట్లాగే మన ఉద్యమ ప్రాంతంలో కూడా మనకు కొంత దూరంగా వున్న ప్రజానీకానికి ఎంతో కొంత మనమీద అనుమానాలను రేకెత్తించే పరిస్థితి కూడా ఈనాడున్నది. వీటన్నింటిని మనం నివృత్తి చేసుకోకుండా, వీటన్నింటినీ మనం ప్రజలకు అంటే మన తప్పులేంటి? అనేది ఒకటి; అట్లాగే మనము తప్పులకు అతీతం కాదు అనే విషయాన్ని కూడా ప్రజల్లో కన్విన్స్ చేసుకోకుండా మనం బలమైన పార్టీగా, ఒక ప్రజల విశ్వాసం చూరగొన్న, మెజారిటీ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న పార్టీగా నిలబడడం అనేది కష్టం అవుతుంది. మనం అనేక పోరాటాలు చేస్తున్నాం. అనేక త్యాగాలు చేస్తున్నాం. వాస్తవానికి ఈ పోరాటాలకు నాయకత్వం వహించడం ద్వారా, త్యాగాలు చేయడం ద్వారా ప్రజల్లో చాలా విశ్వాసాన్ని మనం చూరగొన్నప్పటికీ, తప్పులు కూడా ఈ మధ్య కాలంలో మనవి పెరగడం ద్వారా కొన్ని

***(కా॥ శ్యాం ప్రసంగం: తరువాయి 53వ పేజీలో.....)***

# ఇతోధికంగా ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ, పార్టీ బలాన్ని పెంపొందింప జేసుకుందాం!

# లెనినిస్టు బాటలో మునుముందుకు సాగుదాం!!

*(సి.పి.ఐ. (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] పార్టీ వ్యవస్థాపన దినం మరియు లెనిన్ పుట్టిన రోజు సందర్భంగా 1999 ఏప్రిల్ 22న, కేంద్రకమిటీ (ప్రొవిజనల్) సభ్యుడు, అమరుడు కామ్రేడ్ శ్యాం ఒక సమావేశంలో చేసిన ప్రసంగాన్ని పాఠకులకి అందిస్తున్నాం.)*

మన పార్టీ పుట్టి ఈరోజుకి 30 ఏళ్ళు నిండినాయి. అంటే మనందరికి 30 ఏళ్ళు నిండినాయి. మన పార్టీ వాస్తవానికి పుట్టిన దినమంటే ఇది పునర్జన్మించిన దినమని మరో అర్థంలో చెప్పుకోవాలి. వాస్తవానికి భారతదేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టింది అంతకు ముందే. 1925లోనే భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టింది....దాంట్లోని మంచికి వారసులంగా సి.పి.ఐ. (ఎం-ఎల్) 1969 ఏప్రిల్ 22వ తారీఖున మరొక్కసారి పునర్జన్మించింది. అందుకనే మనపార్టీ పుట్టిన దినంగా '69లో ఏర్పడిన సి.పి.ఐ. (ఎం-ఎల్) వ్యవస్థాపన దినాన్నే మనం పాటిస్తున్నాం. భారత దేశంలో విప్లవాన్ని సాధించ డానికి భారత కమ్యూనిసుపార్టీ నాయకత్వాన చాలామంది అమరులు అయినారు. ఆ అమరుల ఆశయాల అమరుల త్యాగాల కొనసాగింపుగా మనం వున్నామనేది కూడా మనం మరచిపోవద్దు. అందుకని పునర్జన్మ అంటే గతంలో ఇంకొక జన్మ వుందనే అర్థంలో, దాని కొనసాగింపుగా మనం ఈ పార్టీ పుట్టిన దినాన్ని జరుపుకుంటున్నామనేది మనం గుర్తుంచు కోవాలి. అట్లాగే 1969 ఏప్రిల్ 22వ తారీఖున పార్టీని స్థాపించడం; ఆ దినాన్ని ఎంచు కోవడానికి మరొక ప్రాముఖ్యత కూడా వున్నది. అది లెనిన్ పుట్టిన దినం



కూడా. ఆ దినాన్నే ఎందుకు ఎంచుకున్నాం అని అనుకున్నపుడు విప్లవం విజయవంతం చేయడానికి ఒక విప్లవకరమైన పార్టీ వుండాలి. విప్లవకర పార్టీ లేకుండా విప్లవం లేదు. ఇది లెనిన్ చెప్పిన విషయం. చెప్పడమే కాదు రష్యాలో అలాంటి పార్టీని స్థాపించి ఆ పార్టీ నాయకత్వాన అక్కడ విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిస్టు వ్యవస్థను స్థాపించాడు. అలాంటి పార్టీని మనం నిర్మించాలని అనుకున్నాం గనుక, దానిని ఆదర్శంగా తీసుకొని, రష్యాలో ఏర్పడిన బోల్షివిక్ పార్టీని ఆదర్శంగా తీసుకొని దాని స్థాపకుడైన, దాని సిద్ధాంత కర్త అయిన లెనిన్ పుట్టిన దినాన్ని ఎంచుకొని ఆరోజు భారత కమ్యూనిస్టు పార్టీ (ఎం-ఎల్) ఏర్పడింది. అలా మన పార్టీ మరోసారి పునర్జన్మించింది. అందుకని మన పార్టీ పుట్టిన రోజుకి, లెనిన్‌కి ఆ రూపంలో కూడా ఒక సంబంధం వుంది. అయితే, లెనిన్ చెప్పిన విప్లవ పార్టీని, విప్లవకరమైన పార్టీని స్థాపించడం ఎందుకు అవసరమయింది? అప్పటికే కమ్యూనిస్టు పార్టీ వున్నది కదా! అది విప్లవకరమైన పార్టీ కాకుండా పోవడం మూలంగా, మనం మరొకసారి విప్లవకర పార్టీని స్థాపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విప్లవకర పార్టీ అంటే ఏమిటి? లెనిన్ విప్లవకర పార్టీ ఎలా వుండాలని చెప్పాడు? అని మనం చూస్తే...

## ఒక సంఘటితమైన పార్టీ ఎలా వుండాలి?

కేంద్రీకృత ప్రజాస్వామ్యం కలిగి వుండడం, క్రమశిక్షణా యుతంగా వుండడం; ఒక సిద్ధాంతాన్ని కలిగి వుండడం; ఇంకా దాని లక్ష్యం ఎలా వుండాలని అనుకున్నపుడు, సిద్ధాంతానికి ఆచరణకు సమన్వయం కుదరాలి; చెప్పడానికి చేయడానికి సమన్వయం వుండాలి. అలా సమన్వయం లేని పార్టీలు పేరుకు విప్లవ పేరు పెట్టుకున్నా ఆచరణలో అవి రివిజనిజానికో, విద్రోహానికో దారితీస్తాయి. అందుకని గతంలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీలో చెప్పడానికి, చేయడానికి సంబంధం లేకుండా పోయింది; సిద్ధాంతానికి ఆచరణకు సంబంధం లేకుండా పోయింది; పేరుకు మాత్రం కమ్యూనిస్టు పార్టీగా అది మిగిలి పోయింది. దాని నాయకత్వం అంటే ఆనాటి ఆ కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహిస్తున్న నాయకులందరూ కూడా ఆచరణలో విప్లవాన్ని వదలి పెట్టేసింద్రు. విప్లవంలో ముఖ్యమైనది ఏమిటి? విప్లవం చేయడమంటే, ఒక వర్గాన్ని మరొక వర్గం హింసాయుతంగా కూలదోయడమే. మావో మాటల్లో చెప్పాలంటే **''యుద్ధం ద్వారా సమస్యను పరిష్కరించడం సాయుధ శక్తి ద్వారా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం''** ఇది మొత్తం విప్లవంలో మన కేంద్ర లక్ష్యం. ఈ లక్ష్యానికనుగుణమైన ఆచరణ ఏ పార్టీకి వుండదో,

***(తరువాయి 57వ పేజీలో.....)***